నవంబర్ - 2017
DECCAN LAND, HYDERABAD
63
₹20

# దక్కన్ ల్యాండ్

సామాజిక రాజకీయ మాసపత్రిక





- పొట్లపల్లి రామారావు శత జయంతి
- తెలంగాణలో నాటకరంగం
- దక్కన్ సంగీత గమనాలు
- పరిశోధనల్లో సీసీఎంబీ పాత్ర







Artist: **PRITI SAMYUKTA**

మహోన్నతంగా విస్తరించిన స్త్రీ ఆమె చిత్రాలలో ఆవిష్కృతమవుతుంది. అనేక భావాలను అందమైన హరివిల్లు వర్ణాలుగా రాసులు పోసే సృజనాత్మకత ఆమెకు సొంతమైంది. మహిళల ఆకాంక్షలను మదిదోచే గీతలుగా గీస్తూ తన అంతర్లీన ప్రతిభను చాటుతున్న గొప్ప చిత్రకారిణి ప్రీతి సంయుక్త. స్వయంశక్తి, కళాతృష్ణ కలగలిసినవే ఆమె చిత్రాలు

ప్రత్యేక కథనం లోపలి పేజీల్లో









































## పరిపూర్ణత.. ప్రత్యేకత

ఒక్కొక్కరిది ఒక్కో ప్రత్యేకత. సాధనలోంచి ఉద్భవించేది పరిపూర్ణత. కళాతృష్ణకు సునిశిత పరిశీలనా దృష్టి తోడైతే ఆలోచనలను రేకెత్తించే కళాఖండాలు పురుడు పోసుకుంటాయి. తనదైన శైలితో మహిళల ఆత్మ గౌరవానికి అద్దం పట్టే చిత్రాలను గీస్తూ కళారంగంలో రాణిస్తున్న అరుదైన చిత్రకారిణి ప్రీతి సంయుక్త. దేశవిదేశాల్లో పలు చిత్ర కళాప్రదర్శనలలో పాల్గొని తన చిత్రకళా అద్భుతాలను ప్రదర్శించి పలు ప్రతిష్టాత్మక అవార్డులు అందుకున్న సంయుక్త ప్రతిభాశాలి.

TELANGANA
RESOURCE CENTRE

**"CHANDRAM"** 490, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029.
Fax: 040-27635644Mobile: 9030626288
E-mail: deccanlandindia@gmail.com website : www.deccanland.com

# మెయిల్ బాక్స్



## చరిత్రను గుర్తు చేసిన చింత చెట్టు ఘటన

అక్టోబర్ సంచికలో మీరు అందించిన 'తెలంగాణ చరిత్ర మరువలేని చింతచెట్టు ఘటన' నాటి సంఘటనను కళ్ళకు కట్టినట్టు వివరించారు. 1908 మూసీ వరదల్లో సుమారు 150 మంది చింతచెట్టు పైకి ఎక్కి ప్రాణాలు కాపాడుకున్న తీరును, వర్షపాత నమోదును వివరించిన తీరు, ఆ ఘటన తరువాత తీసుకున్న చర్యల గురించి తెలిపిన విధానం అద్భుతంగా ఉంది. ఈ సంఘటనను బేరీజు చేసుకుని ఇప్పటి పాలకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు ఇవ్వడం హర్షించదగ్గ విషయం. చరిత్రలో మిగిలిపోయిన ఇలాంటి సంఘటనలను వెలికి తీసి దక్కన్ ల్యాండ్‌లో ప్రచురిస్తారని ఆశిస్తున్నాం.

**– ఎ. పద్మావతి, హైదరాబాద్**

❖ ❖ ❖

## నేతన్నకు ఆ(యు)సు పోసిన మల్లేశం

చేనేతకు ఉండే కష్టాలను, అందులో మరీ ముఖ్యంగా మహిళలు పోసే 'ఆసు' పనిలో వుండే తీవ్రతకు చలించి లక్ష్మీ ఆసు యంత్రాన్ని కనిపెట్టిన చింతకింది మల్లేశంకు అభినందనలు. తన స్వగ్రామమైన శారాజిపేటను ఖండాంతరాలకు తెలియజేసి విశ్వవేదికపై నిలిపిన యువ ఎంటర్ ప్రైనర్ మన మల్లేశం. వీరికి చక్కగా వివరించిన రచయిత తిరునగరి శ్రీనివాస్‌కి అభినందనలు.

**– బి. వేణుగోపాల్, నల్లగొండ**

❖ ❖ ❖

## గాత్రానికి గుర్తింపు ఇవ్వలేదు..

ప్రముఖ తబ్‌లా వాదకుడు అమీర్ హుసేన్ ఖాన్, ఉస్తాద్ అహమ్మద్ జాన్ తిరఖ్వాలకు దక్కన్‌లో గుర్తింపు లేక హైద్రాబాద్ నుండి వయా ఆదిలాబాద్ మీదుగా మరాఠీ ప్రాంతానికి వెళ్ళిన తీరును గుర్తు చేసుకుని సదాశివగారు వారి జ్ఞాపకాన్ని మనకు మిగిల్చాయి. ఏడవ నిజాం రాజు ఉస్మాన్ ఆలీ దగ్గర పనిచేసేందుకు ఆస్థాన గాయకుడు పండిట్ జ్యోతిరాం ఆ పీఠాన్ని తీసుకోక ముందే మరణించడం దురదృష్టకరం. జ్యోతీ రాం కొడుకు నేటి గొప్ప గాయకుడు పండిట్ జస్‌రాజ్ తన తండ్రి జ్ఞాపకార్థం హైద్రాబాదులో ప్రతి సంవత్సరం కొన్ని రోజులపాటు సంగీత సభలు నిర్వహించి వారి లేని లోటును తీరుస్తున్న తీరు సంగీత ప్రియులకు ఆనందాన్ని ఇస్తుంది. దక్కన్ సంగీతాన్ని తెలియ జేసిన జి. మనోజకు ధన్యవాదాలు.

**– చైతన్య, మహబూబ్‌నగర్**

## ప్రపంచ తెలుగు మహాసభల ప్రత్యేక సంచిక కోసం రచనలకు ఆహ్వానం

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా దక్కన్‌ల్యాండ్ డిసెంబరు 2017 సంచికను భాషా, సాంస్కృతిక, సాహిత్య అంశాలతో కూడిన ప్రత్యేక సంచికగా వెలువరిస్తున్నాం. ఈ విశేష సంచికకు మీ నుండి కథలు, కవితలు, భాషా సాహిత్య వ్యాసాలను ఆహ్వానిస్తున్నాం. మీ రచనలు మాకు చేరవలసిన తేదీ 2017 నవంబరు 10.

**రచనలు పంపవలసిన చిరునామా:**
ఎడిటర్, దక్కన్ ల్యాండ్ (మాసపత్రిక),
చంద్రం, 3-6-712/2,
స్ట్రీట్ నెం. 12,
హిమాయత్‌గర్ హైద్రాబాదు-500029, తెలంగాణ
మొబైల్: 9030626288,
ఫ్యాక్స్ : 040-27635644
E-Mail: deccanlandindia@gmail.com
website: www.deccanland.com

### ఆన్‌లైన్ ద్వారా దక్కన్ ల్యాండ్ చందా చెల్లింపు

**దక్కన్‌ల్యాండ్ బ్యాంకు ఖాతా వివరాలు**

| | |
|---|---|
| Name : | DECCAN LAND |
| Kotak Account No: | 7111218829 |
| Bank : | KOTAK MAHINDRA BANK |
| IFSC Code : | KKBK0000555 |
| Branch Code : | 000555 |
| MICR Code : | 500485007 |

### కొత్త జిల్లాల సంగ్రహ చరిత్ర వ్యాసాలకు ఆహ్వానం

తెలంగాణలో కొత్తగా ఏర్పడిన జిల్లాల నేపథ్యంలో జిల్లాల చరిత్రను తిరిగి లిఖించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. వివిధ కారణాల వల్ల మరుగున పడిన విశేషాలెన్నో ఈ సందర్భంగా వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల సంగ్రహ చరిత్రపై వ్యాసాలను దక్కన్‌ల్యాండ్ మాసపత్రికకు పంపించాల్సిందిగా కోరుతున్నాం.

మీ వ్యాసాలను
E-mail:deccanlandindia@gmail.comకు
పంపించవచ్చు


# దక్కన్ ల్యాండ్

సామాజిక, రాజకీయ మాసపత్రిక

సంపుటి: 6 సంచిక : 3 పేజీలు : 68

నవంబర్- 2017


# లోపలి పేజీల్లో...




సమీకృత కలెక్టరేటుల నిర్మాణానికి శ్రీకారం ........................ తిరునగరి శ్రీనివాస్ ........................ 8

పొట్లపల్లి రామారావు కవిత్వం ........................ సుంకిరెడ్డి నారాయణరెడ్డి ........................ 9

అసఫ్ జాహీ నాణేలు ........................ దెమె రాజారెడ్డి ........................ 13

గుండవరం శాంతమ్మగారు ........................ పరవస్తు లోకేశ్వర్ ........................ 15

పటం కళాకారుల - కట్టడి సంప్రదాయం ........................ డా॥ గడ్డం వెంకన్న ........................ 17

తెలుగు నాటరంగంపై తెలంగాణ యవనిక ........................ డా॥ జె.విజయ్‌కుమార్‌జీ ........................ 19

ఉద్యమ పాటకు ఊపిరూదిన రసమయి బాలకిషన్ గొంతుక ....... అంబటి వేకువ ........................ 21

సంగీత గమనాలు ........................ గూడూరు మనోజ ........................ 26

అప్పుడప్పుడు-4 ........................ బి. నరసింగరావు ........................ 28

సృజనశీలి వానమామలై శ్రీనివాసాచారి ........................ టీఎస్వీ ........................ 31

సిసిఎమ్‌బి కీలక పాత్ర ........................ ఎం.డి.కరీం ........................ 33

చుక్కలు ........................ పొట్లపల్లి ప్రచురణలు ........................ 36

భావోద్వేగపు ప్రతిరూపాలు సంయుక్త చిత్రాలు ........................ పురుషోత్తం ........................ 37

ఫుట్‌బాల్ సువర్ణ యుగానికి కేరాఫ్ అడ్రస్ హైద్రాబాద్ ........................ ఎం.డి. కరీం ........................ 39

ఒంటరి చావు ........................ పొట్లపల్లి ప్రచురణలు ........................ 42

రైతు-రాజు (కవిత్వం) ........................ పొట్లపల్లి ప్రచురణలు ........................ 44

పాధూళి (నాటిక) ........................ పొట్లపల్లి ప్రచురణలు ........................ 46

సావిత్రిని మహానటిగా మార్చిన మన సినిమా ........................ హెచ్.రమేష్‌బాబు ........................ 56

రాజాస్థానంలో కాదు ప్రజల మస్తిష్కాల్లో నిలిచిన తత్వాలు........ సంగిశెట్టి శ్రీనివాస్ ........................ 59

పిల్లల పండుగ ........................ డా॥వి.ఆర్.శర్మ ........................ 61

పంచమ వేదమా..? పంచవేదాలూనా..? ........................ దక్కన్ న్యూస్ ........................ 63

డా॥ ఎన్.గోపి 'జీవన భాష' ........................ డా॥ ఎస్.రఘు ........................ 64

పుస్తకాలు ........................ దక్కన్ న్యూస్ ........................ 66



సంపాదకులు

**యం. వేదకుమార్**

9848044713

editordeccan@gmail.com

సహాయ సంపాదకులు

**తిరునగరి శ్రీనివాస్**

స్పెషల్ కరస్పాండెంట్

**కె. ప్రభాకర్**

8106721111

సర్క్యులేషన్

**హెచ్. మోహన్‌లాల్**

వాణిజ్య ప్రకటనలు

**నీరజ**

9030626288

ఫొటోగ్రాఫర్

**టి.స్వామి**

8374995555

కవర్‌పేజీ ముఖచిత్రం

**ప్రీతి సంయుక్త**

చిత్రాలు

**కూరెళ్ల శ్రీనివాస్**

layout & composing @

CHARITHA IMPRESSIONS

printed @ DECCAN PRESS

ఆజామాబాద్, హైదరాబాద్-500 020.

కార్యాలయ చిరునామా

TELANGANA RESOURCE CENTRE

DECCAN LAND

"CHANDRAM"

3-6-712/2, St.No. 12, Himayatnagar,

Hyderabad - 500 029 Telangana

Mobile: 9030626288 Fax: 040-27635644

E-mail: deccanlandindia@gmail.com

website : www.deccanland.com



**కృతజ్ఞతలు**

దక్కన్ ల్యాండ్ మాసపత్రిక ఈ సంచికలో సాహిత్యం విభాగంలో సలహాలు, సూచనలు అందించిన **డా॥ ఎస్. రఘు**కు మా కృతజ్ఞతలు.


**'దక్కన్ ల్యాండ్'**లో అచ్చువుతున్న రచనలలో వ్యక్తమవుతున్న అభిప్రాయాల న్నింటితో సంపా దకులకు ఏకీభావం ఉండాల్సిన అవసరం లేదు. 'దక్కన్ ల్యాండ్'ను ప్రజాస్వామిక అభిప్రాయ వేదికగా, ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక సాహిత్య విశ్లేషణావేదికగా తీర్చిదిద్దాలన్నదే మా సంకల్పం. అందుకు అనుగుణంగానే అన్ని రకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాలకూ స్థానం కల్పించాలన్నది మా ఉద్దేశం. వివిధ రంగాల్లో నిపుణుల రచనలను అందిం చడం ద్వారా ఆయా అంశాలపై, సమ స్యలపై, పరిష్కార మార్గాలపై పాఠకు ల్లో అవగాహన పెంపొందించడమే **'దక్కన్ ల్యాండ్'** లక్ష్యం.

# JBR
## ARCHITECTURE COLLEGE
HYDERABAD





JBR Architecture College was established by Joginpally B.R.Educational Society in the year 2012 under the patronage of Sri Late J.Bhaskar Rao garu , devoted Educationist and Philanthropist, with a view to impart quality Architectural Education with state of the art infrastructure and Creative learning environment.

JBR Architecture College is approved by the Council of Architecture , affiliated to Jawaharlal Nehru Architecture & Fine Arts University - JNA&FAU Hyderabad and is offering Five year Bachelor of Architecture Course.

The college is located in Bhaskar Nagar, Yenkapally in a sprawling 100 acre campus . The campus also houses many prestigious institutes of the Group including Medical, Engineering, Dental, Pharmacy and Law Colleges, with a combined strength of more than 10,000 students and best infrastructure and sports facilities.

JBR Architecture College Building is one of the best Architectural Campuses in the States of Andhra Pradesh & Telangana with Contemporary Architectural Design incorporating many Green Building Principles and innovative features. The institute has established State of the Art Infrastructure for Architectural Learning with Wifi Facility, Audio Visual Equipment in every class room and studio, well stocked Library, e-library, Computer Lab with advanced programs and soft wares., A spacious Auditorium, Landscaped Open Air Theater, Construction Yard etc., College Bus Facility is also available from every part of the city.







It has a team of highly qualified Faculty coming from different parts of the country graduated from various reputed national institutions and supported by highly experienced Visiting Faculty with international experience.

JBR Architecture College aims to become one of the Premier Architectural Institutes in India and plans to evolve into a School of Excellence, offering Post Graduate Courses in Architecture, Urban Planning, Landscape Architecture, Construction Management etc. A Research and Consultancy Cell is going to be set up soon in the campus to promote advanced research in the related fields and to facilitate interaction and collaboration with reputed Institutes in India and abroad.

**JBR**
**ARCHITECTURE COLLEGE**
HYDERABAD
Bhaskar Nagar, Moinabad Mandal, R.R. District, Hyderabad, Telangana State, India-500075.
Contact No: 08143-235240, 235241, 235242, 9703372442, 9703277053, Fax: +91 40 2330 4036
email: jbrarchitecture@gmail.com, website: http://www.jbrarchitecture.com/

DECCAN tv
Voice of Telangana

# అధికార వికేంద్రీకరణతోనే గ్రామ స్వరాజ్యం




గ్రామస్వరాజ్యం!

దేశ రాజ్యాంగ రూపకల్పన నాటి నుంచి నేటి వరకు కూడా అంతా గ్రామస్వరాజ్యం గురించే మాట్లాడుతున్నారు. గ్రామస్వరాజ్యానికి పునాది వేసిన భావన రూపుదిద్దుకొని ఏడు దశాబ్దాలు గడిచినా ఇప్పటి వరకూ దాన్ని నిర్మాణాత్మకంగా చేపట్టేందుకు ఏ కేంద్రంలో ప్రభుత్వం కూడా కృషి చేసిన దాఖలాలు లేవు.

దేశంలో పంచాయతిరాజ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్నో కమిటీలను నియమించింది. 1956 నుంచి ఈ ప్రహసనం మొదలైంది. అది నేటికీ కొనసాగుతోంది. ఒక మంచి పని చేసేందుకు ఇన్నేళ్ళ సుదీర్ఘ చర్చ అవసరమా? ప్రజల నుంచి వస్తున్న డిమాండ్లకు అనుగుణంగా ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకోలేమా?

1992లో తీసుకువచ్చిన 73, 74వ రాజ్యాంగ సవరణలు దేశంలో సరికొత్త అధ్యాయానికి తెరదీశాయి. స్థానిక ప్రభుత్వాలకు ప్రామాణీకృత విశిష్టతలను ఇది నిర్దేశించింది. ఐదేళ్ళకోసారి ఎన్నికలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలు, మహిళలకు రిజర్వేషన్లు, పాలనలో పాల్గొనే వ్యవస్థలు, రాష్ట్ర - కిందిస్థాయి పాలనాసంస్థల మధ్య ఆర్థిక సంబంధాలకు గాను రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఏర్పాటు, జిల్లా ప్రణాళిక సంఘం వంటివి వచ్చాయి. అంతేకాదు, రాష్ట్రాల అసెంబ్లీలు స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు, బాధ్యతలు అప్పగించడంతో పాటుగా ఆర్థికాభివృద్ధి, సామాజిక న్యాయ పథకాలను అమలు చేసేందుకు తగు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

ఈ తరహా మార్గదర్శకాల నేపథ్యంలో 'గ్రామసభ'లు తీసుకునే నిర్ణయాలకు ప్రాధాన్యం పెరిగింది. పౌరులకు పాలనలో భాగ స్వామ్యం కలిగింది. కార్యరూపం దాల్చలేకపోయాయి. ఒక ఆశ మొలకెత్తి పాతికేళ్ళు గడిచిపోయినా, 'గ్రామసభ' అనేది ఇంకా ఒక కలగానే మిగిలింది. ఈ మూడంచెల ప్రతిపాదనను (గ్రామం, మండలం / తా లూకా పంచాయత్, జిల్లా) దేశంలోని అన్ని రాష్ట్రాలూ ఆమోదించి కూడా 23 ఏళ్ళు గడిచిపోయాయి. అధికార వికేంద్రీకరణ దిశలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందడుగు వేయలేకపోయాయి. రాజకీయపరమైన చిత్తశుద్ధి లోపించడమే ఇందుకు ప్రధాన కారణంగా చెప్పవచ్చు. బాధ్యతలు నిర్దేశిస్తున్న ప్రభుత్వాలు ఆ స్థాయిలో అధికారాలను, నిధులను, విధులను బదిలీ చేయలేకపోతున్నాయి.

తమ అధికారాలు, హక్కులు, విధులు, నిధుల విషయంలో రాష్ట్రాలు తమకు లభిస్తున్న వాటిని అదే స్థాయిలో దిగువకు పంపించడం లేదు. కొన్ని రాష్ట్రాలు ఈ విషయంలో చొరవ తీసుకుంటున్నాయి. రెండు రాజ్యాంగ సవరణలు కొన్ని మార్గదర్శకాలను నిర్దేశించినా, ఈ విషయంలో మరిన్ని బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వాలకే అప్పగించాయి. దీన్ని అవకాశంగా తీసుకొని రాష్ట్రప్రభుత్వాలు  సంస్కరణలు తీసుకురావడంలో వెనుకంజ వేస్తున్నాయి.

కేరళ రాష్ట్రం మాత్రం 1998లోనే సంస్కరణలకు నాంది పలికినా తదనంతరం అది మందగించింది. చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ లాంటి రాష్ట్రాలు స్థానిక ప్రభుత్వాల విధులు లాంటి వాటి గుర్తింపు చేపట్టినా ఆ తరువాత వాటిని అటకెక్కించాయి. కీలక విధులు ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వాల చేతుల్లోనే ఉన్నాయి. ఎంపీలాడ్, ఎమ్మెల్యేలాడ్ నిధుల కేటాయింపులు, వినియోగాలు స్థానిక ప్రభుత్వాలను పక్కనబెట్టి సాగుతున్నాయి. పలు రాష్ట్రాల్లో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్‌లు స్వతంత్ర ప్రతిపత్తి లేకుండా ఉన్నాయి. సంస్కరణల అమలులో పలు రాష్ట్రాల్లో రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్నాయి. ఇలాంటి అంశాలపై న్యాయవ్యవస్థ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

తెలంగాణ స్వరాష్ట్ర సాధన అనంతరం మాత్రం ఇక్కడ ఆ దిశలో కొంతమేరకు అడుగులు పడుతున్న దాఖలాలు కనిపిస్తున్నాయి. అది అభినందించదగినదే. కేంద్రం నుంచి రాష్ట్రాలకు, రాష్ట్రాలనుంచి జిల్లా స్థాయికి, అక్కడి నుంచి మండలం, గ్రామ స్థాయికి పరిపాలన వికేంద్రీకృతం కావాల్సి ఉంది. ఈ భావన విజయవంతం కావాలంటే దీనిపై ప్రజలకు అవగాహన పెంపొందిస్తూ, వారిని భాగస్వాములుగా చేస్తూ, సత్వర ఫలితాలు ప్రజలకు అందేలా చేయాల్సిన అవసరం ఉంది. అప్పుడే భారతదేశం నిజమైన ప్రజాస్వామ్యంలో మనుగడ సాగించగలుగుతుంది.

ఇక్కడ గమనించాల్సిన అంశం మరొకటి కూడా ఉంది. బాధ్యతలను ఒక విడతగా, సామర్థ్యాల పెంపున మరో దఫాగా, అధికారాలను మరో విడతగా, నిధులను ఇంకో విడతగా అందించాలని చూడడం కుదరదు. అలా చేస్తే వేసే తొలి అడుగే వెనుకడుగు అవుతుంది. అలాగాకుండా, బాధ్యతలు, అధికారాలు, విధులు, నిధులు, పర్యవేక్షణ.....ఇలా అన్నీ కూడా ఒకే సారిగా కిందిస్థాయికి వికేంద్రీకృతం అయ్యేలా చేసినప్పుడు మాత్రమే ఆశించిన ఫలితాలు పొందగలం. ఆ దిశగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి కొనసాగుస్తుందని ఆశిద్దాం.

వేదకుమార్. యం

(యం. వేదకుమార్)


ఎడిటర్

## పురోగతి దిశగా పరుగులు.. ఏడాది పూర్తిచేసుకున్న కొత్త జిల్లాలు

# సమీకృత కలెక్టరేటుల నిర్మాణానికి శ్రీకారం

తెలంగాణ రాష్ట్రంలో 10 జిల్లాల స్థానంలో నూతనంగా ఏర్పడిన 31 జిల్లాలు మొదటి ఏడాదిని విజయ వంతంగా పూర్తి చేసుకున్నాయి. అక్టోబరు 11, 12 తేదీలలో కొత్త జిల్లాలలో సమీకృత కలెక్టరేట్ల నిర్మాణానికి శంకుస్థాపనలు జరిగాయి. అభివృద్ధి మరింత వేగవంతంగా కొనసాగేందుకు వీలుగా సమీకృత కలెక్టరేట్ల రూపకల్పన జరిగి కార్యరూపాన్ని అందుకుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సిద్దిపేట, సిరిసిల్ల, సూర్యాపేట జిల్లాలలో సమీకృత కలెక్టరేట్లకు 11, 12 తేదీలలో శంకుస్థాపనలు జరిపారు. ఇదే సందర్భంలో సిద్దిపేట పోలీస్ కమీషనరేట్, సిరిసిల్లలో అపెరల్ పార్కులకు కూడా సీఎం చేతుల మీదుగా భూమి పూజ జరిగింది. సిద్దిపేటకు మెడికల్ కాలేజీతో పాటు సిరిసిల్ల, సూర్యాపేట జిల్లాలకు పలు వరాలను సిఎం ప్రకటించి మూడేండ్లలో తెలంగాణ రాష్ట్రం 21.7శాతం వృద్ధిరేటుతో ముందుకు సాగుతున్నదని వివరించారు. పారిశ్రామికంగా, సంక్షేమ పరంగా, శాంతిభద్రతలతో పాటు అన్ని రంగాలలో పురోగతిని సాధిస్తూనే ప్రజల పరిపాలన అత్యంత చేరువలో ఉండేందుకు నూతన జిల్లాలను, మండలాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు జిల్లా కేంద్రంలో కలెక్టరేట్‌లలో ప్రజలకు అందుబాటులో ఉండేలా సమీకృత కలెక్టరేట్లు ఏర్పాటు చేస్తున్నామని, ఇందువల్ల అన్ని శాఖల సమన్వయం, సమయ పాలన, లక్ష్య సాధన ఎంతో పెరుగుతుందని సిఎం అభిప్రాయపడ్డారు. రూ.44వేల కోట్లతో సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలకోసం తెలంగాణ రాష్ట్రంలో అమలు జరుగుతున్నాయని తెలిపారు. ఒకేసారి 10 జిల్లాలకు అదనంగా 21 కొత్త జిల్లాలు, 125 కొత్త మండలాలు ఏర్పాటు ఎలా సాధ్యమని అందరూ ఆశ్చర్యపోయారని కాని అవి వేగాన్ని అందుకుని ముందుకు సాగుతున్నాయని కేసీఆర్ విశ్లేషించారు. రైతులు, విద్యార్థులు, నేత కార్మికులు అన్ని కులవృత్తుల వాళ్లు, మహిళలు, వృద్ధులు, పారిశ్రామికవేత్తలు, ఐటి నిపుణులు ఇలా ఎందరెందరో సంక్షేమంలో భాగస్వాములని చెప్పారు.






ప్రతి సామాన్యుడికి సంక్షేమ పథకాలు అందలన్నదే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ప్రత్యేక ప్రణాళికతో పనిచేస్తున్నామని చెప్పారు. పథకాల అమలును అన్ని స్థాయిలలో పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు అవసరమైన మార్పులతో కూడిన సూచనలు ఇస్తున్నామని అన్నారు.

అభివృద్ధి వేగాన్ని అందుకోవాలంటే పాలనా సంస్కరణలు ఎంతో ముఖ్యమని భావించి గత మూడేళ్లుగా ప్రభుత్వ వ్యవస్థలో అనేక మార్పులను తీసుకొచ్చానని అన్నారు. పరిపాలనా సౌలభ్యం కోసం కొత్తగా వచ్చిన జిల్లాలు, మండలాలు రాబోయే రోజుల్లో ఊహించని అభివృద్ధిని సాధిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. సమీకృత కలెక్టరేట్ లను నిర్ణీత వ్యవధిలో పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ఉన్నత స్థాయి ఆదేశాలను జారీ చేశామని కేసీఆర్ చెప్పారు.

కాగా వనపర్తి, జనగామ, జగిత్యాల, భూపాలపల్లి, పెద్దపల్లి, కామారెడ్డి, యాదాద్రి–భువనగిరి, నిజామాబాద్, నాగర్ కర్నూల్, గద్వాల, మేడ్చెల్, కుమ్రంభీం ఆసిఫాబాద్, సిద్దిపేట, సంగారెడ్డి, మేడ్చల్, భద్రాచలం, సూర్యాపేట, వికారాబాద్ తదితర కొత్త జిల్లాలలో జరిగిన సమీకృత కలెక్టరేట్లు నిర్మాణ పనులకు జరిగిన శంకుస్థాపనలలో రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అన్ని రంగాలలో సమపాళ్లలో ప్రగతి సాధన లక్ష్యంగా రూపొందిన కొత్త జిల్లాలు ఇక నిర్దేశిత లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు నడవాలి.

–తిరునగరి శ్రీనివాస్,
m : 9441464764
e : thirunagarisrinivas12@gmail.com

## తెలంగాణ సాహిత్య దృశ్యం


### బాహిర సమాజం నుంచి సమాజాంతర్లోకం లోకి
### సమాజ బాహ్యావలయం నుంచి అంతర్వలయం లోకి
### వైస్‌వర్సా పయనం

# పొట్లపల్లి రామారావు కవిత్వం

కళ్ళు మూసుకుంటేగాని పొట్లపల్లి రామారావు అర్థం కాదు.

ఆయన తొలిదశ కవిత్వం కండ్లు తెరుచుకొని రాస్తే మలిదశ కవిత్వం కళ్ళు మూసుకొని రాసిండు. కళ్ళుమూసుకొని ఒక తపసిలా రాసిండు. రాసిండు కాదు పలికిండు.

మనం కూడ కళ్ళు మూసుకొని ధ్యాన ముద్రతో మనలోకి మన నుంచి ఆయనలోకి ఆయన నుంచి ప్రకృతిలోకి ప్రకృతి నుంచి సమస్త మానవాళిలోకి చూస్తేగాని ఆయన కవిత్వం అవగతం కాదు.




ఆయన తొలిదశ కవిత్వం అలా కాదు. ఆయన తొలి కవితా సంకలనం 'ఆత్మవేదన'. దీనిని వట్టికోట 1957లో ప్రచురిస్తూ 'సుమారు 20 ఏండ్ల నుండి వారు రచనలు సాగిస్తున్నా అవి గ్రంథ రూపం ధరించడానికింత కాలం పట్టడం దురదృష్టం" అని బాధపడ్డాడు. అంటె, దీనిలో కవితలు దాదాపు 1937 నుండి 1957 దాకా రాసినవని అనుకోవాలె. దీనికి ముందుమాట రాసిన కాళోజీ 'వరంగల్లులో సత్యాగ్రహం చేసిన మొదటి జట్టులో ఒకడు. జైలు నుండి తిరిగి బయటపడే నాటికి అతడు కవి" (అతని జైలు జీవితం. ది. 28.2.1939 నుంచి 5.7.1939 వరకు) "స్టేటు కాంగ్రేసు సత్యాగ్రహం (24.10.1938)తో పాటు 'నాగొడవ', రామారావు 'ఆత్మవేదన' ప్రారంభమైనాయి" అని అన్నాడు. (ఈ రెండు శీర్షికల అర్థం దాదాపు ఒకటే. ఒకటి గొంతు బయటి 'గొడవ' రెండోది గొంతు లోపలి 'వేదన') పోలికకు కారణం వరవరరావు అన్నట్టు వారిద్దరూ పరస్పర పూరకాలు.

తెలంగాణ భాషా సాంస్కృతికాంశాలతో తెలంగాణ అస్తిత్వ సమస్యతో మొదలైన తెలంగాణ ఆంధ్రోద్యమం నిజామాబాద్‌లో జరిగిన ఆంధ్రమహాసభ (1937 డిసెంబర్)తో ఒక మలుపు తీసుకుంది. 'రాజకీయేతరమైనది'గా ఉన్న 'ఆంధ్రమహాసభ రాజకీయ సంస్థగా' పరిణమించినది. 'బాధ్యతాయుత ప్రభుత్వం (అంటే ప్రజాస్వామిక ప్రభుత్వం) ఏర్పడాలని, పౌరసత్వ హక్కులు కావాలని ఈ సభ తీర్మానించింది'. (50 సంవత్సరాల హైద్రాబాద్- మందుముల నరసింగరావు) ఇక్కడి నుంచి తెలంగాణలో మార్పులు చకచకా చోటు చేసుకున్నవి. బాధ్యతాయుత ప్రభుత్వ ఏర్పాటు, రైతాంగ సమస్యలు పౌర హక్కులు, వెట్టిచాకిరీ రద్దు అనే ప్రజాస్వామిక భావన చకచకా విస్తరించింది. అది సత్యాగ్రహోద్యమంగా, రైతాంగ సాయుధ పోరాటంగా పరిణమించింది. నిజాం వ్యతిరేక, రజాకార్ల వ్యతిరేక పోరాటంగా కూడా పరిణమించింది. ఈ ప్రభావం పొట్లపల్లి "ఆత్మవేదన" మీద పడింది.

కష్టించు వారొకరు
కాజేయు వారొకరు (చూదాము)
అవని బీదల కష్ట
ఫలరాసులను మ్రింగు
ధనమదాంధులు (ఖైది)
ఏదీ నా కష్టార్జిత భాగ్యం
ఎక్కడిదీ అతనికా స్వర్గం (నిస్పృహ)

ధనిక దరిద్రుల
తారతమ్యమే
విశ్వమంతయు
వైషమ్యాగ్నిని
రేపుచున్నది (చీకటి)
ధనిక దరిద్రుల
తారతమ్యము
ద్రవ్యశక్తియే
తాకల్పించును. (రైతు-రాజు)

ఇలాంటి కవితా పదాలను చూసి పొట్లపల్లి రామారావుని కమ్యూనిస్టు కవి లేదా సోషలిస్టు కవి అని అనుకున్నారు. అభ్యుదయ కవి అన్నారు. నిర్దిష్టార్థంలో కాక విశాలార్థంలో ఆయన అభ్యుదయ కవే కాని కమ్యూనిస్టు కవి కాదు.

వర్గ వ్యతిరేకత, దోపిడి, పీడనల పట్ల వ్యతిరేకత, పేదల


పక్షపాతం, రైతు పక్షపాతం, సమానత్వకాంక్ష అనే విలువలు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలకాంశాలు అనేది అందరికీ తెలిసిందే. అయితే ఆ పోరాటంలో సోషలిజం నిర్మాణం అనే సుదూర ఆదర్శం లక్ష్యం, తక్షణ నిర్దిష్ట భూస్వామ్య, రాచరిక వ్యవస్థల నిర్మూలన, ప్రజాస్వామిక వ్యవస్థ స్థాపన అనే రెండు పార్శ్వాలున్నవి.

ఫ్రెంచి వైపు ప్రజాస్వామిక విప్లవం, రష్యావైపు సోషలిస్టు విప్లవ మిశ్రమంగా రూపొందిన చైనావైపు నూతన ప్రజాస్వామిక విప్లవ ప్రభావం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం మీద ఉన్నది. ఆ పోరాటాన్ని నడిపిన కమ్యూనిస్టు పార్టీ నాయకులు పోరాటానంతరం కొత్త వ్యవస్థను స్వప్నించినారు. కాని రూపొందబోయేది ప్రజాస్వామిక వ్యవస్థ అనే అంచనా వారికి లేదు. కాని ప్రజలకున్నది. కవులకున్నది. అలాంటి కవి పొట్లపల్లి. ఆయన ఉద్దేశించింది ప్రజాస్వామిక విప్లవం గురించే.

ఆయనకు సిద్ధాంత రాద్ధాంతాల పట్ల ఆసక్తి లేదుగాని అనుభవం నుంచి రాసిన ఆత్మవేదనలోని కవితలను బట్టి ఆయన ప్రజాస్వామిక వాది, మానవతావాది.

ఎవడు ఇక్కడ రైతు
ఎవడు ఇక్కడ రాజు
కష్టించు వారొకరు
కాజేయు వారొకరు

భూస్వామ్య, రాచరిక వ్యవస్థలోని వైరుధ్యాన్ని ఇక్కడ కవి సమర్థంగా పట్టుకున్నడు. మ్యాజిక్ రియలిస్ట్ ఛాయలతో (మ్యాజిక్ రియలిటం తెలుగు సాహిత్యానికి కొత్తదేమీ కాదు. అన్ని దేశాల అన్ని భాషల మౌఖిక సాహిత్యంలో ఉన్నదే. మనిషి వాస్తవిక స్వప్న జగత్తుల అనుసంధానం అది. ఒక ఉపశమనం అది. అది ఇటీవల ఒక శిల్ప వైచిత్రిగా ముందుకు వచ్చింది. కానీ అది తొలి నుంచీ ఉన్నదే).




భూదేవి నాగటికి
సాలివ్వబోకు
వరుణదేవా నీవు కురియబోకుమా..
విత్తనాలు మొలక
లెత్తబోకండి
నదులార మీరింక
కదిలేరు సుమ్మి..
కోడె గిత్తల్లార
కాడికందేరు
కష్టజీవి నీవు
కడతొలగ వయ్య
చూదాము; ఈ ప్రభువులే మేలుతారో
చూదాము; ఏ ప్రజలు పన్నులిస్తారో (చూదాము)

ఆనాటి కవులు రైతు గురించి సూటిగా, నినాదాత్మకంగా రాస్తే ఈ కవిత తనదైన శైలిలో కవితాత్మకంగా రాసిందు. ఈ శైలి ఆనాటి కవుల నుంచి పొట్లపల్లిని ప్రత్యేకంగా నిలబెట్టింది.

"దేశంలో రైతు జీవనం దుర్భరంగా ఉంది. దేశ సంపదకు తాను కారణమౌతున్నా రైతుకు ఆత్మపోషణ జరుగడం లేదు. అప్పులూ, పన్నులూ, అధికారాలూ అతని శ్రమఫలాన్ని ఆయనకు దక్కకుండా లాక్కుంటున్నాయి. ఈ సంకటస్థితి హృదయాన్ని కరిగిస్తే పొట్లపల్లి రామారావు కలం పట్టినాడు" అని సుప్రసన్నగారు (ఆత్మవేదన - పొట్లపల్లి; స్రవంతి, జులై 1957 చూ. పొట్లపల్లి రామారావు వ్యక్తిత్వం - సాహిత్యం - భూపాల్ -పుట-352) పొట్లపల్లిగారు రైతు వెతల నేపథ్యాన్ని వివరించినాడు. స్వయంగా రైతు అయిన పొట్లపల్లి రైతు వెతల్ని అనేక కవితలలో చిత్రిక పట్టిందు.

మన్నుదున్నె / మిన్నుకురిసె
చేను మొలచె / చిగురువేసే
కంకులేసె / కాపు కోసె
ప్రభువు లేదపుడు / పన్నులేలిపుడు
(రాజులుండేమి?)

అని రాజులు లేని అతి ప్రాచీన కాలంలో వ్యవసాయముండేది రైతు (కాపు) ఉండేవాడు అప్పుడు లేని పన్నులిపుడెందుకని ప్రశ్నించిందు. పన్నులు కట్టలేక భూములిడిచి పెట్టి, వ్యవసాయం విడిచిపెట్టి, ఊరిడిచి పారిపోయే వారని నాచిన్నప్పుడు పెద్ద మనుషులు చెప్పగా విన్న. అంటె తల్లి లాంటి, బిడ్డలాంటి భూమి ఎడబాటే వారంటే పన్నుల భారం ఎంత భరించరానిదిగా ఉండేదో ఊహించ వచ్చు.

ఘర్మజలము / కండబలము
కంటినీరు - ఒంటినెత్తురు
కాన్క వెట్టి - గడన చేసిన
ధాన్యరాసుల - తస్కరించే
రాజులుండేమి - రాజ్యముండేమి
(రాజులుండేమి?)

అని రైతును దోపిడిచేసే రాజ్యాన్ని ధిక్కరించిందు. రాజు-రైతు సంభాషణాత్మకంగా నడిచే "రైతు-రాజు" అనే కవితలో ఈ ధిక్కారం ఇంకా విస్తృతంగా కనబడుతుంది.

సర్వముతానై - జగమునేలెడి
గాలిని నీవా - కదల చేయుటలు
వేడిమి ఇచ్చి - వెలుగును పంచి
భూమికి ప్రాణం - పోసే సూర్యుడు
నీయాజ్ఞలనే - నింగి తిరుగునా
పగలు రాతిరి - పచ్చని చేల
కష్ట సుఖముల - కంట జూచుచు
నీరమొసగెడి - నీలి మబ్బులు
నీ కనుసన్నల - నిలిచే బంట్లా
------

కరచిన – పొడచిన
కదలగలేని – మూగ ధరిత్రిని
ముష్కరసేనల – ఆక్రమించుకొని
అండ జేసుకొని – పాలన చేయుట
భాగ్యమే రాజా! (రైతు–రాజు)

రైతుకు జీవనాధారం భూమి. భూమికి జీవనాధారం గాలి, వెలుతురు, నీరు – వీటిమీద లేని అధికారం భూమిమీద ఎందుకు? రైతు మీద ఎందుకు అని రాజును ధిక్కరిస్తాడు. ఈ ధిక్కారం ఆనాటి నిజాం రాజు ఉస్మానలీఖాన్ మీదనే, కాని ఆనాటి మిగతా కవులు ప్రస్తావించినట్టు నిజాంను ఎక్కడా ప్రస్తావించడు. ఎందుకని? నిజాం అనే పదం వాడితే అది మొత్తం ముస్లింలకు వర్తిస్తుంది.. కాని ముస్లింలందరూ దోపిడీదార్లు కాదు. కొంతమంది ముస్లింలే ఆనాటి దురాగతాలకు కారణం. ఆ కొంతమంది కోసం అందరి ముస్లింలను టార్గెట్ చేసే పదం వాడకూడదనుకుని ఉంటాడు (లేదా సాధారణీకరించి చెప్పే ఆయనశైలి కారణం కావచ్చు). అందుకే ఆయన పేరుతో నిమిత్తం లేని మొత్తం రాచరిక వ్యవస్థను, అంటె హిందూ ముస్లిం భూస్వాములందరికీ వర్తించే రాచరిక వ్యవస్థను గ్రామం నుంచి రాజధాని వరకు గల అధికారాన్ని కలుపుకొని మొత్తం చక్రాన్ని ఈ'రాజు' శబ్ధంలో నిక్షిప్తం చేసిండు. అందుకని ఇప్పటి నుంచయినా మొత్తం ముస్లింలను గాయపలికే నిజాం వ్యతిరేక పోరాటం' అనడానికి బదులుగా 'రాచరిక వ్యతిరేక పోరాటం' అని చరిత్రకారులు విశ్లేషకులు వాడాలె.




అదట్ల ఉంచి ఈ ధిక్కారం దగ్గర ఆగక విప్లవాన్ని అంటే మౌలికమయిన మార్పునే ఆకాంక్షించిండు కవి ఈ కింది కవితలో.

మండి మండి అగ్ని – పర్వతమె పగిలెనా
విసిగి నలిగి రైతు – విప్లవమె వచ్చెనా
పాత గోడలు కూలి – రైతు సంకెళ్ళూడి
కొత్తలోకము పుట్టదా – గొత్త గాడ్పులు వీయవా?
(గగనలక్ష్మి)

విజ్ఞప్తులతో మొదలైన రైతాంగ ఉద్యమం ఆయుధం పట్టేదాకా విజృంభించిన పరిణామాన్ని కూడా వర్ణించాడు. ఇందులో ఆయన ఆకాంక్షించిన 'కొత్తలోకము' ఏది? ఆనాటి కమ్యూనిస్టులు ఆకాంక్షించిన 'సమసమాజమా? జాతీయ వాదులు, మితవాదులు కోరుకున్న 'ప్రజాస్వామిక' వ్యవస్థనా? 'రైతు సంకెళ్ళు' అనే పదాన్ని బట్టి భూస్వామ్య వ్యవస్థ నుచి రాచరిక వ్యవస్థ నుంచి రైతు విముక్తి చెందే వ్యవస్థను అంటే ప్రజాస్వామిక వ్యవస్థనే ఆయన కోరుకున్నాడని భావించాలి. 1958 సైనిక చర్య తర్వాత జరిగిందదే. జాగిర్‌దారీ వ్యవస్థను రద్దు చేసినారు. చట్టాలు తీసుకొచ్చి రైతులకు, కౌలురైతులకు విముక్తి కల్పించినారు. అంతిమంగా 1952లో ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని పటిష్టించినారు.

ప్రజాస్వామిక వ్యవస్థను కాంక్షించడం, ప్రజాస్వామిక, ఆధునిక భావనలను కలిగి ఉండడం తక్కువది కాదు. ఆనాటికది గొప్ప సుగుణం. ఆ రకంగా ఆయన ప్రగతి శీలకవే. అభ్యుదయకవే.

ఆయన తొలిదశ కవిత్వం నిండా ఈ ప్రజాస్వామిక స్ఫూర్తి పరచుకొని ఉంది. దీనికి ప్రేరణలు ఫ్రెంచి, రష్యా విప్లవాలు, వాటిద్వారా వచ్చిన సమానత్వభావన, మానవీయభావనల.

పి.వి.నరసింహారావుగారు ప్రధానిగా కోట్ చేసిన 'జనత' అనే కవితలోని ఈ కింది పాదాలు ప్రజల శక్తి ఏమిటో తెలుపుతవి.

ఉరి ఎక్కించిన మేమే
కరి ఎక్కించిన మేమే
ధూళి జల్లినను మేమె
పూలు జల్లినను మేమే (జనత)

ఈ నూతన భావనలో మనిషి ముఖ్యం. మనిషి కేంద్రం. ప్రజలు ముఖ్యం, ప్రజలు కేంద్రం.

ఎన్నాళ్ళకైన నీ
ఔన్నత్యమును నీవె
సాధించవలెనోయి
----
నీలోన వెలుగొందు
నీస్వశక్తిని మరచి
పరుల పంచల జూడ
ఫలమేమి కలదోయి (సాధన)

అని మనిషి శక్తి సామర్థ్యాలను మనిషికి గుర్తుజేస్తాడు.

ఏభూమి ఐతేమి –ఏ రంగు ఐతేమి
ఏ రూపమైతేమి –మానవుడు నేనంచు
మదితోచు చున్నపుడు
ఏ కులము నీదియని
ఎవరైన అడిగేర
నరులమే మనమంత
నీ కులమె నాకులము
నీ రూపమే నేను – నీవు నేనోయ్
నీరక్తమేనాదు నిలువెల్ల ప్రవహించు----
నిఖరమయ్యే నీకు – కులమేమి మతమేమి
మతవాదముల చిక్కి భ్రమగబోకీవన్న
మంచుగడ్డవుకావు – మహిమాన్వితంవైన ధీరమతి నీవోయి (అద్వైతము)

కులం, రంగు, దేశం, ప్రాంతం, మతంతో నిమిత్తం లేకుండా మనిషి తనమీద తాను ఆధారపడడం, తన కాళ్ళమీద, తన శక్తియుక్తులమీద నిలబడేట్టు చేయడం దేవుడిమీద, మతంమీద తద్వారా సృష్టి అయిన మూఢ విశ్వాసాలమీద ఆధారపడితే మనిషికి తనశక్తిమీద తనకు నమ్మకముండదు. ఆత్మవిశ్వాసంలోపిస్తుంది. నిరాశా–నిస్పృహలకు అచేతనకు లోనవుతాడు అలా ఉండొద్దని

ప్రబోధించడం రాబోయే నూతన వ్యవస్థలయిన పెట్టుబడిదారీ, ప్రజాస్వామిక వ్యవస్థలకు అనుగుణంగా మనిషిని తీర్చిదిద్దడం, మనిషి తానేమిటి, తన శక్తి ఏమిటి, లోపల తనేమిటి బయట తనేమిటి అని ఆలోచించేలా చేయడం పొట్లపల్లి ఈ కవిత, మరికొన్ని కవితల (జీవితము మొ॥ కవితలు) ద్వారా నెరవేర్చిన కర్తవ్యం.

ఈ సంకలనంలో బాగా ప్రసిద్ధి చెందిన కవిత 'కాలిబాట'.. కాలిబాట వైశిష్ట్యాన్ని వాచ్యార్థంలో చెప్తూనే సామాన్యుడికి స్వేచ్ఛా జీవన ప్రియులకు ప్రతీకగానూ ఆయన ఈ కవిత రాసిండు.

కోర్టుప్యాన్లు – పోస్టు మ్యాన్లు
కూలివాళ్ళు – పాలవాళ్ళు
పాకివాళ్ళు– చాకలివాళ్ళు
పయనించే–కాలిబాట
కడపేదల నడకచాలు (కాలిబాట)

అనే పంక్తుల్లో అది వ్యక్తమయింది.

పోరులేక ఏ గతిని భువి
పురోగమన మొందె దీవు
పురోగమన మాగినచో
తిరోగమనమే కదయిక
తుచ్ఛ కాలముల కన్నను
దూర కాంక్షలే ఎప్పుడు
నింగిపైకెత్తునోయి..
ఆదర్శ చ్యుతుడవైన
ఆ క్షణమె మరణమెరుగు" (జీవితము)

నిరంతర చలనశీలత, ప్రగతిశీలత, తిరోగమనం మీద పోరాటం పాతమీద పోరాటం, ఉన్నతమైన ఆదర్శం అనేవి ఈ కవితలో వ్యక్తమయినవి. ఇవి పొట్లపల్లి గొప్ప పురోగమనవాది ప్రగతిశీలి అని తిరుగులేని విధంగా వెల్లడి చేస్తున్నవి.

పురోగమనవాది అయిన పొట్లపల్లి ఈ సంకలనం అనంతరం అంతర్ముఖుడెందుకయిండు?

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానంతరం ఇతర ఆంధ్రప్రాంతాల అభ్యుదయ కవులు సినిమాల్లోకి ఇతర రంగాల్లోకి అంటే మెయిన్ స్ట్రీమ్‌లో ప్రవేశించింద్రు చాలా సౌకర్యవంతంగా. ఆనాటి కమ్యూనిస్టుపార్టీ దానికి ఆమోదం కూడా తెలిపింది. వాళ్ళ లాగా పొట్లపల్లి వ్యాపార సామ్రాజ్యంలోకి పయనించలేదు. ఆయన తన అంతర్లోకాలకు తెలంగాణ సహజాభివ్యక్తిగా పయనించిండు. వాళ్లు ఆస్తులు సంపాదించుకోగా ఈయన కరిగించుకుండు. ఈ మలిదశ ప్రస్థానాన్ని వచ్చే సంచికలో చర్చించుకుందాం.

(2017 నవంబర్ నుంచి పొట్లపల్లి రామారావుగారి శత జయంతి సంవత్సరం. ఆ సందర్భంగా ఈ వాస్యం)

– సుంకిరెడ్డి నారాయణరెడ్డి,
m: 98856 82572
e: narayanareddy.sunkireddy@gmail.com


ద

# బర్కతి

జ్ఞాపకాలో అనుభవాలో
ఏదో ఓ వైపునించి పొగమంచులా కమ్మి
స్వరం పొదూతా జీరలా చేరి
మాట బరువెక్కుతుంది
వ్యాపకాలో వాసనలో
దిగులుపొరల్లా అలుముకొని
మనసూ బరువెక్కుతుంది

ఇంత బతుకూ బతికి
ఇంగితం లేక కుప్పగూలినట్టు
రొంపకొట్టుడు దాటులో
తోటోడు తొడ కోసుకుంటే
సాటోడు మెడకోసుకునే తతంగం

పోటీప్రపంచంలో గెలుపు గుర్రం వెనక పరుగు
కాలిపోయిన కాలం బూడిదలో
గడియ రికాం లేని దేవులాట
ఓటమి చివర మూటగట్టుకున్న
పశ్చాత్తాపం ఖరీదు ఓ జీవితం



వెనుకకు తిరిగి చూస్తే
దాటి వచ్చిన కాలం పొదూతా
నాటిన మొలకల్లో బతికిన వెన్ని
ఎన్నెన్ని మాటలు,
ఎన్నెన్ని వాక్యాలు
మాడిపోయినవెన్ని
చిగురులు తొడిగినవెన్ని

సామూహిక సూత్రాలు
సామయిక స్పందనలు
గుర్తింపుల గుప్పిట్లోకే
ఒదిగి పోతున్నప్పుడు

భుజాలూ భుజకీర్తులు
కైవారాలు కైమోడ్పులు
పుర్సతి లేని కాలం నిండా
బర్కతు లేని బతుకాట

బతుకంటే ఊపిరితో సహవాసం
మాటతో సహజీవనం
మనసుతో సాహచర్యం
కొంత తడి మరికొంత వేడీ
బతుకంటే
ఈ దేహం నలుగురి భుజాలెక్కినంక
మన కోసం కన్నీరు పెట్టించే
ఆ నాలుగు వాక్యాలూ
మరో నాలుగు మంచి కార్యాలూ

–వఝల శివకుమార్
m : 9441883210
e : shivakumarvjjala@gmail.com

ద

# అసఫ్ జాహీ నాణేలు

క్రీ.శ. 1724 –1948 మధ్యకాలంలో పాలన కొనసాగించిన తెలంగాణ చివరి రాజవంశం అసఫ్‌జాహీ. వారి నాణేలు పలు ఆసక్తిదాయక అంశాలను వెల్లడిస్తాయి. ఈ రాజవంశానికి చెందిన పాలకులు మొత్తం 10 మంది ఉన్నప్పటికీ, వారిలో ఏడు మంది మాత్రమే అసఫ్‌జాహీ పాలకులుగా జాబితాలోకి ఎక్కారు. ఆయా కాలాలకు చెందిన మొఘల్ పాలకుల గుర్తింపు పొందనందున ముగ్గురు పాలకులు ఈ జాబితాలోకి ఎక్కలేకపోయారు. బంగారం, వెండి, రాగితో తయారైన నాణేలను అసఫ్‌జాహీలు ప్రవేశపెట్టారు. అసఫ్‌జాహీ నాణేలను మూడు రకాలుగా చెప్పవచ్చు.

ఎ) అసఫ్‌జాహీల పాలనలో ఉన్న దక్కన్‌లోని మింట్‌లలో తయారయ్యే మొఘల్ నాణేలు. మొదటి ఐదుగురు అసఫ్‌జాహీ రాజులు తమ పేర్ల మీద సొంతంగా నాణేలు జారీ చేయలేదు. ఆ నాణేలు మొఘల్ పాలకుల మీదే ఉండేవి. అసఫ్‌జాహీలు పాలించే ప్రాంతాల నుంచే అవి తయారయ్యేవి. ఈ కారణంగానే అసఫ్‌జాహీ ఆరంభకాలం నాటి నాణేల చరిత్ర కానరాకుండా పోయింది. అసఫ్‌జాహీలు మొఘల్ పాలకులకు విధేయులుగా ఉండేవారు. ఢిల్లీ రాజ ఆస్థానం నుంచి 'ఫర్మానా'లు అందుకుని, వాటిని అమలు చేసేవారు. క్రీ.శ. 1736లో నాదర్ షా ఢిల్లీపై దండెత్తిన సమయంలో ముహమ్మద్ షా పిలుపునకు స్పందించిన అసఫ్‌జాహీ పాలకులు ఆయనకు తమ సంఘీభావం ప్రకటించారు. అసఫ్‌జాహీలు తమపై మొఘలుల అధికారాన్ని అంగీకరించారు. తాము స్వతంత్రులమని ప్రకటించుకోలేదు. అందుకే వారికి చెందిన పలు మింట్‌ల నుంచి జారీ అయిన నాణేలు మొఘల్ పాలకుల పేరిట ఉండేందుకు ఇదే కారణం. మొఘల్ పాలకుల పట్ల అసఫ్‌జాహీలకు గల గౌరవం ఎలాంటి మరో సంఘటన ద్వారా కూడా చూడవచ్చు. ఫోర్ట్ సెయింట్ జార్జ్ ఇంగ్లీష్ గవర్నర్ 13000కు పైగా పగోడాలను అసఫ్‌జాహీ 1కు కానుకగా ఇద్దామని నిర్ణయించుకున్నారు. అప్పటికే అసఫ్‌జాహీలకు ఫ్రెంచ్‌వారు కానుకలను సమర్పించుకున్న సంగతి బ్రిటిష్ వారికి తెలుసు. ఆ విషయంలో తాము వెనుకబడకూడదని అనుకున్నారు. బ్రిటిష్ వారు అందించిన కానుకాలను అసఫ్‌జాహీ స్వీకరించారు. అవి అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. వాటిలో కొన్నింటిని తాను ఉంచుకొని మిగితా వాటిని ఢిల్లీ చక్రవర్తికి పంపిస్తానని బదులిచ్చా రు. నిజాం రాజులు మొదటి నుంచి కూడా మొగల్ సామ్రాజ్యానికి విధేయులుగా ఉండేవారు. తదనంతరం, మరాఠాలు, టిప్పుసుల్తాన్ లాంటి పొరుగువారి నుంచి దాడులను తట్టుకునేందుకు గాను క్రీ.శ. 1798లో 'సైన్య సహకార ఒప్పందం'పై సంతకం చేయడం ద్వారా తమపై విదేశీ ఆధిపత్యాన్ని అంగీకరించినట్లయింది. అందువల్ల అసఫ్ జాహీ పాలన ఎన్నడూ పూర్తిస్థాయి సర్వస్వతంత్రమైంది కాదు. ఈ ఒప్పందంతో బ్రిటిష్ వారు దక్కన్‌లో తమ సామ్రాజ్యాన్ని విస్తరించుకునేందుకు వీలు కలిగింది. ఇక్కడ గమనించాల్సిన అంశం మరొకటి కూడా ఉంది. 1857లో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా జరిగిన పితూరి, ప్రిన్స్‌లీ స్టేట్స్‌లో గాకుండా, బ్రిటిష్ ఇండియాలోనే తలెత్తడం విశేషం. ఈ 'పితూరి' అనంతరం బ్రిటిష్ వారు బ్రిటిష్ ప్రభుత్వం తమకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు గాను, తాము ప్రత్యక్షంగా పాలించడం కంటే కూడా తమ కు విశ్వసనీయంగా ఉండే అసఫ్‌జాహీల వంటి వారి ద్వారా పరోక్షంగా పాలించేందుకు ప్రాధాన్యం ఇచ్చారు. ఆ కాలంలో మిగిలిన సామ్రాజ్యాన్ని పాలించేందుకు రెసిడెన్సీ సిస్టమ్ అనేది ఒక నమూనాగా మారింది.

> అసఫ్‌జాహీల పాలనలో ఉన్న దక్కన్‌లోని మింట్ లలో తయారయ్యే మొఘల్ నాణేలు. మొదటి ఐదుగురు అసఫ్‌జాహీ రాజులు తమ పేర్ల మీద సొంతంగా నాణేలు జారీ చేయలేదు.

బి) తదుపరి ముగ్గురు అసఫ్‌జాహీ రాజులు 1858 వరకు కూడా మొగల్ చక్రవర్తులు జారీ చేసిన త రహాలోనే నాణేలు విడుదలు చేసి వాటిపై తమ పేరులోని మొదటి అక్షరాలు ఉండేలా చూసుకున్నారు. మొగల్ పాలకులతో తమ అనుబంధాన్ని తెంచుకోవాలని, మొగల్ తరహా నాణేల జారీ నిలిపివేయాలని తొలిసారిగా 1858లో బ్రిటిష్ యువరాజు అసఫ్‌జాహీ రాజులపై ఒత్తిడి తీసుకువచ్చాడు. అప్పటి నుంచి జారీ అయిన నాణేలు అసఫ్ జాహీ పాలకుల పేరుపై ఉండేవి. వాటిని 'హాలీ సిక్కా'లుగా వ్యవహరించే వారు.

సి) చివరి ముగ్గురు రాజులు అసఫ్‌జాహీ పాలకుల పేరిట నాణేలు జారీ చేశారు. అఫ్జలుద్దౌలా తన పాలన ఆరంభరోజుల్లో మొగల్ తరహా నాణేలను జారీ చేశారు. తదనంతరం విలక్షణ రీతిలో అసఫ్‌జాహీ నాణేలను జారీ చేశారు. మొగల్స్ మరియు అసఫ్‌జాహీ పాలకులు 'నజరానా' నాణేలను నియమబద్ధంగా విడుదల చేసేవారు. అయితే, నిజాం చివరి పాలకుడు మీర్ ఉస్మాన్ అలీఖాన్ హయాంలో మాత్రం అవి విస్తృతంగా జారీ అయ్యాయి.

అందుకే అసఫ్ జాహీ నాణేల అధ్యయనం ఎన్నో విశేషాలను తెలియపర్చేదిగా ఉంటుంది. అది ఆనాటి కాలపు రాజకీయ చరిత్రను ప్రతిఫలిస్తుంది. అంతేగాకుండా కొంత మంది రాజుల గుణగణాలను కూడా తెలియజేస్తుంది. ఇక 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్‌పై భారతప్రభుత్వం తీసుకున్న పోలీస్ చర్యతో అసఫ్‌జాహీల పాలన ముగిసిపోయింది. ఆ విధంగా ఆసఫ్‌జాహీల పాలన, వారి నాణేల కథ ముగిసిపోయిన ప్పటికీ, ఆ నాణేలు 1959 వరకు కూడా చట్టబద్ధమైన కరెన్సీగా చెలామణి అయ్యాయి.

**అసఫ్‌జాహీ రాజులు - వారి పాలన కాలం**

1. మీర్ ఖమరుద్దీన్ అసఫ్‌జాహీ (క్రీ.శ. 1724–1748)
2. నాసిర్ జంగ్ మీర్ అహ్మద్ (1748–1750)
3. మొహియుద్దీన్ ముజఫర్ జంగ్ హిదాయత్ (1751–1752)

4. ఆసిఫ్ ఉద్దౌలా మీర్ అలీ సలాబత్ జంగ్ (1752-1762)
5. నిజాం అలీ ఖాన్ అసఫ్‌జాహీ (1762-1803)
6. సికందర్ జా అసఫ్‌జాహీ (1803-1829)
7. నాసిర్ ఉద్దౌలా అసఫ్‌జాహీ (1829-1857)
8. అఫ్జల్ ఉద్దౌలా అసఫ్‌జాహీ (1857-1869)
9. మీర్ మహబూబ్ అలీ ఖాన్ అసఫ్‌జాహీ (1869-1911)
10. మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ అసఫ్‌జాహీ (1911-1948)

× × ×

1. మొఘల్ పాలకుడు అహ్మద్ షా పేరిట అసఫ్ జాహీ I నాణెం



2. మొఘల్ పాలకుడు మహమ్మద్ అక్బర్ II పేరిట సికిందర్ జా నాణెం



3. మీర్ మహబూబ్ అలీ ఖాన్ జారీ చేసిన అసఫ్ జాహీ రకం



4. మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ చే నాజర్ రకం నాణెం



**చాల్ని నాణేలు:**

చాల్ని నాణేలు అనేవి అసఫ్‌జాహి పాలకుల వినూత్నత. అది విఫలమైంది. అసఫ్‌జాహి పాలకుడు నిజాం అలీ ఖాన్ మరియు తదనంతర పాలకులు వివిధ ప్రైవేటు సంస్థలు నాణేలు జారీ చేయడాన్ని అనుమతించారు. ఈ పదానికి అర్థం చలామణిలో ఉన్న నాణేలు.

ఇలాంటి నాణేలు ఏ సంవత్సంలో ఎన్ని దొరికాయంటే: 1921 (98), 1927 (118), 1929 (10), 1935 (96), 1936 (65), 1972 (24). ఇవన్నీ కూడా స్టేట్ మ్యూజియంలో భద్రపరచబడ్డాయి. కొన్ని సం దర్భాల్లో ఈ నాణేలు ఇతర రకాల నాణేలతో కలసి లభించాయి. ఈ 'చాల్ని' నాణేలు చలామణిలో ఉం డడం, ప్రజలు వాటిని వినియోగిం చడం ఒక విశేషం. ఈ ప్రైవేటు సంస్థలు నాణేల నాణ్యతను ఏ నాడూ పట్టించుకోలేదు. ఈ నాణేలు సృష్టించిన గందరగోళంతో చివరకు సాలార్ జంగ్ అవి చట్ట విరుద్ధ మని ప్రకటించాల్సి వచ్చింది.

5. ఇది గోపాల్‌పేట్‌కు చెందిన చాల్ని నాణెం. మొఘల్ పాలకుడు షా ఆలమ్ పేరు స్థానంలో 'గో' అని ఉంటుంది. అప్పట్లో



ఎన్నో ప్రభుత్వ, ప్రైవేటు మింట్స్ ఉండేవి.

**చర్చ:**

భారతదేశంలో మొట్టమొదటి సారిగా ఇస్లా మిక్ నాణేలను ఎనిమిదో శతాబ్దంలో సింద్ అమీర్లు జారీ చేశారు. క్రమం తప్పకుండా వారి నాణేలు విడుదల కావడం మాత్రం ఢిల్లీ సుల్తానులచే పదకొండు, ప న్నెండు శతాబ్దాల్లో మొదలైంది. వాటి కాలిగ్రఫీ పరంగానే గాకుండా అవి అందించే సమాచారం పరంగా కూడా ఇస్లామిక్ నాణేలు ఎంతో విశిష్టమైనవి. సాధారణంగా ఇస్లామిక్ నాణేలు అవి తయారైన మింట్ పేరు, హిజ్రీ శకంలో అవి జారీ చేయబడిన సంవత్సరం, వాటిని జారీ చేసిన వారి గుణశీలాలను వెల్లడించే ఒక లెజెండ్ ముద్రను కలిగి ఉంటాయి. ఇస్లామిక్ నాణేల మరో విశిష్ట లక్షణం అవి జారీ చేసిన వారి తం డ్రి పేరును కలిగి ఉంటాయి. రాజు పేరు అహ్మద్ లేదా ముహమ్మద్ అనే సాధారణ నామంతో ఉన్న సందర్భాల్లో ఆయా నాణేలను జారీ చేసిన వారెవరో తెలుసుకునేందుకు ఇది బాగా తోడ్ప డుతుంది. ఉదాహ రణకు బహమనీ పాలకుల్లో నలుగురు అహ్మద్‌లు, ముగ్గురు ముహమ్మద్‌లు ఉన్నా కూడా ఆయా నాణేలు వారిలో ఎవరిచే జారీ చేయబడినవో తెలుసుకోవడం సులభమే. కారణం, వారు తమ తండ్రి పేరు, కొన్ని సందర్భాల్లో తాత పేరును కూడా తెలియజేయడమే. ఆయా ముస్లిం పాలకులచే జారీ చేయబడిన నాణేలను గుర్తించేందుకు ఈ రాజవంశాల క్రమాలు ఎంతగానో తోడ్పడుతాయి.

ముస్లిం పాలకులెవరరైనా కొత్తగా అధికారంలోకి రాగానే చేసే మొదటిపని తన సొంతపేరు మీద నాణేలు విడుదల చేయడం. కొన్ని రోజులే లేదా కొద్ది నెలలే పాలించినా ఇలా చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఉదాహరణకు, బహమనీ రాజులు తమాతన్ షా మరియు దౌడ్ షా II ల నాణేలు మన స్టేట్ మ్యూజియంలో అనేకం ఉన్నాయి. మొఘల్స్ కూడా ఇదే విధానాన్ని అనుసరించారు. అధికారం చేపట్టిన తరువాత ముస్లిం పాలకులు సర్వసాధారణంగా చేపట్టే మరో పని తమ పేరును శుక్రవారం నాటి ప్రార్థనల్లో చదవాల్సిందిగా ఆదేశించడం.

తన, ప్రవక్త పుట్టిన రోజులన తన అధికారులు, జాగిర్దారులు తనను సందర్శించాలని మీర్ ఉస్మా న్ అలీ ఖాన్ కోరుకునే వాడు. వారెవరూ ఉత్త చేతులతో ఆయనను సందర్శించే వారు కాదు. వారు ఒక్కొక్కరు కనీసం ఒక బంగారు అష్రాఫి, ఐదు వెండినాణేలు తీసుకెళ్ళాలి. హైదరాబాద్ రాజ్యానికి చెందిన తొలి, గొప్ప కార్డియాలజిస్ట్ డాక్టర్ హైదర్‌ఖాన్. తన తండ్రితో కలసి కొన్ని సందర్భాల్లో ఆయన నిజాంను సందర్శించారు. సందర్శకులు ఆయనను కలుసుకొని, సేవకుడి చేతిలో ఉండే సంచీలోకి నాణేలను వేసేవారు. ప్రతీ పుట్టిన రోజుకు మరింత సుసంపన్నం అయ్యే రాజు ఆయన ఒక్కడే అనేది నిజం. ఏ అధికారి అయినా ఈ కార్యక్రమానికి రాకపోతే, 'తూ క్యోం నహీ ఆయే రే' అని నిజాం గుర్తు చేసేవారు. ఇవీ నాటి నాణేల గురించిన కొన్ని ముచ్చట్లు.

- దెమె రాజారెడ్డి, m: 9848018660
e: palvashareddy@gmail.com

ద

# యాదేఁ రఫ్తగాన్

# గుండవరం శాంతమ్మగారు

ఫారసీ భాషలో "యాదేఁ రఫ్తగాన్' అంటే గతించిన కాలాన్ని జ్ఞాపకం చేసుకోవటం. ఉర్దూలో "జిక్ర్ ఏ బుజుర్గాన్" అంటే వెళ్లిపోయిన పెద్దల ప్రస్తావన. దీనినే ఇంగ్లీష్‌లో "ఎలిజీ" అంటారు. తెలుగులో "స్మృతిగీతం" లేదా ఆప్తవాక్యం. "కాల యవనిక" వెనక్కి వెళ్లిన మహానుభావుల మంచితనాన్ని జ్ఞాపకం చేసుకోవటం అంటే మసకేసిన మన మనసుల్ని సరిదిద్దుకోవటం, సంస్కరించు కోవటం. వెళ్లిపోయిన వీరి మంచి తనాన్ని స్మరించుకుంటే "మౌత్‌కో సామ్నే రఖ్‌లేకే జీనా" అన్న స్పృహ కూడా స్ఫురిస్తుంది.

మొన్న అక్టోబరు నెల మూడవ తారీఖునాడు ఉదయం ఆరు గంటలకు సుప్రభాత వేళలో యోగా, ధ్యానంలు ముగించుకుని రవ్వంత సేపు విశ్రమించటానికి పరుపుపై వాలిన శాంతమ్మగారు అనాయాసంగా "మహాభిష్క్రమణం" చేసింది. అయిన వారిని, బంధుమిత్రులను శోకసముద్రాలలో ముంచి వేసి! "అతిథివోలె వుండి, వుండి – అవని విడిచి వెళ్లుతాను" అన్నట్లుగనే హడావుడిగా తొందరపడి జగము అనే ఈ సత్రశాలను వదిలి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయింది. ఇంకో రెండు సంవత్సరాలు జీవించి వుంటే "సహస్ర చంద్ర దర్శనం" పూర్తి చేసేది.



**"తన గేహము**
**తన దేహము**
**తన కాలంబు**
**తన ధనంబు**
**జగజ్జనులకు వినియోగించిన**
**ఘనుడీ వీరేశలింగము**
**జనులారా"** –చిలకమర్తి లక్ష్మీనరసింహం

పై పద్యం సరిగ్గా గుండవరపు శాంతమ్మగారికి కూడా సరిపో తుంది. "పుటుక నీది చావు నీది బ్రతుకంతా దేశానిది" అని కాళోజీ అన్నట్లుగానే తన బ్రతుకంతా పరుల క్షేమం, ఆనందం కోసమే అం కితం చేసిన శాంతమ్మగారిది నూటికి నూరుపాళ్లు "సార్థక జీవితం".

నాలుగు సంవత్సరాల క్రితం నేను హైద్రాబాద్ పుస్తక ప్రదర్శనలో నా పుస్తకాలతో స్టాల్ పెట్టినప్పుడు నన్ను వెదుక్కుంటూ ఒక ముసలమ్మ వచ్చి "నీవేనా లోకేశ్వర్ అంటే?" అని ప్రశ్నించింది. నేను అవును అనగానే "నీ సిల్కురూట్‌లో సాహస యాత్ర చదివాను. నిన్ను చూడాలనే కష్టపడి ఇక్కడికి వచ్చాను" అన్నది పసిపిల్లలు నవ్వే పసిడి నవ్వుతో! ఆ మాట విన్న నాకు "జ్ఞానపీఠం" అవార్డు నన్ను వెదుక్కుంటూ నా స్టాల్ వద్దకు వచ్చినట్లనిపించింది. నా పక్కన కుర్చీలో కూచుని ఇక ముట్టుకుంటే పట్టుకునే ముచ్చట్లే ముచ్చట్లు. అట్ల మా ఇద్దరి మధ్య దోస్తానా శురువయ్యింది. చరిత్రను త్రవ్వితవ్వి తోడి, తోడి బోలెడన్ని ముచ్చట్లు చెప్పుకున్నాం. తన చిక్కడపల్లి అడ్రసు ఇచ్చి ఇంటికి ఆహ్వానించింది. అట్ల శాతంతమ్మగారి పరిచయ భాగ్యం నాకు ప్రారంభమయ్యింది.

"ఎల్ల లోకములొక్క ఇల్లై" అని గురజాడ అన్నట్లుగానే లోకాన్నే తన ఇల్లుగా మార్చుకున్న ఆమె తన విశిష్ఠ వ్యక్తిత్వాన్ని తన తండ్రి గుండవరం హనుమంతరావు నుండి ఒక గొప్ప వారసత్వ సంపదగా పుణికి పుచ్చుకుంది. ఆయన స్వస్థలం హైద్రాబాద్ నగరమే. గ్రంథాలయ ఉద్యమానికి, అణాగ్రంథమాల ఉద్యమానికి పునాదులు వేసిన వట్టికోట ఆళ్వారుస్వామి, కె.సి.గుప్త, రావిచెట్టు రంగారావు లాంటి వైతాళికులలో ఈ హనుమంతరావు కూడా ఒకరు. ఆ తర్వాత ఆంధ్ర మహాసభ కార్యకలాపాలలో రావి నారాయణరెడ్డి, దాశరథి సోదరులు, ఇంకా అనేకానేక ప్రముఖులతో పాటు ఈయన కూడా పాల్గొన్నాడు. ఆ తదుపరి ఒక చారిత్రిక కర్తవ్యంగా కమ్యూనిస్టు ఉద్యమాలతో మమేకమై యాభై దశకం తొలినాళ్లలో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఉండటం వలన డాక్టర్ జయసూర్య నాయకత్వంలోని పిడిఎఫ్ అభ్యర్థిగా వరంగల్ జిల్లా ములుగు నియోజకవర్గం నుండి అసెంబ్లీకి ఎన్నికైనాడు. నాన్నగారి జీవితం, ఆలోచనలు, ఆశయాలు, ఆచరణా ఆమెను ప్రభావితం చేసి ఆమె వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దాయి.

వారు మొదటి నుండి చిక్కడపల్లిలోనే నివసించేవారు. ఆ రోజులలో చిక్కడపల్లి "లెనిన్ గ్రాడ్" "స్టాలిన్ గ్రాడ్" లాంటిది. కమ్యూనిస్టులకు కంచుకోట. అగ్రశ్రేణి కమ్యూనిస్టు నాయకులు రాజబహద్దూర్‌గౌర్, సత్యనారాయణరెడ్డి, జవ్వాద్ రజ్వీ, కె.కృష్ణమూర్తి లాంటి వారు వీరింటికి చుట్టుపక్కల నివసించేవారు. చిక్కడపల్లి పక్కనుండే ముషీరాబాదు, ఆజామాబాదు పారిశ్రామిక ప్రాంతాల్లో కమ్యూనిస్టు కార్మిక సంఘాలు బలంగా ఉండేవి. ఆర్టీసీ, వివిస్టీ, సిమెంటు పైపుల కర్మాగారాలలో ఎర్రజండాలు రెపరెపలాడేవి. ఇక వారిల్లు ఒక సత్రంలాగ, సరాయిలాగ ఉండేది. కమ్యూనిస్టు నాయకులే గాక సాహితీ దిగ్గజాలైన కాళోజీ, దాశరథి సోదరులు, వట్టికోట, బిరుదురాజు రామరాజు లాంటి వారు రావటం, సాహితీ చర్చలు

గోష్ఠులు జరపటం సర్వసాధారణం. ఇటువంటి రాజకీయ, సాహిత్య వాతావరణంలో శాంతమ్మగారు పెరిగి పెద్దదయ్యింది. విద్యార్థి-యువజన మహిళా సంఘాలలో చురుకుగా పాల్గొనేది. ఆ తరం నాటి విలువలకు, వ్యక్తిత్వాలకు ఆమె వారసురాలిగా, ప్రతినిధిగా జీవితాంతం నిలబడింది.

కాలం కలిసిరాక ఆమె అమ్మగారు కాలం చేశారు. ఆదాయం లేని త్యాగనిరతిగల నాన్న వృద్ధాప్యానికి చేరువైనారు. ఈమెనే ఇంటికి పెద్దదిక్కు. తొలిదశలో సనత్‌నగర్ గ్యాస్ ఫ్యాక్టరీలో చిరుద్యోగిగా పనిచేస్తూ ఇద్దరు తమ్ముళ్లకు, ఇద్దరు చెల్లెళ్లకు తనే తల్లిగా మారింది. ఆ తర్వాత ముషీరాబాద్ ఆర్టీసీలో ఉద్యోగం వచ్చింది. కాస్త ఊపిరి తీసుకునే వెసులుబాటు వచ్చిందనుకోగానే పియుసి చదువుతున్న పెద్ద తమ్ముడు రోడ్డు ప్రమాదానికి గురై కొన్ని నెలల పాటు కోమాలో ఉన్నాడు. అప్పుడు శాసనమండలి సభ్యుడుగా ఉన్న కాళోజీ ప్రతిరోజు దవాఖానకు వచ్చి గంటల కొద్దీ ఆ పిల్లవాడి దగ్గర కూచునేవాడు. దురదృష్టం కొద్దీ ఆ తమ్ముడు నేటికీ నిష్క్రియాపరుడిగా, వికలాంగుడిగా ఇంటికే పరిమితం కాగా తన చివరి క్షణం దాకా శాంతమ్మ అతడ్ని కంటిరెప్పలా కన్నతల్లిలా కాపాడుకుంది. మిగిలిన ఇద్దరు చెల్లెళ్లను ఒక తమ్ముడిని విద్యా ఉద్యోగాలలో ప్రయోజకులుగా తీర్చిదిద్ది పెళ్లిళ్లు, శుభకార్యాలు జరిపించి తను మాత్రం "ఒంటరి వటవృక్షంలా" మిగిలిపోయింది.

తొలిదశలో తననుప్రభావితం చేసిన రాహుల్ సాంకృత్యాయన్ లాగే ఆమె కూడా తన మలిదశలో, సంధ్యాసమయంలో కమ్యూనిజం నుండి బుద్ధిజం వైపు ప్రయాణించింది. హిందూమతంపై ఆమెకు మొదటి నుండి నమ్మకంలేదు. "మతములన్నియు మాసిపోవును. జ్ఞానమొక్కటే నిలిచి వెలుగును" అని దృఢంగా విశ్వసించేది. బౌద్ధసాహిత్యాన్ని, త్రిపిటకాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయటమేగాక దేశవిదేశాలలోని అనేక బౌద్ధ క్షేత్రాలను దర్శించుకున్నది. బర్మా, శ్రీలంక, థాయ్‌లాండ్, మలేసియా, సింగపూర్‌లే గాక నేపాల్‌లోని లుంబినీ, మనదేశంలోని శ్రావస్తి కుసినారా, వైశాలి, రాజగృహ, బోధగయ, సారనాథ్‌లను పర్యటించింది. ఆమె నిరంతర లోకసంచారి. అటు అమెరికాను ఇటు ఆస్ట్రేలియాను చుట్టి వచ్చింది. ప్రయాణాల పక్షిలా నిరంతరం సుదూరతీరాలకు ఎగిరిపోవటానికి ప్రణాళికలు వేస్తుండేది. "జ్ఞాని లోకసంచారి" అన్న సూక్తి ఆమెకు అక్షరాలా వర్తిస్తుంది. నాకు రాహుల్ సాంకృత్యాయన్ "టిబెట్ మే సవావర్ష్" పుస్తకాన్ని బహుకరించి లాసాకు వెళ్లి బౌద్ధారామాలను చూసి వద్దాం అని ఊరిస్తుండేది. మేధస్సు బౌద్ధం వైపు మొగ్గి ఉన్నా హృదయం మాత్రం వామపక్ష ఉద్యమాల వైపు ఊగిసలాడుతుండేది. బాలగోపాల్ లేని లోటు గురించి చాలా సార్లు బాధతో మాట్లాడేది.

"విపస్సన ధ్యానకేంద్రాలు" ఆమెకు ప్రియమైన క్షేత్రాలు. హైద్రాబాద్‌తో సహా దేశంలోని అనేక విపస్సనా కేంద్రాలలో రోజుల తరబడి ఉండి "శ్వాస మీద ధ్యాస" నిలిపి ధ్యానంలో మునిగిపోయేది. తన కొచ్చే అతిస్వల్ప బ్యాంకు డిపాజిట్ వడ్డీలతో బౌద్ధసాహిత్యాన్ని ఇతర మంచి పుస్తకాలను కొని ఆసక్తిగల మిత్రులందరికీ ఉచితంగా బహుకరించేది. ఆమె నివసించే గది "సరస్వతి సన్నిధానంలా" పుస్తకాలతో నిండి ఉండేది. పుస్తకాల పట్ల ఆమె ప్రేమను చూస్తుంటే నాకు ఒక ఉర్దూ షాయరీ జ్ఞాపకం వస్తుండేది.

**"హమే దునియా సే క్యా మత్‌లబ్**
**ఖుతుబ్‌ఖానా హై వతన్ అప్నా**
**మరేంగే హమ్ కితాబోం పర్**
**హర్ వరఖ్ హై కఫన్ అప్నా"**

ఈ లోకంతో మాకేం సంబంధం
గ్రంధాలయమే మా స్వదేశం
పుస్తకాలకోసం ప్రాణాలు విడుస్తాం
ప్రతి కమ్మను కప్పుకుని లోకాన్ని వదలుతాం

ఒకసారి నన్నూ నా శ్రీమతి శోభను తన ఇంటికి ఆహ్వానించి కమనీయమైన కబుర్లు చెప్పి, కమ్మటి భోజనాన్ని పెట్టి కొత్త బట్టలతో మా ఇద్దర్నీ సత్కరించింది. తన ఆశీస్సులు అందచేసింది. అది మేం మరిచిపోలేని మధురజ్ఞాపకం. అరుదైన అదృష్టం.

నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని తిమ్మాపురం గ్రామంలోని "మోక్షానంద ఆశ్రమంలో నివసించే బౌద్ధ భిక్షువు "ధమ్మరక్షిత"ను హైద్రాబాద్‌లోని తన గృహానికి ఆహ్వానించి అక్టోబరు 14, 15 తేదీలలో "బౌద్ధ ప్రవచనాలను" ఏర్పాటు చేయాలని సన్నాహాలు చేస్తూనే 78 సం॥ల వయసులో మూడవ తారీఖు ఉదయం సుప్రభాత సమయాన ఈ "స్థావరజంగమాత్మక" ప్రపంచాన్ని వదిలి ఆకాశం అవతలివైపు "మహాభినిష్క్రమణం" చేసింది. నిశ్శబ్దంగా నిష్క్రమించింది.

తన మరణానంతరం కూడా లోక కళ్యాణానికి, శాస్త్రీయ పరిశోధనలకు, వైద్యశాస్త్రాలకు ఉపయోగపడాలనే అత్యున్నత ఆశయంతో తన పార్థివదేహాన్ని గాంధీ ప్రభుత్వాసుపత్రికి దానం చేసేటట్టు వీలునామా రాసి చివరికి అక్కడికే ఆ 'ఆఖరిమజిలీకి' చేరుకుంది. అచ్చంగా తన తండ్రి తర్వాత తండ్రి లాంటి వాడైన కాళోజీ తన దేహాన్ని వరంగల్ మెడికల్ కాలేజీకి అప్పగించినట్లుగానే!

హిమలాయాలకన్నా ఉన్నతమైన వ్యక్తిత్వాలు వారివి. బహుశా దేవుడనేవాడు ఉంటే వారిని ప్రత్యేకమైన మూసలో తయారు చేసాడేమో! మళ్లీ అటువంటి అపురూపమైన మనుషులు కనబడరేమో!

పుట్టినపుడు తల్లితండ్రులు ఆమెకు పెట్టిన అసలుపేరు "శాంతామణి". ఆమె జీవితాంతం తన ఆలోచనలు, ఆచరణ, అధ్యయనం, ఆదర్శాల ద్వారా "మణిపూస" లా విజ్ఞానపు వెలుగులు విరజిమ్మింది.

సార్థక జీవితం శాంతమ్మగారిది.

**"జానే వాలే కభీ నహీం ఆతే**
**జానే వాలోంకీ యాద్ ఆతీహై"**

**-పరవస్తు లోకేశ్వర్,**
m: 9160680847
e: lokeshwar.hyderabadi@gmail.com

# పటం కళాకారులు - కట్టడి సంప్రదాయం

తెలంగాణా జానపద కళలకు కళాకారులకు కాణాచి. ఇక్కడ ఉన్నన్ని జానపద కళారూపలు కానీ,కళాకారులు కానీ మరే ప్రాంతంలో లేరనేది అక్షర సత్యం.జానపద వృత్తి కళాకారుల్లో పటం కథా కళాకారులు ప్రత్యేకం.ఈ పటం కళాకారులు తమ దాతృకులాల పురాణాలను, వంశ చరిత్రను కీర్తిస్తూ వారందించే ప్రతిఫలంతో జీవనం సాగించడం ఆచారంగా వస్తుంది.పటం ఆధారంగా చేసుకొని,పటంలోని బొమ్మలను చూపిస్తూ కథాగానం చేయడం పటం కథకుల ప్రధాన వృత్తి.ఐతే వీరు తమ ప్రదర్శనలోని కథాంశానికి అనుగుణంగా పలు చిత్రాలను, సంఘటనలను ఒక నూలుగుడ్డపై నకాశి కళాకారులతో వేయించుకొని 'పటం'ను రూపొందించు కుంటారు. పటాలకు అతి పురాతనమైన చరిత్ర ఉండటం గమనార్హం.

అంతర్జాతీయంగా 'పటం' ఆధారిత బొమ్మల వ్యాప్తి ఉన్నప్పటికి తెలంగాణాలో మాత్రం పటం ఆధారిత కళా రూపాలకు ప్రసిద్ధి. ఇక్కడ 12 పటం కథా కళారూపాలు ఉన్నాయంటే తెలంగాణ ఎంతటి ఔన్నత్యాన్ని కలిగిఉందో చెప్పకనే తెలుస్తుంది.ఈ పటం కళారూపాలు నియమిత దాతృకులానికి లేదా పోషక కులానికి ఆశ్రితులుగా ఉంటూ పటం కథలను ప్రదర్శిస్తారు. మంగలి వారికి అద్దపు వారు నాయి బ్రాహ్మణ పురాణాన్ని, కుమ్మరి వారికి పెక్కర్లు గుండ బ్రహ్మపురాణాన్ని,గౌడులకు ఏనూటి, గౌడజెట్టి వారు గౌడపురాణాన్ని ప్రదర్శిస్తారు.పద్మశాలీలకు కూనపులి వారు మార్కండేయపురాణం, యాదవులకు తెరచీరలు వారు కాటమరాజు కథలు, గంగమ్మకథ లేదా యాదవ పురాణంను,చాకలి వారికి మాసయ్యలు మడివేలయ్య పురాణం. తెనుగు/ముదిరాజ్ వారికి కాకిపడిగెల వారు పాండవుల కథను, నాయకపోడు వారికి తోటి కళాకారులు పద్మనాయకుల వృత్తాంతంను, మాదిగ వారికి డక్కలి కళాకారులు జాంబపురాణంను, మాల వారకి గుట్టపు కళాకారులు భేతాళపురాణం వంటి కథలను కథాగానం చేయడం సంప్రదాయంగా వస్తున్న ఆచారం.



పటం కళాకారులు తమ దాతృకులాల వారితో నియమిత హక్కులు కలిగి ఉంటారు. హక్క అనేది వంశపారంపర్యంగా వస్తున్న ఆచారం. ఈ హక్కునే 'కట్టడి'అంటారు. కట్టడి, కట్టడి గ్రామాలు అనేది జానపద వృత్తి కళాకారులకు నియతిగా వచ్చిన సంప్రదాయం. కట్టడిని దాతృకులాలు అతిక్రమించడానికి అవకాశం ఏమాత్రం ఉండదు. ఒకవేళ అలాంటి సందర్భం వస్తే కళాకారులు తమ ప్రాధాన్యాన్ని, హక్కును దాతృకులాలకు తెలియపరిచి తమకు అందాల్సిన కట్టడిని సాధించుకుంటారు. ఈ కట్టడి లేదా హక్కు విషయానికి సంబంధించిన వివరాలు రాగిశాసనాలపై లేదా రాగిసన్నత్‌పై వ్రాయబడి ఉంటాయి. వీటిని స్థిరాస్థిగా భావించి భద్రంగా దాచిపెట్టుకుంటారు. కొన్ని సందర్భాల్లో కళాకారులకు మగ సంతానం లేకపోతే,కట్నం క్రింద తమ ఆడపడుచులకు రాగిశాసనంపై ఉన్న కట్టడి గ్రామాలను రాసి ఇస్తారు.

వరంగల్లు జిల్లా పాలకుర్తి మండలంలోని బమ్మెరకు చెందిన ఏనూటి కళాకారుడికి కొడుకులు లేకపోతే తనకు త్యాగం లేదా హక్కుగా ఉన్న గ్రామాలను కూతరుకు కట్నం కింద పంచి ఇచ్చాడు.అదేవిధంగా సంగెం మండలంలోని బొల్లికుంటకు చెందిన మాసయ్య కళాకారుడు తన ఇద్దరి కొడుకులకు ఆస్తి పంపకాలు చేసినప్పుడు అతనికి వంశపారంపర్యంగా వచ్చిన రాగిశాసనాన్ని కూడా ఇద్దరి కొడుకులకు పంచి ఇచ్చేక్రమంలో మరొక రాగిశాసనం నకలు తయారు చేసి ఇచ్చాడు. ఈ రకంగా కట్టడి గ్రామాలు, దాతృ కులమిచ్చే దానాలు వ్రాయబడిన శాసనాన్ని స్థిరాస్థిగానే కాకుండా పవిత్రంగా భావిస్తారు. కేవలం గ్రామాల మీదికి త్యాగం కొసం వెళ్లినపుడు మాత్రమే రాగిశాసనాన్ని తీసుక వెళ్లుతారు. దాదాపుగా పటం కళాకారులందరికి రాగిశాసనాలుంటాయి. రాగి శాసనాలపై రెండు రకాల త్యాగాలు రాయబడి ఉంటాయి. ఒకటి కేవలం కథలు చెప్పకుండా త్యాగం నిర్ణయం చేసుకునేది, రెండవది కథలు చెప్పి త్యాగం నిర్ణయం చేసుకునేదిగా ఉంటుంది. ఇందులో మొదటిది తప్పనిసరిగా దాతృకులం వారు పాటించి త్యాగం అందచేస్తారు.రెండవది కథలు చెప్పినందుకు ప్రతిఫలంగా అందచేసేది. కళాకారులు కథలు చెప్పినన్ని రోజులు దాతృకులం వారిని పోషించాల్సి ఉంటుంది. ఉండటానికి వసతితో పాటు ప్రదర్శనలో అనుష్ఠానాలకు అయ్యే ఖర్చును కూడా భరించాల్సి ఉంటుంది.

పటం కళాకారులు కట్టడి గ్రామాలలోని దాతృకులాల దగ్గరికి వెళ్లి ముందుగా కులపెద్దను కలుస్తారు. ఆర్తి వాళ్ళం వచ్చామని, తరతరాలుగా మిమ్మల్ని నమ్ముకొని జీవిస్తున్నామని, మీ కులపురాణాలను కీర్తిస్తూ, మిమ్ముల్ని ఆశ్రయిస్తూ బ్రతుకుతున్నామని, మాకు త్యాగం చెప్పండని వేడుకుంటారు. అప్పటికే కులపెద్ద తన కులం వారితో చర్చిస్తాడు. కేవలం త్యాగం మాత్రమే ఇవ్వాలనుకుంటే కథలు చెప్పటం గురించి మాట్లాడరు.కథలు చెప్పటం అవసరం లేదనుకుంటే త్యాగం మాత్రమే కట్టడి చేసుకోండని అంటాడు. కళాకారులు మేం చాలా యేండ్ల తర్వాత వచ్చామని మా మీద దయచూపండని బ్రతిమాలుతూ దాతృకులాన్ని కథలు చెప్పించుకునే విధంగా వేడుకుంటారు.

కులపెద్ద కళాకారులు ఒప్పుకుంటేనే ప్రతిఫలం గురించి

కట్టడి చేసుకుంటారు. ఎక్కువ ప్రతిఫలం కావాలని కళాకారులు చూస్తుంటే, కులం వారు మాత్రం తక్కువ ప్రతిఫలం ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తూ ఉంటారు. ఇప్పుడే ఎన్ని రోజులు కథలు చెప్పేది నిర్ణయించుకుంటారు. అలాగే కథల మధ్యలో జరిగే అనుష్ఠానాలకు సంబంధించిన వస్తువులు కులంవారే ఇప్పించాల్సి ఉంటుంది. కథలు పూర్తయిన తర్వాత చేసే బలి కార్యక్రమానికి సంబంధించిన మేకపోతులు. కులంవారే ఇవ్వాల్సిన అనుష్ఠానాలకు సంబంధించిన వస్తువులు కులం వారే ఇప్పించాల్సి ఉంటుంది. ఈ రకంగా వారిచ్చే ప్రతిఫలాన్ని కట్టడి చేసుకుంటారు. కట్టడి ఒప్పందం జరిగిన తర్వాత కళాకారులు ఆయా కులపెద్దలకు, కులస్థులందరికి దీవనార్తి చదివి దీవిస్తారు.

పటం కళాకారుల్లో దక్కలి,గుర్రపు కళాకారులు ప్రతిఫలం విషయమై కట్టడి చేసుకునే విధానం భిన్నంగా కనిపిస్తుంది. వీరి కట్టడి విధానం పరిశీలించినట్లైతే ఈ క్రింది విధంగా ఉంటుంది.



**దక్కలి :**

దక్కలి కళాకారులు ప్రదర్శనకు కట్టడి గ్రామంలోని మాదిగ కులస్థులకు కథలు చెప్పటానికి వెళ్లినపుడు గ్రామంలోకి ప్రవేశించకుండా ఊరి బయట గుడారాలు వేసుకొని ఉంటారు.

ఆ తర్వాత మాదిగ కులపెద్దకు కబురు పంపి విషయం తెలియజేస్తారు. అపుడు కులపెద్ద దక్కలివారిని తన ఇంటికి పిలిపిస్తాడు. “పెద్దలు మీకు తెలియందికాదు, చాలా ఏండ్ల తర్వాత మీ ఊరికి వచ్చామని, మీరు కథలు చెప్పించుకోవాలని వేడుకుంటారు. అందుకు కులపెద్ద తన కులస్థులతో విచారించి సరేనంటే దక్కలివారు కులపెద్ద ముందు ఒక తువ్వాల పరిచి అందులో గవ్వల దర్శనాలు పోస్తాడు. అందులో రెండు రకాల గవ్వలుంటాయి. ఒకటి గవ్వలు, రెండు గురిగింజలు. గవ్వలు అనేవి తొమ్మిది వరకు ఉంటాయి. వీటిని డబ్బుల క్రింద లెక్కగడతారు. ఒక గవ్వ వెయ్యి రూపాయలతో సమానంగా లెక్కడతారు. గురిగింజలు అనేవి తొమ్మిది వరకు ఉంటాయి. ఒక్కో గురిగింజ ఒక్కో ధాన్యం బస్తా సమానంతో లెక్క కడతారు.

కళాకారులు ఎన్ని గవ్వలు వేయాలో చెప్పండని కులపెద్దను కోరుతారు. ఆ కులపెద్ద తన వారితో చర్చించి అయిదు గవ్వలు వేయమంటే కళాకారులు ఒక రెండు గవ్వలు ఎక్కువగా వేయనివ్వండని వేడుకుంటారు. అందుకు కులపెద్ద సమ్మతిస్తే సరేనంటారు. ఆ తర్వాత గురిగింజలు ఎన్ని వేయాలో అడుగుతారు. గురిగింజలు రెండు లేదా మూడింటికి కులపెద్ద సరేననటంతో గవ్వలు ఏడింటికి ఏడువేలు, గురిగింజలు రెండు అయితే రెండు ధాన్యం బస్తాలు, మూడయితే మూడు ధాన్యం బస్తాలు ప్రతిఫలం ఇచ్చేటట్టు కళాకారులు కట్టడి చేసుకుంటారు.

**గుఱ్ఱపు:**

గుర్రపువాళ్లు ప్రదర్శన కోసం మాలల దగ్గరికి వెళ్లినపుడు వీరు కట్టడి చేసుకొనే విధానం కొంత దక్కలి వారిని పోలి ఉంటుంది. దక్కలి వారి మాదిరిగా త్యాగం తీసుకోవటానికి గవ్వల దర్శనం వేస్తారు. కానీ వీరు త్యాగం తీసుకోవడానికి వేసే గవ్వల దర్శనంలో రెండు రకాలుంటాయి. ఒకటి త్యాగం గవ్వలు, రెండు ఆట గవ్వలు. త్యాగం గవ్వలు అంటే కేవలం కథలు చెప్పకుండా మాల కులం వారి దగ్గర తీసుకొనే ప్రతిఫలం దీన్నే త్యాగం అని కూడ అంటారు. ఆట గవ్వలు అంటే కథలు చెప్పినపుడు తీసుకునే త్యాగం (ప్రతిఫలం). త్యాగం గవ్వల్లో గవ్వలు, గురిజలు, గచ్చకాయలు ఉంటాయి. ఇందులోని గవ్వలు మూడు రకాలుంటాయి. ఇవి చిన్న గవ్వలు, మామూలు గవ్వలు, పెద్ద గవ్వలు. చిన్న గవ్వలు అనేవి ఒక గవ్వకు అయిదు రూపాయలు లెక్కగడతారు. మామూలు గవ్వలకు ఒక్కో గవ్వకు అయిదు రూపాయల నుండి పది రూపాయల వరకు లెక్క కడతారు. పెద్ద గవ్వలు అనేవి బస్తా ధాన్యానికి నిదర్శనంగా చూపుతారు. ఇక గురిగింజలు అనేవి కిలో ధాన్యానికి విలువ కట్టడం జరుగుతుంది. గచ్చకాయలు ఒక్కొక్క గచ్చకాయ వెయ్యి రూపాయలతో విలువ కడుతారు. మాలవారు తువ్వాలలో ఎన్ని గవ్వలు, గురిగింజలు, గచ్చకాయలు పోయమంటే గుఱ్ఱపువారు అన్నింటిని పోస్తారు.

ఆట గవ్వల్లో అయిదు రకాల గవ్వలుంటాయి. ఇందులో గంగపురి గవ్వ, పెద్ద గవ్వ, పొడగవ్వ, ఊరగవ్వ, త్యాగం గవ్వలు. ఇందులో ఒక్కొక్క గవ్వకు అయిదు వేల రూపాయలకు విలువ కడతారు. వీరు త్యాగం కోసం పోయిన గ్రామంలో ఎక్కువ మాలలు ఉంటే ఒకటి నుండి రెండు గవ్వలు వేసి ప్రతిఫలం కట్టడి చేసుకుంటారు. కట్టడి చేసుకున్న పిమ్మట మాల కులం వారికి బొట్లు పెట్టి అందరికి దీవనార్తి చదువుతారు.

తరతరాలుగా సాంస్కృతిక పరంగా వచ్చిన నియతిని పాటిస్తూ కళాకారులు దాతృకులం దగ్గర గౌరవప్రదమైన మనుగడ సాధించలేక పోతున్నారు. మారుతున్న కాలంలో కళారూపం మనుగడ ప్రశ్నార్థకమై పోయింది. కట్టడి ఆచారాలను దాతృకులాలు విస్మరిస్తూ ఏదో తోచినంత ప్రతిఫలమిస్తూ కళాకారులను ఆదుకోలేక పోతుండటం బాధకరం. దీనివల్ల ఒక సమూహం మనుగడకు దోహదం చేసే సంస్కృతిని పరిరక్షించి, దాని ఔన్నత్యాన్ని బయటి ప్రపంచానికి తెలియజేయాల్సిన అవసరం ఎంతైన ఉంది. ప్రభుత్వాలు,స్వచ్ఛంద సంస్థలు,దాతృకులాలు సైతం పటం కళాకారుల ఔన్నత్యానికి తోడ్పాటు నందించి,సంస్కృతి పరిరక్షణలో భాగస్వామ్యం కావల్సిన అవసరం ఉంది.


-డా॥ గడ్డం వెంకన్న m : 9441305070
e : gaddamvenkanna@gmail.com

ద

# తెలుగు నాటకరంగంపై తెలంగాణ యవనిక

తెలుగు నాటకరంగంలో ఆయనది ఒక సుదీర్ఘ ప్రయాణం. రచయితగా, నటుడిగా, దర్శకుడిగా తెలుగు నాటక రంగంపై తెలంగాణ యవనిక ఆయన. తెలంగాణ గడ్డపై పుట్టిన బిడ్డగా నాటకరంగంలో తనదైన భూమికను పోషించాడు. గ్రామీణ యువకులను దండుగా గట్టి పీడిత, తాడిత ప్రజలను తట్టి లేపిన నాటక దళపతి ఆయన. నిజాం కాలం నుండే సాంఘిక నాటకాలను గ్రామాల వైపు మళ్ళించి నాటక క్షేత్రాన్ని సుసంపన్నం చేసినవాడు. అంతేకాదు గాంధేయవాదాన్ని గ్రామీణాభివృద్ధికి అన్వయించినవాడు. నాటక వికాసానికి తండ్రి నుండి సంక్రమించిన ఆస్తులను ధారపోసిన త్యాగజీవి. ఆయన ఎవరో కాదు కె.యల్. నరసింహారావుగా ప్రసిద్ధులైన కోదాటి లక్ష్మీనరసింహారావు.

కె.యల్. నరసింహారావు 23 అక్టోబర్ 1923న నల్లగొండ జిల్లా, మునగాల మండలం రేపాలలో కోదాటి వేంకట నరసింహారావు, వెంకట నరసమ్మ దంపతులకు జన్మించారు. ఆయన విద్యాభ్యాసం జగ్గయ్యపేట, సూర్యాపేటలో సాగింది. కమ్యూనిస్టు భావజాలం కలిగిన కె.యల్. విద్యార్థి దశ నుండి పరిషత్తు నాటకాల పట్ల ప్రభావితుడై నాటక రంగంపై ఆసక్తి పెంచుకున్నాడు. నిజాం పాలన సాగుతున్న రోజుల్లో గ్రామాల్లో నెలకొన్న దారిద్ర్యం, నిరక్షరాస్యత గమనించి ఆయన గ్రామ అభివృద్ధివైపు అడుగులు వేసాడు.



స్వాతంత్రసమరయోధుడు, గాంధేయవాది కోదాటి నారాయణరావు కె.యల్.కు చిన్నాయన. ఆయన స్ఫూర్తితో 1944లో మిత్రులతో కలిసి 'గ్రామవెలుగు' సంస్థను ప్రారంభించి గ్రామీణ సంస్కరణోద్యమానికి, గ్రంథాలయ వ్యాప్తికి ఉద్యమించాడు. అంతేకాదు ప్రజల్లో సాంస్కృతిక చైతన్యానికి నాటకాలు అవసరమని భావించి 1946లో 'గ్రామవెలుగు' నాట్యమండలిని స్థాపించి సాంఘిక నాటకాలకు తెర లేపాడు. తెలంగాణలో యక్షగానాలు, పద్యనాటకాలకు ఆదరణ ఉన్న రోజుల్లో కె.యల్. సాంఘిక నాటకాలవైపు దృష్టి సారించడం సాహసోపేతమైన నిర్ణయం. ఆయన కమ్యూనిస్టు భావజాల స్ఫూర్తితో తొలిసారిగా 'విప్లవశంఖం' నాటకాన్ని వ్రాసి ప్రదర్శించారు. అయితే సాయుధ పోరాటాల్లో నిర్దాక్షిణ్యంగా బలైన అమాయకుల మరణం కె.యల్.ను ఎంతో కలిచివేసింది. దీనితో ఆయన కమ్యూనిస్టు పంథాను వీడి సమాజాన్ని తనదైన కోణంలో దర్శించడం మొదలు పెట్టారు. సాయుధ పోరాటానికి వ్యతిరేకంగా 'గెలుపునీదే' నాటకాన్ని వ్రాశారు. నాటక ప్రముఖులైన తేరాల సూర్యనారాయణ శర్మ దర్శకత్వంలో గ్రామీణ యువకులు, రైతులతో 1948లో ఈ నాటకాన్ని హైదరాబాద్ ప్రతాప్ గిర్జీ కోఠిలో జరిగిన జాతీయ కాంగ్రెస్ మహాసభలో మొదటిసారి ప్రదర్శించారు. ఈ ప్రదర్శన అందర్నీ ఆలోచింపచేసింది. జాతీయ నాయకుల ప్రశంసలతో నాటక రచయితగా కె.యల్. మంచి గుర్తింపు పొందారు. ఈ నాటకాన్ని చూసిన అప్పటి విద్యాశాఖ మంత్రి శ్రీ రాజాధోండే రాజ్ బహద్దూర్ ప్రభుత్వ పక్షాన రాష్ట్ర వ్యాప్తంగా ఈ నాటకాన్ని ప్రదర్శించేందుకు నిర్ణయం తీసుకున్నారు.

చుట్టూ వున్న సమాజాన్ని మేల్కొల్పేందుకు కె.యల్. ఒకవైపు సాహిత్యాన్ని మరోవైపు నాటకాన్ని ఆయుధంగా మలచుకున్నాడు. ఆయన పుట్టిన రేపాల గ్రామాన్ని నాటక ప్రయోగశాలగా మార్చాడు. సమాజంలోని పరిస్థితులను ఇతివృత్తంగా తీసుకుని విశ్వజనీనమైన మానవ విలువలను జోడించి నాటకం వ్రాసి ప్రదర్శించేవారు. ఆయన రాసిన నాటకాలను చూడడానికి వట్టికోట ఆళ్వారుస్వామి, పి.వి. నరసింహారావు, గోపిచంద్ కాళోజీ నారాయణరావు, సి. నారాయణరెడ్డి, అక్కినేని నాగేశ్వర రావు, గుమ్మడి వంటి ఎందరో మేధావులు రాజకీయ నాయకులు, ప్రజలు రేపాలకు తరలివేళ్లేవారు. 1956లో ఆయన 'అడుగుజాడలు' నాటకం వ్రాశారు. రజాకార్ల నితంతృత్వ పాలనకు చరమగీతం పాడి అప్పుడప్పుడే కోలుకుంటున్న గ్రామాలలో ఆత్మీయ అనుబంధాల్ని ముందుకు సాగాలని సూచిస్తుంది. స్వయంకృషితో సమస్యలను పరిష్కరించే యువతరానికి ఈ నాటకం మార్గదర్శనం చేస్తుంది. ఉత్తమ రచయితలెప్పుడు సాహిత్య సృష్టికి, సమకాలీన సమస్యలను ఎంచుకుని రచనలు చేస్తారు. ఈ క్రమంలోనే భారతదేశంపై చైనా దాడిని నిరసిస్తూ కె.యల్. 'అగ్నిపరీక్ష' నాటకాన్ని వ్రాశారు. ఇందులో చైనా యుద్ధంపట్ల గ్రామీణుల మనోభావాలను యథాతథంగా చిత్రించారు. కొందరు తెలంగాణాలోని యువకులను చైనా భావజాలంవైపు మళ్ళించేలా చేస్తున్న ప్రయత్నాలను రచయిత ఈ నాటకం ద్వార నిరసిస్తూ జాతీయ భావాన్ని ఉద్బోదించాడు. ఈ నాటకాన్ని ఆనాటి రాష్ట్ర సమాచార శాఖామంత్రి పి.వి. నరసింహారావు సారథ్యంలో 1963 ఫిబ్రవరి 14న రవీంద్రభారతిలో ఈ నాటకాన్ని ప్రదర్శిస్తే నాటి ముఖ్యమంత్రి, ఇతర శాసన సభ్యులు ప్రేక్షకులై తిలకించారు. ఇది ఒక అరుదైన సందర్భం. సి. నారాయణ రెడ్డి పాటలు రాసిన ఈ నాటకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శించారు.

1956లో ఆయన రాసిన 'క్రీనీడలు' నాటకం పరిషత్తు నాటకాల్లో విశేష ఆదరణ పొందింది. ఈ నాటకానికి ప్రముఖ సాహితీ వేత్త గోపిచంద్ సమీక్ష వ్రాశారు. హిమాచల్ గవర్నర్‌గా పనిచేసిన వి.యస్. రమాదేవి ఈ నాటకంలో ముఖ్యపాత్రను పోషించారు. కె.యల్. సామాన్య ప్రజలకు అర్థంకాని మన రాజ్యాంగం, పంచవర్ష ప్రణాళికలు, ప్రజాస్వామ్య విలువలు వంటి అంశాలు గ్రామీణులకు అర్థమయ్యే రీతిలో తెలంగాణ మాండలికంలో నాటకాలను రాసి ప్రజల్లోకి తీసుకువెళ్ళాడు. 1958లో వట్టికోట ఆళ్వారుస్వామి

'దేశోద్ధారక గ్రంథమాల'లో కె.యల్. వ్రాసిన స్వార్థం నాటికను ప్రచురించారు. 1948లో 'ఆదర్శలోకాలు', 1956లో 'అడుగు జాడలు', 1957లో 'కొత్తగుడి', 1961లో 'తోడునీడ', 1964లో 'కోడిగట్టిన దీపాలు', 'చీమలు పెట్టిన పుట్టిల్లు' వంటి ఎన్నో నాటకాలను వ్రాసిన కె.యల్. నరసింహారావు తెలుగు నాటక రంగంలో ప్రముఖ నాటక కర్తగా గుర్తింపు పొందారు.



ఒకవైపు నాటక రచయితగా రాణిస్తూనే వరంగల్ కేంద్రంగా పి.వి. నరసింహారావు సారథ్యంలో ప్రచురితమయ్యే ప్రగతి వాం పత్రికకు ఉప సంపాదకుడిగా పని చేసారు. ఆ సమయంలో పి.వి.తో కలిగిన సాన్నిహిత్యం చివరి వరకు కొనసాగింది. కె.యల్. రాసిన నాటకాలకు పి.వి. నరసింహా రావు సమీక్షలు వ్రాశారు. అదేవిధంగా సురవరం ప్రతాపరెడ్డి 'ప్రజావాణి' పక్షపత్రికలో వ్యాసకర్తగా పనిచేశారు. 1949-50 ప్రాంతంలో కె.యల్. భవధీయుడు కలం పేరుతో నాటి తెలంగాణ తీరుతెన్నులపై తెలుగు స్వతంత్ర్య పత్రికలో ఆయన వ్యాసాలు వ్రాశారు.

1951-57 కాలంలో ఆ స్క్రిప్ట్ రైటర్‌గా, వ్యాఖ్యాతగా, ఆల్ ఇండియా రేడియోలో ఉద్యోగ బాధ్యతలను నిర్వహించారు. ఆ సమయంలో 'అక్బర్' అనే చారిత్రక నాటకాన్ని వ్రాసి రేడియోలో ప్రసారం చేశారు. ఆయన ప్రత్యేకంగా నిర్వహించిన వెంగళప్ప కబుర్లు, రేడియో ఎల్లయ్య మామ ముచ్చట్లు వంటి కార్యక్రమాలు రేడియో శ్రోతలను అలరించాయి. రేడియోలో ఆయన తెలంగాణ యాసకు, మాండలికాలకు పెద్ద పీటవేశారు. రేపాలలో ప్రతి ఏడాది నిర్వహించే లక్ష్మీనరసింహాస్వామి ఉత్సవాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు వైజ్ఞానిక మహాసభలను నిర్వహించడం ఆయనకే చెల్లింది. ఈ ఉత్సవాల్లో భాగంగా 1958 నుండి రాష్ట్ర నాటక స్థాయి పోటీలను ప్రారంభించారు. ఈ పరంపర ఈనాటికి కొనసాగుతూనే ఉంది.

కె.యల్. స్థాపించిన గ్రామవెలుగు నాట్యమండలి ఆయన నాటక రచనలే కాకుండా, ఆత్రేయ, భమిటిపాటి వంటి గొప్ప రచయితల నాటకాలను ప్రదర్శించారు. తెలంగాణ, ఆంధ్రా ప్రాంతాల్లో వేలాదిగా ప్రదర్శనలిచ్చారు. పి.వి.నర సింహారావుతో అనుబంధం కలిగిన కె.యల్. నరసింహారావు రాజకీయాల్లో ప్రవేశించి వుంటే ఎన్నో ఉన్నత పదవులను అధిరోహించేవాడు. కాని నాటకాన్ని శ్వాసించిన ఆయన చివరి మజిలీ వరకు నాటకంతోనే ప్రయాణించాడు. ఆయన ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ సభ్యులుగా, ఆంధ్రప్రదేశ్ నాట్య సంఘానికి ఉపాధ్యక్షుడిగా పనిచేసారు. ఆయన అందించిన నాటక రంగసేవలకు తెలుగు విశ్వవిద్యాలయం సత్కరించింది.

నిశ్శబ్దంగా సాగిన ఆయన నాటక ప్రస్థానం గ్రామీణ ప్రజలనేకాదు మేధావులను, రాజకీయ నాయకులను సైతం ఆలోచింప చేసింది. దేశం అస్థిరతకు లోనయిప్పుడల్లా తనపదునైన కలంతో నాటకాలను రచించి ప్రజలను జాగృత పరిచారు. తన నాటకాలతో పల్లె బ్రతుకులకు వెలుగులద్దిన ఆయన 2013 జులై 22న మరణించారు. కె.యల్. నరసింహారావు తెలంగాణాలో గ్రామీణ నాటకానికి చేసిన కృషి ఈ తరానికి మార్గదర్శకత్వంగా నిలుస్తుంది.

– డా॥ జె. విజయ్‌కుమార్జీ,
m: 9848078109
e: vijay.kumarji@rediffmail.com

## ఒక ప్రేమ గీతం

ఆమె
అతనిచుట్టూ మెత్తని అడుగులతో
గుండ్రంగా తిరుగుతూ
తన కలల గీతం పాడింది లేత ధ్వనితో..
వెనుక నుంచి అతని భుజంమీద
తన ముఖాన్ని ఆనించింది తమకంగా...
చూపు తిప్పకుండానే అతనన్నాడు



'మనం యిప్పుడు యుద్ధరంగంలో ఉన్నాం'
ఆమె అతని ముందుకు వచ్చి
పిడికిలి ఎత్తి పట్టి
'ఇంక్విలాబ్ జిందాబాద్' అన్నది
ఉద్విగ్నంగా...
(మాగ్జిమ్‌గోర్కీ నాటకం 'అమ్మ' చూసాక)

– జుగాష్ విలి
m : 98482 66384
e : jugashvili.15@gmail.com

**జానపదమై విప్లవస్వరమై ధూంధాం పాటల దరువై పల్లెపల్లెలో ప్రతిధ్వనించి లక్షలాది ప్రజలను మంత్రముగ్ధులను చేసిన మహత్తరమైన గీతిక**

# ఉద్యమపాటకు ఊపిరూదిన రసమయి బాలకిషన్ గొంతుక

దేశంలోనే ఒక విశిష్టమైన సంస్కృతి, సంప్రదాయాలతో ప్రత్యేకతను సంతరించుకున్న ప్రాంతం తెలంగాణ. సకలకళలకు, శ్రమైక జీవన సౌందర్యానికి నెలవైన నేల. తెలంగాణ పల్లె పాటతోనే తెల్లార్తది. పాటతోనే పొద్దూక్తది. పాట లేనిదే పూట గడువని తెలంగాణ. ఇది పనిపాటల తెలంగాణ. జానపద జీవనతత్వానికి నిలువుటద్దమైన తెలంగాణ. అది జానపదం కావచ్చు. విప్లవగీతం కావచ్చు. విరహగీతం కూడా కావచ్చు. పాట ఏదైన తనదైన శైలిలో పాడి పదిమందిని ఆకట్టుకుంటడు. ఆ గొంతులో పాటల ఊటశెలిమలతో పాటు, మాటల మంత్రదండమేదో ఉన్నట్టు కనిపిస్తది. ఆ గొంతులో పాట పన్నెండు గుర్రాల రథం మీద సవారి జేసినట్టుంటది. అస్సోయ్ ధులా అంటూ అలువాసుట్టు దుంకులాడినట్టుంటది. ఎన్ని గంటలైన అలుపు సొలుపు లేకుండ ఆడి పాడగల గొంతు. మీరందరు ఎక్కడోచోట వినే ఉంటరు. ఎవరైన గలగల పాడినా, గనగన మాట్లాడినా "పుట్టి నేర్చినవా – పుట్టకముందే నేర్చినవు బిడ్డ" అంటుంటరు. ఆ నానుడిని అక్షరాల నిజం చేసిన మహత్తర కళాకారుడు రసమయి బాలకిషన్. తన మాటలతో, ఆట పాటలతో తెలంగాణ ప్రజా ఉద్యమాన్ని ఉగ్రరూత లూగించిన సహజసిద్ధ గాయకుడు. నాటి తెలంగాణ ఉద్యమ కళాకారుడు, ప్రస్తుత మానకొండూరు శాసనసభ్యులు, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ గురించి నేటి మన 'అలుగెల్లిన పాట' లో...



మెదక్‌జిల్లా సిద్దిపేట మండలం రావురూకుల గ్రామంలో ఏర్పుల మైసమ్మ, రాజయ్యలది ఒక నిరుపేద దళిత కుటుంబం. మైసమ్మ – రాజయ్య దంపతులకు కలిగిన ఐదుమంది సంతానంలో ముగ్గురు మొగపిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు. వాళ్ళు వరుసగా బాలరాజు, మల్లేష్, బాలకిషన్, విజయలక్ష్మి, భారతి. బాలకిషన్ మే 15, 969లో జన్మించిండు. రావురూకుల గ్రామం ప్రస్తుతం సిద్దిపేట జిల్లాలో ఉన్నది. సిద్దిపేటకు సరిగ్గా తొమ్మిది కి.మీ. దూరంలో ఉండే రావురూకుల గ్రామంలో పటేల్, పట్వారీల పెత్తనం ఉండేది.

రాజయ్య జీతాలుండి, కూలినాలి చేసి సంసారం ఎల్లదీసిండు. తల్లి మైసమ్మ కలుపులు, కోతలకు పోయి భర్తకు చేదోడు వాదోడుగా ఉంటూ పిల్లల్ని కంటికి రెప్పోలె చూసుకునేది. కొన్ని సార్లు తండ్రి జీతానికి కొడుకులు కూడ పోయేది. ఈ క్రమంలో బాలరాజు, మల్లేష్‌లతో పాటు బాలకిషన్ కూడ జీతాలుండే పరిస్థితి వచ్చింది. పసులకాడ మనిషి లేకపోతే పటేండ్లకు ఏల్లేది కాదు. తెల్లవార్లు భాగోతాలు రక్తిగట్టించేది. మంచికి సెద్దకు డప్పుగొట్ట బొయ్యేది. సాటింపు ఏసేది. దీంతో బాలకిషన్ ఇంట్ల ఎప్పుడు డప్పు వాయించడం, డప్పు దరువులకు అనుగుణంగ పాటలు పాడడం కూడ చేసేది. చిన్నతనంలో బాలకిషన్ ఆటపాటని చూసి తల్లిదండ్రులు సంబురపడేది. కలుపుల్లో, కోతల్లో తల్లి నోటి నుంచి జాలువారే జానపదాలకు బాలకిషన్ వరాల మీద కుసోని గొంతు కలిపెటోడు. ఈ రకంగ బాలకిషన్‌కు కన్నతల్లే పాటల గురువయ్యింది. అంత పేదరికంలోను బాలకిషన్‌ని ఎంతో గార్వంగ చూసేది. బాలకిషన్ తన తల్లి పాడేటి పాటల్లో తనకు ఎంతో ఇష్టమైనది. చాలాసార్లు బాలకిషన్ కూడ వేదికల మీద పాడిన పాట

"కంది బూసే కంది గాసే – కంది కొనలు నంది మేసే
నందీవోలె నువ్వే రాంగనో నెమలి కండ్లా నరుస
మంది కండ్లు మండావట్టెనో నెమలి కండ్లా నరుస" అంటూ

పాడుతుంటె పచ్చని పైరగాలి మీద తేలిపోతున్నట్టు ఉంటది. కల్మషం లేని తెలంగాణ పల్లెప్రేమ కండ్లముందు కదలాడినట్టు ఉంటది. బాలకిషన్ చిన్నప్పుడు స్కూలుకు ఎప్పుడు ఆలస్యంగా పోయెటోడు. కారణం ఏందంటే తల్లి పటేలిండ్లల్ల పనిజేసి వచ్చేవరకు అంబటాల్ల దాటేది. అప్పుడొచ్చి ఉన్నదో లేందో ఇంత పెడితే తిని బడికి పోవాలె. అప్పటికే రెండు మూడు క్లాసులు పోయేది. దెబ్బలు తినని రోజు లేదంటె అతిశయోక్తి కాదు. బాలకిషన్ రావురూకులలోని ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువును మధ్యలోనే ఆపేసి పటేలు దగ్గర పసులగాసిండు. పడరాని బాధలు పడ్డడు. పటేలు కాడ రెండు సంవత్సరాలు జీతం ఉన్నడు. బాలకిషన్ పసులగాస్తుంటె భూమయ్య సారు చూసి మందలించిండు. తండ్రి రాజయ్యతోని మాట్లాడి ఒప్పించిండు. బాలకిషన్‌ని మళ్ళీ బడిబాట బట్టించిండు. అట్ల

భూమయ్య సారు పుణ్యమాని ఒకేసారి 7వ తరగతిలో చేరిండు. ఇక ఆ రోజు నుంచి బాలకిషన్ చదువు ఎక్కడ ఆగింది లేదు.

బాలకిషన్ తన ఉన్నత విద్యను సిద్ధిపేట మల్టీపర్పస్ హైస్కూల్‌లో పూర్తి చేసిండు. ఆ సమయంలో రావురూకుల సుట్టుపక్కల గ్రామాల్లో అక్కడక్కడ దళాలు సభలు పెట్టి ఆలపించే పాటలు బాలకిషన్‌ను ఎంతో ఆకట్టుకునేవి. ఆ విధంగ బాలకిషన్‌లో జానపదాలతో పాటు విప్లవపాటల చైతన్యం కూడ కలిగింది.

ఒకసారి 1985 ప్రాంతంలో బాలకిషన్ సిద్ధిపేట హాస్టల్‌లో ఉండి చదువుకునేటప్పుడు వేదిక మీద పాటలు పాడే అవకాశం వచ్చింది. అప్పటికింకా బాలకిషన్ 8వ తరగతి మాత్రమే చదువుతున్నడు. కేసిఆర్ సభలో పాటలకు కోరస్ పాడడం కోసమని దానయ్య సార్ అనే వ్యక్తి చింతమడక మల్లేశంతో పాటు, బాలకిషన్‌ను మరికొంతమంది విద్యార్థులను కూడ ఆ సభకు హాస్టల్ నుంచి తీసుకొని పోయిండు. సభ మధ్యలో భోజన విరామ సమయంలో మైకు ఉత్తగనే ఉందికదా అని బాలకిషన్ పాట పాడడం మొదలు పెట్టిండు.



"చంద్రశేఖరన్న వచ్చె ఎన్నెలో ఎన్నెలా
ఓటెయ్యబోదాము ఎన్నెలో ఎన్నెలా" అంటూ ఆశువుగా పాటని కైగట్టి పాడుతుంటె కేసీఆర్ ఎప్పుడు వచ్చిండో కూడ ఎవరు చూడలే. బాలకిషన్ పాడుతనే ఉన్నడు. బాలకిషన్ పాట విని లోలోపల ముగ్ధుడైన కేసీఆర్ ఇక ఆ రోజు నుంచి ఎక్కడ ప్రోగ్రాం ఉన్నా బాలకిషన్‌ని తప్పకుండ తీసుకు రమ్మని దానయ్యకు చెప్పడం జరిగింది. అట్ల ఆ రోజుతో మొదలైన అనుబంధం బాలకిషన్‌ని కేసీఆర్ కుటుంబంలో ఒక సభ్యుడిగా చేసింది. కన్నతండ్రి రాజయ్య అయితే పెంచిన తండ్రి కేసీఆర్ అన్నంతగా వాళ్ళ మధ్య అనుబంధం పెనవేసుకుంది.

బాలకిషన్ చిన్నప్పటినుంచి ఎక్కడ టేప్‌రికార్డర్ దొరికితే అక్కడ జననాట్యమండలి పాటలు బాగా వినేది. ముఖ్యంగ గద్దర్ రాసిన
"పొద్దు తిరుగుడు పువ్వు పొద్దును ముద్దాడె తొలిపొద్దును ముద్దాడె
అడవిలో వెన్నేలమ్మ ఆకుల ముద్దాడె చిగురాకుల ముద్దాడే..."
పాటతో పాటు ప్రత్యేక తెలంగాణ ఉద్యమం కోసం గద్దర్ రాసిన
"అమ్మా తెలంగాణమా ఆకలి కేకల గానమా
అమ్మ నీకు వందనాలమ్మో కమ్మని ప్రేమ నీదమ్మో" పాటలంటే ఇప్పటికీ ఎంతో ఇష్టం. బాలకిషన్‌కు 10వ తరగతి చదివే రోజుల్లోనే ఆలిండియా రేడియోలో పాట పాడే అరుదైన అవకాశం వచ్చింది. అప్పుడు బాలకిషన్ రేడియోలో పాడిన పాట
"సిన్ని సిన్ని దానివే ఓ పిల్ల పజ్జన్న గోసెదాన
ఆకలు దూపల్లు నే గోరివచ్చాను కాపిజ్జన్నలు గాయవే" అంటూ పాడిన పాటకు అప్పట్లో 75 రూపాయల పారితోషికం కూడ పొందిండు. ఒక దశలో "రేడియోలో నుంచి మాటలెట్ల వస్తయి! దానిలోపల ఎవరైన మనిషి ఉంటడా" అని అమాయకంగ ఆలోచించే రోజుల్లో తన పాట రేడియోలో వినడం కంటే ఆనందం ఏముంటది. ఆ రోజుల్లో బాలకిషన్ గురించి ఎక్కడ ఏ పేపర్ల చిన్న వార్త వచ్చినా రాజయ్య వాటిని తీసుకొచ్చి భద్రంగా దాచిపెట్టేటోడు. కొడుకు ఘనతను చూసి లోలోపల మురిసిపోయేటోడు.

బాలకిషన్ దుబ్బాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదివే రోజుల్లో కాలేజ్ చైర్మన్‌గా ఉన్నడు. అదే కాలేజ్‌లో రజియా సి.ఆర్‌గా ఉండేది. అక్కడే బాలకిషన్ రజియాకు మధ్య మంచి స్నేహం కుదిరింది. కుల, మతాలకు అతీతమైన ఈ స్నేహం కాస్త ప్రేమగా మారింది. అది డిగ్రీలో పెళ్ళికి దారితీసింది. బాలకిషన్ వరంగల్ సి.కె.యం కేలేజ్‌లో డిగ్రీ మొదటి సంవత్సరం చదివి, ఆ తర్వాత సిద్దిపేట డిగ్రీ కళాశాలలో మిగిలిన రెండు సంవత్సరాల డిగ్రీని పూర్తి చేసిండు.

బాలకిషన్ డిగ్రీ చేసే సమయంలో కొన్ని జానపదాలను రికార్డు చేసిండు
"యాడా ఉన్నాదో... నవ్వుల నా ఎంకీ – ఎట్లా ఉన్నాదో మాట మరుమల్లీ
మల్లెల కన్నా తెల్లని మనసు – జాబిలి కన్నా చల్లని మనసు " అంటూ యువతరాన్ని జానపదాల ఊయలూపేది. అదేవిధంగ ఆధునిక పాటల హంగులను కేవలం కాలేజ్ పిల్లల కోసం కొంత సినిమాటిక్‌గా "కాలేజి పిల్ల జూడరో యమ కతర్నా కున్నదిరో" అంటూ పాడిన పాటలు ప్రతి కాలేజ్‌లో మోత మోగినయి. ఆ సమయంలోనే బాలకిషన్ సిద్దిపేటలో "రసమయి జానపద కళాసమితి" ని స్థాపించిండు. వందలాది జానపదాలను రికార్డు చేయించిండు. ఒక దశలో తనకు వచ్చే స్కాలర్‌షిప్‌ను కూడ పాటల రికార్డింగ్ కోసం ఖర్చు చేసిండు.

"అల్లీ బిల్లి అంగూర తోట నేనాడుకుంట బోయె బండ్లబాట
బండ్ల బాటల్లో బాడుకుంట పల్లెపాట నేను చిన్నంగ జేరాలి సిద్ధిపేట" వంటి పాటలతో బాలకిషన్ తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నడు. బాలకిషన్‌ని అప్పటిదాక ఏర్పుల రాజయ్య కొడుకని కొందరు, రావురూకుల పిలగాడని మరికొందరు పిలిసేది. ఎప్పుడైతే బాలకిషన్ "రసమయి జానపద కళాసమితి" ని స్థాపించిండో నాటి నుంచి బాలకిషన్ రసమయిగా ప్రజల నాలుకల మీద నాట్యం చేసిండు. అట్ల సంస్థ పేరే తన ఇంటి పేరయ్యింది. తెలంగాణ ఉద్యమ పాటకు చెరగని చిరునామయ్యింది. అది లక్షలాది ప్రజలను 'అవ్వ, అన్న' అంటూ పలకరిస్తున్నట్టు ఉంటది. పదాల మెరుపుల, విరుపుల నడుమ చిచ్చరపిడుగైతడు. పాటల ప్రవాహంలో తాను ఎగిరి దునికే ఎత్తిపోతలైతడు. జానపద రాగమైతడు. యక్షగాన దరువైతడు. మొత్తంగా వేదికను అల్లల్లాడిస్తడు. ప్రజలను విప్లవోన్ముఖులను చేస్తడు. ఉద్యమకారులను యుద్ధోన్ముఖులను చేసే గంభీరనాదమైతడు. రసమయి బాలకిషన్ వీటితో పాటు సామాజిక

చైతన్య గేయాలు, సారా వ్యతిరేకోద్యమ పాటలు కూడ రికార్డు చేసిండు. ఆ తర్వాత "మంజీర అక్షర ప్రభ"లో కీలకంగ పనిచేసిండు. రాష్ట్రవ్యాప్తంగ ఎన్నో ప్రదర్శనలు చేసిండు. తన పాటలకు, ప్రదర్శనలకు ఎన్నో రాష్ట్రస్థాయి అవార్డులు పొందిండు. ఎంతో మంది ప్రముఖుల ప్రశంసలు అందుకుండు. ఆనాటి ముఖ్యమంత్రుల చేతుల మీదుగా అవార్డులు తీసుకున్నడు. ఢిల్లీలోని కృషి విజ్ఞానభవన్‌లో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్నడు.

బాలకిషన్ మొదటి సారి తన అంతర్జాతీయ ప్రదర్శన నిమిత్తం శ్రీలంకకు వెళ్ళే అవకాశం వచ్చింది. అప్పటిదాక గాలిమోటర్ గాలిమోటరని మెడలన్నిబొంగ పైకి జూసిన పల్లెటూరి పిల్లగానికి ఆ గాలిమోటర్ ఎక్కే అవకాశం రావడంతో తన ఆనందం ఎల్లలు దాటింది. రసమయి బాలకిషన్ అధ్భుతమైన ప్రదర్శనతో ఎందరినో ఆకట్టుకున్నడు. ఆ తర్వాత ఎన్నో దేశాలు తిరిగినప్పటికి తాను మొదటిసారి వెళ్ళిన శ్రీలంక టూర్‌ను మాత్రం మరిచిపోలేనని అంటడు.


టీఆర్‌సీ 'ఒక్కొక్క పాటేసి' పుస్తకావిష్కరణ సభలో

అటు జీవితంలోను, ఇటు కళా రంగంలోను ఎన్ని ఆటంకాలు ఎదురైనా చదవడం ఆపలేదు. పాటని వీడి బతకలేదు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో బి.ఇడి పూర్తి చేసిన రసమయి బాలకిషన్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సంపాదించిండు. బాలకిషన్ మొత్తం ఐదు సంవత్సరాల ఉద్యోగంలో రెండు సంవత్సరాలు అప్రెంటీషిప్ పోను, మిగిలిన మూడు సంవత్సరాలలో సెలవులే ఎక్కువ. తెలంగాణ ఉద్యమంలో కళాకారుడిగ క్రియాశీలకంగ పనిచేయడం వల్ల కొనసకు ఉపాధ్యాయ వృత్తికి దూరమయ్యిండు. సమైక్య పాలకులకు వ్యతిరేకంగ పాటలు పాడడం వలన రసమయి బాలకిషన్‌ను ఉద్యోగం నుంచి సస్పెండ్ చేసిండ్రు. అయితే బాలకిషన్ ఉద్యోగంలో ఉన్నప్పుడు జరిగిన ఒకే ఒక అరుదైన, ఆనందకరమైన సంఘటన ఏందంటే బాలకిషన్ తాను కొత్తగా కొన్న బైక్ మీద తన తల్లిని ఎక్కించుకొని ఊరంత తిప్పడం. ఎక్కడైతే తన తల్లి కూలీ పనిచేసిందో, ఏ కల్లాలైతే ఊడ్చిందో, ఏ పటేండ్లకైతే ఊడిగం చేసిందో వాళ్ళ ఇండ్ల ముందు తన తల్లిని బండి మీద తిప్పడంతో ఆ తల్లి ఎనలేని సంతోషాన్ని పొందింది. కొడుకు ఎదుగుదలను చూసి చివరి రోజులలో సంతోషంగ బతికింది. ఆ తర్వాత కొంత కాలానికి చనిపోయింది. బతికున్న రోజుల్లో తల్లి దండ్రులు ఇద్దరు కూడ కొడుకు చేసే ధూం-ధాం సభలకు లారీలల్ల, ట్రాక్టర్లల్ల జనంతోని కలిసి వచ్చిన సందర్భాలు ఎన్నో ఉన్నయి.

రసమయి బాలకిషన్ తెలుగు విశ్వవిద్యాలయంలో ఎం.ఎ. జానపదకళలు, ఎం.ఫిల్, పూర్తి చేసిండు. అదే విశ్వవిద్యాలయంలో రసమయి బాలకిషన్ "తెలంగాణ రాష్ట్రసాధనలో ధూంధాం పాత్ర" అనే అంశాన్ని తన పి.హెచ్.డికి ఎంచుకున్నడు. అంటే ఒక రకంగ తనమీద తానే పి.హెచ్.డి చేసుకోవడం. తెలంగాణ మలివిడత పోరాటంలోని పాటని పరిశోధించడం. పి.హెచ్.డి దాదాపు అవార్డు దశలో ఉంది. నిజానికి తెలంగాణ ఉద్యమంలో రసమయి చేసిన సేవకు న్యాయంగ డాక్టరేట్ రావాల్సిన అవసరం ఉన్నది. అయినప్పటికి తాను కష్టపడి చదివి డాక్టర్ డిగ్రీ పొందడంలోనే ఎక్కువ ఆనందం ఉంటదని నమ్ముతడు. డా॥ బి.ఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో చదవడమే తనకు ఎంతో ఇష్టమని అంటడు. రసమయి బాలకిషన్ మొత్తం రావురూకుల గ్రామంలోనే డిగ్రి చదివిన మొట్టమొదటి విద్యార్థిగా, ఆ గ్రామంలోనే ఉద్యోగం పొందిన వ్యక్తిగా గుర్తింపును పొందిండు. బాల్యంలో అనేక ఆటుపోటులకు గురైన బాలకిషన్ చదువు క్రమంగ ఎన్నో డిగ్రీలను సంపాదించి పెట్టింది. మనం ఇంతకుముందే చెప్పుకున్నట్టు రసమయి బాలకిషన్ డిగ్రీ చదివే రోజుల్లోనే రజియాను ప్రేమ వివాహం చేసుకుండు. అయితే రజియా స్టాఫ్‌నర్సు ట్రెయినింగ్ పూర్తి చేయడంతో ఆమెకే ముందుగా ఉద్యోగం వచ్చింది. రసమయి - రజియా దంపతులకు ఇద్దరు మగపిల్లలు కలిగిండ్రు. వారి పేర్లు అమిత్, ఆదర్శ్. వీరిలో అమిత్ మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసి ప్రస్తుతం జర్మనీలో ఉంటున్నడు. ఆదర్శ్ ఇంజనీరింగ్ చదువుతున్నడు. రజియా ప్రస్తుతం గాంధీ హాస్పిటల్‌లో హెడ్‌నర్సుగా పనిచేస్తున్నది.

తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగ కేసీఆర్ "తెలంగాణ రాష్ట్ర సమితి"ని స్థాపించిండు. తెలంగాణ రాష్ట్రసమితి కరీంనగర్‌లో నిర్వహించిన మొట్టమొదటి సింహగర్జనలో గోశి, గొంగడేసి, కాళ్ళకు గజ్జెలు గట్టి రసమయి తన విశ్వరూపాన్ని ప్రదర్శించిండు. ఐదు లక్షలకు పైగా వచ్చిన ఈ సభలో మిట్ట మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంకాలం 7 గంటల దాకా జనాన్ని కదలకుండ కూర్చోబెట్ట గలిగిండు. ఇక అక్కడినుంచి తాను వెనుదిరిగి చూసుకున్నది లేదు.

సుద్దాల అశోకతేజ రాసిన పాటలను "టప టప టప టప టప టప -చెమటబట్లు తాళాలై పడుతుంటె"

"నేలమ్మ నేలమ్మ నీకు వేలవేల వందనాలమ్మ"

"ఆకుపచ్చ సందామామ నువ్వేలే - నువ్వేలే" వంటి పాటలను "రసమయి ఆణిముత్యాలు" పేరుతో రికార్డు చేయించిండు. అప్పట్లో ఈ పాటల క్యాసెట్ ఒక నూతన ఒరవడిని సృష్టించింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా కేసీఆర్ రావడం రసమయి బాలకిషన్ అంతడుపుల నాగరాజుతో కలిసి ప్రదర్శించిన "తెలంగాణ జానపద జాతర కళాప్రదర్శనను" కేసీఆర్ మైమరిచి చూసిండు. ప్రధానంగ ఆ బ్యాలెలో "తానడిల్లా తల్లాడిల్లా ఏలో" అంటూ తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను, ఆటలను, పాటలను గుర్తుచేస్తూ "ఏవీ నా పల్లెల్లోన ఏవీ తెలంగాణలోన" అంటూ ప్రశ్నించడం ఉంటది. బొడ్రాయి కాడ

మొదలై మొత్తం తెలంగాణ జీవన విధానాన్ని వృత్తులను, రైతు జీవితాలను, పీరీలు, బతుకమ్మలు, బోనాలు అంటూ మొత్తం పల్లె జీవన చిత్రాన్ని కండ్లకు కట్టినట్టు ప్రదర్శన చేయడంతో కేసీఆర్ రసమయికి మరింత బాధ్యతను అప్పగించిండు. తెలంగాణ వ్యాప్తంగా ఇలాంటి కార్యక్రమాలకు రూపకల్పన చేయాలని కోరడంతోనే రసమయి ఆలోచన తెలంగాణ ధూం-ధాంకు బాటలు వేసింది.

అందెశ్రీ రాసిన

"గల్లు గల్లు గల్లు గల్లు గజ్జెల మోత అన్నల్లార ఓ సెల్లెల్లార

గవ్వల మోత అన్నల్లారా ఓ సెల్లెల్లార మువ్వలమోతో అన్నల్లారో ఓ సెల్లెల్లార

మండుతున్న గుండెలన్ని దండుగట్టి దరువేసి

ప్రతినబూనె తెలంగాణ పట్టాభిషేకానికి... ఛల్" ఈ పాటలో రసమయి బాలకిషన్ వేదిక మీద గజ్జెల్లాగు తొడుక్కున్న మల్లన్న లెక్క కనిపిస్తడు. చంద్రనిప్పులు చెరిగే జాంబవంతుడేమో అనిపిస్తడు.

"ఊరు తెలంగాణ నా పేరు తెలంగాణ

నా తల్లి తెలంగాణ తనువెల్ల తెలంగాణ

నా మాట తెలంగాణ నా పాట తెలంగాణ

సయ్యాట తెలంగాణ సాధించు తెలంగాణో..." అంటూ సమైక్య పాలకులతో సయ్యాటలాడుతడు. పదాల ఈత బరిగలు అందుకొని వెంటబడి తరిమినట్టుంటడు. ఇక గూడ అంజన్న రాసిన

గజ్జెలు గజ్జాలు రెండు గజ్జెలో రాజన్న" అనే పాటలో గలగల సెలయేరై ప్రవహిస్తడు. ఎత్తిపోతలై దునుకుతడు.



"ఇది తెలంగాణ కోటి రతనాల వీణ

గుండె రగిలి కదనరాగమాలపించి

పొలికేక పెట్టినది ఇది రుద్రవీణ" సుద్దాల అశోక్‌తేజ రాసిన పాటలో తెలంగాణ శక్తియుక్తులను ప్రదర్శిస్తడు. ఇట్ల ఎన్నో పాటలతో గంటల తరబడి లక్షలాది జనాన్ని ఓలలాడించిన ఘనత రసమయి బాలకిషన్‌ది.

సెప్టెంబర్ 30, 2002లో కామారెడ్డిలో జరిగిన మొట్టమొదటి ధూం-ధాం సభలో వరంగల్ శంకర్, మురళీమధు, అందెశ్రీ, గూడ అంజన్న జయరాజు వంటి వాళ్ళను తీసుకొచ్చి వాళ్ళ పాటలతో, రసమయి దరువులతో సభను ఉద్రూత లూగిస్తడు. ఆ తర్వాత రెండవ ధూం-ధాం సంగారెడ్డిలో జరిగింది. మూడవ ధూం-ధాం సభ సిద్ధిపేటలో జరిగింది. నాల్గవ ధూంధాం సభ నాటికి ధూం-ధాం విస్తృతి పెరిగింది. ఇది హైద్రాబాద్ లలిత కళాతోరణంలో జరిగింది. ఈ సభలో గద్దర్, విమలక్క, జయరాజు, గోరటి వెంకన్న, అందెశ్రీ, జయరాజు, గూడ అంజన్న లాంటి వాళ్ళు ఎందరో పాయలు పాయలుగా వీడిన వాళ్ళంత ఒక్కటై ప్రవహించిండ్రు. తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా సాంస్కృతిక ఉద్యమానికి శ్రీకారం చుట్టిండ్రు.

గమ్మత్తయిన విషయం ఏందంటే ఈ ధూం-దాం సభలో కళాకారులు వేదిక మీద నుంచి పాడుతుంటే రాజకీయ నాయకులు వేదిక ముందుండి చూసిండ్రు. ఇట్ల రసమయి పాట ప్రజలను కదిలించ ఆయుధం అయ్యింది. ధూం-ధాం సాంస్కృతిక సేనానిగా ఉద్యమాన్ని ముందుకు నడిపింది. ముందుకొచ్చింద్రు. ప్రతి మారుమూల పల్లెల్లో ధూం-ధాం పేరుతో సభలు నిర్వహించింద్రు. నందిని సిధారెడ్డి "అమరులకు జోహార్" పాటతో మొదలై అందెశ్రీ "జయజయహే తెలంగాణ" గోరటి వెంకన్న "జిల్లేలమ్మ జిట్ట, ఇద్దరం విడిపోతే భూమి బద్దలైతుందా" మిత్ర "ఆడుదాం డప్పుల్ల దరువెయ్‌రా" కోదారి శ్రీను "ఉందు పైలంగుందు, అసోయ్ ధూలా హారతి" వంటి పాటలతో సభలు తెల్లవార్లు పల్లెల్ని మేల్కొలిపినయ్. ఇంకా ఇలాంటి పాటలతో ధూం-ధాం సభలు దద్దరిల్లినయ్.

జానపద గేయాలు పాడుకునే పసులకాడి పోరగాడు పటపట పండ్లు గొరికి, చిటపట చిందులేసే చిరుతపులై గర్జించిండు. రసమయి బాలకిషన్ పధ్నాలుగు సంవత్సరాలు తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ అడుగుల్లో అడుగై కదిలిండు. పాటను భుజాన మోసుకొని పల్లెపల్లెన ధూం-ధాం చేసిండు.

సకలజనుల సమ్మెలో కూడ పాట నిలబడ్డది. పాట సహాయనిరాకరణ ఉద్యమం చేసింది. వంటావార్పు చేసింది. పాట లేని తెలంగాణ ఉద్యమాన్ని ఊహించలేం.

"దప్పులా డెడ్డనక జూడు సకలజనుల సమ్మెజూడు

కళాకారుల పాటతోని కదిలేటి ధూంధాం జూడు

కడుపులున్న పిండం అడిగిందో కనబోయె తల్లిని

పోరుజేయా ముందు గనమందో" అంటూ తెలంగాణ ఉద్యమ స్వభావాన్ని తన పాటలోకి ఒంపుకున్న ఎన్నో పాటలకు జీవం పోసిన ఘనత ధూం-ధాం వేదికకే దక్కింది.

రాష్ట్రాన్ని సాధించడం కోసం ప్రతి ఒక్కరితో కలిసి పనిచేసిన ఘనత టి.ఆర్.ఎస్‌ది. తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష కోసం "గొంగలి పురుగునైన ముద్దుపెట్టుకుంట''నని ప్రకటించి, పార్టీలను, ప్రజాసంఘాలను ఏకతాటిమీదికి తెచ్చిన గొప్ప చతురత కలిగిన నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు. ఎప్పటికప్పుడు అనేక వ్యూహాలు, ఎత్తుగడలతో ఉద్యమ చైతన్యాన్ని పాదుగొలిపిండు. ఒక దశలో జెఎసిని ఏర్పాటు చేసి ఉద్యమాన్ని ఉడుకెత్తించిండు. తెలంగాణలో ఏ ఉద్యమం జరిగినా అది టి.ఆర్.ఎస్ పార్టీ, కేసీఆర్ మద్దతు, సహకారం లేకుండ ఏది విజయవంతం కాలేదని అంటడు రసమయి బాలకిషన్.

రసమయి బాలకిషన్ తెలంగాణ భాషను సినిమా స్థాయిలో హుందాగా చూపించాలనే సంకల్పంతో "జై తెలంగాణ" వీరులకు మరణం లేదు, అనే ట్యాగ్‌లైన్‌తో సినిమాని అన్నీ తానై

రూపొందించిండు. తెలంగాణ భాషని సినిమాలో ప్రధానపాత్రలు మాట్లాడినప్పుడే మన భాషకు గౌరవం దక్కుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తడు. అంతేకాకుండ తన సినిమా ద్వార కేసీఆర్, కవితల సహకారంతో తెలంగాణ సినిమాకు ముఖ్యంగ చిన్న సినిమాలకు థియేటర్ల కొరత లేకుండ చేయగలిగిండు. ఇట్ల తెలంగాణ ఉద్యమంలో రసమయి బాలకిషన్ సాంస్కృతిక సేనానిగా మారిండు. కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం నుంచి టి.ఆర్.ఎస్ అభ్యర్థిగా పోటీచేసి 59వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందిండు. తెలంగాణ ప్రజలు పాటని అట్ల గుండెలకు హత్తుకున్నరు. నిజానికి మానకొండూరులో ఎన్నికల ప్రచారంలో రసమయి బాలకిషన్ జనాన్ని ఓట్లడిగితే వాళ్ళు పాటడిగింద్రు. ఓటుకు నోటిచ్చే కాలంలో పాటకు ఓటేసింద్రు. మానకొండూరు మట్టిబిడ్డలు రసమయి బాలకిషన్‌కు రాజకీయ జీవితాన్ని ఇచ్చింద్రు. ప్రజాప్రతినిధిగా అసెంబ్లీకి పంపింద్రు.

తెలంగాణ రాష్ట్ర మొదటి అసెంబ్లీ సమావేశాలలో రసమయి బాలకిషన్ పాట పాడిండు. అసెంబ్లీ వేదికగా అమరుల త్యాగాలను స్మరించిండు.

"లాఠీలైన తూటాలైన రగిలేపోరుని ఆపలేవని

గుండ్లకు గుండెలనిచ్చినవాళ్ళు రక్తపు ముగ్గులు పోసినవాళ్ళు

తెలంగాణ పోరాటాన్ని నడిపీ నోళ్ళురా....

తెలంగాణ పోరాటంలో ఒరిగీ నోళ్ళురా....

వీరాధి వీరులోయమ్మ.. త్యాగాల సూర్యులోయమ్మా...." అంటూ కాసోజు శ్రీకాంతాచారి, యాదయ్య, యాదిరెడ్డిల సాహసాన్ని గానం చేస్తడు. సభలో తనదైన శైలిలో ప్రసంగిస్తడు.




రసమయి బాలకిషన్ జీవితం ప్రజల సేవకే అంకితమని అంటడు. అందుకే తన ఫోన్ నెంబరు అన్ని గ్రామపంచాయితీలలో గోడల మీద రాయించిండు. నియోజకవర్గంలో ఎప్పుడు ఎవరికి ఏ ఆపదొచ్చినా ప్రజలు నేరుగ తనతోనే మాట్లాడాలని అంటడు.

ముఖ్యమంత్రి పదవి కేసీఆర్ మాత్రమే చేయగలిగేదని, సమైక్యపాలనలో అన్ని రంగాలలో ధ్వంసమైన తెలంగాణ బంగారు తెలంగాణగ రూపొందాలంటె అది కేసీఆర్‌తో మాత్రమే సాధ్యమని అంటడు.

తెలంగాణ ఉద్యమాన్ని బతికించిన కళాకారులు ఎందరో ఇయ్యాల ఎంతో దీనస్థితిలో ఉన్నరని వాళ్ళ బతుకుదెరువు కోసం ఏదో చేయాలనె తలంపుతో తెలంగాణ సాంస్కృతిక సారథి ఏర్పాటులో కీలకభూమికను పోషిస్తడు. తద్వార ఏర్పాటు చేసిన తెలంగాణ సాంస్కృతిక సారథికి రసమయి బాలకిషన్‌ను చైర్మన్‌గా నియమించ బడ్డడు తెలంగాణ ఉద్యమంలో తనతో కలిసి నడిచిన ఎందరో కళాకారులకు తాను ఇయ్యాల ఒక నీడ అయ్యిండు. వాళ్ళ కష్ట సుఖాలను తెలుసుకోగలుగుతున్నడు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత మొట్టమొదటి ఉద్యోగ ప్రకటన ఏదైన ఉన్నదంటే అది తెలంగాణ సాంస్కృతిక సారథిలో మాత్రమే. అట్ల ఆ సంస్థ ద్వార మొట్టమొదటి ఉద్యోగాన్ని ఇచ్చిన ఘనత కూడ రసమయి బాలకిషన్‌కే దక్కింది. ఒక్క కేసీఆర్ మాత్రమే పాటని గుర్తించిండు. గౌరవించిండు. పాటగాళ్ళ జీవితాలను గురించి ఆలోచించిండు. ఇయ్యాల వాళ్ళకు ఒక బతుకుదెరువును ఇచ్చిండు. తెలంగాణ సాంస్కృతిక సారథిని ఏర్పాటు చేసి రసమయి బాలకిషన్‌ను చైర్మన్‌ను చేసి పాట కవుల, కళాకారుల జీవితాల్లో వెలుగులు నింపిండని సంతోషాన్ని వ్యక్తం చేస్తడు. కేసీఆర్ గొప్ప కవి హృదయం ఉన్నోడని, మంచి గాయకుడని అంటడు. కవులతో కూర్చున్నప్పుడు వాళ్ళు రాయబోయే పాటలకు చాలవరకు కేసీఆరే పల్లవులు అందించిన సందర్భాలు ఎన్నో ఉన్నయని అంటడు.

పధ్నాలుగు సంవత్సరాల ఉద్యమ కాలంలో కళాకారుల కష్టాలను, కన్నీళ్ళను కేసీఆర్ దగ్గరుండి చూసిండని అట్లాంటి గొప్ప నాయకుడు ముఖ్యమంత్రి కావడం తెలంగాణ ప్రజల అదృష్టమని అంటడు.

రసమయి బాలకిషన్ 550 మంది ప్రభుత్వ కళాకారులున్న నిండు సభలో సాక్షాత్తు ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు కన్నీటి పర్యంతమైతడు. కేసీఆర్ కూడ ఆరోజు తన కుటుంబ సభ్యులతో ఉన్నట్టు ఉందని ఉద్వేగానికి లోనైతడు. ఒకరి భావాలను ఒకరు పంచుకొనే ఒక ఆత్మీయసభగా సారథి కార్యక్రమం సాగింది.

కళాకారులకు చక్కని భవిష్యత్తును అందించడంలో తెలంగాణ సాంస్కృతిక సారథి ఎల్లప్పుడు ముందుంటదని అంటడు. మరికొందరికి సారథిలో ఉద్యోగాలు ఇవ్వవలసిన అవసరం ఉన్నదని, ఆ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి కూడ తీసుకుపోవడం జరిగిందని, అందుకు వారు సానుకులంగా ఉన్నరని అంటడు. సమాజశ్రేయస్సు కోసం పాటుపడే కవి గాయకులు, కళాకారులకు సాంస్కృతిక సారథిలో ఎప్పుడు సముచిత స్థానం ఉంటుందని అంటడు. ఆవేశాలకు పోయి అనర్థాలు సృష్టించే వాళ్ళను ఎప్పుడు ఎవరు నెత్తిన పెట్టుకోరని అంటడు. కళాకారులకు మరిన్ని సదుపాయాలు కల్పించడంలో కృషి చేస్తానని అంటడు. తెలంగాణ సాంస్కృతిక సారథి ద్వార ఒక ఇరవై మంది కళాకారులను అమెరికాకు తీసుకుపోవడం, ఆస్ట్రేలియా, దుబాయ్, ఆఫ్రికా వంటి దేశాలతో పాటు హర్యానా లాంటి ఇతర రాష్ట్రాలకు కూడ సారథి కళాకారులను పంపడం జరిగిందని అంటడు.

**–అంబటి వేకువ,**

m: 94927 55448

e: varji.ambati@gmail.com

# సంగీత గమనాలు

హైద్రాబాద్ నేపథ్యంలో 'గజల్' గానరీతిని నిలబెట్టిన గాయకులలో విఠల్‌రావుగారు స్మరణీయులు. నిజాం మీర్ ఉస్మానలీ ఖాన్ ఫర్ మాయిష్ మీద కోరి మరీ పాడించుకున్న గాయకుడు. దురదృష్టవశాత్తూ ఆ గజల్ 'రీతి' కూడా మనకు దక్కలేదు.

గజల్ ప్రస్తావనలో గుర్తుకు తెచ్చుకోవాలసిన మరో పేరు మీర్ ఉస్మానలీఖాన్ రెండవ కొడుకు ప్రిన్స్ మొ అజ్జం జాహ. కలం పేరు 'షజి'తో ప్రసిద్ధుడు. కవులూ, గాయకులూ అతని దర్బారులో మనగలిగినారు. ఇది హైద్రాబాదు – తెలంగాణ సంగీత నేపథ్యానికి ఒక మంచి జ్ఞాపకం. అసలు గజల్ ప్రక్రియ తొలుత బీజం ఇక్కడే. ఇక్కడి భాషలోనే పడింది. గజల్ ఫారసీ నుండి మొదట దకనీ లోకి వచ్చింది. అట్లా బీజాపూర్, గోల్కొండ సామ్రాజ్యాల్లో రూపు దిద్దుకున్న భాష అయిన దకనీ భాషలో మొదటి కవి అయిన సుల్తాన్ మహమ్మద్ ఖులీ. హైద్రాబాద్ నగర స్థాపకుడు. విస్తారిత నిజాం రాజ్యాన్ని పరగణలోకి తీసుకుంటే ఔరంగాబాద్ వాని వలీ దకనీ లేని దకనీ సాహిత్యాన్ని గజల్‌ని ఊహించలేము.



ఉర్దూగజల్‌లో భారతీయత లోపించినట్లు అనిపించినా దకనీ గజళ్ళ నిండా భారతీయతని సంతరించుకున్న ఇంపుదనమే. "పియా వాజ్ ప్యాలా పియా జామెనా, పియా వాజ్ ఎక్ తిల్ జియా జామెనా" అనే గజల్ ఈ గడ్డ మీది ప్రజల భాషలోని నుడికారపు గుభాళింపులని రాగమయం చేసింది. పై వాక్యాల్లోని "ఏక్‌తిల్" అన్న పదం నుడికారపు సొబగుని అందిస్తుంది. "ప్రేయసి చరిత్ర లేనిదే సురపానం చేయలేమా – ఒక్కక్షణం జీవించలేను" క్షణం అన్న పదం ఎక్‌తిల్‌కి చాలా ఖరాబు అనువాదం. క్షణాన్ని విభజిస్తే అందులోని పిసరు భాగమన్న మాట ఎక్ తిల్ అంటే.

ఇదే గజల్‌ను ప్రముఖ సినీ దర్శకుడు శ్యామ్ బెనగళ్ తన సినిమా 'మంథన్' కోసం ప్రీతిసాగర్‌తో పాడించారు. ఈ గడ్డ వాసన మిగిలిన వాడు కావడం వల్ల కావచ్చునని మనం అను కోవచ్చు.

ఇదే క్రమంలో హైద్రాబాద్ సంస్థానంలో నవాబ్ జహీర్ యార్ జంగ్ మంచి కళాపోషకుడుగా పేరు తెచ్చుకున్నాడు. మంత్రి పదవిలో ఉన్న అతడు ఎప్పుడు బొంబాయికి వెళ్ళినా హైద్రాబాద్ ప్యాలెస్‌లో సంగీత కచేరీలు జరిగేవి జి.ఎన్.జోషి, బి.జె.ఘాటే లాంటి రసజ్ఞుల సంగీతమయ చర్చల్లో గొప్ప సంగీతజ్ఞులను వినే అవకాశాల్ని ఎప్పుడూ వదులుకునేవాడు కాదు. అట్లాగే అక్కడ బొంబాయిలో ఉన్న కళాకారులని హైద్రాబాద్‌కు ఆహ్వానించేవాడు. ఇక్కడి బషీర్‌బాగ్ ప్యాలెస్‌లో ఉస్తాద్ బడే గులామలీఖాన్ సకుటుంబ సపరివారంతో నెలల తరబడి బస చేసేవారు. ఉస్తాద్‌కు పక్షవాతం వస్తే అదే నవాబు దగ్గరుండి వైద్యం కూడా చేయించారు.

ఉస్తాద్ బడే గులామ్‌లీఖాన్ ఆదిలాబాద్‌లో ఇచ్చిన ఛారిటీ ప్రోగ్రాం గురించి సదాశివసారు రాసిన ఆదిలాబాదు సంగీత నేపథ్యాలని మనకి అందించారు. బోథ్‌లాంటి చిన్నగ్రామం చేసుకున్న సంగీత అదృష్టాన్ని మనకి వివరించారు.

అట్లాంటి ఉస్తాద్ బడేసలామ్ ఆలీఖాన్ అమ్జద్ హైద్రాబదీ రుబాయిల మీద ప్రాణం పెట్టేవారు. అమ్జద్ గొబీప్ప సూఫీ కవి. ఆసాంతం హైద్రాబాద్ అతనిని నెత్తిమీద పెట్టుకుని వినేది. అలాంటి కవుల ఆనవాళ్లను తరిచి తరిచి చూసుకోవాలి.

ఇదే హైద్రాబాద్ సంస్థానంలో జహీర్ యార్ జంగ్, పండిత్ జగన్నాథ్ బువా పురోహిత్ అతడి శిష్యుడి జిన్‌జోషి సహాయంతో అప్పటి గొప్ప గాయన, వాద్య కళాకారులందరినీ ఆలిండియా రేడియోకోనం, హెచ్.ఎమ్.వి. గ్రామఫోన్ వాళ్ళ కోసం రికార్డు చేసి పెట్టడం కూడా అప్పటి సంగీతాన్ని ఇప్పుడు మనకు అందివ్వడంలో భాగంగా పెట్టుకున్నారు.

ఇక్కడ హైద్రాబాదులో ముంబయి, పుణేలో, సంగీతం కోసం 'గంధర్వ మహ విద్యాలయ' స్థాపింపబడింది. ఇక్కడ హిందుస్థానీ సంగీతం నేర్పబడేది. దంతాళే దంపతులు వసుమతి, గోవిందరావు, మాలినీ రాజూర్‌కర్, మీరా పన్సే, కరాడీ లాంటి పేరున్న గాయకులు అక్కడ సంగీతం నేర్పించారు.

ఆ తర్వాత ప్రభుత్వ సంగీత కళాశాల ఏర్పాటు చేయబడింది. ఇక్కడ కర్ణాటక సంగీతం మీద ఎక్కువ ఆసక్తి చూపబడింది. శ్రీరంగం గోపాల రత్నం, నూకల చిన సత్యనారాయణ లాంటి గొప్ప కళాకారులకు నెలవైంది ఆ కళాశాల.

ఒక వైపు హిందుస్థానీ, మరోవైపు కర్ణాటక సంగీతాలకు విద్యాలయాలని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మొన్న మొన్నటి వరకు అడపా దడపా ఇప్పుడు హైద్రాబాద్ నగరం ఎం.ఎస్. సుబ్బలక్ష్మిని, ఎం.ఎల్ వసంత కుమారిని, పండిత్ భీమ్‌సేన్ జోషిని, పండిత్ జస్‌రాజ్‌ని ఆహ్వానించుకుని తన సంగీత పరంపరని, సంగీతపు కొనసాగింపుని నిలుపుకుంటున్నది. ముఖ్యంగా 'వివేకవర్ధిని' సంస్థ ఈ సంగీత ప్రమాణాన్ని ముందుకు తీసుకెళ్ళడంలో సఫలీకృత మవుతున్నది.

మహారాష్ట్రతో ఉన్న సంపర్కం వలన ఇక్కడ హిందుస్థానీ గాత్రం మనగలిగింది. ప్రాంత పరంగా చూసుకుంటే అప్పటి బాంబే ప్రావిన్స్‌లోని బీజాపూర్, గదగ్, హుబ్లీ, ధార్వాడ్ ప్రాంతాలు ఇప్పుడు కర్ణాటకలో కలిసాయి. కానీ గాత్రం మాత్రం అదే హిందుస్థానీ పరంపరలో సాగుతుంది. జమిలిగా అల్లుకుపోయిన ఈ రెండు గాన రీతులు కర్ణాటక, హిందుస్థానీ రెండూ నిజాం ప్రాంతంలో నిల్చాయి.

సంగీత పోషణ, సంగీతాన్ని గుర్తించడం అన్నది నైజాం రాష్ట్రంలోని ఇతర చిన్నపాటి సంస్థానాల్లో కూడా కొనసాగుతూ వచ్చింది. గాయన ఔచిత్యాన్ని మన్నించడానికా అన్నట్టు ఆయా సంస్థానాలు తమ వంతు కచేరీలు, ప్రోగ్రాంలు ఏర్పాటు చేసుకునేవారు. ఇక్కడ గుర్తించాల్సిన అంశం ఈ ప్రాంతం సంగీతానికి ఎన్నడూ దూరమవలేదు. కాకపోతే మహారాష్ట్ర సరిహద్దుల్లో సంగీతం మనగలిగినంతగా ఇతర సరిహద్దు ప్రాంతాల్లో మనలేక పోయింది.



అది కూడా కాల క్రమంలో సరిహద్దుల గీతలు మరీ ధృడమవడంతో హిందుస్థానీ రసజ్ఞతలేని తరం ఇటు కర్ణాటక సంగీత మాధుర్యాన్నీ పట్టుకోలేక సంగీతాన్ని అర్థం చేసుకోకుండా మిగిలి పోతున్నాం.

శుద్ధ శాస్త్రీయం కంటే కొంచెం సులువయిన ఉపశాస్త్రీయ గాయన రీతులు కావయితే వీటి బీజాలు కూడా భక్తి, సూఫీ సంగీతాల్లోనే దొరుకుతాయి. భక్తి సంగీతాన్ని "సంత్ సాహిత్యం"లో రంగరించి మహారాష్ట్రీయులు తమ ముద్ర వేసుకోవడం సహజమైనప్పటికీ, అందులో కొంత వాటా మన ప్రాంతానికి దక్కక తప్పదు. నిజాం రాష్ట్రంలో తూర్పున తెలంగాణా జిల్లాలు, పడమరన మరాత్వాడా జిల్లాలయినప్పుడు ఆ ఆదాన-ప్రధానాలన్నీ ఇరువురివి అవక తప్పదు కదా! గోల్కొండ సుల్తానుల కాలంలోనే 'భక్తి' 'ఉద్యమ' రూపం దాల్చింది. ఈ భక్తిఉద్యమం అంతా సంగీత మయమే.

సంగీతం తన రాగాలతో పాటు, అవి పాడబడే భాషా నియమాలతో పాటు, ఏ గాయన రీతి ఎప్పుడు ఎలా విలసిల్లిందో, ఎప్పుడు నిర్లక్ష్యం చేయబడిందో తనలో తాను చెపుతూ నడిచింది. ఆ రాగాల గమకాలతోపాటు ఆ ఉద్ధాన పతనాలనూ అర్థం చేసుకోవలసిన అవసరం ఉంటుంది.

- జి.మనోజ
m : 9704643240
e : gmanoja61@gmail.com

# ఐ ట్రస్ట్ యూ!

ఈనాటి ఈ ప్రేమ మోహమో కామమో
అది ఇగిరిపోయే గంధమో బలపడే బంధమో
ఏమో?
విన్యాసానికి, సన్యాసానికి మధ్య
'ఐలవ్‌యూ' అరిగిపోయిందా?
అర్థం మార్చుకుందా?
ఉపరితలం మీద మెరుస్తున్నది
గాజుముక్కా? వజ్రశకలమా?
భాషకు దేహభాషకు పొంతన వుందా?
రెండు హృదయాల మధ్య వంతెన అమరిందా?
ప్రేమ ఒక యుక్తికాదు, వ్యూహం కారాదు
గుండెలో తడివున్నంతసేపే
జ్ఞాపకాలు చెట్టుమీది మొగ్గలు
అది ఎండిపోతే వాడి మొలలు



విశ్వాసం విశ్వాంతర్యామి
అది అన్ని విలువలకు పునాది
ఆనంద భాష్పంలోని చిరునవ్వు
రక్తకణంలోని ప్రాణశక్తి
అది ప్రాణవాయువు అది జీవధాతువు
కష్టాల కదలికి జడిసి దారి మార్చబోదు
కాలం మలుపులకి విసిగి ప్రయాణమాపబోదు
పరస్పరం ఒక పరంపరగా కొనసాగాలంటే
ప్రేమ విశ్వాసమై పోవాలి
అప్పుడే అవినాభావం, అద్వైతం
ఐలవ్‌యూ కన్నా - గొప్పది
ఐట్రస్ట్‌యూ!

-అమ్మంగి వేణుగోపాల్
m : 7441054637
e : ammangivenugopal1948@gmail.com

# అప్పుడప్పుడు-4



చూపులే కదా
అర్థవంతమైన సందేశాలు
మర్మఘాతాలు
వాడి
వేడి.

నేనొక ఎడారిని
దుప్పటిలా కప్పుకుంటాను
సముద్రాన్ని
వెన్నెలలో వేయించుక తింటాను
ఆకాశాన్ని
చాపలా పరుచుకొని
దానిపై దొర్లుతూ దొర్లుతూ
పోతోంటాను.

దారిలో తారసిల్లే
నా ప్రియ నేస్తాల్లారా
మీరు నాకు ప్రసాదించిన
చిరునవ్వులను
ఖజానాలో
భద్రంగా దాచి ఉంచాను!

మనం
నాలుగు రోడ్ల కూడలిలోనే
కల్సుకున్నది
విడిపోయిందీ అక్కడే!
ఈ మధ్యలో
ఆకాశాన్ని సాగరం మింగేసింది
తారలు
వరసగా పేలనారంభిచాయి
మంచం కోళ్ళు
కురుచనైపోయి
నేను నేలపై చతికిలబడ్డాను.

ఈసారి
ఎందరో పిల్లలు రిబ్బన్లు ఊపుతూ
బారులు తీరి
పరిగెత్తుకొస్తున్నారు
ఏ విజయాన్ని ఆలాపించడానికి
వస్తున్నట్లు వీళ్ళు!

ఇప్పుడు ఏదీ
ఇబ్బంది పెట్టదు
తల దిండు మాత్రం
దీర్ఘంగా నిట్టూరుస్తుంది.



కొన్ని నక్షత్రాలు
కొన్ని పిడిబాకులు
మరికొన్ని సన్నజాజులు
ఒకపక్క జాలువారుతున్న
పాలలా
మరోపక్క
నెత్తురు రంగులీనుతున్న
చిత్తడిలా
కొంత నలుపు
కొంత తెలుపు



కొంత రాత్రి
కొంత పగలు
కొన్ని పగలు
కొన్ని వగలు
రాగ ద్వేషాలు
ప్రేమామృతాలు

ఈ ఆప్యాయతలూ
భరించలేనివే
అలాగే ఈర్ష్యాద్వేషాలు.

కూడలిలో నిలబడి
గాలిలోకి విసిరిన అరుపు

అరణ్య రోదన
అంతరిక్ష పర్యటన
నాజీ క్యాంపు

కన్నీటితో పాటు
పన్నీటి జల్లు
కష్టాలతో పాటు
కాంచన జంగా
జీవితం

కలగలిసిపోయిన లిపి
సహస్ర హస్తాలతో
విస్తరించిన
వైవిధ్యభరితమైన
ఆశల ద్వీపం

ఆకుపచ్చ భూమి
నా చుట్టూ పర్చుకొని ఉంది
నీలపు ఆకాశం
నన్ను అచ్చెరవొందేట్లు చేసింది.

నిలకడలేని మనసు
పగలబడి నవ్వుతూ నవ్వుతూ
మైదానాలగుండా
దొర్లుతూ దొర్లుతూ పోతోంది.
నాక్కావల్సిన వాళ్ళంత
నా పక్కనే ఉన్నారు.
నన్ను భూమితోపాటు
పెకిలించి ఎత్తి పట్టుకుంటారు
నా చేతిలో ఎవరో ఉంచిన దివిటీ
సదా వెలగాలి కాబోలు!

సాయంకాలానికి
పక్షులు గూళ్ళకు చేరుకున్నట్టు
నేనుకూడా కొంప అనే ఒకదాన్ని
నమ్ముకున్నాను కాబోలు!



మిల్లు కూస్తూనే ఉంటుంది
గాడిద
ఓండ్రపెడ్తూనే ఉంటుంది
గుర్రం
సకిలిస్తూనే ఉంటుంది
సలిపే పుళ్ళు
చీము ఓడుతూనే ఉంటాయి
ఇసుక నేలపై



శిధిల శరీరంతో
ఐరావతంలా కూలిపోతాను
క్రమంగా
నిన్నటి గుర్తులు
చెరిగిపోతోంటాయి

క్షణ క్షణం
కాలం ఎడంగా జరుగుతూనే ఉంటుంది.
నగర రహదారులు
మెరిసిపోతోంటాయి
ఇక్కడ లైట్ల కాపలాలో
పోగొట్టుకున్న దృశ్య మాలికల్ని
వెతుక్కుంటూనే ఉంటాను.
ఈ తోపులాటలో
ఒక కొలనునే ఎన్నుకుంటాను
దాంట్లోకి
గులకరాళ్ళు విసురుతూ
కలలో కనుమరుగౌతుంటాను
మళ్ళీ మళ్ళీ
నీళ్ళలా తుళ్ళిపడుతూ
చలి కాచుకోవడానికి
వేడి దారి వెతుక్కుంటూ ఉంటాను.
పచ్చగడ్డి మైదానం
తివాచీలా పరుచుకొని
నన్ను తన బాహువుల్లోకి
ఆహ్వానిస్తోంటుంది.
బాధలనే భుజకీర్తులు ధరించి
బతుకు భాగోతంలో
నర్తిస్తూ ఉంటాను.
కాలి గజ్జెలు రాలిపోతాయి
పాదాలు రక్తసిక్తమౌతాయి

ఆకాశంలో ఎగిరిపోయే
పక్షుల గుంపు తప్ప
నీళ్ళపై తేలియాడే
వెలుగు రేఖలు తప్ప
గుండెల్లో వెచ్చగా కదిలే
గుర్తులు తప్ప
ఒకానొక తీపిభావం తప్ప
ఏదీ పెద్దగా స్పందింపచేయదు.
నేను రోజూ కొలిచే
ఈ రోడ్లపై
మననం చేసుకునే
ప్రేమ పాఠాలు
ఆకులను పువ్వులను
చూపుల చేతులతో
తాకేలా చేస్తోంటాయి.



అద్భుతంగా
ఆకాశం ఒక విరుపు విరుస్తుంది
నా వొడినిండా నక్షత్రాలే!

విహారపు గడువు
దాటుతున్నట్టుంది
అందంగా కురుస్తున్న వర్షాన్ని
నగ్నంగా అద్దాలలోంచి చూస్తూండడం
నన్ను అమితానందానికి గురి చేస్తుంది
తడి ఇసుకలో కట్టుకున్న
పిచ్చుక గూళ్ళ జాడ దొరకదు
కాళ్ళను నీళ్ళలో
తపతపలాడిస్తూ
ఊరేగిన ఊర్లన్నీ
వలసపోయాయి.

– బి. నరసింగరావు,
m : 9908010404
e : butterflymovements@gmail.com

## నిరంతరతపన... జనజీవిత దృశ్యాల ఆవిష్కరణ

# సృజనశీలి వానమామలై శ్రీనివాసాచారి

ప్రకృతిని ప్రేమించే మనస్తత్వం, నిరంతర పరిశీలనాదృష్టి ఆయనను ఫొటోగ్రాఫర్‌గా మార్చాయి. తన అభిరుచికి సృజనాత్మకతను జోడించి ఫోటోలను కమనీయ దృశ్యకావ్యాలుగా మలచి పేరొందిన వానమామలై శ్రీనివాసాచారి ఫోటోగ్రాఫర్‌గా తనకంటూ ఒక ప్రత్యేకతను సంపాదించుకున్నారు. ఫోటోగ్రఫీని సృజనాత్మక కళగా ఆరాధించే శ్రీనివాసాచారి జన్మస్థలం మంథని. ప్రాథమిక స్థాయి నుండి ఇంటర్ వరకు కరీంనగర్‌లో, డిగ్రీ వరంగల్‌లో చదివారు.

కరీంనగర్‌లో బండి రాజన్‌బాబు ఫోటో ప్రదర్శనను చూసి ఆర్ట్ ఫోటోగ్రఫీపై శ్రీనివాసాచారి మక్కువను పెంచుకున్నారు. తనలోని ప్రతిభకు మెరుగుపెట్టి నైపుణ్యాన్ని వృద్ధి పరచుకుంటూ ఫోటోగ్రాఫర్‌గా ముందుకు సాగుతూ తన ప్రత్యేకతను నిలపుకున్నారు. 1996లో కరీంనగర్‌లో కెమెరా ఆర్ట్స్ క్లబ్ పేరిట శ్రీనివాసాచారి మరో ఇద్దరు మిత్రులు కలిసి సంస్థను ఏర్పాటుచేసి ప్రతి ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా హైస్కూల్ విద్యార్థులకు కెమెరాతో ఫోటోలు తీయించే ఫోటో కాంపిటీషన్‌ను నిర్వహించి బహుమతులందజేశారు. కేవలం పోటీలను మాత్రమే నిర్వహించకుండా ఆ విద్యార్థులకు ఫోటోగ్రఫీలో పలు సూచనలు, మెళకువలు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో జోధ్‌పూర్, పాట్నా, లక్నో తదితర ప్రాంతాలలో జరిగిన పోటీలలో క్లబ్ సభ్యులతో కలిసి పాల్గొని కరీంనగర్ జిల్లాకు పేరు ప్రఖ్యాతులు సాధించి పెట్టారు. ఫోటోగ్రఫీపై మంచి పట్టును పెంపొందించుకుని సరికొత్త నైపుణ్యాలను అభివృద్ధి పరచుకున్నారు. కరీంనగర్ జిల్లా వాస్తవ్యులైన బండిరాజన్ ఫోటో ప్రదర్శనను చూసి ఆర్ట్ ఫోటోగ్రఫీపై ఎంతో ఇష్టాన్ని పెంచుకున్న శ్రీనివాసాచారి ఆయన స్ఫూర్తిని పొంది వివిధ జీవనరీతులను, విశిష్ట దృశ్యాలను అద్భుతంగా తమ ఫోటోలలో నిక్షిప్తం చేశారు. 'ఔట్‌పుట్'పై ప్రత్యేక దృష్టిని పెట్టి అది తాను అనుకున్నట్టుగా సాధించగలిగిన అరుదైన ఫోటోగ్రాఫర్‌గా తన పేరును నిలబెట్టుకున్నారు. ఫోటోగ్రఫీపై పలు అంతర్జాతీయ వర్క్‌షాప్‌లలో పాల్గొని నూతన కోణాలను తెలుసుకుని ఆ దిశగా మనసును ఆకట్టుకునే ఫోటోలు తీశారు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫోటోగ్రఫీ (ఫిఫ్), ఫోటోగ్రఫీ సొసైటీ ఆఫ్ అమెరికా (పిఎస్ఏ), ఇండియన్ ఇంటర్నేషనల్ ఫోటోగ్రఫీ కౌన్సిల్ (ఐఐపిసి)లలో సభ్యునిగా చేరి ఎన్నెన్నో మెళుకువలు ఫోటోగ్రఫీకి సంబంధించి నేర్చుకున్నారు. ఎన్నో పోటీలలో పాల్గొన్న శ్రీనివాసాచారి తమ గురువు రాజన్‌బాబు చేతుల మీదుగా సత్కారాలు, పురస్కారాలు ఎన్నెన్నో అందుకున్నారు. తమ గురువు కీర్తిని ఇనుమడింపజేశారు. రాజస్థాన్, ఒరిస్సా, అరకుతో పాటు మన రాష్ట్రంలోని ఆదిలాబాద్ వంటి అనేక ప్రాంతాలలో ఉన్న గిరిజనుల జీవన విధానంపై వారి గ్రామాలకు వెళ్ళి వారితోనే కలసి ఉండి అనేక ఫోటోలను ఆయన తీశారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, జీవన ప్రత్యేకత, ఆచార వ్యవహారాలు, అనుబంధాలను కళ్లకు కట్టినట్టు ఆయన చిత్రీకరించారు. గిరిజనుల జీవనసరళిపై ఫోటోభాష్యం అని ఆ ఫోటోలకు రసజ్ఞుల ప్రశంసల్ని శ్రీనివాసాచారి అందుకున్నారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాలను నిశితంగా అర్థం చేసుకున్న పరిశోధనాత్మక దృష్టిని ఆయన ఫోటోలు స్పష్టంగా వ్యక్తం చేస్తాయి.



వివిధ జిల్లాలలో ఫోటోగ్రఫీ మెళకువలను ఔత్సాహికులైన ఫోటోగ్రాఫర్లు తెలుసుకునేందుకు కొత్తకొత్త ఫోటోగ్రఫీ క్లబ్‌లను


















ఏర్పాటు చేయించి వర్క్‌షాప్‌లను నిర్వహించడంలో శ్రీనివాసచారి కీలకపాత్ర నిర్వహించారు.

కొత్త ఫోటోగ్రాఫర్లను రాష్ట్రస్థాయి అకాడమీలలో చేర్పించి తమ గురువు రాజన్‌బాబు సూచనలను పాటిస్తూ వారికి శిక్షణను ఇప్పించే పనిలో ఆయన నిమగ్నమయ్యారు. కాలంతోపాటు ఫోటోగ్రఫీ పరంగా వస్తున్న కంప్యూటరీకరణ, డిజిటల్ మార్పులను మండల స్థాయిలలో స్టూడియోలలో ఫోటోగ్రాఫర్లుగా పనిచేస్తున్న వారికి అందించే శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసే కృషిని కొనసాగిస్తున్నారు. ఫోటోగ్రఫీరంగంలో నిత్యవిద్యార్థిగా శరవేగంగా వస్తున్న మార్పులను విశ్లేషించుకుంటూ తన వృత్తికి అనేక మెళకువలను జోడించి రాణిస్తున్న శ్రీనివాసాచారి సృజనశీలి.

**వానమామలై శ్రీనివాసాచారి**, ఫోన్:9440222125

**-టీఎస్పీ**, m : 9441464764

e : thirunagarisrinivas12@gmail.com



# అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలి

**దే**శంలో అసంఘటిత రంగ కార్మికులు దుర్భర జీవితాలు గడుపుతున్నారని, ఇప్పటికైనా అసంఘటిత రంగ కార్మికుల పనికి సామాజిక భద్రత కల్పించాలని సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షులు ఆర్.సుధాభాస్కర్ అన్నారు. సుందరయ్య కళా నిలయంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐయూటీయూసీ కార్మిక సంఘాల రాష్ట్ర కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వలస కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా సుధాభాస్కర్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు అంతరాష్ట్ర వలస కార్మిక చట్టంలోని హక్కులను కాలరాయడంతో కార్మికులు ఉపాధిలేక వలసలు వెళ్తున్నారన్నారు. వెళ్లిన చోట కూడా సరైన పని లేక పూటగడవని పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. గనులు, భవన నిర్మాణ రంగాల్లో రోజూ 12 గంటలకు పైగా కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. కనీస వేతనాలు అందడం లేదని, ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయం కల్పించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పని ప్రదేశాల్లో వసతుల కల్పన, కనీస దినసరి వేతనం అందించేందుకు కార్మిక శాఖ చర్యలు చేపట్టాలన్నారు. వలసలను పూర్తిగా అరికట్టాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్, పాలడుగు భాస్కర్, సోమన్న, ఆయా సంఘాల నేతలు జయలక్ష్మీ, వంగూరి రాములు, హేమలత, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

JBR
ARCHITECTURE COLLEGE
HYDERABAD
(Approved by Council of Architecture, New Delhi - Affiliated to JNA & FAU Hyderabad)
6-3-248/1/1A, 2nd Floor, Bhaskar Plaza, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034. Telangana, India
Ph : 040-66105270, 9703372442, 9703277053, E-mail : jbrarchitecture@jbgroup.org.in, www.jbrachitecture.com

# ఆధునిక జీవశాస్త్ర పరిశోధనల్లో సిసిఎమ్‌బి కీలక పాత్ర




ఈ సృష్టిలో ప్రాణమున్న ప్రతిజీవి ప్రత్యేకమైనదే. అది మనుషులైనా, జంతుజాలమైనా, వృక్షాలైనా... ప్రత్యేక కణజాలం, జీవ అణువులతో వేటికవే ప్రకృతిలో తమ అస్తిత్వం కోసం పోరాడుతుంటాయి. అలాంటి సందర్భాల్లో వాటికొచ్చే వ్యాధులు, జీవ ప్రక్రియల్లో జరిగే మార్పులు, వాటిని నివారించడానికి చేయాల్సిన కృషి వంటి విషయాలపై... సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ పనిచేస్తుంది. భారతదేశ ఆధునిక జీవశాస్త్ర రూపశిల్పిగా పేరుగాంచిన పి.ఎమ్.భార్గవ ఆధ్వర్యంలో 1977లో హైదరాబాద్‌లో ఏర్పాటైన ఈ సంస్థ 'కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్' నిర్వహణలో పనిచేస్తుంది. దేశంలోనే ఎంతో ప్రత్యేకమైన ఈ సంస్థ మన హైదరాబాద్‌లో ఏర్పాటుకావడం మనకు గర్వకారణం.



యునెస్కోకు చెందిన 'గ్లోబల్ మాలెక్యులర్ అండ్ సెల్ బయాలజీ నెట్‌వర్క్' విభాగం, సిసిఎమ్‌బిని 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ'గా గౌరవిస్తోంది. మనదేశంతోపాటు వివిధ దేశాల పరిశోధనల్లోనూ సిసిఎమ్‌బి తనవంతు పాత్ర నిర్వహిస్తూ ఉంటుంది. అమెరికాలోని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్', 'హొవర్డ్ మెడికల్ స్కూల్', 'మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ' వంటి సంస్థలు సిసిఎమ్‌బితో భాగస్వామై ఉన్నాయి. బ్రిటన్‌కు చెందిన 'ఇంపీరియల్ క్యాన్సర్ రీసెర్ట్ సెంటర్' 'కేమ్‌బ్రిడ్జి యూనివర్సిటీ' అటు జపాన్‌కు చెందిన 'ఇండియా-జపాన్ సైన్స్ కౌన్సిల్', 'యూనివర్సిటీ ఆఫ్ ర్యుక్యుస్ సంస్థలు... ఫ్రాన్స్‌కు చెందిన 'సెంటర్ నేషనల్ డె లె రీసెర్చ్ సైంటిఫిక్', 'పోశ్చర్ ఇన్‌స్టిట్యూట్'... జర్మనీకి చెందిన 'వోక్స్ వోగన్' ఫౌండేషన్ సంస్థలు... సిసిఎమ్‌బితో కలిసి సంయుక్తంగా పరిశోధనలు చేస్తుంటాయి.

**సిసిఎమ్‌బి పాత్ర -**

శక్తి, జలం, పౌష్టికాహారం, ఆరోగ్యం, పారిశుధ్యం, పర్యావరణం ... ఈ రంగాల్లో మేలైన మార్పుల దిశగా శాస్త్ర విజ్ఞాన పరిశోధనలను సిసిఎమ్‌బి నిర్వహిస్తుంది. ఆధునిక జీవశాస్త్రంలో ప్రాథమికస్థాయిలో వివిధ విభాగాలను ఏర్పాటుచేసుకుని సిసిఎమ్‌బి పరిశోధనలు జరుగుతుంటాయి. వీటిలో కణాల పనితీరు, వ్యాధుల పరిస్థితి, వాటిని అంటిపెట్టుకుని ఉండే కణాలు, జీవక్రియ, మెదడులోని రుగ్మతులలో జన్యు నియంత్రణ వంటి విషయాలపై సిసిఎమ్‌బి పరిశోధనలు చేస్తుంది. జీవ కణాల్లో ప్రొటీన్ల ప్రభావం, జీవరసాయనాల పనితీరుపై నిరంతరం పరిశోధనలు జరుగుతుంటాయి. సిసిఎమ్‌బి పరిశోధనల్లో మరో ముఖ్యమైనది జెనెటిక్ ఎనాలసిస్. జన్యుపరంగా వచ్చే వ్యాధులపైన విశ్లేషణలను ఇక్కడి శాస్త్రవేత్తలు చేస్తుంటారు. ఇన్‌ఫెక్షన్లలో లీష్మేనియా, ప్లాస్మోడియం, ఎమ్‌టిబి, హెచ్‌సివి, హెచ్‌ఐవి వంటి వ్యాధులు... అవి మానవ శరీరంలో జరిపే ప్రతిచర్యలపైనా సిసిఎమ్‌బిలో నిరంతరం అన్వేషణ జరుగుతుంది.

**సిసిఎమ్‌బి సంస్థ గురించి కొన్ని ముఖ్య విషయాలు-**

ఆధునిక జీవశాస్త్ర రంగంలో దేశంలోనే అత్యున్నత పరిశోధనా సంస్థగా సిసిఎమ్‌బి పేరుగాంచింది.

ఆధునిక జీవశాస్త్ర ఆవశ్యకతను గుర్తించిన 'కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్-సి.ఎస్.ఐ.ఆర్ సంస్థ 1976లో సిసిఎమ్‌బి ఏర్పాటుకు అనుమతిచ్చింది. సి.ఎస్.ఐ.ఆర్ సంస్థ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 44 పరిశోధనా కేంద్రాలు పనిచేస్తుండేవి. ప్రస్తుతం 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ' పేరు అప్పట్లో రీజినల్ రీసెర్చ్ లేబరేటరీగా ఉండేది. దాని బయోకెమిస్ట్రీ డివిజన్‌గా పాక్షిక స్వయంప్రతిపత్తిగల సంస్థగా సిసిఎమ్‌బి 1977 ఏప్రిల్ 1న ఏర్పాటైంది. అప్పటి నుంచి 1990 వరకు పి.ఎమ్.భార్గవ డైరెక్టర్‌గా పనిచేశారు. 1981-82 కాలంలో సిసిఎమ్‌బి పూర్తిస్థాయిలో

ఎగ్జిక్యూటివ్ కమిటీ, సైంటిఫిక్ అడ్వైజరీ కౌన్సిల్ ఏర్పాటు అయ్యాయి.

**సిసిఎమ్‌బి అవార్డులు - గుర్తింపులు**

1. యునెస్కోకు చెందిన గ్లోబల్ నెట్‌వర్క్ ఆఫ్ మాలిక్యులర్ అండ్ సెల్ బయాలజీ విభాగం సిసిఎమ్‌బిని ' సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా గుర్తించింది.
2. 'థర్డ్ వరల్డ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్' అవార్డుతో ఇటలీ గుర్తించింది.
3. డిఎన్ఎ ఫింగర్ ప్రింటింగ్‌లో చేసిన పరిశోధనలకుగాను జీవశాస్త్రంలో సిఎస్ఐఆర్ టెక్నాలజీ అవార్డు లభించింది.
4. సైన్స్ అండ్ టెక్నాలజీలో అద్భుతమైన ప్రదర్శన చూపించినందుకు సిసిఎమ్‌బికి ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కూడా సిసిఎమ్‌బిని సత్కరించింది.
5. ఐసిఐసిఐ బ్యాంక్ స్థాపించిన 'ఐసిఐసిఐ నాలెడ్జ్ పార్క్'లో సిసిఎమ్‌బికి సభ్యత్వం కూడా ఉంది.
6. అడ్వాన్స్ బయోమెట్రిక్స్‌లో అంతర్జాతీయ సంస్థగా పేరుగాంచిన 'ఏపిబయోనెట్' సంస్థలో సిసిఎమ్‌బికి సభ్యత్వం కూడా ఉ ంది.



**సిసిఎమ్‌బి పరిశోధనా విభాగాలు**

1. బయోమెడిసిన్ అండ్ బయో టెక్నాలజీ
2. జెనిటిక్స్ అండ్ ఎవల్యూషన్, జినోమిక్స్
3. సెల్ బయాలజీ అండ్ డెవలప్‌మెంట్
4. మొలుక్యులర్ బయాలజీ అండ్ స్ట్రక్చరల్ బయాలజీ
5. బయో కెమిస్ట్రీ అండ్ బయో ఫిజిక్స్
6. ఇన్‌ఫెక్షియస్ డిసీజెస్
7. కంప్యూటేషనల్ బయాలజీ అండ్ బయోఇన్‌ఫార్మటిక్స్

**సిసిఎమ్‌బి తాజా పరిశోధనల్లో వెల్లడైన విషయం-**

మేనరికం వివాహాలతో జన్యువరమైన వ్యాధులు సంక్రమిస్తాయని అందరికీ తెలసిన విషయమే. దీనికి సంబంధించి అనేక తాజా విషయాలు సిసిఎమ్‌బి పరిశోధనల్లో వెల్లడయ్యాయి. మేనరికాలతోపాటు ఒకే సామాజిక వర్గంలో స్వగోత్రికుల్లో వివాహాలవల్ల వంశానుగత వ్యాధులు వచ్చే అవకాశం ఉందని సిసిఎమ్‌బి డైరెక్టర్ డాక్టర్ రాకేశ్ మిశ్రా తెలిపారు. సిసిఎమ్‌బి అంచనాల ప్రకారం దక్షిణాసియాలో దాదాపు 5 వేల జన్యు సమూహాలున్నాయి. దీనివల్ల ఈ ప్రాంత ప్రజల్లో కొన్ని ప్రత్యేకమైన వ్యాధులు వస్తుంటాయి. వీటిలో ఇప్పటి వరకు కొన్ని మాత్రమే కనుక్కోగలిగారు. ఒక సామాజిక వర్గంలో వచ్చే వ్యాధులకు 'బ్యూట్రైఎల్‌క్లోనిస్టిరేజ్' అనే ఎంజైమ్ తక్కువగా ఉండటమే కారణమని పరిశోధనల్లో తేలింది.

పరిశోధనా ఫలాలను వేగంగా సామాన్యులకు అందించేందుకు సిసిఎమ్‌బి వినూత్న ఆలోచనలతో ముందుకెళుతోంది. చిన్న, మధ్యతరహా కంపెనీల ఆలోచనలను వాణిజ్యస్థాయికి చేర్చేందుకు సహాయపడుతోంది. దీంతో సొంతంగా పరిశోధనలు నిర్వహించలేని సంస్థలకు సిసిఎమ్‌బి తనవంతు సహాయం చేస్తుంది.

**సిసిఎమ్‌బి సాధించిన విజయాలు-**

1. మనదేశంలో అత్యధికులు ఎదుర్కొంటున్న సమస్యలు గుండె సంబంధిత సమస్యలు. వీటి కారకాలపై సిసిఎమ్‌బి చేసిన పరిశోధనలు సత్ఫలితాలనిచ్చాయి.
2. ఎలుకలపై జన్యుపరంగా సరిచేసిన ప్రయోగాల్లో సిసిఎమ్‌బి ప్రత్యేమైనది.
3. దేశంలో క్యాన్సర్ నివారణకు ఉపయోగిస్తున్న మందులపై కూడా ఓ ప్రత్యేకమైన పరిశీలన వ్యవస్థను సిసిఎమ్‌బి ఏర్పాటు చేసింది.
4. ప్రత్యేకమైన డిఎన్ఎ ఫింగర్ ప్రింటింగ్ టెక్నాలజీ ద్వారా అండమాన్ దీవుల్లో ఓ ప్రత్యేకమైన తెగను, వారి జీవ, అణువంశిక విషయాలను సిసిఎమ్‌బి తెలుసుకుంది.
5. కంటి అంటు వ్యాధులకు కారణమవుతున్న వ్యాధులను డిఎన్ఎ పరిశోధనాల ద్వారా తెలుసుకుని, వాటిని నిర్మూలించడంలో సిసిఎమ్‌బి విజయం సాధించింది.
6. అన్ని రకాల వ్యాధులు తట్టుకునే విధంగా వరివంగడాలను సిసిఎమ్‌బి సృష్టించింది.



7. ఇండస్ట్రియల్ బయో టెక్నాలజీ రంగంలో ఎంజైమ్‌లు, బయో మాలుక్యుల్స్‌లో నేటివ్ బ్యాక్టీరియాను సిసిఎమ్‌బి పరిశోధనలు జరిగాయి.

8. పై వాటితోపాటు డిఎన్ఎ, సిపిఎ వంటి అనేక ప్రత్యేక విభాగాల్లో సిసిఎమ్‌బి పరిశోధనలు సత్ఫలితాలను ఇచ్చాయి.

**ఆధునిక జీవ శాస్త్ర రూపశిల్పి 'పిఎమ్ భార్గవ'**

సీసీఎమ్‌బి గురించి ప్రస్తావన వచ్చిన ప్రతీసారి గుర్తుకుతెచ్చుకోవాల్సిన అతిముఖ్యమైన వ్యక్తి (పుష్ప మిత్ర భార్గవ) పి.ఎమ్.భార్గవ. ఆధునిక జీవశాస్త్ర రూపశిల్పిగా పేరుగాంచిన భార్గవ ఫిబ్రవరి 22, 1928న రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో జన్మించారు. ఆయన తండ్రి రామచంద్ర భార్గవ, తల్లి గాయత్రీ భార్గవ. వారణాసిలోని బీసెంట్ థియోపాసికల్ స్కూల్‌లో భార్గవ విద్యాభ్యాసం సాగింది. 1946లో లక్నో విశ్వవిద్యాలయం నుంచి ఆర్గానిక్ కెమెస్ట్రీలో ఎమ్మెస్సీ పట్టా పొందారు. 21వ ఏటనే సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీపై పరిశోధన చేశారు. 23 ఏళ్ల వయసులోనే 14 అంశాలపై పరిశోధనా పత్రాలను ప్రచురించారు. 1950 నుంచి 1953 వరకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో, అదే సమయంలో ఉస్మానియా యూనివర్సిటీ కెమెస్ట్రీ విభాగంలో లెక్చరర్‌గానూ పనిచేశారు. 1953 నుంచి 1956 వరకు అమెరికాలోని విస్కాన్సన్ యూనివర్సిటీలో విధులు నిర్వహించారు. అక్కడే హెడిల్ బర్గర్ లేబరేటరీ వ్యవస్థాపకుల్లో ఒకరిగా నిలిచి యాంటీ డ్రగ్ ఆవిష్కరణలో కీలక పాత్ర పోషించారు.



పిఎమ్ భార్గవ

పద్మభూషణ్ సహా 100కు పైగా జాతీయ, అంతర్జాతీయ అవార్డులు ఆయన్ను వరించాయి. 2015 సంవత్సరంలో అప్పటి పరిస్థితుల కారణంగా పద్మభూషణ్ అవార్డును ఆయన ప్రభుత్వానికి తిరిగి ఇచ్చేశారు. సైంటిస్ట్‌గానే కాకుండా సామాన్య జనం కోసం మూఢనమ్మకాల నిర్మూలనకు ఆయన ఎంతగానో కృషి చేశారు. నేషనల్ నాలెడ్జ్ కమిషన్ వైస్ చైర్మన్‌గా పనిచేసిన భార్గవ, ప్రభుత్వానికి పలు విలువైన సూచనలు చేశారు.

ఎన్డీయే ప్రభుత్వం విశ్వవిద్యాలయాల్లో జ్యోతిష్య శాస్త్రాన్ని కోర్సుగా ప్రారంభించాలని సన్నాహాలు చేస్తున్నప్పుడు నిర్ద్వంగా వ్యతిరేకించి సుప్రీం కోర్టు వరకు వెళ్లారు. హైదరాబాద్‌లో బత్తిన సోదరులు పంపిణీ చేసే చేప మందు శాస్త్రీయతను సవాల్ చేస్తూ 2008 నుంచి జనవిజ్ఞాన వేదిక చేపట్టిన అన్ని ఆందోళన కార్యక్రమాల్లోనూ భార్గవ పాల్గొన్నారు. చివరికి హైకోర్టు వరకు వెళ్లారు. చివరికి దాన్ని చేపమందుగా పరిగణించరాదని, చేప ప్రసాదంగానే భావించాలని హైకోర్టు పేర్కొంది.

**పి.ఎమ్. భార్గవ రచించిన పుస్తకాలు-**

1. ప్రొటీన్స్ ఆఫ్ సెమినల్ ప్లాస్మా
2. ద సాగా ఆఫ్ ఇండియన్ సైన్స్ సిన్స్ ఇండిపెన్‌డెన్స్ – ఇన్ ఎ నట్‌షెల్
3. ఏంజిల్స్, డెవిల్ అండ్ సైన్స్ – ఎ కలెక్షన్ ఆర్టికల్స్ ఆఫ్ సైంటిఫిక్ టెంపర్
4. ఎజెండా ఫర్ ద నేషన్ – ఏన్ అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ ద యు.పి.ఎ. గవర్నమెంట్

మల్టీనేషనల్ విత్తనాల కంపెనీల వ్యవహారంలోనూ పి.ఎమ్.భార్గవ తీవ్రంగా వ్యతిరేకించేవారు. జన్యుమార్పిడి వంగడాలపై దీర్ఘకాలంపాటు పరిశోధనలు జరిగాక మాత్రమే వాటికి అనుమతులివ్వాలని భార్గవ అభిప్రాయపడేవారు. 2013 ఏర్పాటైన 'రిప్రొడక్టివ్ టెక్నాలజీస్' డ్రాఫ్టింగ్ కమిటీకి భార్గవ ఛైర్మన్‌గానూ వ్యవహరించారు. 2016లో సరోగసీపై కేంద్రం విధించిన ఆంక్షలను కూడా భార్గవ వ్యతిరేకించడంతోపాటు సరోగేట్ మదర్స్ హక్కులకు రక్షణ కల్పించాలని కూడా నినదించారు. అలా... జీవ శాస్త్ర రంగంలో విశేష సేవలందించిన భార్గవ ఆగస్టు 1, 2017న హైదరాబాద్‌లో తీవ్ర అనారోగ్యంతో మరణించారు.

పి.ఎమ్.భార్గవ వంటి ఆధునిక జీవ శాస్త్ర వేత్తల కృషితో ఎన్నో విజయాలు సాధించిన సిసిఎమ్‌బి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆశిద్దాం.

**–ఎం.డి.కరీం**
m: 9618644771
e:karreemmd786@gmail.com

చందదారులుగా చేరండి! **దక్కన్ ల్యాండ్** చందదారులను చేర్పించండి!

'ఎం.వేదకుమార్ సంపాదకత్వంలో ప్రజాఉద్యమాల వేదికగా ఆరంభమైన 'దక్కన్‌ల్యాండ్' తెలుగు సామాజిక రాజకీయ మాసపత్రిక అనతికాలంలోనే అన్ని వర్గాల ఆదరణ పొందింది. తెలంగాణ ఉద్యమకారులకు కరదీపికగా మారింది. ఈ పత్రిక మరిన్ని వర్గాలకు చేరడంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

**మా చిరునామా**
DECCAN LAND
**"CHANDRAM"** 490, St.No. 12, Himayatnagar
Hyderabad - 500 029. Mob: 9030626288
mail: deccanlandindia@ gmail.com, www.deccanland.com

**చందా వివరాలు:**
వార్షిక చందా : రూ. 200
2 సం॥లకు : రూ. 400
*'దక్కన్ ల్యాండ్' పేరిట ఎం.ఓ, మనీయార్డర్, చెక్ లేదా నగదు రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.*

# చుక్కలు

**(పొట్లపల్లి రామారావు సాహిత్యం)**

ఒకసారి నీరు రాయిని ప్రశ్నించింది
"నీవు కదల వెందుకు?"
రాయి జవాబుగా అంది
"నీవు నిలబడ వెందుకు"
"ఎవరైనా గట్టువేస్తే నిలబడతాను" నీరు అంది.
"ఎవరైనా ఉలితో కదిపితే లేస్తాను"
రాయి జవాబుగా అంది.

❖ ❖ ❖

ఒకసారి గొడ్రాలుకు దేవుడు ప్రత్యక్షమై
"నీకు సంతానం కలిగే యోగం లేదు.
దానికి బదులు స్వర్గాన్ని కోరుకో" అన్నాడు.
"నాకు బిడ్డలే కావాలంది గొడ్రాలు
అమృతాన్ని యిస్తానన్నాడు
నాకు బిడ్డలే కావాలంది గొడ్రాలు
"బిడ్డడిమీద ఇంత మమత ఎందుకు నీకు?"
"నీకు మహా యిస్తే స్వర్గమో, అమృతమో, అనిమిషత్వమో
దీనిలో ఏదో ఒకటి ఇస్తావు.
సంతానంలో ఈ మూడూ ఉన్నాయి.
"మూడు ఉన్నాయా?"
"కళ్ళలో స్వర్గము-చిరునవ్వులో అమృతము,
కౌగిలిలో అనిమిషత్వము."

❖ ❖ ❖


చాలామంది కాలముకన్న ముందు
చావుకు మానసికంగా తయారు అయి కూర్చుంటారు.
అలాంటివాళ్ళు రైలు వేళకన్న ముందు వచ్చి
ప్లాటుఫారంమీద ఎదిరి చూపులతో యాతనలు పడే
యాత్రికుల మోస్తరు దయనీయంగా ఉంటారు.
గుఱ్ఱాన్ని బండికి అమర్చి
హస్తబంధముతో ఎదురుగా నిలపబడ్డ నౌకరు ఇంగితాన్ని గ్రహించి,
బండిలో కూర్చునే యజమాని మోస్తరు
హుందాగ ఉండాలె మృత్యువు.

❖ ❖ ❖

బయటి ప్రదేశమునుంచి సొరంగం ప్రవేశించగానే
రైలులో దీపాలు వెలిగినట్టు
జీవిత ప్రదేశమునుంచి మృత్యుభాగం చేరగానే
ఆత్మ తన వెలుగుతో తానే దీపమై
తనకు తానే మార్గదర్శకమౌతుంది.

❖ ❖ ❖

ఇవాళ నీవు చాల అన్యాయం చేశావు"
పామునోటిలో ఆక్రందిస్తూ కప్ప అంది.
"ఏమిటి?" ఆశ్చర్యంగా అంది పాము.
"ఆకలి బాధకు ఇట్లా బయలుదేరానో, లేదో - నీవు గుటుక్కుమన్నావు"
పాము వెంటనే అంది-
"చెపితే నమ్మవు కాని - నా కడుపులోకి పోయి చూడు
నీకే తెలుస్తుంది - నేను ఏమైనా తిన్నానేమో?"



❖ ❖ ❖

పిల్లలతో ఆటలాడే టప్పుడు
పిల్లల తికమక పెట్టడానికి పిల్లల వెనక వెనక నడుస్తూ,
పిల్లలకు చిక్కకుండా తిరుగుతూ ఉంటాం.
అట్లాగే సుఖాన్వేషణా తత్పరుడైన మానవుని
వెనక వెనక సుఖం తిరుగుతూ ఉంటుంది.
వాడేమో భూమ్యాకాశాలు గాలిస్తూ ఉంటాడు.

❖ ❖ ❖

రుచి ఎన్నిగంతులు పెట్టినా
ఆకలి శుష్కిస్తే రుచి కూడా సన్నగిల్లుతుంది.
ఆకలి అనే మూలం సజీవంగా ఉంటేనే
రుచి అనే చిగుళ్ళు పెరుగుతాయి.

❖ ❖ ❖

కనురెప్పల ద్వారా నిలవబడి
మనల ఆహ్వానించే ఆనంద భాష్పమే అభ్యాగతి.
అలాంటి అభ్యాగతి గేహంలో కాలు పెట్టడం
దేవాలయంలో ప్రవేశంచడము కన్న పవిత్రమైనది.

❖ ❖ ❖

కన్నీటి ఋణం చాలా భారమైంది.
ధనం, ధాన్యం, మర్యాద,
ఈలాంటి కుబేరసంపత్తితో ఆ ఋణాన్ని తీర్చలేము.
కన్నీటి నిధి నీ దగ్గర లేకపోతే లేకపోవచ్చు కాని
ఒకే ఒక అశ్రు కణం చాలు ఋణభారం తీర్చడానికి.

-పొట్లపల్లి రామారావు - కవిత్వం (చుక్కల నుండి)
పొట్లపల్లి ప్రచురణల సౌజన్యంతో
ఫోన్: 040-23314033

ద

# భావోద్వేగపు ప్రతిరూపాలు సంయుక్త చిత్రాలు

విశ్వమంతా నిండిన స్త్రీ విశ్వరూపం ఆమె చిత్రాల్లో కనిపిస్తుంది. ఆమెలోని భావాలు హరివిల్లు వర్ణాలుగా మారతాయి. ఆమె ప్రతి పెయిటింగ్, స్త్రీ మనసులో నిగూఢమైన ఉన్న ఆలోచనలకు దృశ్యాలుగా కనిపిస్తాయి. అంశం ఒక్కటే అయినప్పటికీ కళాకారుడు స్పందించే తీరును బట్టి విభిన్న రీతుల్లో కళాకారులు ఆవిష్కృత మవుతుంటాయి. అలా మహిళలు వారి ఆకాంక్షలనే మదిదోచే చిత్రాలుగా గీయడం చిత్రకారిణి ప్రీతి సంయుక్తకే సాధ్యమంటే అతిశయోక్తి కాదేమో... ప్రీతి సంయుక్త చిత్రాలు... మహిళలే ప్రధానంశంగా ఉంటాయి. ఆమె కళారూపాలన్నీ మహిళల్లో అంతర్లీనంగా దాగిఉన్న భావాలు, సామాజిక పరిస్థితులను ప్రతిబింబిస్తాయి.



1977 హైదరాబాద్‌లో జన్మించిన ప్రీతి సంయుక్త ఇక్కడే పెరిగారు. ప్రీతి తండ్రి కె.వి.తిరుమలేష్ ఇఫ్లూలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. చిన్నతనంలో ప్రీతిని అక్కడి లైబ్రరీకి తీసుకెళ్లి పికాసో వంటి ప్రముఖ చిత్రకారుల పెయింటింగ్స్ చూపించేవారు. అలా చిన్నప్పటి నుంచే చిత్రకళపై ప్రీతి సంయుక్తకు ఆసక్తి ఏర్పడింది. చిన్నతనం నుంచి తన చుట్టూ ఉన్న పరిస్థితులు, అనుభవాలు, భావాలే తన పెయింటింగ్స్‌కు స్ఫూర్తి అని ఆమె అంటారు. పెయింటింగ్-ఫైన్ ఆర్ట్స్‌లో సరోజిని నాయుడు స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ నుంచి అమె మాస్టర్ డిగ్రీ పొందారు. ప్రస్తుతం హైదరాబాద్ జెఎన్‌టియూ ఫైన్ ఆర్ట్స్ కాలేజీ పెయిటింగ్ డిపార్ట్‌మెంట్ హెడ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌తోపాటు షిల్లాంగ్, జైపూర్, చెన్నై, కేరళ, గ్వాలియర్, ఇండోర్, నాగ్‌పూర్, భోపాల్, ఢిల్లీ, ముంబయిలలోని ఆర్ట్ గ్యాలరీలలో అనేక పెయింటింగ్స్ గ్రూప్ షోలు నిర్వహించిన ఘనత ప్రీతి సంయుక్త సొంతం.

పురుషాధిక్య సమాజంలో మహిళలు చిత్రలేఖన కళాకారులుగా ఎదిగే క్రమంలోనూ అనేక ఒడిదొడుకులు ఎదురవుతున్నాయని, వాటిని మహిళలే స్వయం శక్తితో అధిగమించాలని ప్రీతి సంయుక్త అంటారు.

అమెరికా, యుకె, దుబాయిలలోనూ... అమె పలు కళా ప్రదర్శనలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఆమె నిర్వహించిన అనేక ప్రదర్శనలు ఎంతగానో కీర్తించబడ్డాయి. జాతీయ లలిత కళా అకాడమీ నిర్వహించిన పెయింటింగ్ క్యాంప్స్, వర్క్ షాప్‌లలో సంయుక్త తన చిత్రాలను ప్రదర్శించారు. 2013లో నిర్వహించిన 'వెనిస్ బినాలె'లో ప్రీతి సంయుక్త పాలు పంచుకున్నారు. 2010లో ఐదు పట్టణాల్లో 'విజువల్ కాన్వర్జేషన్స్' పేరుతో 11 పెద్ద చిత్ర ప్రదర్శనలను నిర్వహించారు. 2011లో 'బ్లూ బటర్‌ఫ్లైస్' పేరుతో అమెరికాలోని టెక్సాస్‌లో, 2016లో 'అన్ టైటిల్డ్' పేరుతో శ్రీలంకలో 2016లో హైదరాబాద్‌లో 'వ్యూవ్ పాయింట్', 'వ్యూవ్ పాయింట్-2' పేరుతో చిత్ర ప్రదర్శనలు ఆమెలోని అద్భుత పెయింటింగ్స్ కళా తృష్ణకు అద్దం పడతాయి.

'తెలంగాణ ఉమెన్ ఆర్టిస్ట్ అండ్ దెయిర్ ఇమెజరీస్' పేరుతో ఉస్మానియా యూనివర్సిటీలో 'సైన్ బోర్డ్ - ద వానిషింగ్ ఆర్ట్' అంశంపై బెంగళూరులో, 'ఎ లెజెండ్ కాల్డ్ హుస్సేన్' పేరుతో గుల్బర్గాలో సంయుక్త తన పత్రాలను సమర్పించారు. వీటితోపాటు సొంతంగా 6 చిత్ర ప్రదర్శనలతోపాటు అనేక కొత్త ప్రాజెక్టులపైనా పనిచేస్తున్నారు. 2003, 2009లలో 'హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అవార్డ్'తో సన్మానించారు. 940 నుంచి 2010 వరకు హైదరాబాద్‌కు చెందిన మహిళా చిత్ర కళాకారులు రూపొందించిన చిత్రాలను 'వ్యూ పాయింట్' పేరుతో ప్రదర్శించారు. 2016 జనవరిలో అంతర్జాతీయ










మహిళా కళాకారుల కళా రూపాలను 'వ్యూ పాయింట్ – 2' పేరుతో ప్రదర్శన నిర్వహించి కళాభిమానుల దృష్టిని ఆకర్షించారు. చిత్ర కళారంగంలో తనకంటూ ఓ ప్రత్యేక పేజీ లిఖించుకున్న ప్రీతి సంయుక్త ప్రస్తుతం 'విజువల్ ఆర్ట్స్'లో పిహెచ్‌డీ చేస్తున్నారు.

ప్రీతి చిత్రాల్లో సమాజంలో ఉన్న ఏదో ఒక మహిళ కనిపిస్తూనే ఉంటుంది. చిత్రకళా రంగంలో రావాలనుకేవారికి స్ఫూర్తిగా నిలుస్తున్న ప్రీతి సంయుక్త... భవిష్యత్తులో మరిన్న ఆలోచనాత్మక, అద్భుతమైన పెయింటింగ్స్‌తో పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని కోరుకుందాం.

ప్రీతి సంయుక్త
ఫోన్: 9849661555
మెయిల్: samyukta_bhat@yahoo.com

– పురుషోత్తం

# స్మార్ట్ సిటి



ఆమె
రోజు పొద్దున్నే
మాసిన ముఖంలోంచి ఉదయించి
మురికిపడ్డ కొన్ని ఇంటి ముఖాల్లో
మల్లెల్ని పూయిస్తుంది

అతడు
రోజు పొద్దున్నే
చినిగిన చొక్కాలోంచి నడక సాగించి
నాలుగు బాటల మూలమీద
కొన్ని తెగిన పాదాలకు జీవం పోస్తుంటాడు

ఆమె
నిత్యం ఎన్ని ముఖాల్లో మల్లెలు పూయించినా
తనకంటూ ఓ ముఖానికి పునాదినైనా
తొవ్వుకోలేదు

అతడు
నిత్యం ఎన్ని పాదాలకు జీవం పోసినా
తను పాదం మోపేందుకు ఓ గూడునైనా
అల్లుకోలేదు

అవును..
ఇప్పుడు వారిద్దరు
నువ్వంటున్న ఒకానొక స్మార్ట్ సిటీలో
వెలుగుతున్న 'భార'తీయులు..!!

–బిల్ల మహేందర్
m : 9177604430
e : billamahisari@gmail.com

# ఫుట్‌బాల్ సువర్ణయుగానికి కేరాఫ్ అడ్రస్ హైదరాబాద్


నవాబుల సంస్కృతితో పాటు కళలు, క్రీడలకు... దక్కన్ పీఠభూమితో విడదీయరాని అనుబంధం ఉంది. అలాంటి క్రీడల్లో ఫుట్‌బాల్ ఒకటి. ఒలింపిక్ స్థాయి మేటి ఫుట్‌బాల్ క్రీడాకారులను జాతీయ జట్టుకు అందించిన ఘనత మన హైదరాబాద్ సొంతం. హైదరాబాద్‌ను పరిపాలించిన నవాబు చక్రవర్తులు.. ఫుట్ బాల్ క్రీడను ఎంతగానో ప్రోత్సహించారు. వారి కృషి ఫలితంగానే... హైదరాబాద్ రాష్ట్రం భారత దేశంలో విలీనమయ్యాక కూడా ఫుట్‌బాల్ ఫీవర్ కొనసాగింది. 1950 నుంచి 70వ దశకం వరకు హైదరాబాద్‌లో ఫుట్‌బాల్ కాలాన్ని గోల్డెన్ పీరియడ్‌గా చెప్పుకోవచ్చు.



హైదరాబాదీ ఫుట్‌బాల్ క్రీడాకారులు... 1952 హెల్సింకీ, 1956 మెల్‌బోర్న్, 1960 రోమ్‌లలో జరిగిన మూడు ఒలింపిక్ టోర్నమెంట్స్‌లో.. తమ సత్తా చాటారు. అప్పటి కోచ్ సయ్యద్ అబ్దుల్ రహీమ్ ఆధ్వర్యంలో వీరు ఒలింపిక్స్‌లో పాల్గొన్నారు. 1943 నుంచి 1963 వరకు హైదరాబాద్ ఫుట్‌బాల్ అసోసియేషన్‌కు... అబ్దుల్ రహీమ్ కోచ్‌గా వ్యవహరించారు. 1952 హెల్సింకీ ఒలింపిక్స్‌లో హైదరాబాద్ నుంచి సయ్యద్ ఖాజా అజీయుద్దీన్, నూర్ మహ్మద్, ఎస్.కె.మొహియుద్దీన్ పాల్గొన్నారు. 1956 మెల్‌బోర్న్ ఒలింపిక్స్‌కు వెళ్లిన క్రీడాకారుల సంఖ్య 8కి చేరింది. వీరిలో పీటర్ తంగరాజ్, అజీజుద్దీన్, మహ్మద్ అబ్దుల్ సలామ్, అహ్మద్ హుస్సేన్, నూర్, జె.కృష్ణస్వామి, ధర్మలింగం కణ్ణన్, తులసీదాస్ బలరామ్, మహ్మద్ జుల్ఫీకరుద్దీన్ తదితరులు మెల్‌బోర్న్ ఒలింపిక్స్‌లో పాల్గొన్నారు. మొత్తం టోర్నమెంట్‌లో ఇండియా జట్టు నాల్గోస్థానంలో నిలిచింది. భారత్ ఫుట్ బాల్ క్రీడాకారుల అత్యుత్తమ ప్రదర్శనగా చెప్పుకోవచ్చు. 1960లో రోమ్‌లో జరిగిన ఒలిపింక్స్‌లో ఆరుగురు హైదరాబాద్ ఫుట్‌బాల్ క్రీడారులు పాల్గొన్నారు. తంగరాజ్, యూసుఫ్ ఖాన్, ఎస్.ఎస్.హకీమ్, బలరామ్, కణ్ణన్, హబీబుల్ హసన్ హమీద్ భారత జట్టు తరపున ఆడారు. ఈ మూడు ఒలింపిక్స్‌లో ఆడిన వాళ్లంతా.. హైదరాబాద్ ఫుట్‌బాల్ గోల్డెన్ ఎరాలో... దక్కన్ ఖ్యాతిని పెంపొందించారు. ఇప్పటికీ చాలా మంది క్రీడారులు అప్పటి సువర్ణాధ్యాయాన్ని ఫుట్‌బాల్ చారిత్రక మ్యాచ్‌లను గుర్తుచేసుకుంటుంటారు. అలాంటి రోజులు మళ్లీ హైదరాబాద్ ఫుట్‌బాల్ అసోసియేషన్ చూడగలదా అని ఆ తరానికి చెందినవారు అనుకుంటూ ఉంటారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్, 11హంటర్స్, నేషనల్ స్పోర్టింగ్, మెర్రీ గో రౌండ్, హైదరాబాద్ స్పోర్టింగ్, సిటీ కాలేజ్ ఓల్డ్ బాయ్స్ లాంటి హైదరాబాద్‌కు చెందిన ఫుట్‌బాల్ జట్ల నుంచి ఒలింపిక్ స్థాయి క్రీడాకారులు ఎదిగారని మనమంతా గర్వంగా చెప్పుకోవచ్చు. ప్రస్తుతం దేశంలో ప్రముఖంగా వినిపించే బెంగాల్, గోవా ఫుట్‌బాల్ జట్ల మేనేజ్‌మెంట్ అద్భుతంగా ఉండటం వల్లే... ఇప్పటికీ ఆ జట్ల నుంచి అత్యుత్తమ క్రీడాకారులు రాగలుగు తున్నారని... నాటి తరం సాకర్ అభిమానులు అభిప్రాయపడుతున్నారు.



తంగరాజ్



హైదరాబాద్‌లో ఫుట్‌బాల్ ప్రస్తావన వచ్చినపుడు... మొదటగా వినిపించే పేరు... నిజాం గోల్డ్‌కప్... అయితే ప్రస్తుతం ఈ పేరు క్విజ్‌ల కోసం ప్రిపేర్ అవడానికి ఉపయోగించే జనరల్ నాలెడ్జ్ బుక్స్‌లో ఇన్‌ఫర్మేషన్‌గా మాత్రమే మిగిలిఉంది. ఇలాంటి ప్రముఖ టోర్నమెంట్‌లతోపాటు... మజీద్ ఛాలెంజ్ షీల్డ్, శివకుమార్ లాల్ టోర్నమెంట్, రహీమ్ సాబ్ వంటి లోకల్ టోర్నమెంట్లు కూడా ప్రముఖంగా జరుగుతుండేవి. 70వ దశకంలో ప్రముఖంగా వినిపించిన సాకర్ క్రీడారుల పేర్లలో పి.పి.సురేంద్ర కుమార్ ఒకరు. ఫుట్‌బాల్ సర్కిల్‌లో ఆయన్ని గోపీగా పిలిచేవారు.

**దక్కన్‌లో ఫుట్‌బాల్ చరిత్ర**

నవాబుల కాలంలో 20వ దశకంలో హైదరాబాద్‌లో ఫుట్‌బాల్ ప్రస్థానం మొదలైంది. నవాబ్ ఆఫ్ టార్బండ్, మహారాజాస్ ఆఫ్ కాకినాడ, మహారాజా ఆఫ్ రాజమండ్రి వంటి జట్లు ఫుట్‌బాల్ క్రీడల్లో తలపడేవి. అలా క్రమంగా ప్రాచుర్యం పొందిన ఈ క్రీడ 1939 నాటికి హైదరాబాద్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఏర్పడింది. గులామ్ మహ్మద్ దీనికి తొలి అధ్యక్షులుగా ఉన్నారు. ఆ తర్వాత ఎస్.ఎమ్.హాదీ హైదరాబాద్ ఫుట్‌బాల్ అసోసియేషన్‌కు తొలి సెక్రటరీగా ఉన్నారు. అహ్మద్ మొహియుద్దీన్ వంటి ఫుట్‌బాల్ క్రీడాభిమానులు హైదరాబాద్‌లో జరిగిన ప్రతి ఫుట్ బాల్ టోర్నమెంట్‌లోనూ తమవంతు సహాయసహకారాలను అందించారు.

1942లో ఎస్.ఎమ్.హాదీ హైదరాబాద్ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడుగా నియమితులయ్యారు. లెజండరీ కోచ్ ఎస్.ఎ. రహీమ్ అప్పుడు సెక్రటరీగా ఉన్నారు. రహీమ్ కృషి ఫలితంగా 1959లో హైదరాబాద్, ఆంధ్ర రెండు సంఘాలు కలిసి ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్‌గా ఏర్పడ్డాయి.

అలా ఏర్పడ్డ హైదరాబాద్ ఫుట్‌బాల్ అసోసియేషన్‌లో...

హైదరాబాద్ సిటీ పోలీస్ జట్టు.. అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తూ క్రీడాభిమానుల మనసు గెలుచుకుంది. ఈ జట్టు 'సిటీ అఫ్ఘన్స్'గా పేరుగాంచింది. నిజాం కాలంలో పోలీసు దళాలకు సిటీ అఫ్ఘన్స్‌గా ఉన్న పేరు కారణంగానే.. పోలీసుల ఫుట్‌బాల్ జట్టుకు ఆ పేరు వచ్చింది. 1950లో జరిగిన డ్యురాండ్ కప్‌లో బెంగాల్‌కు చెందిన మోహన్ బగాన్ జట్టును ఓడించి సిటీ ఆఫ్ఘన్ జట్టు కప్ సొంతం చేసుకుంది. ఆ సమయంలో కనీసం 15 జట్లు... హైదరాబాద్‌లో ఫుట్‌బాల్ క్రీడా ఖ్యాతిని పెంచడంలో కృషి చేశాయి. ఫుట్‌బాల్ గోల్డెన్ పీరియడ్‌లో ఉస్మానియా యూనివర్సిటీ, నిజామ్ కాలేజి, సిటీ కాలేజి, సైన్స్ కాలేజీ, సైఫాబాద్ గవర్నమెంట్ టెక్నికల్ కాలేజీల నుంచి యువ కాలేజీ జట్లు ఫుట్‌బాల్ మ్యాచ్‌లలో తమ సత్తా చూపించేవి. కాలేజీ యాజమాన్యాలు కూడా ఫుట్‌బాల్ క్రీడాకారులను అమితంగానే ప్రోత్సహించారు. అలా ఉస్మానియా యూనివర్సిటీ నుంచి లభించిన ప్రోత్సాహంతోనే రహీమ్ ఫుట్‌బాల్‌లో రాణించారు.



Helsinki Olympics of 1952

ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ ప్రొఫెసర్‌గా పనిచేసిన వి.ఎమ్. శ్యామ్ రాజ్ కూడా విద్యార్థిదశలో ఉండగా సంతోష్ ట్రోఫీలో ఆడారు. గౌసుద్దీన్ సాహెబ్ ఆసమయంలో ఓయూ ఫుట్‌బాల్ జట్టు కోచ్‌గా ఉన్నారు.

**ఫుట్‌బాల్ గురు - సయ్యద్ అబ్దుల్ రహీమ్-**



**సయ్యద్ అబ్దుల్ రహీమ్**

'నేటి మీ రోజును నాకివ్వండి, రేపు మీకు బంగారు పతకం వస్తుంది'... తనను కలిసే ఫుట్‌బాల్ క్రీడాకారులందరికీ అలనాటి లెజండరీ కోచ్ సయ్యద్ అబ్దుల్ రహీమ్ ఇచ్చిన సందేశం. దేశంలో ఇప్పటికీ హైదరాబాద్ ఫుట్‌బాల్ స్వర్ణయుగం గురించి మాట్లాడుతున్నారంటే... ఆ ఘనత రహీమ్ సాహెబ్ మాత్రమే దక్కుతుంది. ఫుట్‌బాల్ క్రీడనే ఊపిరిగా చేసుకున్న రహీమ్ సాబ్... ఆగస్టు 17, 1909 లో హైదరాబాద్‌లో జన్మించారు. చిన్నప్పటి నుంచే ఆయనకు ఫుట్‌బాల్ అంటే విపరీతమైన ఇష్టం. అలనాటి సాకర్ క్రీడాకారులను అద్భుతమైన ఆటగాళ్లుగా మలిచిన ఘనత ఆయనకే దక్కుతుంది. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైన రహీమ్, తన మాటలు, వాక్చాతుర్యంతో... క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపేవారు. 1951, 1962 ఏసియన్ గేమ్స్‌లలో విజయాలతోపాటు 1956 మెల్‌బోర్న్ ఒలింపిక్స్‌లో భారత్ జట్టును సెమీ ఫైనల్స్‌ను తీసుకెళ్లిన ఘనత రహీమ్ సొంతం. 1950 నుంచి తన తుదిశ్వాస విడిచే వరకు.. భారత జాతీయ ఫుట్‌బాల్ జట్టుకు కోచ్‌గా వ్యవహరించారు. 1943 నుంచి 1963 వరకు 'హైదరాబాద్ సిటీ పోలీస్' జట్టుకు కోచ్‌గా కొనసాగారు. ఆ కాలంలోనే జాతీయ జట్టుకు కూడా తన సేవలందించారు. రహీమ్ కోచ్‌గా ఉన్న చివరి రోజుల్లో 1962 జకార్తా ఏసియన్ గేమ్స్ ఫైనల్‌లో దక్షిణ కొరియాను ఓడించి కప్ గెలవడాన్ని ఇప్పటికీ... సాకర్ అభిమానులు గుర్తు చేసుకుంటూ ఉంటారు.



ఫుట్‌బాల్ అంటే బెంగాల్ జట్టు మాత్రమే అని చెప్పుకునే ఆ రోజుల్లో... దానికి ధీటుగా హైదరాబాద్ నుంచి ఫుట్‌బాల్ క్రీడాకారులను తయారు చేయడంలో రహీమ్ ఎనలేని కృషి చేశారు. 1943 హైదరాబాద్‌లో ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మృత్యువు తనను ఓడించే వరకు కొనసాగారు. అడ్మినిస్ట్రేటర్‌గా ఆఫీస్ గదిలో కూర్చోకుండా, గ్రౌండ్‌లో దిగి క్రీడాకారులను మలిచారు.

నిజామ్ గోల్డ్‌కప్, మజీద్ ఛాలెంజ్ షీల్డ్ టోర్నమెంట్లలో రహీమ్ మలచిన క్రీడాకారులు అద్భుత ప్రదర్శన కనబరిచేవారు. జాతీయ జట్టుకు కోచ్‌గా రహీమ్ ఎంపిక అంత సులువుగా జరగలేదు. ఆ రోజుల్లో ఫుట్‌బాల్ కోచ్‌లు వేళ్లమీద లెక్కబెట్టేస్థాయిలోనే ఉండేవారు. 1948 ఒలింపిక్స్‌కు భారత్ జట్టుకు కోచ్‌గా ఉన్న బాలాయ్ దాస్ ఛటర్జీకి రహీమ్ నచ్చలేదు. అయినప్పటికీ రహీమ్‌కు ఉన్న అద్భుతమైన ట్రాక్ రికార్డు కారణంగా ఆయన్ను 1951 ఏసియన్ గేమ్స్‌కు పంపే జట్టుకు కోచ్‌గా నియమించారు. అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కూడా ఏసియన్ గేమ్స్‌లో భారత జట్టు ప్రదర్శనకు ఫిదా అయ్యారని చెబుతారు. అయితే 1952లో ఒలింపిక్స్ జట్టుకు కోచ్‌గా మళ్లీ ఛటర్జీ బాధ్యతలు తీసుకున్నారు. దాంతో యుగోస్లేవియాపై భారత్ జట్టు 10-1 తేడా భారీస్థాయిలో అపజయాన్ని మూటగట్టుకుంది. ఇక ఆ తర్వాత మళ్లీ కోచ్‌గా రహీమ్‌కు పగ్గాలు అప్పగించారు. రహీమ్ సారథ్యంలో గెలుపు, ఛటర్జీ సారథ్యంలో వచ్చిన భారీ ఓటమితో... ఇకపై ఎవరూ కూడా రహీమ్ సారథ్యాన్ని ప్రశ్నించే ధైర్యం చేయలేదు.

రహీమ్ తర్వాతి కాలంలో భారత సూపర్ కోచ్‌లుగా పేరుగాంచిన అమల్ దత్తా, పికె బెనర్జీ, నయీముద్దీన్ వంటి వాళు రహీమ్ శిక్షణలో రాటుదేలిన ఫుట్‌బాల్ క్రీడాకారులే కావడం గమనార్హం.

కోచ్‌గా రహీమ్ శిక్షణ చాలా కఠినంగా ఉండేది. ఎప్పుడు ఆట గురించే ఆలోచించే విధంగా క్రీడాకారులను ప్రోత్సహిస్తూ, ఫుట్‌బాల్ పుస్తకాలను చదవాలని సూచించేవారు. భారత ఫుట్‌బాల్

చరిత్రలో హైదరాబాద్ ఫుట్‌బాల్ ఆటకు క్రీడాకారులకు... ఓ ప్రత్యేక పేజీ అంటూ ఉందంటే ... అది కేవలం సయ్యద్ అబ్దుల్ రహీమ్ వల్లనే అని ఏ మాత్రం అనుమానం లేదని గోల్ కొట్టిమరీ చెప్పవచ్చు. అయితే.. ఫుట్‌బాల్ చరిత్రలో భారత్ పేరును మారుమోగేలా చేసిన సయ్యద్ రహీమ్‌ను ప్రభుత్వాలు సరిగ్గా పట్టించుకోలేదు. రహీమ్ ట్రాక్ రికార్డును పట్టించుకోకుండా ఆయన్ను ఇంగ్లీష్ కోచింగ్ క్లాస్‌లంటూ వేధించేవారు. అలా.. ఎస్ఎ రహీమ్ ఆధ్వర్యంలో... సుమారు రెండు దశాబ్దాలపాటు.. ఫుట్ బాల్ సువర్ణయుగం గడిచింది. 54 ఏళ్ల వయసులో క్యాన్సర్‌తో బాధపడుతూ 1963 జూన్ 11న రహీమ్ తుదిశ్వాస విడిచారు. ఆయన మరణంతో... భారత ఫుట్‌బాల్ చరిత్రలో ఒక అధ్యాయం ముగిసింది. దాంతోపాటుగానే... ఫుట్‌బాల్ మెరుపులూ తగ్గుతూ వచ్చాయి.

1963 తర్వాత.. ఒలింపిక్ క్రీడలకు భారత సాకర్ జట్టు క్వాలిఫై కాలేదు. 1964 ఏసియన్ గేమ్స్‌లో క్వాలిఫై అయినప్పటికీ... టైటిల్ గెలవడంలో మన సాకర్ జట్టు విఫలమైంది. ఆ తర్వాత 1970 ఏసియన్ గేమ్స్‌లో జపాన్‌పై గెలిచి బ్రాంజ్ మెడల్‌తో సరిపెట్టుకుంది. 70వ దశకం మధ్యలో ఇరాన్‌తో కలిసి యూత్ ఏసియన్ కప్ సాధించింది. ఇక ఆ తర్వాతి కాలంలో... రహీమ్ లాంటి కోచ్‌లూ రాలేదు.. అలాంటి క్రీడాకారులూ మనకు కనిపించలేదు. ఫుట్‌బాల్ స్వర్ణయుగం గురించి ప్రస్తావన వచ్చిన ప్రతీసారీ రహీమ్ పేరు ప్రస్తావనకు వస్తుంది. సాకర్ ప్రపంచంలో తనకంటూ ఓ పేజీని లిఖించుకున్న రహీమ్ సేవలు ఎన్నటికీ మరువలేం.... హ్యాట్సాఫ్ టు లెజెండరీ కోచ్ రహీమ్ సాబ్.

-ఎం.డి.కరీం
m: 9618644771
e:karreemmd786@gmail.com

## కర్కు బీడి



ఊపిరి పీల్చడం - బీడి కాల్చడం
ఆయన నిత్య - ఉచ్ఛ్వాస నిశ్వాసలు...!

కోంద్రలేసి ఎకురాలెకురాలు
భూమి ఇరువాలు దున్నినప్పుడు..
దమ్మార బీడి గుంజుతేనే
అవిసిపోయిన శగితి
మల్ల రూపు తీసుకుంటుందతనికి...!

ఎల్లని కాపిరం తిప్పలు
కడుపుల కసబిస సలిపినపుడు
కడుపు నిండదని తెలుసు..
కాలు నిండదని తెలుసు..
మనుసు కుదార్తంకై
మంచి మందతనికి కర్కుబీడి..!

కడుపున అంబలి కంటె
కర్కు బీడి కుదురుగుంచుతది
పొగసూరిన మనుసును
పొగతోటే కడిగేసే నేర్పరి
కుక్క బుద్ధి ఆలోచనను
కర్కుబీడే కూకబెడ్తది
బీడి పొగ బిర్రుగా గుంజుతేనే
ఏసొంటి పనినైనా ఎదుర్కసేస్తడు..!


కాయకష్టానికి గుర్తులేమో వాళ్ళు
కర్కుబీడి బతుకులు వాళ్ళవి
వాళ్ళొదిలిన రింగు పొగల్లో
వెతికే గుణముండాలే కాని
నాలుగువేల సంవత్సరాల
బతుకు జీవన సారం ఉబుకుతది!
వాళ్ళొదిలిన బీడి పొగల రింగులు
మా వూరి కపిలవాయి లింగమూర్తి
కలిపిరాతల కవితల్లాగుంటయి..!

చెకుముకిరాయికి
పలుగురాయి దూదికి
సంయోగం జరిపి నిప్పు పుట్టించిన
ఆధునిక శాస్త్రవేత్త అతడు..!

- గుడిపల్లి నిరంజన్,
m : 9493319878
e : niranjangudipally@gmail.com

# ఒంటరి చావు

ఆ జొన్న విత్తులకు పుటకలోనే జాతీయాభిమానమం కురించింది. అప్పుడప్పుడే స్వరూపాలు ఏర్పడుతున్నాయి ఆ విత్తులకు. పెద్దగాలి చుట్టుకుంది. నిమిషమాత్రమైన స్థిమితంగా నిలవబడనీయక కిందుమీదుగా ఊపివేసింది ఆ గాలి. అప్పుడా విత్తుల్లో ఘనమైంది యిట్లా అంది "మనము కొంచము అంకుర ప్రాయంగా అయినామొ లేదో గాలి చిచ్చులా చుట్టుకొని ఊపుతుంది. మనము యింకా కొంచము బలంగా అయితే దాని ఆటలు సాగవని తెలుసు. గాలి ఎంతైన ఊపనీయి. మనము ఒక్కళ్ళము దాని మాయలో పడవద్దు. ఎప్పటినుండి కాచుకొని చూస్తుందో మరి?" గింజలు యిట్లా తమలో తాము గుసగుసలు ఆడుతున్నాయి. గాలి నేలకు విసిరింది ఆ మొక్కను.




''చూశారా? ముండగాలి........ఎట్లా ప్రతాపము చూపుతుందో! ఆడుతుంది గొంతు కోయాలని జాగ్రత్త పట్టు విడిచేరు. బాగ పట్టుకోండి. ఎంత ఎగురుతుందో చూద్దాము" అని ఆ ఘనమైన గింజ అన్నిటిని హెచ్చరించింది. గాలి ఊపింది, నేలకు విసిరింది, వేళ్ళ దగ్గర నుండి పెళ్ళగిలేటట్టు ప్రళయనృత్యం చేసింది. గింజలన్ని మౌనంగా ఆ బీభత్సాన్ని ఎదుర్కొంటూ ఉన్నట్టు గాలి నేలకు వంచితె చక్కా లేచి నిలచాయి. తమ అణుమాత్రమైన జీవాలన్నిటికి కేంద్రీకరించుకొని గాలికి ఎదురుతిరిగాయి. నీవు ఎంత వంచిన నీ ముందు వంగేది లేదన్నట్టుగా లేచి చక్కా నిలబడ్డాయి. గాలి మరీ విజృంభించింది. గగ్గోలు చేసింది. 'కానీయి!' అన్నాయి విత్తులు. 'నీ ఊపిరితిత్తుల్లో ఆఖరు శ్వాస లేకుండా ఊదేయి. మూల మూలల ఉన్న నీ బలాన్ని అంతా పైకి తోలు. జంకేదిమాత్రము లేదు.' గాలి విసిరి విసిరి, తన ప్రయత్నాలన్నీ వ్యర్థమైపోయినట్టుగా వెళ్ళిపోయింది. కాలమేఘము పై నుండి తొలగిపోయినట్లు అమ్మయ్య అని నిట్టూర్పులు తీసాయి విత్తులు. విజయ గర్వంతో అవన్నీ ఉబ్బిపోయినాయి. వాటి అణువు అణువులలో సంతోష జ్వాల పరువులు పెట్టింది. వాటిలోని ఆ ఘనమైన విత్తు జాతీయ ఉద్రేకంలో "సోదరులారా!" అని తతిమ్మావాటిని హెచ్చరించింది. "చూశారా! జాతీయతలో ఉండే బలము? జాతీయత గల ఒక అణువు బ్రహ్మాండాన్ని గూడ ఎదిరించవచ్చుననే విషయము ఈ రోజు ఋజువైంది. మన మీ చరిత్ర సంఘటనను మరవగూడదు. మన మీ సంఘటనను మరిస్తే మన జాతీయతే నశిస్తుంది. మన జాతీయత నశించిన్నాడు మనమే నశించిపోతాము" అంటు ఉపన్యాసాన్ని ముగించింది.

తెల్లవారి దారినిపోతూవున్న ఓ పడుచు ఆ కంకి విరిచి కర్రతో విత్తులు రాలుస్తు ఉంటే అకస్మాత్తుగా ఆ బలిసిన విత్తు ఆమె తలవెంట్రుకల్లో రాలింది. పరిమళాలు వెదజల్లుతు ఉన్న ఆమె కేశపాశములో చిక్కుకొని, ఏదో దివ్యలోకములో పడ్డట్టు అయింది ఆ విత్తుకు. సువాసనలో మైమరచిపోయింది. అణువు అణువులో ఆ పరిమళాలు నిండగా తన్మయావస్థలో పొర్లాడింది. పట్టుకుచ్చుల్లా ఉన్న ఆ వెంట్రుకలు మెత్తగా సోకగానే "ఎవ్వరే నన్ను పోకుండ ఆపేది" అని తల వెంట్రుకల ముద్దాడింది. "ఏమైన కానీయి. నేనీ లోకాన్ని మాత్రము విడిచేది లేదు. నాలో ఏదో ప్రత్యేకత ఉండబట్టే నాకీ స్థానం లభించింది. లేకుంటే యింత మెత్తని శయ్య, యింత చక్కని పరిమళాలు ఊరకనే లభిస్తాయా? మొదటినుండే యిలాంటి పదవి ఎప్పుడో లభిస్తుందని నాకు తెలుసు. నాలో ఉన్న గొప్పదనమే నన్నిట్లా బయటికి తీసుకవచ్చింది. ఎంత అధముల మధ్య ఉంటే మాత్రమేమి! ప్రతిభ ఎన్నటికైన చీకటిని చీల్చుకొని బయటికి వస్తుంది" యిట్లా తనలో తాను ఉబ్బిపోతూ గర్వంగా కిందికి చూచింది ఆ విత్తు. కర్ర దెబ్బలకు నేలరాలి చిందరవందరగా పడివున్నాయి విత్తులన్నీ.

"వీటికి ఏనాడో యీగతి పట్టుతుందని ఆనాడే అనుకొన్నా, అల్పోద్రేకాలు కాకపోతే ఏమిటీ వీటి జాతీయత? దయాధర్మము మీద ప్రపంచములో దారి దొరకాలేకాని యీ పోట్లాటలతో ఏమౌతుంది? ఏమి నాకు పోట్లాడే శక్తి, సాహసము లేకనేనా యిట్లా వచ్చింది. నేను నాలాంటి వాళ్ళనెందరనో నిప్పు తొక్కిన కోతులమాదిరి ఎగిరించగలను. జాత్యభిమానమనే నిప్పు యింటింటికి అంటించి అవి మండుతూవుంటే దేశభక్తిలో మునకలు వేయగలను.

"స్వనాశాన్ని పురికొల్పే యీ జాతీయాభిమానమనే సారాయిని ఏ పిశాచమో కల్పించి ఉంటుంది. లేకపోతే దీని స్పర్శ తగిలిన ప్రతి జీవము శివమెత్తినట్లు ఎందుకు పరుగులు పెడుతుంది? అయినదేదో అయిపోయినది. యిక వీటిని దారికి తీసుకువస్తాను. ఒంటరితనములోవున్న సౌఖ్యాన్ని, స్వేచ్ఛను రుచి చూపిస్తాను. యేమి మేమంతా ఒకళ్ళనొకళ్ళము అంటుకొని పుట్టామా? అయితే యింకెందుకు జాతీయత? జాతీయతయని ఏదో మునిగిపోతున్నట్టు పెద్దగా అరవడం? ఏదో నా వివేకాన్ని బట్టి నాకీ స్థానం లభించింది. ఇక పదవులందుకోవడంలోనే నిజమైన సుఖం ఉందని బోధిస్తాను. అంతకూ వినకపోతే ఆకలికి మాడ్చి దారికి తెస్తాను!" అంటూ దర్పంగా కిందరాలిన విత్తులవైపు చూచింది కంకి నుండి విత్తులన్నీ రాలిపోగానె నేల రానినవాటినన్నిటిని మూటగట్టదొడగింది పడుచు. తలవైపున్న గింజ బాగా చూచింది.

"ఇక తెలుస్తుంది వీటి ప్రభావము? జాతీయత అంటే ఏమిటో

రుచి చూపిస్తాను. ఒకదానిపై ఒకటిపడి ఉక్కిరిబిక్కిరి కావాలె. గుక్క తిప్పకుండా లోలోన ఉడికి చావాలె. చూడు తమాషా!" అంటూ పడుచు వెన్నుపై వేసుకొన్న కొంగు ముడివైపు బాగా చూచింది. గట్టిగా బిగిసిన ముడి చినిగి ఒక్కటొక్కటిగా పారిపోతున్నాయి విత్తులు.

తన ప్రయత్నమంతా వ్యర్థమైనట్టు వుడికిపోయింది విత్తు. "దేశద్రోహులు ముడి చించుకొని పారిపోతున్నారు. వీటిని పట్టుకొని మళ్ళీ బంధించాలె. లేకుంటే దేశములో మళ్ళీ అరాచకం వ్యాపిస్తుంది. శాంతి మంటకలుస్తుంది." అంటూ కిందుమీదుగా తలపైన ఎగిరింది. జారిపోతున్న విత్తులన్నీ దాని తొందరపాటు చూచి 'ఏమైంది? ముందు వుంది నీగతి' అన్నట్టుగా దానివైపు చూచాయి. స్వేచ్ఛగా జారిపోతున్న ఆ విత్తుల చూచేవరకు 'అయ్యో! ఒంటరిదాన్ని అయిపోతున్నానే' అనే భయం పుట్టింది. 'మళ్ళీ ఎట్లా వీటిలో కలవను' అనే ఆరాటం బయలుదేరింది. అక్కడినుండి లేచిపోవాలని వెంట్రుకలన్నిటిని విదలించ దొడగింది.

ఇంతలో పడుచు యిల్లుచేరి పొయ్యిపైన కంచుడు వేసి కొంగు విప్పి చూసుకుంది. ఒక్క విత్తుకూడా లేదు. 'ఆయ్యో ఖర్మమా' అని నిర్ఘాంతపోయి తల దురద పెడుతూవుంటే గోక్కుంది. గోక్కోవడంలో ఆ ఘనమైన గింజ వేళ్ళమధ్య చిక్కింది. ఎఱ్ఱగా కాగివుంది పెనము. గోళ్ళతో అట్లాగే తీసి ఆ పెనములో పడవేసింది ఆ విత్తును. హృదయాన్ని చింపుకొని ఏమో అయిపోయింది. కాని ఆ ధ్వని బయటికి రాకముందే మాడి మసి అయిపోయింది ఆ విత్తు.

–పొట్లపల్లి రామారావు – వచన సాహిత్యం నుండి

పొట్లపల్లి ప్రచురణల సౌజన్యంతో

ఫోన్: 040–23314033


## దక్కన్ ల్యాండ్

చందదారులుగా చేరండి! చందదారులను చేర్పించండి!

'ఎం.వేదకుమార్ సంపాదకత్వంలో ప్రజాఉద్యమాల వేదికగా ఆరంభమైన 'దక్కన్‌ల్యాండ్' తెలుగు సామాజిక రాజకీయ మాసపత్రిక అనతికాలంలోనే అన్ని వర్గాల ఆదరణ పొందింది. తెలంగాణ ఉద్యమకారులకు కరదీపికగా మారింది. ఈ పత్రిక మరిన్ని వర్గాలకు చేరడంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

**చందా వివరాలు:**

| | | |
|---|---|---|
| వార్షిక చందా | : | రూ. 200 |
| 2 సం॥లకు | : | రూ. 400 |

*'దక్కన్ ల్యాండ్' పేరిట ఎం.ఓ, మనీయార్డర్, చెక్ లేదా నగదు రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.*

**మా చిరునామా**

DECCAN LAND

**"CHANDRAM"** 490, St.No. 12, Himayatnagar

Hyderabad - 500 029. Mob: 9030626288

mail: deccanlandindia@ gmail.com, www.deccanland.com


# మరణ పరిమళం



నువ్వు నిశ్చలమైనప్పుడు
నీ పక్కన ఉన్నాను కదా
మరణ పరిమళం అంటుకుంది
చస్తూ... బతుకుతూ... నేను

నువ్వు అలంకరించుకుని తిరిగినప్పుడు
ఏమి తెలియలేదు
నువ్వు నిశ్చలమైనప్పుడు
నీ మరణ సౌందర్యం కదలించివేసింది

నిన్ను తనలో కలుపుకుంది కదా
అందుకే మృత్యువు నా ఆరాధ్య దేవత

ప్రపంచమంతా నీ నిశ్చల దేహాన్ని
దహనం చేసి మరచిపోయారు
ప్రతిక్షణం స్మరిస్తూ నాలో నీకు జీవం పోస్తున్నాను

నీ చిటికెన వేలునికూడా తాకలేదు
ఈ లోకం వేలు విడిచి వెళ్ళిపోయావ్

ఇక నువ్వీలోకంలోకి రాలేవని అంటున్నారు
పర్లేదు, నేను నీ లోకంలోకి రావొచ్చు కదా

–షాజహాన
m : 7799059494
e : shajahana74@gmail.com

# రైతు - రాజు

రైతు:

హలము పట్టను
పొలము దున్నను
నారు వేయను
నీరు పోయను
కంచె వేయను
మంచె కాయను
కాలు కదపను
వేలు ఊపను
చాలును ఈ శ్రమ ఓ రాజా!
చాలిక్కడికి ఓ రాజా!

రాజు:


హలము పట్టవా?
పొలము దున్నవా?
నారు వేయవా?
నీరు తోలవా?
కంచె వేయవా?
మంచె గాయవా?
నా రాజ్యంబిది ఓ రైతా!
నన్నెరుంగవా ఓ రైతా!

రైతు:

గుణనిధి రాజా!
కోపము వలదు
సర్వము తానై
జగము నేలెడి
గాలిని నీవా
కదల చేయుటలు?

వేడిమి ఇచ్చి
వెలుగును పంచి
భూమికి ప్రాణం
పోసే సూర్యుడు
నీ యాజ్ఞలనే
నింగి తిరుగునా?

పగలు రాతిరి
పచ్చని చేల
కష్ట సుఖముల
కంట జూచుచు
నీర మొసగెడి
నీలి మబ్బులు
నీ కనుసన్నల
నిలిచే
బంట్లా?




గాలిని
వెలుగును
కదపలేక ఇక
పాపము!
అసలే
పలకగ రాని
కరచిన పొడచిన
కదలగ లేని

మూగ ధరిత్రిని
ముష్కర సేనల
ఆక్రమించుకొని
అండ చేసుకొని
పాలన చేయుట
భాగ్యమె రాజా!

విచ్చల విడిగా
విశ్వము తిరిగె
గాలి వెలుగువలె
నేలయు కూడా
ఏరి దురాశకు
ఎరగా కుండిన

రాజులు లేక
రైతులు లేక
పాలక పాలిత
పక్షాల్ లేక
ఈ లోకం స్వ
ర్లోకం కాదా!

రాజు:

ఆగుము రైతా
ఆపుము కైతా
గాలి వెలుగుయని
గోల జేసెదవు

పంచ భూతముల
ప్రసక్తేలయట
మన్ను మన్నెయౌ
ఎన్నటికైనను
మట్టిపైన నా
పాలన ఏమిటి?

ప్రభుత యంతయును
ప్రజల మనుసుపై
ఈ మాటింకయు
ఈ వెరుంగవా?

రైతు:

ఓహో! రాజా!
ఓపిక కొంచెం
మట్టి లేనిచో
మనుషుల నీవు
ఏ విధంబుగా
ఏలెద వయ్యా

అవని నీదు హ
స్తాన నున్న నే
ప్రజలపై
నీ పరిపాలనము.

మట్టిని నీవు
ముట్టుకోనిచో
ఎవరికి రాజువు?
ఎవరికి ప్రజలు?

మట్టిలేక యిక
మనుషుల ఏలుట
ఎంతవారికో
యిల అది సాధ్యము

నిత్యము నీ సభ
నిన్ను పొగడ్తల
ఇంద్రుని జేసెడి
వందిమాగధుల
మాటలు నమ్మి
మైమరిచేవు

శునకమునైనను
కనక పీఠిని
కూర్చోపెట్టిన
గొప్ప చేసెదరు.

రాజులు పొందెడి
పూజలన్నియును
భూవిభు లేలెడి
భూములవే అవి.

నిష్ఠురమైనను
నెతి సత్యమును
నే నవలభించితి
నీ యిష్టంబిక.

ధనిక దరిద్రుల
తారతమ్యము
ద్రవ్యశక్తియే
తా కల్పించును
రాజా! ఇంక
చూచెద వేటికి?

కనక పీఠిని
కాల తన్నుము
నీ వారలలో
నీ వొకడౌదువు

కల్పిత భేదాల్
గంగ కలిసెనా
రాజులు లేక
రైతులు లేక
మానవజాతి
మహి సుఖియించును.

–పొట్లపల్లి రామారావు – సాహిత్యం (కవిత్వం)
పొట్లపల్లి ప్రచురణల సౌజన్యంతో
ఫోన్: 040–23314033

---

## పొట్లపల్లి రామారావు శత జయంతి సందర్భంగా...

ఇక తాజా సంచిక విషయానికి వస్తే, ....తెలంగాణ తొలితరం వేగుచుక్కల్లో ఒకరైన పొట్లపల్లి రామారావు శతజయంతి సందర్భంగా ఆయన విశిష్ట రచనలతో ఈ సంచికను ప్రత్యేకంగా రూపొందించి అందిస్తున్నాం. పొట్లపల్లి కథ, కవిత, నాటకాల ప్రత్యేకతను యథాతథంగా అందించడం ద్వారా ఆయన విశిష్ట రచనాశైలిని మరోమారు గుర్తు చేసుకొని అక్షర నివాళి అందించాలన్నదే ఈ విశేష సంచిక ఆకాంక్ష. పొట్లపల్లి ప్రచురణల నుండి ప్రచురించడానికి సహకరించిన శ్రీ పొట్లపల్లి వరప్రసాదరావుగారికి మా కృతజ్ఞతలు.

'దక్కన్ ల్యాండ్' మాసపత్రిక ప్రారంభించి ఐదేళ్ళు పూర్తయిన సందర్భంగా 60వ ప్రత్యేక సంచికను ఆగస్టులో అందించాం. అదే విధంగా కాళోజీ జయంతి నేపథ్యంలో విశేష సంచికను సెప్టెంబర్‌లో ముద్రించాం. తాజాగా అక్టోబర్ సంచికను పొట్లపల్లి రచనలతో విశిష్టంగా అందిస్తున్నాం. మా ఈ ప్రయత్నాన్ని మీ చేతుల్లో ఉంచుతున్నాం. అదే విధంగా ప్రపంచ తెలుగు మహాసభలను పురస్కరించుకొని డిసెంబర్‌లో ప్రత్యేక సంచికను తీసుకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. ఎప్పటిలా మీ అండదండలను కోరుకుంటూ .....


చందదారులుగా చేరండి! **దక్కన్ ల్యాండ్** చందదారులను చేర్పించండి!

'ఎం.వేదకుమార్ సంపాదకత్వంలో ప్రజాఉద్యమాల వేదికగా ఆరంభమైన 'దక్కన్‌ల్యాండ్' తెలుగు సామాజిక రాజకీయ మాసపత్రిక అనతికాలంలోనే అన్ని వర్గాల ఆదరణ పొందింది. తెలంగాణ ఉద్యమకారులకు కరదీపికగా మారింది. ఈ పత్రిక మరిన్ని వర్గాలకు చేరడంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

**మా చిరునామా**
DECCAN LAND
**"CHANDRAM"** 490, St.No. 12, Himayatnagar
Hyderabad - 500 029. Mob: 9030626288
mail: deccanlandindia@ gmail.com, www.deccanland.com

**చందా వివరాలు:**
వార్షిక చందా : రూ. 200
2 సం॥లకు : రూ. 400
'దక్కన్ ల్యాండ్' పేరిట ఎం.ఓ, మనీయార్డర్, చెక్ లేదా నగదు రూపంలో చందా మొత్తం చెల్లించవచ్చు.

# పాదధూళి (నాటిక)

## (స్వాతంత్రోద్యమంలో 'అస్సాం'లో జరిగిన ఒక సంఘటన ఆధారంగా-)

**పాత్రలు:** తల్లి, పిల్లవాడు, బాపు (గాంధి మహాత్ముడు), ఒక నాయకుడు, రెండవ నాయకుడు, ముఖ్ఖన్ లాల్, దులారీ రామ్, ఒక స్త్రీ, సుశీలా నయ్యర్.

**మొదటి రంగము**

(ఊరి బయట గుడిసె. గుడిసె మధ్య తడిక అడ్డం కట్టి ఉంటుంది ముందు వసారాలోంచి తల్లిలోనికి పోతుంది. తల్లి ఓ చినుగు గుడ్డ కట్టుకొని ఉంటుంది. ఎప్పుడో, సిరులనుభవించినట్టు ఆమె మోము గంభీరంగా ఉంటుంది.

తొమ్మిదేళ్ల పిల్లవాడు పడుకొని నిద్రపోతూ ఉంటాడు. పట్టుదలగల ముఖంలా కనపడుతుంది. ఉదయం ఏడుగంటల వేళ)

తల్లి : నాయనా! (పిల్లవాడు కదలడు)

తల్లి : అబ్బాయి! (జవాబివ్వడు)

తల్లి : నాయనా! లేరా (చెంపకు చేయివుంచి కదిలిస్తుంది)

పిల్లవాడు : ఏమిటమ్మా? (పడుకునే కసురుతాడు)

తల్లి : తెల్లవారింది రా!


పిల్లవాడు : తెల్లవారితే యేం నిద్రపోనీయవూ.

తల్లి : అయ్యో మాట చెపుతా!

పిల్లవాడు : ఏమిటమ్మ మాట! నిద్రపోయి లేవనీయ్

తల్లి : అయ్యో!... నాయనా (నిరాశగా అంటుంది)

పిల్లవాడు : నిద్రపోనీయక 'నాయనా.... నాయనా'.




తల్లి : ఒక్క మాటవిని పడుకోరాదురా.

పిల్లవాడు : ఊహు...

తల్లి : అయ్యో...

పిల్లవాడు : నన్ను పడుకోనియ్యవూ, (కోపంతో)

తల్లి : ఇంత కోపమైతే ఎట్టాగురా?

పిల్లవాడు : నిద్రపోనీయక కోపము...

తల్లి : ఈ రోజు ఇక్కడికి...

పిల్లవాడు : సరే...పో

తల్లి : చూడు?

పిల్లవాడు : నీ పుణ్యముంటుందమ్మా కొంచెం పడుకోనీయి.

తల్లి : ఇదెక్కడి నిద్రరా... మొద్దునిద్ర! ఊరంతా మేల్కొంది... ఇదంతా ఏమిటో కొంచెం లేచి చూడు!

పిల్లవాడు : చాల్లే పో!

తల్లి : బాపూజీ వస్తారు నాయనా! ఈ రోజు మనవూరు! (పిల్లవాడు చకితుడై లేస్తాడు)

పిల్లవాడు : బాపూజీ!

తల్లి : అవును నాయనా! ఏమనుకున్నావు!

పిల్లవాడు : ఇక్కడికా!

తల్లి : అవును ఇక్కడికి. మన గ్రామానికి మన లోగిళ్ళలోకి... మన మధ్యకు.

పిల్లవాడు : మన ఇంటికి గూడానా అమ్మా!

తల్లి : మన ఇంటికా నాయనా! శుష్కదరిద్రులం... దొంగలుపడ్డ ఇల్లు మనది. మనల్ని ఎవరడుగుతారు నాయనా! ఆ మహాత్మునికి అర్పించడానికి మన చేతిలో ఏముంది చెప్పు! పోనీ ఆ మహానుభావునికి మనం ఏం తెలుసు!

పిల్లవాడు : దేశంకోసం అన్నీ అర్పణచేసిన మనబోటివాళ్ళను విడచి, సేట్ దులారి రామ్, ముఖ్ఖన్‌లాల్ ఇంటికి వెళుతాడమ్మా బాపూ?

తల్లి : మన త్యాగాలు ఒక లెక్కలోనికి రావు నాయనా! ఈ ఊరి నాయకులు, రోజు పెట్టెల్లో దాచివుంచిన ఖాది బట్టలు వేసుకొని మహాత్యాగుల్లాగా ఊరంతా ఎంత తాపత్రయంతో తిరుగుతున్నారో... పందిళ్ళు! పాకలు! ద్వారాలు! తోరణాలు!...

పిల్లవాడు : బాపూను పూనా జైల్లో పెట్టినప్పుడు వీళ్ళేకాదమ్మా అధికారులకు ఆశ్రయమిచ్చి మనయిళ్ళు దోయించింది?

తల్లి : అవును నాయనా! కాని ఆ బాపూకు ఏం తెలుసు ఈ తెరచాటు సంగతులు వీళ్ళ గౌరవం, మర్యాద, మాట, మన్నన, భయం, భక్తి, ఎవళ్ళకొస్తాయి. రోజు వీళ్ళు పూనుకోకపోతే బాపూను ఆహ్వానించేది ఎవరు? పోగా వాళ్ళను కాదని ఆ మహానుభావుడి దగ్గరికి పోయి ఈ సంగతులు చెప్పేవారెవరు?

పిల్లవాడు : బాపూ బీదవాళ్ళతో ఉంటాడుగా అమ్మా! ఏం! మన ఇంట్లో ఎందుకు దిగకూడదు?

తల్లి : మనయిల్లా నాయనా! ఆయన పాదధూళి దొరికినా చాలు మనకు.

పిల్లవాడు : పాదధూళా అమ్మా! బాపూజీని ఆహ్వానిద్దామమ్మా మన ఇంటికి!

తల్లి :నీ మాట ఎవరు వింటారు నాయనా. దులారిరామ్, ముఖ్ఖన్‌లాల్ వాళ్ళ మాటె చెల్లుబడి అవుతుంది.

పిల్లవాడు : వీళ్ళు వినకపోతేమానె, బాపు వినడమ్మా?

తల్లి : ఆయన దగ్గరికి ఎవరు పోనిస్తారమ్మా నిన్ను?

పిల్లవాడు : నేనే పోతాను... దులారిరామ్, ముఖ్ఖన్‌లాల్ వాళ్ళంతా పోయినట్టే నేనూ పోతాను.

తల్లి : లాఠీలు తీసుకొని ఆయనచుట్టూ మన షాహుకారు అనుచరులంతా నిలబడతారు. పోయినా నిన్ను నెట్టివేస్తారు. ఈ అవమానమెందుకు బాబూ!

పిల్లవాడు : ఇప్పుడు మనకున్న గౌరవమేమిటమ్మా? అయినా బాపు దర్శనం కోసం పోయినప్పుడు ఎవడైనా నెట్టివేస్తే దానిని లెక్కచేయకూడదమ్మా.

తల్లి : నాయనా...తండ్రిలేని పిల్లవాడివి. చూడు! పైగా ఆ షాహుకారు మనపై ఏమంత ఇదిగా లేడు.

పిల్లవాడు : వాళ్ళతో నాకెమి అక్కరమ్మా! బాపూతో నాకు పని.

తల్లి : బాపూను ఏమనుకున్నావు నాయనా! రాజాధిరాజులు ఆయనతో సంభాషిమచలేరు.

పిల్లవాడు : రాజాధిరాజులతో బాపూకు పనిలేదు. నిజమే...కాని బాపు బీదవాళ్ళతో ముచ్చటపడతాడు... నవ్వుతాడు, ఆడుకుంటాడు. ఆ రోజున పత్రికలో నుంచి కత్తిరించిన బొమ్మేది? దాంట్లో బాపూ కూలి అబ్బాయిని ఎత్తుకొని నవ్వడం లేదా?

తల్లి : నిజం.. నాయనా.. కాని

పిల్లవాడు : ఫరవాలేదమ్మా! అన్నీ అనుమానాలు నీకు.

తల్లి : సాహసం ఎందుకు తండ్రీ... అందని పండ్లకు ఆశపడటం దేనికి?

పిల్లవాడు : అందని పండు అయితే మన మధ్యకు ఎందుకొస్తాడు బాపు?

తల్లి : మన సేట్ దులారిరామ్ వాళ్ళు పిలిచారు.

పిల్లవాడు : నీకు దులారిరామ్ పిచ్చి పట్టుకుంది... వీడెవడమ్మా! వీడి కొంప పోయిందా? గోడుపోయిందా? వీడు తుపాకులకు రొమ్మిచ్చి ఎదురు నిలబడ్డాడా? మనబోటి ఆర్తుల, దీనుల దు:ఖితుల చూడటానికి వస్తున్నాడమ్మా బాపూ. లేకపోతే ఈ సేట్ కన్న పెద్ద బొడ్డ కలవాళ్ళు బాపూకు దొరకకపోరు.

తల్లి : బాపూను ఎట్లాగూ నేను చూడలేను. కొంచెం ఆయన పాదధూళి తెచ్చి పుణ్యం కట్టుకో నాయనా!

పిల్లవాడు : నీకు వెర్రిలేచిందేమొ అమ్మా!

తల్లి : అవును నాయనా, వెర్రే. వెర్రి కాకపోతె ఇంకేముంది? నిన్ను అన్ని విధాల పెంచి పెద్దజేసి విద్యాబుద్దులు నేర్పవలసిన మీ నాన్నను పోగొట్టుకున్నాను. నిన్ను మరిపించే నీ ఎత్తు కొడుకును దేవుడు ఎత్తుకుపోయాడు. ఆస్తిని దొంగలు దోచుకుపోయారు. కొంప బూడిద అయ్యింది. ఇక వెర్రిలేవక ఏమౌతుంది?

పిల్లవాడు : అమ్మా..ఊరుకో...మన బాపూకు ఇవన్నీ చెపుతాను

తల్లి : నిజమే... నాయనా..బాపు!

పిల్లవాడు : మనబోటి నీడలేని వాళ్ళందరికీ తండ్రి, బాపు.

తల్లి : నిజము... నాయనా... నీకన్నీ వయసుకు మించిన ఆలోచనలే... పెరిగి పెద్దయి నాలుగు కాలాలపాటు చల్లగా బతకాలె.

పిల్లవాడు : ఇక మనం బాగానే బతుకుతాము!

తల్లి : నీ మాటలు విని నాకు ధైర్యం వేస్తుంది. మీ నాన్న ఇంతే. ఎంత సంకటాల్లో ఉన్నా ఇట్లాగే మాట్లాడే వాడు.

పిల్లవాడు : అమ్మా! నీ మీద కిసాను నిద్రలేపావని.

తల్లి : ఫర్వాలేదు తండ్రీ.

పిల్లవాడు : నాకు మొదట చెప్పలేదేం?

తల్లి : నిద్రపోయేవాళ్ళు అట్లాగే చేస్తారులే.

పిల్లవాడు : అమ్మా నేను బయటకి పోతా.

తల్లి : నాలుగు బియ్యపుగింజలు వేస్తాను. ఒక ముద్ద నోట్లో వేసుకొని వెళ్ళు తండ్రి.

పిల్లవాడు : ఇవాళ నాకు ఆకలి అనిపించడం లేదమ్మా.

తల్లి : మళ్ళీ ఎంత పొద్దుపోతుందో.

పిల్లవాడు : పోనీ... ఆకలి లేనిది...!

తల్లి : పోయిరా బాబూ! కాని బాపు పాదధూళి మరువకు తండ్రి.

పిల్లవాడు : వెర్రిదానివి... అంత మతిమరపు వాడినా అమ్మా నేను!

తల్లి : బైట సందడిలో పడితే ఏమో నాయనా!

**<u>రెండో రంగము</u>**

(ఊరు ఉత్సాహ తరంగితమై ఉంటుంది. ఊరిజనం ఊరిబయట బాపూకోసం గుమిగూడి వుంటారు. స్వచ్ఛమైన ఖాదీ దుస్తులు ధరించిన స్వయం సేవకులు జనాన్ని సర్దుతుంటారు. దులారిరామ్, మఖ్ఖన్‌లాల్ సన్మానపు పందిట్లో పూల మాలలు అలంకరిస్తుంటారు. ఇంతలో 'బాపూ, బాపు' అని కేకలు వినిపిస్తాయి. జనసమూహం అంతా ఓ కెరటంలాగ లేచి ఊళ్ళోకి వస్తున్న మోటారు పై పడతారు. బాపు మోటారులో నుండి చిరకాలపు మిత్రులకు మధ్యకు వచ్చినట్టు బోసి నవ్వులతో భాస్వంతమైన తేజంతో, జన సమూహంలో నుంచి దారి చేసుకొని బయటికి వస్తాడు. మఖ్ఖన్‌లాల్ మొదలైన వాళ్ళు దండలు వేస్తారు. ప్రజలు "మహాత్మాగాంధీకీ జై" అంటూ ఆహ్వానిస్తారు. బాపూ తొణకడు, నవ్వుతుంటాడు. పిల్లవాడు జన సమూహం కోలాహలానికి, తొందరపాటుకు ఉక్కిరి బిక్కిరి అవుతూ బాపూను చేరడానికి తాపత్రయపడ్తుంటాడు.)

బాపు : కాల్పులు జరిగింది ఇక్కడేనా?

మఖ్ఖన్‌లాల్ : అవును బాపూ! ఇక్కడే ఘోరహత్యలు జరిగాయి... ఎంతోమందిని... రామ రామ... ఆ దృశ్యం తలుచుకుంటే..

బాపు : నడవండి!

(బాపు ముందు ఆయన వెనక జనసమూహం నడుస్తుంటారు. పిల్లవానికి జనంలో నుంచి ముందుకు సందు దొరకదు)

పిల్లవాడు : నన్ను కొంచెం ముందుకు పోనీయండి.

ఒక నాయకుడు : ఎవడు వీడు?(పిల్లవాడు వినిపించుకోడు)

రెండవ నాయకుడు : అరె ఎక్కడికి?

ఒ.నా. : ముందు యేమున్నదని వురుకుతున్నావ్?
(పిల్లవాణ్ణి వెనుకకు నెట్టివేస్తారు. పిల్లవాడు మళ్ళీ ముందుకు పోతాడు)
రెం.నా. : అరె...ఏమి చేస్తావురా? (చేయిపట్టి ఆపుతాడు)
ఒ.నా. : నెట్టేయండి! (పిల్లవాడు వినిపించుకోకుండా జనంలో నుంచి ముందుకు పోయి బాపు పాదధూళి అందుకోబోతాడు)
రెం.నా. : అరేయ్ వెనక్కురా!
ఒ.నా. : తోసేయండి!... ఎవడు వీడు?
రెం.నా. : చచ్చిపోతావు! వెనక్కు పోవేం రా!
(రెండో నాయకుడు కుర్రవాణ్ణి లాగి వెనక్కు తీసుకుపోతాడు. కుర్రవాడు మరో పక్కనుంచి బాపు అడుగులు చూస్తూ సమయం చిక్కిందని తోచగానే ముందుకురికి ధూళి ఎత్తుకోబోతాడు)
ఒ.నా. : 'అరె వీడు చస్తాడు! ఎవడో వీడు!'
రెం.నా. : ఏమిరా అబ్బాయ్! నీకు కాదురా చెప్పేది!
ఒ.నా. : అరె తొక్కుతున్నార్రా!.. వీడు చస్తాడు.
రెం.నా. : తొక్కనీయ్! చేయో, కాలో విరిగితే కాని బుద్ధిరాదు.
(జన సమూహం కాళ్ళ క్రిందనుండి ఎట్లాగో నలిగిన చేయి బయటికి తీసుకుంటాడు)
ఒ.నా. : మంచి పనయింది... బుద్ధి వచ్చిందా?
రెం.నా : ఇక వెళ్ళు... మళ్ళీ చెయ్యి పెడితివా ముక్కలైపోతుంది!
ఒ.నా. :ముక్కలు కాదు... తొక్కడంలో నుసి అవుతావ్!
(పిల్లవాడు ఇవేమీ వినిపించుకోక, బాపు కాళ్ళు చూస్తూ నడుస్తుంటాడు. బాపు వెనక కొంచెంమేర ఖాళీ ఏర్పడుతుంది. పిల్లవాడు వెంటనే బాపు పాదాల గుర్తులపై పడతాడు)
ఒ.నా. : అరేయ్! కాళ్ళలో పడ్డాడు వెధవ!
రెం.నా. : మళ్ళీ చేరాడు?... అరేయ్ నా కాలు చేయిమీద పడ్డది లే... లే.
ఒ.నా. : చావనీయి వెధవని.
రెం.నా. : ఆగండి... ఆగండి కాస్త చూడండి కుర్రవాడు.
ఒ.నా. : చచ్చిపోతాడు.
పిల్లవాడు : (ఊపిరి తిరగదు) బాపూ! బాపూ!
బాపు : ఎవరు?
మఖ్ఖన్‌లాల్ : ఎవడో కుర్రవాడు జనం మధ్యకు వచ్చినట్టున్నాడు.
(పిల్లవాడు 'బాపూ' అని మూల్గుతుంటాడు)
బాపు : తొక్కి వేసినవారు? ఏది? ఎవరు?
మఖ్ఖన్ : బాపూ! తాము ఉండండి నేను పోయి వస్తాను.
బాపు : అక్కరలేదు... నేను పోతాను.
(జన సమూహం మధ్యకు పోతారు)
బాపు : ఎవరు?
దులారి : ఎవడో ఇక్కడవాడే (మఖ్ఖన్‌లాల్‌తో మెల్లగా) శ్యామ్ కొడుకు.
మఖ్ఖన్ : వాడికేంపని ఇక్కడ?
బాపు : ఏడి?
(బాపు పిల్లవాని దగ్గరికి పోతాడు మనుషుల పాదాలు పడడం వలన పిల్లవాడి చేతులు నలిగి రక్తం కారుతుంది. శరీరం ధూళితోను నిండి ఉంటుంది. పిల్లవాడికి స్పృహతప్పి పోతుంది.)
బాపు : చంపారా?
సుశీలానయ్యర్ : లేదండి... కొంచెం పొట్టకు ఎక్కడో దెబ్బ తగిలినట్టుంది.
బాపు : అదేమిటి? చేతులు చితక తొక్కారు! మెల్లగా రాగూడదూ!
సుశీల న. : వేళ్ళు కొంచెం నలిగాయండి.
బాపు : కొంచెమేమిటి! రక్తం కారుతుంటే.
(పిల్లవాడు కళ్లు కొద్దిగా తెరుస్తాడు హఠాత్తుగా బాపు ఎదుట కనిపించేసరికి పిల్లవాడు పోయిన ప్రాణాలు వచ్చినట్లు లేవబోతాడు)
బాపు : ఎక్కడికి లేస్తావు!
పిల్లవాడు : బాపూజీ!
బాపు : ఏమబ్బాయి? ఉండు కొంచెం కూర్చో!
పిల్లవాడు : (లేస్తాడు) నమస్తే, బాపూజీ.
బాపు : (నమస్తే అంటాడు) జాగ్రత్తగా నడవాలబ్బాయ్!
పిల్లవాడు : క్షమించండి బాపూ! మీరు కొంచెం అటు జరుగుతారా?
బాపు : ఎందుకు? ఏమైనా పోగొట్టుకున్నావా?
(బాపు రెండడుగులు వెనకకు వేస్తాడు. పిల్లవాడు వంగి ఆయన పాదధూళి చొక్కాలోకి తీసుకుంటాడు)
బాపు : ఇదేమిటబ్బాయ్?
పిల్లవాడు : అయిపోయింది బాపూ!
బాపు : దీనికోసమే జనం కాళ్ళక్రింద పడ్డావా?
పిల్లవాడు : లేదు బాపూ!
బాపు : వేళ్ళు రక్తం కారుతున్నాయి. కట్టు వేసుకో ముందు.
పిల్లవాడు : రక్తం ఇక కారదు బాపూ! అయిపోయింది.
బాపు : గాయంలో మట్టి చేరుతుంది.
పిల్లవాడు : మట్టి అంటితె ఊరకె మానిపోతుంది బాపు.
బాపు : ఇప్పుడు తెలివి తప్పినట్లుంటివే?
పిల్లవాడు : మీ మాట వినగానే తెలివి వచ్చింది బాపూ!
బాపు : సుశీలాజీ! అబ్బాయిని కొంచెంచూడు. వ్రేళ్ళు చితికిపోయినయ్!
సుశీలాజీ : మంచిది బాపూ.
బాపు : అబ్బాయీ మీది ఏ గ్రామం?
మఖ్ఖన్ : ఈ రగామస్థుడేనండి.
ఒకడు : ఇతని తండ్రినే కాల్చారండి పోలీసులు.
బాపు : ఏ మబ్బాయ్?

పిల్లవాడు : అవును బాపూ!
బాపు : అబ్బాయ్ నాతోరా: కట్టు కట్టుకొని పోదువు.
(అబ్బాయి నలిగిన చేయిపట్టుకొని నడుస్తుంటాడు)
బాపు : ఎవరున్నారబ్బాయి నీకిప్పుడు?
పిల్లవాడు : అమ్మ ఉంది.
బాపు : నీవొకడవేనా?
పిల్లవాడు : అన్నయ్యను కాల్చారండి.
బాపు : రక్తం చుక్కలు పడుతున్నాయి చూడు! త్వరగా నడు! అన్నను కాల్చారు కదూ?
పిల్లవాడు : నయమైపోతుందండి ఇప్పుడు.
ఒకడు : అంతేకాదండి, ఇల్లు తగుల బెట్టారండి.
బాపు : ఇల్లు కూడా! ఎక్కడవున్నారబ్బాయ్! ఇప్పుడు?
పిల్లవాడు : ఊర్లోనేనండి.
బాపు : అదికాదు. ఇల్లుపోయింది కదా, ఎక్కడ వుంటున్నారు?
పిల్లవాడు : ఊరిబయట పాకవేసుకున్నామండి.
(ఇంతలో సేటు బాబు రెండు అంతస్థుల మేడవస్తుంది. బాపు ఆ ఇంటివంక ఓ చుపు చూచి తలవాల్చు కుంటాడు.)
బాపు : సేట్ సాబ్! వీళ్ళు వూరిబయట వున్నారా?
మఖన్‌లాల్ : అవునండి... ఎంతో చెప్పాను ఊళ్ళో వుండమని. నా గది ఒకటి చూపించాను.
బాపు : ఏమబ్బాయ్?
పిల్లవాడు : అవునండి వారికే ఇరుగ్గా వుందని బయట పాకవేసుకున్నామండి.
బాపు : ఇరుకా!
(భవనంవంక మరొకసారి చూస్తాడు)
మఖన్‌లాల్ : తమకిక్కడే బస.
బాపు : అబ్బాయ్! మీ పాక ఎక్కడ?
పిల్లవాడు : ఊరిబయట బాపూ! సేట్‌సాబ్! నేను ప్రస్తుతానికి అబ్బాయి పాకలోనే బస చేస్తాను. నీఇంట్లో దిగనందుకు క్షమించు.
మఖన్‌లాల్ : బాపూ! బాపూ!
బాపు : అబ్బాయ్! నడవమ్మా!
పిల్లవాడు : బాపూ! సేట్‌సాబ్ చాలా శ్రమపడ్డాడు.
బాపు : నీకెందుకది?
పిల్లవాడు : మా ఇంట్లో ఎట్లా వుండగలవు బాపు? కూచోను చింకి చాపైనా లేదే.
బాపు : నాకు తెలుసు. ఎక్కడెట్లా ఉండాలో.
మఖన్‌లాల్ : మా అపరాధాన్ని క్షమించండి.
బాపు : నీ అపరాధమేముందీ! వెర్రివాడ!
సుశీలాజీ : అబ్బాయీ! నీ చేతికి కట్టు వేసుకో మొదట.
బాపు : అవును.. వెళ్ళు!
పిల్లవాడు : పోతున్నా బాపూ.

**మూడో రంగం**

(గుడిసెలో పిల్లవాడి తల్లీ, మరో స్త్రీ మాట్లాడుకుంటుంటారు. వాళ్ళిద్దరి గొంతులు సంతోషంతో ఉప్పొంగుతుంటాయి.)
స్త్రీ : అమ్మా! ఊరంతా సేట్‌సాబ్ యింటిముందు మూగివుంది
తల్లి : ఏమి భాగ్యమమ్మా! నాకు కళ్ళతో చూచే అదృష్టం లేదు.
స్త్రీ : అంతటి మహానుభావుడు మన ఊళ్ళో కాలు పెట్టాడంటే అది మన అదృష్టమే.
తల్లి : ఎన్నడో మన గ్రామం చేసుకున్న పుణ్యం!
స్త్రీ : కాని ఈ పాడుజనం యెవరో ఓ కుర్రవాణ్ణి తొక్కివేశారట.
తల్లి : అయ్యో! మా పిల్లవాణ్ణి కాదుగదా?
స్త్రీ : ఏమోనమ్మ! తెలివి తప్పిపోయిందన్నారు.
తల్లి : వీళ్ళకెందుకు మతులు లేవు. నెత్తిన కళ్ళు పెట్టుకొని పోతారా?
స్త్రీ : ఒక్కడికీ తనువుమీద స్పృహ వుంటేనా! అంతా వెర్రియెత్తినట్టు ఉరికారుఈ
తల్లి : ఏమిటో తల్లీ! నాకు భయం వేస్తూంది. అందరిని పోగొట్టుకొని ఒక్కణ్ణి మిగుల్చుకున్నాను. వాడి బ్రతుకు అమదరికీ కంటకంగా ఉంది.
స్త్రీ : అబ్బో! మీ కుర్రవాడు అంత అజాగ్రత్తగా పోయేవాడు కాదమ్మా.
తల్లి : ఏమోనమ్మ, ఇంకా రాలేదుచూడు!
స్త్రీ : ఇవాళ ఎవరికీ తిండిమీద ధ్యాస లేదు.
తల్లి : మావాడు నోట్లో నీళ్ళుకూడా పోసుకోలేదు.
స్త్రీ : ఊరివాళ్ళు మాత్రం! తిండి తిప్పలు మతికి రాకుండా చిరునవ్వుతో మంత్రించేటట్లు వున్నాడాయన.
తల్లి : యింట్లో కూర్చున్ననాపని చూడరాదూ! నాలుగు మెతుకులు నంజుదామంటే, ఎందుకో నాకు ఆకలే లేకుండా పోయింది. నామనసు ఎక్కడో ఉంది.
స్త్రీ : అదిగో, ఆ కోలాహలం యిటె వినపడుతున్నది.
తల్లి : పిల్లవాణ్ణి జ్ఞాపకం చేసుకుంటే నా మనసు, మనసులో ఉండడంలేదు. నీవేదో చెప్పితివే!
స్త్రీ : ఎందరు పిల్లలు లేరమ్మా!
తల్లి : ఏమోనమ్మా వాడు వచ్చేవరకూ నాకు,
(ఇంతలో 'అమ్మా...' అని కుర్రవాడు పరుగెత్తుకు వస్తాడు)
తల్లి : వచ్చావు నాయనా?
స్త్రీ : ఇదుగోనమ్మ నీ కొడుకు.
పిల్లవాడు : ఏమిటమ్మ! .... వచ్చాను.
తల్లి : ఏమినాయనా, ఏమిచేశావు?
పిల్లవాడు : ఏమిటమ్మ?
తల్లి : అయ్యో, నాయనా – పాదధూళి?
పిల్లవాడు : క్షణమాగమ్మా?

తల్లి : నిమిషమైతే మన యిల్లంతా ఆయన పాదధూళి నిండుతుంది.

తల్లి : ఇదేమిటి నాయనా?

పిల్లవాడు : బాపు వస్తున్నాడమ్మా మన యింటికి.

తల్లి : బాపూ! నాయనా! అయ్యో! మన ఇంటికి? విధీ! ఆయన ఎదురుగా ఎట్లా పోను!

పిల్లవాడు : ఏమిటమ్మా వెర్రి?

తల్లి : వెర్రినాయనా! చినుగు గుడ్డతో ఎట్లాపోను ఆయన ఎదటికి?

పిల్లవాడు : అదిగో! ఇంటి ముందుకు వచ్చారు.

తల్లి : అయ్యో! విధీ! నాయనా! ఆ చేతి కేమిటి? నేను చూడనే లేదు!

పిల్లవాడు : ఏమీ లేదమ్మా, గడపలోకి వచ్చారు.
(తడక వాకిలి నుంచి వసారా లోనికి ఉరికి, బాపూ ముందు చేతులు మోడ్చి నిలబడతాడు)

బాపు : అబ్బాయ్! మీ అమ్మ ఏది?

పిల్లవాడు : వెంటనే చాప పరుస్తాడు. ఉంది బాపూజీ!

బాపు : కనపడదేమి?

పిల్లవాడు : లోన ఉంది.

బాపు : ఏమీ? బయటికి రాదూ? (పిల్లవాడి కండ్లలోకి నీరు వస్తుంది)

బాపు : ఏమబ్బాయీ?

పిల్లవాడు : అమ్మ ఇక్కడికి రాలేదు బాపూజీ!

బాపు : ఘోషా అబ్బాయ్ మీకు?

పిల్లవాడు : కాదండి.

బాపు : మరి ఏమిటి? (చెప్పడానికి సంశయిస్తాడు)

బాపు : చెప్పు నాయనా!

పిల్లవాడు : పైన గుడ్డ లేదండి!

బాపు : గుడ్డ లేదూ! ఇదుగో నా వంటిపైది.

పిల్లవాడు : వద్దు బాపూ!

బాపు : తీసుకపో అబ్బాయ్!

(పిల్లవాడు అంగవస్త్రం తీసుకొని లోనికి పోతాడు. బాపు మౌనముద్రాంకితుడై గంభీరమైన ఆలోచనతో నిలబడి పోతాడు. ఆ మర్మాంతిక ఆవేదనను అనుభవిస్తున్న ప్రజలు నిశ్శబ్దంగా నిలబడతారు. ఇంతలో అంగవస్త్రం చుట్టుకొని సంతోషంతో వణుకుతూ వచ్చి బాపు పాదాలపై పడుతుంది తల్లి)

బాపు : అమ్మా!... లే, (తల్లి ఏడుస్తుంది)

బాపు : ఫరవాలేదు. ఇవాళ నీ దర్శనమైనందుకు ఎంతో గర్వపడుతున్నా

తల్లి : ఎందుకు బాపూ పాపురాలిని?

బాపు : అట్లా అనుకోవద్దు... నీవంటి వీరమాతల, వీరపత్నుల చూచి దేశం గర్వపడాలి.

(బాపు సేట్ వంక ఓమారు చూస్తాడు. సేట్ ఆ చూపుకు తాళలేక బాపూ కాళ్ళమీద బోరగిలబడుతాడు)

మఖ్ఖన్‌లాల్ : నా తప్పు మన్నించండి బాపూ! మీ ఆత్మను తెలుసుకోలేదు.

బాపు : నా ఆత్మా! (నవ్వుతాడు) ఇకరా అబ్బాయి కట్టు ఏది? (చూస్తాడు) నయమైపోతుంది ఫరవాలేదు.

పిల్లవాడు : ఎప్పుడో పోయింది బాపూ

బాపు : చాలా గట్టివాడు!

మఖ్ఖన్‌లాల్ : నిజం బాపూ

బాపు : వృద్ధిలోకి వస్తాడీ కుర్రవాడు!

తల్లి : మీ దయ!

(1942 మహోద్యమము నాటిది ఈ ఘటన. అస్సాం పల్లె ప్రాంతంలో ఒక ఇంటిని నిలువున దోచుకున్నారు పోలీసులు. గాంధీజీ ఆ ప్రాంతాల్లో సంచారం చేసినపుడు ఆ కుటుంబంలో మిగిలిన తల్లి, పిల్లవాడు, వాళ్ళ విషాద జీవితం బయటకొచ్చింది. మఖ్ఖన్‌లాల్, దులారిరామ్ నాటికలో కల్పిత వ్యక్తులే ఐనా ఇలాంటి నేర్పరులు మన రాజకీయ రంగంలో చాలామంది ప్రవేశించారు.)

ప్రచురణ: అభ్యుదయ, ఆగస్టు 1948

**-పొట్లపల్లి రామారావు - వచన సాహిత్యం**
**నాటిక విభాగం నుండి**
**పొట్లపల్లి ప్రచురణల సౌజన్యంతో**
**ఫోన్: 040-23314033**

## దారి



**నిరంతర ప్రవాహమే !**
**అడుగులు జలపాతాల్లా**
**గల గల సాగుతుంటాయి !**
**వాహనాల పరుగు**
**సంగీత ఝరిలా సాగుతుంది !**
**ఒకదారికి ఎన్నెన్నో అడ్డదారులు !**
**ప్రతిదారికి ఓ గమ్యం వుంటుంది**
**ఏ గమ్యం వైపు వెళ్లే వాళ్ళు**
**ఆ గమ్యం వైపే వెళ్తుంటారు**
**దారి ఓఅనుభూతుల జీవనది !**
**ప్రయాణికులకే ఆ అనుభూతులు తెలుస్తాయి !**
**అవి జ్ఞాపకాలుగా వెంటాడుతుంటాయి !**
**దారులు కూడా రక్తాలతో**
**అభిషేకం చేసుకుంటాయి !**
**అతివేగమే దానికి తార్కాణము**
**ప్రయాణికుడికి ఒల్లంతా కళ్ళుంటే**
**దారి ఓ స్వర్గ ధామమే !!**

**-ఆకుల రాఘవ** , m : 9440971792
e : akularaghavadirector@gmail.com




## రాద్ధాంతం

## పరిశోధనకు అడ్డంకి

చరిత్రకారులకు సామాజిక పరిశోధన పరిధి విస్తృతంగా ఉంటుందని, కానీ పరిశోధకుల భావ ఘర్షణను కూడా భౌతిక ఘర్షణగా మార్చివేశారని ప్రొఫెసర్ హర గోపాల్ ఆందోళన వ్యక్తంచేశారు. ప్రతి విషయంలో ప్రజలు తలదూర్చి తమ మనో భావా లను, ఆత్మగౌర వాన్ని దెబ్బతీశారని రాద్ధాం తం చేస్తూ పోతే సామాజిక పరిశోధనలపై చర్చను ముందుకు తీసుకెళ్లలేమన్నారు. హైదర్‌గూడలో పౌర హక్కుల సంఘం తెలంగాణ అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నారాయణరావు తదితరులతో కలిసి హరగోపాల్ మాట్లాడారు. కంచ ఐలయ్యను చంపుతామంటూ వస్తున్న బెదిరింపులు అప్రజాస్వామికమన్నారు. గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఐలయ్యపై బెదిరింపులు, భౌతిక దాడులకు పాల్పడేలా కుట్ర పన్నిన వారిపై చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న

## ఎన్ఎంఆర్‌లను క్రమబద్ధీకరించాలి

ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న నాన్ మస్టర్ రూల్(ఎన్ఎంఆర్), క్యాజువల్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని మాజీ ఎమ్మెల్సీ, ప్రొ.కె.నాగేశ్వర్ డిమాండ్ చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఎన్ఎంఆర్, క్యాజువల్, మినిమమ్, టైంస్కేల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఐకాస ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఒప్పంద కార్మికులకు జీతాలు పెంచుతూ, ఈఎస్ఐ, పీఎఫ్ కూడా అందజేస్తుందని.. కానీ ఎన్ఎంఆర్, క్యాజువల్ ఉద్యోగులకు మాత్రం వేతనాలు పెంచకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు ఐదు వేల మంది వివిధ ప్రభుత్వ శాఖల్లో మూడు దశాబ్దాల నుంచి పనిచేస్తున్నారని, వారికి ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు ఈఎస్ఐ, పీఫ్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఐకాస ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, పద్మశ్రీ, కుమారస్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అక్రమాలపై విచారణ చేపట్టాలి

ఇంటర్ బోర్డు కమిషనరేట్‌లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ప్రభుత్వం విచారణ చేపట్టాలని తెలంగాణ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఫర్ జస్టిస్ డిమాండ్ చేసింది. బోర్డులో దళిత ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించింది. కమిటీ కన్వీనర్ మహ్మద్ ఇస్మాయిల్, వర్కింగ్ కన్వీనర్ ప్రవీణ్‌కుమార్, అఖిల భారత దళిత సేన అధ్యక్షులు జేబీ.రాజు తదితరులు సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో తమ డిమాండ్లతో కూడిన కరపత్రాన్ని విడుదల చేశారు. సాధారణ బదిలీలపై నిషేధం ఉన్నా ఉన్నత వర్గాల వారికి బదిలీలు కల్పిస్తున్నారని ఆరోపించారు. సమా వేశంలో డా.ఎ.ఖాన్, ఎస్.కైలాసం, మహ్మద్ ముజీవుద్దీన్, నంద కుమార్, సీహెచ్‌యాదగిరి, ప్రమీళ, సీహెచ్. గోపాలకృష్ణ ఉన్నారు.

## సమాచార హక్కు చట్టంపై

## అవగాహన కల్పించాలి

సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని మాజీ ఎమ్మెల్సీ ప్రొ.కె.నాగేశ్వర్ అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం(టీపీఎస్‌కే)లో పీపుల్స్ ఫోరం ఫర్ ఇన్ఫర్మేషన్ (పీఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తొలి రాష్ట్ర సదస్సు- ఆహ్వాన సంఘం సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన నాగేశ్వర్ మాట్లాడుతూ...స.హ చట్టం ఉపయోగించుకోకుండా ఉండే విధంగా పాలన సాగాలన్నారు. ఈ చట్టం ప్రతి ఒక్కరికీ వజ్రాయుధం లాంటిదన్నారు. పీఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పార్థసారథి మాట్లాడుతూ పీఎఫ్ఐ రాష్ట్ర మహాసభలను డిసెంబర్ రెండో వారంలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో యాదయ్య, సిరాజ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు తప్పనిసరి పాఠ్యాంశమే కావాలి

ఒకటి నుంచి ఇంటర్ వరకు తెలుగును ఒక సబ్జెక్టుగా తప్పనిసరిగా ఉంచాలని, ఐచ్ఛికం కాకూడదని పలువురు వక్తలు అభిప్రాయ పడ్డారు. తెలుగు భాషపై ముఖ్యమంత్రి నిర్ణయం నేపథ్యంలో ఇంటర్ బోర్డు ఆధ్వర్యంలో 'ఇంటర్ స్థాయిలో తప్పనిసరి పాఠ్యాంశంగా తెలుగు' అనే అంశంపై చర్చాగోష్ఠి నిర్వహించారు. చర్చలో సాహిత్య అకాడమీ ఛైర్మన్ సిధారెడ్డి, అధికార భాషా సంఘం ఛైర్మన్ దేవులపల్లి ప్రభాకర్‌రావు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య సత్యనారాయణ, ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి, సీఎం కార్యాలయం ఓఎస్‌డీ దేశపతి శ్రీనివాస్ తదితరులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. వేరే రాష్ట్రాల వారు ఇక్కడికి వచ్చి చదువుకుంటే వారికి తెలుగును పరిచయం చేసే స్థాయిలో తెలుగు వాచకం ఉండేలా చేయాలని సూచించారు.

## విపత్తు నిర్వహణ పాఠ్యాంశం తప్పనిసరి

ఉన్నత విద్యలో విపత్తు నిర్వహణ పాఠ్యాంశాలు తప్పనిసరి చేస్తూ యూజీసీ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు విశ్వవిద్యా లయాల ఉపకులపతులకు ఆదేశాలు పంపింది. విద్యార్థుల భద్రత అత్యంత ముఖ్యం కాబట్టి వారికి విపత్తు నిర్వహణపై అవగాహన అవసరమని యూజీసీ పేర్కొంది. బాంబు బెదిరింపులు వచ్చినప్పుడు, భూకంపాలు, వరదలు, బాంబు విస్ఫోటనం, ఉగ్రవాదుల చర్యలు ఎదురైనప్పుడు వాటిని ఎదుర్కోవడంపై అవగాహన కల్పించే పాఠాలు సిలబస్‌లో తప్పనిసరి చేయాలని యూజీసీ పేర్కొంది. ద

## సామాజిక మాధ్యమాల్లో చర్చించొద్దు న్యాయాధికారులకు హైకోర్టు సూచన



అధికారిక విధుల్లో సమస్యలెదురైతే ఆ విషయాన్ని జిల్లాల విభాగాధిపతులు (యూనిట్ హెడ్స్) దృష్టికి తీసుకెళ్లాలని తెలుగు రాష్ట్రాల్లోని న్యాయాధికారులను (జ్యుడీషియల్ ఆఫీసర్లు) కోరుతూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్(ఆర్జీ) సీహెచ్. మానవేంద్రనాథ్‌రాయ్ ఉత్తర్వులు జారీచేశారు. వాట్సాప్ లాంటి సామాజిక మాధ్యమాల ద్వారా సమస్యలను ప్రజల దృష్టికి తీసుకెళ్లొద్దని ఆదేశించారు. జిల్లాల విభాగాధిపతుల దృష్టికి సమస్యలను తీసుకెళితే వారు వాటిని పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. వారి స్థాయిలో పరిష్కారం కాకపోతే ఆ సమస్యను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ముందు ఉంచడానికి ఆర్జీకి పంపుతారన్నారు. ఈ నిబంధనలను అందరు అనుసరించాలని కోరారు. ఈ ఉత్తర్వులు న్యాయాధికారులందరికి చేరేలా విభాగాధిపతులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## ‘విక్టోరియా హోమ్ స్థలంలో పోలీసు కమిషనరేట్’పై హైకోర్టులో వ్యాజ్యం

రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ హోమ్ ఆశ్రమ పాఠశాల (వీఎంహెచ్ఆర్ఎస్)కు చెందిన పదెకరాల స్థలాన్ని రాచకొండ పోలీసు కమిషనరేట్ నిర్మాణం కోసం లీజుకిచ్చేందుకు ఎస్సీ సంక్షేమశాఖ జారీచేసిన రెండు జీవోలను సవాల్ చేస్తూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. ఎస్సీ సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, హోం శాఖ ముఖ్యకార్యదర్శి, వీఎంహెచ్ఆర్ఎస్ గౌరవ కార్యదర్శి, తెలంగాణ డీజీపీ, రాచకొండ కమిషనర్, దేవాదాయ శాఖ కమిషనర్ తదితరులను వ్యాజ్యంలో ప్రతివాదులుగా పేర్కొన్నారు.

**అన్యాక్రాంతం చేసే అధికారం ప్రభుత్వానికి లేదు: పిటిషనర్**

“అనాథ పిల్లలకు విద్య, వసతి కల్పించే ప్రధాన ఉద్దేశంతో 1903లో అప్పటి హైదరాబాద్ ఆరో నిజాం మీర్ మహబూబ్ అలీ ఖాన్ బహదూర్ ఈ భవనాన్ని నిర్మించారు. ఇది వారసత్వ కట్టడం. విక్టోరియా మహారాణి గౌరవార్థం ఆ భవనానికి ‘విక్టోరియా మెమోరియల్ ఆర్ఫనేజ్ హోమ్’ అని పేరు పెట్టారు. 1953లో ఈ ప్రదేశాన్ని సందర్శించిన అప్పటి ప్రధాని నెహ్రూ.. అక్కడున్న చిన్నారులు అనాథలుగా కనిపించడంలేదన్నారు. ఈ సంస్థకుగానీ, ఇలాంటి మరే సంస్థలకుగానీ ‘ఆర్ఫన్’, ‘ఆర్ఫనేజ్’ అనే పదాల్ని వాడొద్దని సూచించారు. దాంతో ఆ సంస్థ పేరులోంచి ఆర్ఫనేజ్ అనే పదాన్ని తొలగించారు. ట్రస్టు ఆస్తులను అన్యాక్రాంతం చేసే అధికారం ప్రభుత్వానికి లేదు” అని వ్యాజ్యంలో పిటిషనర్ పేర్కొన్నారు.

## సుప్రీంకోర్టుకా? హైకోర్టుకా?

కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పనులను చేపట్టరాదంటూ జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో వాటిని ఉన్నత న్యాయస్థానంలో సవాలు చేయాలన్న తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం. ట్రిబ్యునల్ ఉత్తర్వులపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని మొదట అనుకున్నప్పటికీ ఇక్కడే ఉమ్మడి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని భావిస్తోంది. ఈ పిటిషన్‌పై విచారించిన ధర్మాసనంలో నైపుణ్యం ఉన్న సభ్యులు (ఎక్స్‌పర్ట్ మెంబర్) ఈ నెల 8న పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో, అన్ని అంశాలనూ పరిగణనలోకి తీసుకున్న ట్రిబ్యునల్ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అయితే తీర్పు పూర్తిపాఠం తరువాత వెలువరిస్తామని పేర్కొంది.

మధ్యంతర ఉత్తర్వుల్లో కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి సంబంధించి చెట్లను నరకడం, బ్లాస్టింగ్ నిర్వహించడం వంటి పనులను చేపట్టరాదని, అనుమతుల్లేకుండా అటవీ ప్రాంతంలో సొరంగం తవ్వడం అటవీ సంరక్షణ చట్టానికి విరుద్ధమని స్పష్టం చేసింది. పర్యావరణ, అటవీశాఖ అనుమతులు మంజూరు చేశాక తమ ఉత్తర్వులపై వివరణ.. లేదంటే సవరించాలని కోరడానికి తెలంగాణ ప్రభుత్వానికి అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో ట్రిబ్యునల్ ఉత్తర్వుల వల్ల పనులకు ఆటంకం కలగకుండా సుప్రీంకోర్టును ఆశ్రయించాలని మొదట ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం హైకోర్టునే ఆశ్రయించాలని భావిస్తోంది. దీనిపై ప్రభుత్వ అధికారులు, న్యాయ నిపుణులు చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. మరోవైపు ఎన్జీటీ ఉత్తర్వులు కాళేశ్వరం పనులకు ఎలాంటి అడ్డంకి కాదన్న అభిప్రాయమూ వ్యక్తమవుతోంది. ఉత్తర్వుల పూర్తిపాఠం వస్తేగానీ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడానికి కారణం తెలియదని, అధ్యయనం చేశాక నిర్ణయం తీసుకోవాలని అధికారులు, న్యాయనిపుణులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ద

DECCAN tv
Voice of Telangana
Watch On Hathway Network, Channel No.70

అవి ఇవి

## కుమ్రంభీం స్ఫూర్తి ప్రదాత

భూమి, భుక్తి, నీరు, అటవీ భూముల కోసం సాహసోపేతంగా పోరాడిన యోధుడు కుమ్రభీం అని అతిథులు కీర్తించారు. గోండుల జీవితాలలో వెలుగులు నింపిన కుమ్రంభీం స్ఫూర్తి ప్రదాతని కొనియాడారు. గిరిజన స్వచ్ఛంధ సంస్థల సమాఖ్య (ట్రింగో), త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో లలితకళా వేదికలో కుమ్రంభీం 77వ వర్ధంతిని నిర్వహించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమానికి తెలంగాణ బీసీ కమిషన్ అధ్యక్షులు బీఎస్ రాములు ముఖ్యఅతిథిగా విచ్చేశారు.

గానసభ అధ్యక్షులు కళాజనార్ధనమూర్తి అధ్యక్షత వహించారు. చెల్లప్ప కమిషన్ సభ్యులు డా. హెచ్‌కే నాగు, ఓయూ తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య సూర్యధనుంజయ్, తెలంగాణ ప్రభుత్వ గిరిజన శాఖ మ్యూజియం ముఖ్య అధికారి సత్యనారాయణ, తెలుగు రాష్ట్రాల గిరిజన ఐక్యవేదిక అధ్యక్షులు వివేక్‌వినాయక్ తదితరులు అతిథులుగా విచ్చేశారు. వారికి మురళీ మధు ఆహ్వానం పలికారు.

## దేశంలో అతిపెద్ద నెఫ్రాలజీ కేంద్రంగా నిమ్స్!

నిమ్స్‌లోని నెఫ్రాలజీ విభాగం దేశంలోనే అతిపెద్దదిగా అవతరించనుందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి చెప్పారు. నెఫ్రాలజీ విభాగంలో నూతనంగా 40 రక్తశుద్ధి (డయాలసిస్) యంత్రాలు మంజూరు చేయగా 30 యంత్రాలను కొనుగోలు చేశారు. వాటిలో 10 యంత్రాలను మంత్రి ప్రారంభించారు. అనంతరం రోగులకు ఇచ్చే ఫోల్డర్(వైద్య నివేదిక భద్రపర్చుకునేది)ను, నిమ్స్ సమాచార వెబ్ పోర్టల్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నిమ్స్‌లో ఇప్పటికే 25 రక్తశుద్ధి యంత్రాలు ఉన్నాయని, కొత్తగా మరో 40 అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు. కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా కొత్త పరికరాలు అందిస్తున్నామని, నిమ్స్‌కు ఏ పరికరాలు అవసరమో తెలపాలని ప్రతి విభాగాన్ని ఆదేశించామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి రాజేశ్వర్ తివారీ, నిమ్స్ డైరెక్టర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎగ్జిబిషన్ సొసైటీ మేనేజింగ్ కమిటీ

ఎగ్జిబిషన్ సొసైటీ మేనేజింగ్ కమిటీలో అత్యంత కీలకమైన ఎకనామిక్ కమిటీ తరపున ముగ్గురు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ అధ్యక్షునిగా కొనసాగుతున్న ఎగ్జిబిషన్ సొసైటీకి జరిగిన ఎన్నికల్లో ఎకనామిక్ కమిటీ తరపున పుప్పాల వసంత్‌రావు, వనం వీరేందర్, వడ్డి అజయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో ఎగ్జిబిషన్ సొసైటీకి నూతన కార్యవర్గం (2018 ఏడాదికి) సమగ్రంగా ఏర్పాటైంది. మంత్రి ఈటల రాజేందర్ నేతృత్వంలో మొత్తం 15 మంది సభ్యులతో కూడిన ప్రతినిధి బృందం వచ్చే ఏడాది జరిగే నుమాయిష్‌కు నేతృత్వం వహించనున్నారు.

## ప్రపంచ యువజన ఉత్సవాలకు ఓయూ విద్యార్థి

రష్యాలో జరిగే ప్రపంచ యువజన ఉత్సవాలకు ఓయూ పరిశోధన విద్యార్థి ఎం.నాగేశ్వర్ ఎంపికయ్యారు. ప్రస్తుతం ఓయూలో ప్రభుత్వ పాలన శాస్త్రంలో పరిశోధక విద్యార్థిగా ఉంటూనే ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. రష్యాలోని శోచి నగరంలో ఈ నెల 14 నుంచి 22 వరకు నిర్వహించే ఉత్సవాలకు 150 దేశాల నుంచి 16వేల మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు.

## జాతీయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

జాతీయ స్థాయిలో పారిశ్రామిక అవార్డుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఎస్ఎంఈడీ డైరెక్టర్ అరవింద్ పట్వారీ తెలిపారు. 2016వ సంవత్సరానికిగాను పలు విభాగాల్లో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల నిర్వాహకులు ఈ అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఉత్తమ పారిశ్రామికవేత్త, ఉత్తమ తయారీదారు, సర్వీస్ విభాగంలో, ఉత్తమ ఉత్పత్తులు, పరిశోధన, నాణ్యత ఉత్పత్తులు, ఎగుమతి రంగంలో ఉత్తమ పరిశ్రమలకు అవార్డులు ఉంటాయన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన పరిశ్రమల నిర్వాహకులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ద

## తెలంగాణ నిఘంటువు నిర్మాణంపై కార్యగోష్ఠి

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో 'తెలంగాణ బృహత్ నిఘంటువు నిర్మాణం'పై కార్యగోష్ఠి నిర్వహించారు. వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ మాట్లాడుతూ లక్ష తెలంగాణ పదాల సేకరణ లక్ష్యంగా తెలుగు వర్సిటీ అడుగులు వేస్తోందన్నారు. ఇందుకు గ్రామస్థాయి నుంచి పద సేకరణకు ప్రాజెక్టు సహాయకులను వినియోగించుకుంటామన్నారు. కనీసం వెయ్యి పదాలను సమీకరించి విశ్వవిద్యాలయానికి అందజేసిన వారి పేర్లు నిఘంటువులో పొందుపరుస్తామన్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు జి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ నిఘంటువు నిర్మాణంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యగోష్ఠిలో ఆచార్య పిల్లలమర్రి రాములు, సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, యాకూబ్, బాలశ్రీనివాసమూర్తి, ముదిగంటి సుజాతారెడ్డి, లక్ష్మణరావు, భూతం ముత్యాలు, డా. ఎస్.రఘు, డా.సి. కాశీం, పసునూరి రవీందర్‌తోపాటు కార్యగోష్ఠి సమన్వయకర్త సంగిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు. ద

# కళలు సాహిత్యం

## ప్రపంచ తెలుగు మహాసభలకు సిద్ధం

## కండి: డా. కె.వి.రమణాచారి

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా డిసెంబర్‌లో నిర్వహించతలపెట్టిన ప్రపంచ తెలుగు మహాసభలకు సంగీత, నృత్య కళాశాలలు, సంస్థలు, కళాకారులు సిద్ధం కావాలని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా.కె.వి.రమణాచారి అన్నారు. శ్రీ లక్ష్మణాచారి మెమోరియల్ కాలేజ్ ఆఫ్ మ్యూజిక్ పదో వార్షికోత్సవం సందర్భంగా గత మూడు రోజులుగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ కళామందిరంలో నిర్వహిస్తున్న 'శాస్త్రీయ భక్తి భావ తరంగాలు' పాటల పండగ ఘనంగా ముగిసింది. డా.కె.వి.రమణాచారి మాట్లాడుతూ.. మహాసభల్లో శాస్త్రీయ సంగీతం, నృత్యాలు, జానపద కళాకారులకు అవకాశాలు కల్పిస్తున్నామని వివరించారు. ముఖ్యంగా ఇతర రాష్ట్రాల కళాకారులకూ అవకాశం ఉంటుందన్నారు. తెలంగాణ సంస్కృతి ఉట్టిపడే రీతిలో, తెలుగు వైభవాన్ని చాటే విధంగా కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రముఖ గాయని, నిర్వాహకురాలు శశికళాస్వామి, వంశీ ఇంటర్నేషనల్ ఛైర్మన్ వంశీ రామరాజు, సత్తిరాజు వేణుమాధవ్, దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు.

## సమాజాన్ని సంస్కరించే బాటసారులే కవులు

ప్రపంచంలో విస్తృతమైన ఆదరణ ఉన్న ప్రక్రియ కవిత్వమని.. ప్రతి హృదయాన్ని చేరి భావోద్వేగాలను, మానవత్వాన్ని కదిలించ గలిగిన శక్తి దీనికే ఉందని తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి అన్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో సాహితీ సంస్థ సృజనలోకం ఆధ్వర్యంలో కొనసాగిన 'భారత ప్రపంచ కవితోత్సవం'లో రెండో రోజు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సమాజాన్ని సంస్కరించే బాటసారులే కవులని, అలాంటివారెందరినో రామోజీ ఫిల్మ్‌సిటీ వేదికగా సమాజశ్రేయస్సు కోసం సృజనలోకం ఏకం చేయడం అభినందనీయమని అన్నారు. ఒక సంస్కృతికి మరో సంస్కృతి, ఒక కవికి మరో కవి పరిచయమై ప్రపంచం మధ్య సంబంధాలు పెంపొందుతాయన్నారు. అనంతరం గ్రీకు రచయిత్రి రౌలా పొల్లార్డ్ రచన 'సెంచరీ ఆఫ్ లవ్', సౌభాగ్య రచించిన 'కాలం మీద సంతకం' పుస్తకాలను ఆవిష్కరించారు. 'సెంచరీ ఆఫ్ లవ్' పుస్తకాన్ని డాక్టర్ లంక శివరామప్రసాద్ తెలుగులోకి అనువదించారు. ఫిలిప్పీన్స్‌కు చెందిన డాక్టర్ పెన్‌పెన్ మాట్లాడుతూ.. ప్రపంచాన్ని ఏకం చేసే ఏకైక సాధనం శాంతి అని, అది కవుల సంకల్పంతోనే సాధ్యమవుతుందని అన్నారు. గుజరాత్ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు విష్ణుపాండే మాట్లాడుతూ.. కవితా మాధ్యమంతో ప్రపంచ శాంతికి పాటుపడుతున్న పెన్‌పెన్ సంకల్పానికి యావత్ భారతం అండగా నిలుస్తుందన్నారు. డాక్టర్ కల్పమల్లిక్ ఒడిశా నృత్య రీతిని ప్రదర్శించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సృజనలోకం ప్రతినిధులు డాక్టర్ లంక శివరామప్రసాద్, ప్రొఫెసర్ రామాచంద్రమౌళి, పొట్లపల్లి శ్రీనివాసరావు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు సంపత్‌రెడ్డి, కేసీ జాన్‌బన్నీ, రాంగోపాల్‌రెడ్డి, నరేంద్ర, వివిధ దేశాల కవులు పాల్గొన్నారు.

## మరొకరి జీవితంలో వెలుగు నింపడమే నిజమైన సేవ

తమ కోసం తాము బతుకుతూ మరొకరి జీవితంలో వెలుగు నింపడమే నిజమైన సేవని, ఇతరుల మోహంలో చిరునవ్వును చిందించడంలో ఉన్న సంతృప్తి మరెందులోనూ ఉండదని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.వి.రమణాచారి పేర్కొన్నారు. సేవాభారతి పబ్లిక్ చారిటబుల్ ట్రస్టు 11వ వార్షికోత్సవ వేడుకలు మోతీనగర్‌లోని శంకర్‌మఠంలో ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన రమణాచారి మాట్లాడుతూ.. సమాజంలో ప్రేమ, క్షమ, త్యాగం ఈ మూడు గుణాలు లేని వారే నిజమైన పేదవారన్నారు. సేవాభారతి ట్రస్ట్ ప్రతినిధులు సమాజ శ్రేయస్సు కోసం చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఉన్నతమైనవని ప్రశంసించారు. నిరుద్యోగ బ్రాహ్మణులకు బ్రాహ్మణ సేవా పరిషత్తు ఆధ్వర్యంలో ఉద్యోగ అవకాశాల్ని కల్పిస్తామన్నారు. మరో విశిష్ట అతిథి ఈనాడు జర్నలిజం పాఠశాల ప్రిన్సిపల్ ఎం.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మహాత్ముల సుగుణాలైన సేవ, త్యాగం, సృజన అంశాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుంటే సమాజం పురోగమిస్తుందన్నారు. జీవితంలో కొంత సమయాన్ని, సంపాదించిన వస్తువులను సమాజానికి ఇవ్వగలిగే ప్రయత్నాన్ని చేయాలని సూచించారు. ఇతరులకు ఇచ్చిందే మనదని.. మన దగ్గర ఉన్నది ఇతరులది అనే అంశాన్ని అందరూ గుర్తించి ఆచరించడం అవసరమన్నారు. సేవా భారతి ఈ దిశగా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆరుగురు మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. సంస్థకు విరాళాలిచ్చిన దాతల్ని సైతం ఆహుతులు ఘనంగా సత్కరించి అభినందించారు. ట్రస్టు ఆధ్వర్యంలో శిక్షణ పొందిన పలువురు మహిళలు తాము తయారు చేసిన దుస్తులను ప్రదర్శనగా ఉంచారు. సభా కార్యక్రమానికి ముందు శివబాలు అనే అంధురాలు ఆలపించిన గణపతి గీతం అందర్నీ అలరించింది. కార్యక్రమంలో ట్రస్టు ఇన్‌ఛార్జి ఛైర్మన్ పి.ఎ.ఎస్.మూర్తి, మేనేజింగ్ ట్రస్టీ సీ.ఎస్.ఆర్.మూర్తి, వైస్ ఛైర్మన్ ఎస్.ఎన్.బైరెడ్డి, వి.దుర్గారావు, ఎ.నాగేశ్వరరావు, శ్రీచంద్ర, వీర్రాజు, మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

## అధ్యయనంతోనే ఉత్తమ సాహిత్యం

అధ్యయనంతోనే ఉత్తమ సాహిత్యాన్ని జనాలకు అందించగలమని, ప్రాచీన, ఆధునిక సాహిత్యాన్ని ప్రతి ఒక్కరూ చదవాలని రచయిత, సినీ నటులు తనికెళ్ల భరణి పేర్కొన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని ఠాగూర్ ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో

సాహితీ కళాభారతి ద్వారా ద్వాదశ పుస్తకావిష్కరణ మహోత్సవం పేరిట ఒకే వేదికపై 12 పుస్తకాలను ఆవిష్కరించారు. తెలుగుబుక్ ఆఫ్ రికార్డులో ఈ కార్యక్రమానికి చోటు దక్కింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తనికెళ్ల భరణి మాట్లాడుతూ.. ప్రపంచంలోని సాహిత్యమంతా ఒక ఎత్తైతే.. పోతన సాహిత్యం మరో ఎత్తుగా నిలిచిందని ప్రశంసించారు. కవులంటే తనకు ఎంతో అభిమానమన్నారు. సాహిత్యాన్ని చదవాలని, మంచి సాహిత్యాన్ని అందించాలని యువ కవులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన రాసిన చెప్పో శురాచెక్కల దాని పద్యాలను ఇతర కవితలను చదివి వినిపించారు. కార్యక్రమానికి ఎన్‌కే రాజేంద్రప్రసాద్, పాతూరి వెంకటరావు, బండారి రమేష్ సహకారం అందించారు. రచయిత కోటమర్పల్లి రవీంద్రాచార్య రాసిన హేకృష్ణ, భవాని జగదీశ్వర్‌రెడ్డి రాసిన పద్యసేద్యం, ఆకుల మల్లికార్జున్ రాసిన వస్త్రశిల్పి, వెన్నె గౌరీశంకర్ రాసిన గౌరీశంకర శతకం, ఆనందీశ్వర్‌రెడ్డి రాసిన వెన్నలమ్మ పదాలు, హరీష్‌శర్మ రాసిన సమూహంలోకి, వెన్నెల సత్యం రాసిన ప్రేమనానీలు, ఓలేటి స్వరాజ్యలక్ష్మి రాసిన అమృతగీత, సాకేత ప్రవీన్ రాసిన సాకేత సౌరభాలు, డీవీవీఎస్ నారాయణ రాసిన సిరివెన్నల వెన్నలలు, వీరబహ్మేంద్రచార్య రాసిన నీతిశాస్త్రం, రంగనాథ్ రాసిన ఇది నాహృదయం పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. గౌరీశంకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నేటినిజం పత్రికా సంపాదకులు బైస దేవదాసు, కవి, సినీగేయ రచయిత మౌనశ్రీమల్లిక్, గాయకుడు, సంగీత దర్శకుడు సాయిచంద్‌వేద, లక్ష్మీకాంతరావు, వెంకట్‌రెడ్డి, మానపాటి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## గోరటి వెంకన్నకు సుద్దాల హనుమంతు పురస్కారం

సుద్దాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజాకవి, వాగ్గేయకారుడు గోరటి వెంకన్నకు 2017 సంవత్సరానికి గాను 'సుద్దాల హనుమంతు –జానకమ్మ' జాతీయ పురస్కారాన్ని అందజేశారు. అక్టోబర్ 13న బాగ్‌లింగంపల్లి సుందరయ్య కళానిలయంలో జరిగిన కార్యక్రమంలో శాసనమండలిలో ప్రభుత్వవిప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, ప్రముఖ సినీ నటులు ఆర్. నారాయణమూర్తి సంస్థ వ్యవస్థాపకులు డా. సుద్దాల అశోక్‌తేజ, ప్రభుత్వ సలహాదారు సుధాకర్‌తేజ, యువకళావాహిని అధ్యక్షులు వైకె నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## సుద్దాల అశోక్‌తేజకు సంగీత పురస్కారం

ఘంటసాల ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభ సహకారంతో కళాదీక్షితులు కళావేదికలో పాటకు పట్టాభిషేకం శీర్షికతో నిర్వహిస్తున్న సినీ సంగీత సప్తాహ ప్రారంభ కార్యక్రమాన్నినిర్వహించారు. సర్ సీవీ రామన్ అకాడమీ అధ్యక్షుడు లయన్ విజయ్‌కుమార్ సారధ్యం వహించిన ఈ గాన కార్యక్రమంలో ప్రముఖ గాయనీగాయకులు వైఎస్ రామకృష్ణ, పద్మశ్రీ కొన్ని మధుర చిత్ర గీతాలను ఆలపించారు. జాతీయ పురస్కారం అందుకున్న ప్రముఖ సినీగేయ రచయిత డా.సుద్దాల అశోక్‌తేజకు సద్గురు ఘంటసాల బంగారు తెలంగాణ సంగీత పురస్కారం ప్రదానం చేశారు. పురస్కార స్వీకర్త అశోక్‌తేజ మాట్లాడుతూ ఘంటసాల పేరిట నెలకొల్పిన సంగీత పురస్కారాన్ని పొందడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో నిర్వహణ, సౌజన్య సంస్థల ముఖ్యులు వంశీ రామరాజు, కళాజనార్దన మూర్తి, టి.సుధాదేవి, ప్రభూజి తదితరులు పాల్గొన్నారు. ద

## సార్వజనీనతను సాహిత్యంగా మలచిన బిఎస్‌రాములు



తాత్వికతను కవిత్వంతో రంగరించి నిర్దిష్టమైన సార్వజనీనతను ప్రదర్శించిన రచయిత బిఎస్‌రాములు అని తెలంగాణ భవన్ సహాయ కమీషనర్ జి రామ్మోహన్ అన్నారు. న్యూఢిల్లీలో సామాజిక తత్వవేత్త బిఎస్‌రాములు సాహిత్య స్వర్ణోత్సవ సంవత్సరాన్ని పురస్కరించుకొని తెలంగాణ భవన్‌లో ఆయన రాసిన దీర్ఘకావ్యం 'విహారం'ను రాంమ్మోహన్ ఆవిష్కరించి మాట్లాడారు. కవిగా, రచయితగా అనేక సామాజిక కోణాలను దృశ్యాదృశ్యాలుగా విశ్లేషించిన రాములు తెలంగాణ ఉద్యమంలో తనదైన శైలిలో క్రియాశీల పాత్ర నిర్వహించారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ భవన్ పరిపాలనాధికారి కె లింగరాజు మాట్లాడుతూ 1960 నాటి నుండి సాహిత్య రంగంలో కథలు, కవితల వంటి ఎన్నో సాహిత్యరచనలు చేస్తూ పేరొందిన రాములు సమాజ జీవన శైలికి ప్రతిబింబంగా మారారని చెప్పారు. అనంతరం కావ్యరచయిత బిఎస్ రాములు మాట్లాడుతూ గాయపడిన హృదయం నుండే కవిత్వం వస్తుందని వాల్మీకి నుండి వర్తమానం వరకు రుజువైన సత్యమని అన్నారు. అమ్మ ఒక స్ఫూర్తి, అమ్మ వర్ధమానం, అమ్మ మరణించదు, అమ్మకు మరణం లేదు, అమ్మప్రేమ విశ్వప్రేమ అంటూ నీటికి మొగులుకు గాలితోడైతే తుఫాను అని ఉద్యమాలకు సిద్ధాంతాలు తోడైతే ఉప్పెనలే అంటూ తన దీర్ఘకావ్యంలోని పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో పలువురు సాహిత్యాభిమానులు పాల్గొన్నారు. ద

# 'చివరకు మిగిలేది'

# సావిత్రిని మహానటిగా మార్చిన మన సినిమా

తెలుగు సినిమా రంగంలో 1950 దశకంలో విజయా, వాహిని పి.ఏ.పి., ఎన్.ఏ.టి. అన్నపూర్ణ వంటి సంస్థలు మొదలై శరపరంపరగా సాంఘిక పౌరాణిక, జానపదాలను నిర్మిస్తున్న కాలం అది. వీటిలో అన్నీ ఒకే మూసలో పోటీపడి తయారయ్యేది. దాంతో ప్రేక్షకులంతా ఒకే మానియాలో ఇమిడిపోయి సినిమాలను ఆదరించక తప్పని పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రేక్షకుల మత్తును ఒక్కసారిగా వదిలించే దృశ్యకావ్యం ఒకటి వచ్చి తెలుగు సినిమా రంగాన్ని ఒక కుదుపు కుదిపింది. అది తెలంగాణ నిర్మాతలు తీసిన సంచలన చిత్రం "చివరకు మిగిలేది" (1960).




"చివరకు మిగిలేది" చిత్ర నిర్మాణానికి ప్రధాన కారకులు ఉప్పునూతల పురుషోత్తమరెడ్డి. ఆయన బాగా చదువుకున్నవాడు. మంచి సాహిత్యాభిలాషి. ఆనాటి సినిమా తీరుతెన్నులను చూసి ప్రేక్షకుల అభిరుచిని సంస్కరించే సినిమా ఒకటి తీయాలనుకున్నారు. తన మిత్రులు పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి, ఎం.సత్యనారాయణరావులతో కలిసి లాభనష్టాలతో నిమిత్తం లేకుండా ఒక సినిమా తీయాలనే నిర్ణయానికి వచ్చారు. వారు ముగ్గురు మంచి మిత్రులు. యూత్ కాంగ్రెస్ రాజకీయాల నుండి కలిసి పనిచేసిన వారు కావడంతో ఏకాభిప్రాయానికి వచ్చారు. అయితే నిర్ణయాధికారం మాత్రం పురుషోత్తమరెడ్డికే అప్పగించారు. ఎందుకంటే ఆయన మంచి అభిరుచి ఉండి నిర్వహణా సామర్థ్యం ఉన్నవాడు. అయితే ఈ పురుషోత్తమరెడ్డికి సినిమా తీసే ప్రేరణ కల్పించిన వాడు ఎం.కొండల్‌రెడ్డి అనే మిత్రుడు. సూర్యాపేటలో కలిసి చదువుకున్న మిత్రులు వారు. ఈ కొండల్‌రెడ్డి హైదరాబాద్‌లో ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో డిప్లొమా చేసి ఉన్నాడప్పటికే. ఎప్పుడైతే తాను సినిమా తీయాలనుకున్నడో దానికి కొండల్‌రెడ్డి తోడ్పాటు తీసుకోవాలని అనుకున్నాడు పురుషోత్తమరెడ్డి. ఇట్లా వి.పురుషోత్తమరెడ్డి ప్రధాన నిర్మాతగా, సహ నిర్మాతలుగా పాల్వాయి, ఎం.ఎస్. కొండల్‌రెడ్డి, కె.సుధాకర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, మధుసూదన్‌రావులతో "మంజీరా ఫిలింస్" బానర్ ఏర్పాటైంది.


"చివరకు మిగిలేది" (1960) సావిత్రితో

అప్పుడే హైదరాబాద్‌లో సారథి స్టూడియో ఏర్పాటై తొలిసారిగా "మాయింటి మహాలక్ష్మి"(1959) సినిమా తయారై విజయవంతంగా నడుస్తున్నది. ఈ చిత్ర దర్శకుడు గుత్తారామినీడు దగ్గరకెళ్లి "ఈ వ్యాపారంలో ఎంత లాభం? ఎంత నష్టం? అన్నదికాదు మా ఆలోచన. ఒక మహత్తరమైన చిత్రాన్ని ఈ యువ బృందం తీసింది. అన్నపేరు మనందరికి రావాలి. అలాంటి సినిమా మాకు అందించాలని" అడిగారు.

అప్పట్లో విభిన్న తరహా కథలు ఇక్కడ రూపొందేవి కావు. మన సినీ రచయితలంతా మూస ధోరణిలోనే ఆలోచించేవారు. అందువల్ల కలకత్తా వెళ్లి అక్కడ కొన్ని రోజులుండి, సినిమాలు చూసి మంచి కథలు ఎంచుకోవచ్చని దర్శక నిర్మాతలంతా కలిసి కలకత్తా వెళ్లారు. అక్కడ "సినీ అడ్వాన్స్" పత్రికలో రివ్యూలు రాసే సరోస్‌సేన్ గుప్తాను కలుసుకుని నగరంలో నడుస్తున్న సినిమాల గురించి అడిగారు. వీరి అభిరుచి తెలుసుకుని ఉత్తమ్‌కుమార్ సుచిత్రాసేన్ నటించిన సినిమా "దీప్ జలా జాయ్"ని ముందుగా చూడమని సలహా ఇచ్చాడాయన. దానితో బాటే "శాప్‌మోచన్" సినిమా కూడా ఆడుతున్నది. "దీప్ జలా జాయ్" సినిమా అందరికీ నచ్చింది. కానీ తెలుగులో ఆర్థికంగా విజయవంతం అవుతుందని చెప్పలేనని దర్శకుడు చెప్పేశాడు. మరో చిత్రం "శాప్‌మోచన్" బాగున్నా అది అప్పటికే తమిళ్‌లో రైట్స్ లేకుండానే రీమేక్ చేశారని తెలిసి "చివరకు మిగిలేది" తెలుగు, తమిళ, కన్నడ రైట్స్ తీసుకొని ఒక ప్రింట్‌తో సహా మద్రాసు వచ్చేశారు.

మొదట ఈ సినిమాను నాగేశ్వరరావు గారికి చూపించారు. ఆయన చూశాక సినిమా బాగా వుంది కాని కమర్షియల్‌గా ఆడదు మీరే ఆలోచించుకోవాలన్నారు. అయినా లీడ్‌రోల్‌లో మాత్రం సావిత్రి తప్ప మరొకరు నప్పరని ఆయన చెప్పారు. ఇది హీరోయిన్ ఓరియెంటెడ్ కనుక తాను నటించలేనన్నారు. సినిమాను మద్రాసులో సావిత్రి, ఎల్.వి.ప్రసాద్, మల్లాది రామకృష్ణశాస్త్రికి చూపించారు. ఆ షోకి రమణారెడ్డి కూడా వచ్చాడు. ప్రసాద్‌గారు సినిమా చూశాక ఇది మీకు పేరొచ్చే చిత్రమే గాని డబ్బు రావడం కష్టమన్నారు.

హిందీలో "నేను శారద (ఇలవేలుపు) తీసినట్లుగా అవుతుందన్నారు". ఇక బెంగాలీ స్క్రిప్టును హైదరాబాద్‌లో పని చేసే వొక బెంగాలీ ఆఫీసరు భార్యతో ఇంగ్లీషులోకి ట్రాన్స్‌లేట్ చేయించారు. ఇంగ్లీషు నుండి తెలుగులోకి అనువాదం చేసింది సహ నిర్మాత, సహ దర్శకుడు అయిన కె.సుధాకర్‌రెడ్డి. వీరు స్వతహాగా కథా రచయిత. అయితే స్క్రీన్‌ప్లే రాయడానికి ముందుగా గోపీచంద్‌ని అనుకున్నారు. గోపీచంద్‌కి వీలుగాక అట్లూరి పిచ్చేశ్వరరావును సూచించారు. కొండల్‌రెడ్డి పూర్తిగా ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేశారు. వీరితో బాటు లక్ష్మీనారాయణ అనే హైదరాబాదీ మరో సహాయ దర్శకుడుగా ఉన్నాడు. ఈయనే ఆ తరువాత లక్ష్మీదీపక్ పేరుతో చాలా హిట్ చిత్రాలు తీశారు. ఇక హీరోయిన్‌గా ముందుగా జమునను అనుకున్నారు. కానీ నాగేశ్వరరావు మాత్రం ఎట్టి పరిస్థితుల్లోను సావిత్రినే తీసుకోవాలనడంతో అట్లానే చేశారు. అయితే ఆయన కూడా ఈ సినిమాలో కాంతారావు రోల్ వేస్తానని మొదట సూత్రప్రాయంగా అంగీకరించినా తరువాత చేయలేనన్నారు. సావిత్రి సిస్టర్ పద్మ రోల్‌ని ఇష్టపడి వొప్పుకున్నది. ఆ రోజుల్లో ఆమె 40వేలు తీసుకునేది. అంతే ఇచ్చారు కూడా. అయితే ఈ సినిమాను తాను తమిళంలో తీస్తానని 30 వేలిచ్చి తమిళ హక్కులు తీసుకున్నది. అయితే తెలుగులో ఈ చిత్రం ఫెయిలవడంతో ఆమె తమిళంలో తీయలేదు.



చిత్రంలో హీరోయిన్‌గా సావిత్రి సరేసరి. ఈ సినిమాలో బెంగాలీ వర్షన్‌లో మానసిక వైద్యునిపాత్ర పోషించిన పహాడి సన్యాల్ పాత్రను తెలుగులో డా. ప్రభాకర్‌రెడ్డి పోషించారు. ఇదే ఆయనకు తొలి సినిమా అయినప్పటికి నటనలో పరిణితి కనిపిస్తుంది. ఇతర పాత్రల్లో కాంతారావు, బాలయ్య, హరనాథ్, విజయలక్ష్మి, రమణారెడ్డి తదితరులు నటించారు. సంగీతం చేసింది అశ్వద్ధామ. ఘంటసాల, సుశీల, పి.బి.శ్రీనివాస్, గాయనీ గాయకులు. 'సుధవోల్ సుహాసినీ", "అందానికి అందం నేనే", నెలరాజు జతమాని చెంగల్వమనియేన" పాటలు పాపులరైనవి. ఈ చిత్ర సంగీతం పాటల గురించి వి.ఎ.కె. రంగారావు తన 'సరాగమాల' కాలమ్‌లో ఆ రోజుల్లో చాలా గొప్పగా రాశారు.

ఉత్తమాభిరుచిగల ప్రేక్షకులకు చివరకు మిగిలేది ఒక భిన్నమైన చిత్రంగా మెప్పొందింది. విజయవాడలో ప్రసిద్ధ రచయిత్రి తెన్నేటి హేమలత సినిమా చూసి ఈ సినిమా గొప్పగా ఉంది. సామాన్య ప్రేక్షకులకు అంతగా నచ్చకపోవచ్చు. సాధ్యమైనంత త్వరగా వెళ్లి చూడండి. లేకుంటే ఒక గొప్ప సినిమాను మిస్ అయినట్లేనని మిత్రులకు, పత్రికల వాళ్లకు ఫోన్ చేసి చెప్పారు.

చివరకు మిగిలేది 1960 నవంబర్ 25న విడుదలైంది. కానీ ఆర్థికంగా విజయం సాధించలేదు. సినిమా గొప్పగా తీసినప్పటికీ మంచి డిస్ట్రిబ్యూటర్ రాలేకపోవడం కూడా అపజయానికి కారణం. ఒకవేళ ఈ సినిమా సక్సెస్ అయితే ఈ తెలంగాణ వారు ఇక్కడే స్థిరపడి పోటీకొస్తారా అని అప్పటికే స్థిరపడిన సీమాంధ్ర సినిమాకు డిస్ట్రిబ్యూటర్స్‌గా మంచివారిని రాకుండా అడ్డుకున్నారని సుధాకర్‌రెడ్డి చెబుతారు. అయితే పత్రికలు చివరకు మిగిలేది గురించి గొప్పగా రివ్యూలు రాసాయి. మద్రాసు ఫిలిం ఫ్యాన్స్ అసోసియేషన్ వారు ఈ చిత్రాన్ని, ఉత్తమ చిత్రంగా ఎన్నుకుని పురుషోత్తమరెడ్డికి ఉత్తమ నిర్మాత, సావిత్రికి ఉత్తమ నటి, రామినీడుకి ఉత్తమ దర్శకుడు అవార్డులిచ్చారు. నార్ల వెంకటేశ్వరరావు కూతురు పెళ్లిలో చివరకు మిగిలేదిని ప్రదర్శించి డాక్టర్లు ఎక్కువగా హాజరైన రిసెప్షన్‌లో "వైద్యవృత్తి ఎంత ఉదాత్తమైనదో, కళాత్మకంగా చూపిన ఈ చిత్రాన్ని డాక్టర్లందరూ చూడాలని" మరీ మరీ చెప్పారాయన. ముఖ్యంగా సావిత్రి నటన ఆ రోజుల్లో చర్చనీయాంశమైంది. మూలచిత్రం దీప్ జాలా జాయ్‌లో సుచిత్రా సేన్ కన్నా వందరెట్లు గొప్పగా నటించింది. ఇదే చిత్రాన్ని

### కథేమిటంటే..

కల్నల్ చంద్ర పిచ్చాస్పత్రిలో ఒక అంకితభావం గల నర్స్ పద్మ. ప్రేమించి మోసపోయి మతిభ్రమించిన భాస్కర్ పిచ్చాస్పత్రిలో చేరతాడు. పద్మ అతని నర్సుగా ఉంటుంది. అతణ్ణి గతాన్ని మరిపించి తన ప్రేమను, అనురాగాన్ని ధారపోసి అతణ్ణి మామూలు మనిషిని చేస్తుంది. కానీ ఇదంతా నటన అని, చికిత్సలో ఒక భాగమని, పద్మ తనపై చూపే ప్రేమ నిజంకాదని భాస్కర్ అపోహపడతాడు. తాను బాగయ్యాక ఆ అపోహతోనే బయటికి వచ్చేస్తాడు. కానీ పద్మ అతణ్ణి నిజంగా ప్రేమిస్తుంది.

ఇంతలో మరో భగ్న ప్రేమికుడు ప్రకాశం ఇదే ఆస్పత్రిలో చేరతాడు. అతడినీ అలాగే నయం చేయడానికి ప్రయత్నించమంటాడు కల్నల్ చంద్ర నర్స్ పద్మని. కానీ అప్పటికే భాస్కర్‌కి తన మనసును అర్పించిన పద్మ ఆ పని తను చేయలేనంటుంది. ప్రకాశ్ బాధ్యతను మరో కృష్ణవేణి నర్సుకి అప్పగిస్తాడు కల్నల్. ఇంతలో భాస్కర్‌కి మరో అమ్మాయితో పెళ్లి నిశ్చయమైనట్లు తెలుస్తుంది. కానీ పద్మ ఆత్మ నిగ్రహంతో బాధను తనలోనే దాచుకుంటుంది. రోగుల సేవలో ఇదంతా మరిచిపోతుంది. అక్కడ ప్రకాశం మానసిక ఆరోగ్యం చెడి నర్స్ కృష్ణవేణిని చంపబోతాడు. ఈ పరిస్థితుల్లో ప్రకాశంను బాగు చేయడానికి పూనుకుంటుంది పద్మ. నెమ్మదిగా ప్రకాశం మామూలు మనిషిగా మారతాడు. అతనికి పద్మ మీద ప్రేమ కలుగుతుంది. దాన్ని వ్యక్తం చేస్తాడు కూడా. అయితే తన ప్రేమనేనాడో భాస్కర్‌కి అర్పించుకున్న పద్మ ఎవరి ప్రేమనూ పొందలేక అదే ఆస్పత్రిలో తానొక మానసిక రోగిగా చేరుతుంది. హృదయాన్ని ద్రవింపజేసే సన్నివేశాల్లో సావిత్రి నటన విశ్వరూపానికి "చివరకు మిగిలేది" దర్పణం పడుతుంది. వి.ఆర్.మూర్తి అనే ప్రవాస తెలుగు వాడు ఆంగ్లంలో సావిత్రి జీవిత చరిత్రను లెజండరీ యాక్ట్రెస్"గా రాస్తూ కవర్ పేజీపై చివరికి మిగిలేది స్టిల్‌నే వేయడం ఈ సినిమా గొప్పతనం.

## మేధావులకు నచ్చిన సినిమా...

పురుషోత్తమరెడ్డి నన్ను చాలా అభిమానించేవారు. నా రచనా విధానాన్ని చూసి పిచ్చేశ్వరరావుకాన్న మన సుధాకర్ బెటర్ అనేవారు. రామినీడు గారు కూడా నన్ను సహ దర్శకుడుగా పని చేయమన్నారు. సినిమా నిర్మాణంలో నేను, పురుషోత్తమరెడ్డి, కొండల్‌రెడ్డి పూర్తికాలం పని చేశాం. మిగతా నిర్మాతలంతా తరచూ వచ్చి వెళ్లేవారే. డైరెక్షన్ విభాగంలో నా పనితనం చూసి రెండో సినిమా గనుక చేస్తే నా డైరెక్షన్‌లోనే చేస్తానని పురుషోత్తమరెడ్డి చెప్పేవారు. అయితే ఎందుకో గానీ అక్కినేనికి జమునను మేం తీసుకోవడం ఇష్టం లేదు. ఆ రోజుల్లో వారిద్దరి మధ్య కోల్డ్ వార్ నడిచేది. సినిమా షూటింగ్ అంతా వీనస్ స్టూడియోలో నాలుగు నెలల పాటు జరిగింది. రెడ్డి హాస్టల్‌లో ఉండి మెడిసిన్ చదువుతున్న ప్రభాకర్‌రెడ్డిని నాటకాల్లో చూసిన రామినీడు బెంగాలీ మూలంలో పహాడీ సన్యాల్ ధరించిన కల్నల్ పాత్రను తెలుగులో వేయించారు. ఇది ఆయనకు తొలిచిత్రం. అయితే తొలుత చిత్రానికి పాటలు రాసింది సంపత్‌రావు అనే పాలమూరు కవి. కానీ తీసేది మొదటి సినిమా. పేరున్న కవితో పాటలు రాయించకపోతే సినిమా ఆయింత కూడా నడవదని మల్లాది రామకృష్ణ శాస్త్రి, కొసరాజ ఆరుద్రలతో రాయించాల్సి వచ్చింది.



ఉప్పునూతల పురుషోత్తంరెడ్డి



యం.ఆర్. కొండల్‌రెడ్డి



కె. సుధాకర్‌రెడ్డి

హీరోయిన్ సావిత్రి చాలా మంచి మనిషి. మర్యాదస్తురాలు. షూటింగ్ జరిగినంతకాలం పద్మ పాత్రలో లీనమై ఉండేది. చివరి సీన్‌లో ఆమె నటన అద్భుతం. నటనలో పరాకాష్టకు చేరి ఆమె ట్రాన్స్‌లోకి వెళ్లినంత పని చేసింది. ఈ సీన్‌ని ఆమె అడిగి మరీ రాత్రి పూటనే షూటింగ్ పెట్టమంది. సీన్ పూర్తయ్యాక చాలా సేపటి వరకు తననెవరూ మాట్లాడించొద్దని చెప్పింది. గొప్ప అంకిత భావం గల నటి ఈ చిత్రంలో సావిత్రి నటన శిఖరాయమాన మైనది. ఉన్నత ఆశయంతో చివరకు మిగిలేది నిర్మించాక విడుదల చేయడానికి డిస్ట్రిబ్యూటర్లు ముందుకు రాలేదు. నవయుగ వారైతే నాలుగు నెల్లు ఆగమన్నారు. కొత్తవారు చేశారు. సరైన థియేటర్లు దొరకలేదు. మేధావులకు, రచయితలకు, అభిరుచి ఉన్న వారికి సినిమా బాగా నచ్చింది. కానీ సామాన్య ప్రేక్షకుడికి నచ్చలేదు. పి.వి.వంటి వారికి బాగా నచ్చిన సినిమా "చివరకు మిగిలేది".

'ఖామోషీ'గా హిందీలో తీస్తే వహీదా రహెమాన్ సావిత్రి దరి దాపులకు రాలేకపోయింది. ఆ మధ్య ఇదే కథాంశంతో సల్మాన్‌ఖాన్, కరీనాలతో "క్యోంకి" అనే మరో సినిమా కూడా వచ్చింది.

చివరగా ''చివరకు మిగిలేది'' నిర్మాతలకు ఏమి మిగల్చలేదు. అద్భుతంగా నటించిన సావిత్రికీ జీవితంలో ఏమీ మిగలలేదు. కానీ గొప్ప కళాత్మక చిత్రంగా, తెలంగాణ చిత్ర నిర్మాతల ఉత్తమాభిరుచికి దర్పణంగా సినీ చరిత్రలో వొక ప్రత్యేక స్థానాన్ని పొందింది "చివరకు మిగిలేది".

**– హెచ్.రమేష్‌బాబు,**
m: 94409 25814
e: hrameshbabu5@gmail.com

సమాచార సహకారం, ఫొటోల సౌజన్యం:
కె.సుధాకర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, ఆర్.బి.రావు, పంచకర్ల రమేష్

Oxford
Grammar School
Street No. 13, Himayathnagar,
Hyderabad 500 029.
Phone : 040 2763 6214
Mobile : 99596 12345
Email : ogshyd@gmail.com
www. oxfordgrammarschool.com

ogs
JUNIORS
grow naturally



# రాజాస్థానంలో కాదు ప్రజల మస్తిష్కాల్లో నిలిచిన తత్త్వాలు

(గత సంచిక తరువాయి)

గతంలో సాహిత్యంలో దళితులు పాత్రలుగా చిత్రించబడ్డారు. ఇందులో ఎక్కువ మేరకు హేళనకు గురైన పాత్రలే ఉన్నాయి. ఇది తెలుగు సాహిత్యారంభం నుంచీ జరిగింది. మహాభారతాన్ని తెలుగులోకి అనువదించిన నన్నయ- వ్యాసుని మూలానికి విరుద్ధంగా నిషాదులని చిత్రించిండు. గరుత్మంతుడి కథను వక్రీకరించిండు. అంతేగాదు. అంటరానితనాన్ని సమర్థించిండు. కద్రువు అనే సర్పం నిషాదుల రక్తం తాగితే బలం వస్తుందని రాసిండు. నిషాదులను నిర్మూలించే ప్రయత్నం చేసిండు. ఇది మూలంలో లేదు. అలాగే రామాయణ, భారతాల్లో శంబూకుడు, ఏకలవ్యుడుల పాత్రల చిత్రణ ఇందుకు నిదర్శనం. ఎఱ్ఱాప్రెగడ బ్రాహ్మణులు మాత్రమే జ్ఞానవంతులు అని చెప్పేందుకు 'ధర్మవ్యాధుడు' పాత్రని సృష్టించిండు. నిజానికి ఈ మహాభారతాన్ని చాతుర్వర్ణ సిద్ధాంతాన్ని ప్రచారంలో ఉంచేందుకు గాను నన్నయ రాసిండు. పాల్కురికి సోమనాథుడు బసవపురాణంలో దళితుల ప్రస్తావన చేసిండు. ఇందులోని సూరసానమ్మ కథలో మాదిగల ప్రస్తావన ఉన్నది. అంతేగాదు చెప్పులు కుట్టే మాదరి కక్కయ్య, కాటికాపరి హన్నయ్యలతో పాటుగా దేవరదాసయ్య, మాదర చెన్నయ్య, గుడ్డవ్వ, శ్వపచయ్య, పిట్టవ్వ, కలికామదేవుడు, శివునాగుమయ్య, జుమ్మవ్వ, డోకర కక్కయ్య, నులుక చందయ్య, హరళయ్య ఇంకా అనేకమంది దళితులను, దళిత భక్తులను బసవపురాణంలో సోమనాథుడు పేర్కొన్నాడు. శ్రీకృష్ణదేవరాయలు రాసిన ఆముక్త మాల్యదలో మాలదాసరి పాత్ర మనకు కనిపిస్తుంది. శ్రీనాథుడు పల్నాటి చరిత్రలో దళితుడైన కన్నమనీడు గురించి రాసిండు. ఈతను చాపకూడు ద్వారా 'సహపంక్తి' భోజనాన్ని ఏర్పాటు చేసిన సంస్కర్త బ్రహ్మనాయుడి సర్వసైన్యాధ్యక్షుడు. ఈతడు వైష్ణవుడు. దళితులు ఎక్కువగా ఆరాధించే చెన్నకేశవుడి గుడి మాచర్ల (పల్నాడు)లో ఉన్నది. ఇప్పటి సంగతేమో కాని చాలా ఏండ్ల వరకు ఈ గుడిలో పూజారులు దళితులే ఉండేవారు. ఆ తర్వాతి కాలంలో వేమన, పోతులూరి వీరబ్రహ్మం విరివిగా దళితుల గురించి రాసిండ్రు. వీరికి కొనసాగింపుగా కందిమల్లాయ పల్లె ఈశ్వరమ్మ, దూదేకుల సిద్ధప్ప, రామదుగు శివరామదీక్షితులు, గుంటూరు జిల్లా చర్ల గుడిపాడుకు చెందిన దార్ల సుందరమ్మ, రాకమచర్ల వెంకటదాసు, వేపూరి హనుమద్దాసు, అన్నావధూత, సిద్ధప్ప వరకవి ఇలా ఎంతో మంది తత్త్వాల్లో 'కింది'కులాల వారి గురించి రాసిండ్రు. కులాన్ని నిరసించిన అచల బోధకులు చేసిన రచనలన్నీ ఇందుకు నిదర్శనాలు. అలాంటి అచల మతంలో దళితులైన దున్న ఇద్దాసు, అరిగె రామస్వామి (భూమానందస్వామి) తత్త్వవేత్తలుగా రూపొందిండ్రు. రచనలు చేసిండ్రు. తత్త్వ కవుల్లో కనిపించే ప్రధాన లక్షణాలు ఇలా ఉన్నాయి. తత్త్వం తెలియడమంటే 'జ్ఞానం', 'ఎఱుక' కలగడమే!



దున్న ఇద్దాసు తంబూర

1. లౌకిక వ్యవహార జీవితాన్ని ఆరాధించడం, 2. సంసారంలోనే నివృత్తిని దర్శించడం, 3. జీవనపరంగా స్త్రీ పురుష భేధాలను పాటించక పోవడం, 4. కుల భేధాలే కాదు, హిందూ మహమ్మదీయ మత భేధాలకు కూడా అతీతంగా ఉండడం, 5. విగ్రహారాధనను, కర్మకాండను నిరసించడం, 6. పదార్థ ప్రాధాన్యం (తెలుగులో తత్త్వకవులు ముందుమాట కె.కె. రంగనాథాచార్యులు, 1987, పే. 5).

తమిళంలో రెండు నుంచి ఏడో శతాబ్ది వరకు, ఆ తర్వాత మరాఠీ, కన్నడ, హిందీ, బెంగాలీ, పంజాబీ భాషల్లో 16వ శతాబ్దం నాటికి దళితులు తత్త్వాలు రాసిండ్రు. అయితే తెలుగు నేలలో మొదటి రచనలు మల్లియ రేచన, పంపన, జినవల్లభుడు, నన్నయం, సోమనాథుడు తదితరులు వెలువరించారు. వీరికన్నా ముందు కొంత శాసన సాహిత్యం కూడా వెలుగు చూసింది. అయితే తొలి తెలుగు దళిత రచన/ తత్త్వం 1835 ఆ ప్రాంతంలో మాత్రమే వెలువడింది. ఇన్ని రోజులు తెలంగాణనుంచే గాకుండా ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా తెలుగులో దళితుల రచన వెలువడక పోవడానికి బహుశా తమిళనాడుతో పోలిస్తే జైన, బౌద్ధ మత ప్రభావం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లో అధికంగా ఉండడమే కారణం కావచ్చు. ఈ సమయంలో క్రిస్టియన్ మిషనరీల ప్రభావంతో రచనలు చేసిన దళితులు కూడా లేరు. జైన ప్రభావంతో తెలంగాణలోని కరీంనగర్‌లో జినవల్లభుడి రచనలు వెలువడ్డాయి. కళ్యాణి చాళుక్యులు, తొలి కాకతీయులు కొంత జైనాన్ని ఆచరించిండ్రు, ప్రచారంలో పెట్టిండ్రు. అయితే ఈ జైనాన్ని సమూలంగా తుడిచిపెట్టడంలో భాగంగా పాల్కురికి సోమన శైవ సాహిత్యం వెలువడింది. రాజులకు దగ్గరగా ఉన్న జైన సాహిత్యాన్ని కాదని ప్రజల భాషలో ప్రజలకు చేరువయ్యేందుకు వారి భాషలోనే వారి జీవితాన్ని కైగట్టేందుకు శైవసాహిత్యం వెలువడింది. ఆ తర్వాత కృష్ణమాచార్యుల సింహగిరి వచనాలు (వైష్ణవ సాహిత్యం) వెలువరించిండు. ఈయన

ఇప్పటి రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మండలం సంతపూర్‌కు చెందినవాడు. వీరి తర్వాత కంచర్ల గోపన్న కొంత భక్తి సాహిత్యాన్ని సృజించిండు. పాల్కురికి సోమనాథుడు తన సాహిత్యంలో అన్ని కులాల వారికి ప్రాతినిధ్యం కల్పించాడు. ఇందులో మడివాలు మాచయ్య (రజకుడు), కాకట కోటడు ( యాదవుడు), వాగీషనైనారు (భట్రాజు), కుమ్మరి గుండయ్య, గొల్లవ్వ, ఆడిభర్తుడు (చెస్త), కన్నడ బ్రహ్మయ్య (మంగలి), తెలుగు బొమ్మయ్య (బోయ), కిన్నర బ్రహ్మయ్య (కంసాలి) ఇట్లా అన్ని కులాలవారిని ఆయన పేర్కొన్నాడు. ఆనాటి సమాజాన్ని ప్రతిబింబించాడు. తర్వాతి కాలంలో ఇండియాతో పాటు తెలుగునాట కూడా రాజకీయ అస్థిరత ఉండింది. పాలనాధికారం కోసం హిందూ–ముస్లిం రాజుల కలహాలు, కుల వైషమ్యాలు, ఎక్కువ –తక్కువ జాతి జగడాలు, కుమ్ములాటలు, మూఢాచారాలు, అవినీతి అధర్మం, జంతుబలులు ప్రభలంగా ఉన్న సమయంలో సూఫీ గురువులు తమ బోధనల ద్వారా సమాజాన్ని చికిత్స చేసేందుకు ప్రయత్నించిండ్రు. ఈ సూఫీల ప్రభావం, ప్రోత్సాహంతోనే కింది కులాల వారు తత్త్వ కవులుగా మారిండ్రు. ఇట్లా మారిన వారిలో బహుజనులే ఎక్కువగా ఉన్నారు. వీరిలోనూ అచలమత ప్రచారకులే ఎక్కువ. సూఫీ మతానికి, అచల మతానికి చాలా సారూలున్నాయి. ఇద్దరు కూడా విగ్రహారాధనను నిరసించిండ్రు. కుల వివక్షతను నిరసించిండ్రు. ఇంకా చెప్పాలంటే సూఫీని అధిగమించి అచలమతావలంభకులు స్త్రీలకు తమ మతంలో ఉన్నతమైన స్థానం కల్పించారు. పీఠాధిపత్యాలిచ్చారు. అచలమతబోధకులు తత్త్వాలు, కీర్తనలు, కందార్థాలను, కందార్థ దర్వులను, భజన కీర్తనలను, కోలాట పాటలు/కీర్తనలు, బతుకమ్మ పాటలుగా రాసి ప్రచారం చేసిండ్రు. తెలుగులో తత్త్వాలు మొదటగా చెప్పింది, ప్రచారం చేసింది పోతులూరి వీరబ్రహ్మం. ఈయన అచల మత ప్రభావంతో తత్త్వాలు చెప్పిండు. వీరబ్రహ్మం కాలంలోనే బనగానపల్లెలో ముస్లిం నవాబుల పాలన ఉండేది. శిష్యుడు సిద్దయ్య దూదేకుల కులం వాడు. అంటే ముస్లిం మతం విషయంలో కూడా పూర్తి జ్ఞానం ఉండేది. ఇది ఆనాటి సిద్ధులు/సూఫీల ద్వారా అబ్బింది!? ఇప్పటి వరకు దళితులు సాహిత్యంలో ఎలా రికార్డయింది తెలుసుకున్నాం.

అయితే దళితుడు కావ్యాల్లో ఒక పాత్రగా కాకుండా తామే రాయడం లేదా కీర్తనలు/తత్త్వాలు చెప్పడమనేది దున్న ఇద్దాసుతో ప్రారంభమయింది. ఒకప్పటి నల్లగొండ జిల్లాలో ప్రారంభమైన ఈ అచల పరంపర మొత్తం తెలంగాణ అంతటా వ్యాపించింది. దీనికి భిన్న కులాల వాళ్ళ నుంచి, భిన్న మతాలకు సంబంధించిన వారి నుంచీ మంచి స్పందన లభించింది. అచలం, తత్త్వం, గురువులు, యోగులు, భక్తి/తత్త్వ ఉద్యమకారులుగా, కవులుగా మారిండ్రు. సామాజిక మార్పుకు భక్తిని వాహికగా వినియోగించుకున్నారు. అందుకు కుల, మత, లింగ వివక్ష లేకుండా తమతో ఏకీభవించే అందరిని కలుపుకున్నరు. భక్తిని ఉద్యమంగా మలిచిండ్రు. ఆ ఉద్యమం ద్వారా ఒక మూలకు నెట్టివేయబడ్డ లేదా పీడనకు గురవుతున్న కింది కులాలవారికి ఒక స్వాంతనగా అచలం పనిచేసింది. ప్రజల మానసికస్థితికి తగ్గట్టుగా మార్మికత బోధనలతో ఒక సైక్రియాటిస్ట్ చేసే పనిని అచల గురువులు చేసిండ్రు. అందులో దున్న ఇద్దాసు ఎక్స్‌పర్ట్ అంటే అతిశయోక్తి కాదు.

భక్తి ఉద్యమం దక్షిణ భారతం నుంచి ఉత్తరాదికి పాకింది. ఇందులో చిన్నపాయ తెలుగు ప్రాంతాల్లో ప్రధానంగా తెలంగాణ, రాయలసీమల్లో ప్రచారంలో ఉండింది. భక్తి–ఉద్యమం రెండూ ఒకే ఒరలో ఇమడని కత్తులు. భక్తి అంటే సరెండర్ కావడం. ఉద్యమం అంటే రెబెల్ కావడం. ఇవి రెండూ ఒక్క దగ్గర ఇమడం కష్టసాధ్యమైన పని. అయితే ఈ కత్తులకున్న వాడి, వాటిని ఉపయోగించే వాడి నైపుణ్యాన్ని బట్టి ప్రజామోదం, ప్రచారాన్ని పొందాయి. తమ కలాలనే కరవాలాలుగా భక్తి/తత్త్వ సాహిత్యకారులు ఆ యా కాలాల్లో ఉపయోగించుకున్నారు. కులాధిపత్యాన్ని నిరసించిండ్రు. సమానత్వం కోసం కృషి చేసిండ్రు. తత్త్వాన్ని అంటే ప్రశ్నించే పరంపరను ఉద్యమంగా మలిచిన వారు తత్త్వ కవులు. అయితే కొందరు కేవలం భక్తి ద్వారానే సమాజంలో మార్పులకు కొంత ప్రయత్నం చేసిండ్రు. నయనార్లలోని నందనార్ ఇందుకు ఉదాహరణ. ఎక్కువ శాతం మంది తమ సాహిత్యం ద్వారా తత్త్వం వాహికగా ఉద్యమాన్ని ఇంకా చెప్పాలంటే సామాజికోద్యమాన్ని నిర్మించారు. ఈ భక్తి/తత్త్వ కవిత్వోద్యమంలో కూడా బ్రాహ్మణాధిపత్యాన్ని నిలబెట్టడానికి కొంతమంది ప్రయత్నం చేసిండ్రు. ఆళ్వార్లలో తెన్గల్ శాఖవారు ఈ ప్రయత్నం చేసిండ్రు. మరోవైపు వడగళ్ శాఖకు చెందిన రామానుజచార్యుడు కుల, లింగ వివక్ష లేకుండా ఆళ్వార్లందరినీ సేవించాలని చెప్పిండు. అయితే బ్రాహ్మణాధిపత్యాన్ని నిరసిస్తూ కుల అసమానతలకు, అంటరాని తనానికి వ్యతిరేకంగా ప్రజాచైతన్యం కల్గించినవారు న్యాయంగానే ఇవ్వాళ ఉద్యమకారులుగా గుర్తింపు పొందుతున్నారు. భూస్వామ్య, రాచరిక వ్యవస్థలో స్థానిక భూస్వాములు, మత నాయకులు, మతాధిపతులు, దొరలు, దేశ్‌ముఖ్‌లు, దేశ్‌పాండ్యాలు, జాగీర్దారులు, సంస్థానాధీశులు వివిధ చేతివృత్తిదారులు, కూలీలు, సన్నకారు రైతులు, చిన్న చిన్న వ్యాపారస్తులపై ఆధిపత్యం చలాయిస్తూ నిరంకుశంగా వ్యవహరించేవారు. ఈ నిరంకుశత్వానికి, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సంస్కరణ భావాలతో తత్త్వవేత్తలు రచనలు చేసిండ్రు. తత్త్వకవులు సమాజంలోని అట్టడుగు వర్గాలవారికి స్వాంతన చేకూర్చే రచనలు చేసిండ్రు. ఉన్నతవర్గాల వారు కర్మకాండలు, యజ్ఞయాగాదుల ద్వారా భక్తిని ప్రదర్శించుకున్నారు. అయితే గురుబోధ ద్వారా జ్ఞానం, ఎరుక, బయలు ద్వారా చైతన్యాన్ని తత్త్వకవులు కల్పించిండ్రు. హిందీలో భక్తి కవులు, సంత్ కవులు అనే విభజన ఉన్నది. దీన్ని తెలుగులో భక్తి కవులు, తత్త్వ కవులుగా చెప్పవచ్చు. భక్తి కవులు కేవలం భక్తికి మాత్రమే ప్రాధాన్యత నివ్వగా, సంత్ లేదా తత్త్వ కవులు చైతన్యానికి, జ్ఞానానికి ప్రాధాన్యతనిస్తూ ఆధిపత్యానికి వ్యతిరేకంగా రాసిండ్రు. గానం చేసిండ్రు. అంతేగాదు భూస్వామ్య వ్యవస్థలో క్షీణిస్తున్న మానవసంబంధాలను, విలువల్ని ఈసడించిండ్రు.


పాదుకలు

(మిగతా వచ్చే సంచికలో)

–సంగిశెట్టిశ్రీనివాస్, m:98492 20321
e: sangishettysrinivas@gmail.com

## కొత్త ఆలోచనలకు తెరతీసిన

# "పిల్లల పండుగ!"

సిరిసిల్లకు దగ్గరలో వేములవాడకు వెళ్ళే మార్గంలో రంగి నేని సుజాతా మోహనరావు ఎడ్యుకేషనల్, చారిటబుల్ ట్రస్ట్ వారి ఆశ్రమ పాఠశాల. దుర్భర దరిద్రంలోంచి, పేద కార్మిక, రైతాంగ బడుగు వర్గాల, అనాథలైన పిల్లలు పూర్తి ఉచితంగా చదువుకునే తమ స్వంత ఇల్లులాంటి పాఠశాల. ఎటుచూసినా ఆకుపచ్చగా కనిపిస్తున్న ప్రశాంత విశాలమైన ప్రాంగణం. ఆ పిల్లలందరికీ తల్లీ, తండ్రీ అన్నీ తానై అక్కడే ఉండి మోహనరావుగారు నడుపుతున్న విద్యాలయం. పిల్లలంటే, సమాజం అంటే, విద్య అంటే, ప్రకృతి అంటే ప్రేమ ఉన్న వాళ్ళు తప్పకుండా సంద ర్శించాల్సిన పిల్లలతోట. గాంధీ, రవీంద్రుడూ నడి పిన పాఠశాలలు ఇలాగే ఉండేవేమో అనిపిం చే చోటు. గత 7,8 తేదీల్లో పిల్లల పండుగ జరిగింది క్కడ. గత సంవ త్సరం కూడా ఇక్కడ కేంద్ర సాహిత్య అకాడమీ, రంగినేని ట్రస్టు సంయుక్తంగా రెండు రోజులు దేశంలోనే అతిపెద్ద స్థాయిలో పిల్ల లకు సాహిత్య రచన శిక్షణ శిబిరాన్ని నిర్వహిం చారు. ఆనాటి పిల్లల రచనలు కవితా, కథా సంకలనాలుగా చిల్డ్రన్స్‌డే కానుకలుగా అందించే ప్రయత్నాలు చేస్తున్నారు.



ఏడవతేదీ ఉదయం-నేనూ, నల్లగొండ నుంచి వచ్చిన బాల సాహితీవేత్త పెండెం జగదీశ్వర్, సాహిత్య అకాడమీ యువ పుర స్కార గ్రహీత పింగళి చైతన్య, బాలసాహితీ వేత్తలు రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి, పాలమూరుకు చెందిన మాడభూషి రంగాచార్య స్మారక కమిటి బాధ్యులు మాడభూషి లలితాదేవి, ఉపాధ్యాయులు గిరిజ కలిసి హైదరాబాదు నుంచి బయలుదేరాం.

సుమారు మూడు గంటలపాటు సాగిన మా ప్రయాణంలో పరిచయాలు మొదలై, బాల సాహిత్యంలో ప్రస్తుత పరిస్థితుల మీద మా మధ్య చర్చలు, మాటలు నడిచాయి. వాటిలో ఈనాటి పిల్లలకు 'మాతృభాష రాయడం సరిగా రావడం లేదనే విషయం' ప్రధానంగా చోటుచేసుకుంది. ఇంతకాలం పాఠ్యపుస్తకాల్లో పిల్లల మాతృభాష పేరిట చలామణి అయిన తెలుగు పల్లెప్రజల, దళిత, బహుజన వర్గాల, శ్రామిక ప్రజల తెలుగుకు చాలా దూరంగా, భిన్నంగా ఉంటూ, సంస్కృతానికీ, గ్రాంథికానికీ, కావ్య పురాణ భాషలకూ దగ్గరగా ఉంటూ వచ్చింది. ప్రజలు మాట్లాడే భాషలో ఒత్తు అక్షరాలు, అనేక శబ్దాల కలయికతో కూడిన సంక్లిష్ట అక్షరాల పదాలూ, మాటలూ ఉండవు. అచ్చ తెలుగుకు అక్షరాలు 36 అని పరవస్తు చిన్నయసూరి వంటి వాడే చెప్పాడు, కనుక సంస్కృతం నుంచి వచ్చిన అక్షరాలు, శబ్దాలు, పదాలు, పద్ధతులు, గ్రాంథిక వాక్య పద్ధతి, వాక్య నిర్మాణాలు పిల్లలకు పరాయిగానే ఉంటాయి. కనుక ఇప్పటి పిల్లలకు తెలుగు నేర్పడం ప్రత్యేక దృష్టిలో శ్రద్ధతో జరగాలి. ఇలా రకరకాల అభిప్రాయాలు చెప్పుకుంటూ, మాట్లాడుకుంటూ మేం సిరిసిల్లాకు చేరేసరికి పద కొండు గంటలు కావొచ్చింది.

సమావేశం అప్పుడే ప్రారంభమైనట్టుంది. డా॥ పత్తిపాక మోహన్ సమన్వయంలో రంగినేని మోహనరావు అధ్యక్షతన సమావేశం జరుగుతున్నది. వేదికమీద రంగినేని సుజాత, గరిపెల్లి అశోక్, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ డి. కృష్ణభాస్కర్, మరికొందరు అతిథులు కనిపిస్తున్నారు. 'బాల సాహిత్యాన్ని చదివే వాళ్ళుగానో, వినేవాళ్ళుగానో మాత్రమే పిల్లలు ఉండిపోవడం సరి కాదని, బాలలు బాల సాహిత్య రచయితలుగా మారా లని, వారి లోని 'సృజన' సాహిత్య రంగంలో బహు ముఖాలుగా వికసిం చాలని, అందుకు ఇలాంటి పండుగలు పాదులు వేస్తాయని' కార్య క్రమ సంచా లకులు లక్ష్యాల్ని వినిపించారు. రంగినేని సుజాత జ్యోతి ప్రకాశనం చేసిన తరు వాత ముఖ్యఅతిథిగా వచ్చిన కృష్ణ భాస్కర్ (జిల్లా కలెక్టర్, మెజి స్ట్రేటు) ఈ పండుగను ప్రారంభిం చారు. ముఖ్య అతి ధులుగా వచ్చిన జూకంటి జగన్నాథం, డా॥ నలిమెల భాస్కర్, ధనా లకోట రాధాకిషన్, పింగళి చైతన్య, మద్దికుంట లక్ష్మణ్ మొద లైన వారి సందేశాలు, అభినందనల తరువాత బాల సాహితీ వేత్తలు డా॥ మలయశ్రీ, గరిశకుర్తి రాజేంద్ర, తిరునగరి వేదాంత సూరి, రేగుల పాటి కిషన్‌రావ్, వాసాల నర్సయ్య, నారంశెట్టి ఉ మా మహేశ్వర్ రావు, పింగళి చైతన్యలను సత్కరించారు. ప్రారంభ సమావేశం రంగినేని నవీన్‌కుమార్ వందన సమర్పణతో ముగిసింది.

వెంటనే జరిగిన తొలి సదస్సుకు ప్రముఖ రచయిత పెద్దింటి అశోక్ కుమార్ అధ్యక్షత వహించారు. బహుభాషా వేత్త నలిమెల భాస్కర్ ప్రధాన వక్తగా 'పిల్లలు భాషను నేర్చుకోవడంలో శ్రద్ధవహిస్తే సాహిత్య రచన వాళ్ళకు కరతలామలకమౌతుందని' చెప్తూ, తాను సుమారు 30 ఏళ్ళ కిందట రాసిన బాలగేయాన్ని పాడి 'సమాజ పుస్తకమందు దాగిన పేద బతుకుల పేజీలు తిప్పి అవలోకించమని, ఆలోచించమని' చెప్పారు. విషయ నిపుణులుగా వచ్చిన డా॥ బి.వి.యస్ స్వామి, పెండెం జగదీశ్వర్, పింగళి చైతన్య, సభాధ్యక్షులు పెద్దింటి అశోక్ కుమార్, సమన్వయకర్త జిందం అశోక్, నాగిళ్ళ రమేశ్ బాల సాహిత్య రచనలు ఎలా చేయాలో, తమ అనుభవాలు ఏమిటో వివరించారు. ఇంటి భాషలోనే రాయా లని, చుట్టూ ఉన్న విషయాలే రచనల వస్తువులుగా గ్రహించమని' చెప్పారు. 'బాల సాహిత్యం చదవాలని, వినాలనీ, కృషిచేస్తే సాహిత్య రచన ఎవరైనా చేయవచ్చునని, బాల సాహిత్యాన్ని బాలలే రాసే కాలం వచ్చిందని, ఈనాడు పిల్లలు రాస్తున్న ఎన్నో పుస్తకాలు వస్తున్నాయని' చెప్పారు.

మధ్యాహ్నం ఒకటిన్నరకు భోజనాల కార్యక్రమం. ఆ పచ్చటి

పండుగ వాతావర ణంలో, పిల్లగాలుల్లో వ్యాపిస్తున్న పిల్లల మాటలు, సీతాకోక చిలుకల్లా చుట్టూ కనిపిస్తున్న పిల్లల నడుమ, బాల్యాల పూల తోటలో మా అందరి మనస్సులూ, కడుపులూ కమ్మగా నిండి పోయాయి.

మధ్యాహ్నం గం॥ 2.15 ని॥లకు జరిగిన రెండవ సదస్సులో గోనె బాల్‌రెడ్డి సమన్వయ కర్తగా కందేపి రాణిప్రసాద్ అధ్యక్షత వహించారు. బాల సాహితీవేత్తలు రాజా వాసిరెడ్డి మల్లేశ్వరి, సుమిత్రా దేవి, ఉండ్రాళ్ళ రాజేశం, నర్రా అంజన్‌రెడ్డి, డా॥ సిరి పాల్గొని, బాల సాహిత్య రచనలో మెళుకువలు. భాష, వస్తువు, ప్రక్రియల గురించి వివరించారు.

మూడున్నర గంటలకు జరిగిన సమావేశంలో అధ్యక్షత వహించిన డా॥ వి. ఆర్. శర్మ మాట్లాడుతూ 'సుమారు వందేళ్ళ కిందటి బాలసాహిత్య దృక్పథం, ఆసూత్రీకరణలు, మార్గదర్శకాలు ఆనా దు గొప్పవే, కానీ ఈనాడు పరిస్థితులు ఎంతో మారాయని, నేటి పిల్లలకు బాల్యం అనేదే లేకుండా పోతున్నదని, బాల్యం మధురమైన దశనే కానీ, ఈనాడు బాల్యం అనేక తీవ్రమైన పరిస్థి తులలో సంఘర్షిస్తున్నదని, అవిద్య, చదువు ఒత్తిడి, బాల కార్మికత, అనాథలుగా మారిపోవడం, బాలవేశ్యలు, బాల నేరస్తుల సమస్యలు, డ్రగ్స్, రాజకీయాలు, హత్యలు, యుదా ్ధలు, పర్యావరణ, ఆరోగ్య సమ స్యలు, వలసలు వంటి అనేక సమస్యల్లో బాల్యం చితికిపోతున్నదని' అన్నారు. ఈ సమా వేశంలో బాలసాహితీ వేత్తలు ఐతా చంద్రయ్య, ఎన్నవెళ్ళి రాజమౌళి, మాడ భూషి లలితాదేవి, ఓజు దేవేంద్రాచారి ప్రసంగించారు. పిల్లలకు బాల సాహి త్యానికి సంబం ధించిన తమ అనుభవాలను వివరించి, పిల్లలతో పాడిం చారు. చిన్న కథలు చెప్పారు. ఎన్నో విలువైన సూచనలు, సలహాలు అందించారు.



మర్నాడు ఉదయం టీ తాగుతున్నాం ఉపాధ్యాయుడు, రచయిత నాగిళ్ళ రమేశ్ "సార్...! బాలసాహితీ వేత్తలకు నావి కొన్ని ప్రశ్నలు, విన్నపాలు" అంటూ ప్రారంభిచాడు. నేనూ, పెండెం జగదీశ్వర్, నారంశెట్టి ఉమామహేశ్వరరావు 'చెప్పండి' అన్నాం. 'సర్! నేను పల్లెటూళ్ళో పేద, దళిత, బహుజన, శ్రామిక, రైతాంగ వర్గాల పిల్లల మధ్య పనిచేస్తున్నాను. వాళ్ళలో ఒకడిగా అడుగుతున్నాను. బాల సాహిత్యం తెలుగులో మొదలైనప్పటి నుంచి, ఇప్పటి వరకు మా పిల్లలకు ఏమైనా చోటు దక్కిందా? పాత్రలు, జీవితాలు, పైన నేను చెప్పిన వర్గాల పిల్లలకు సంబం ధిచిన వారికి బాలసాహిత్యం ఇచ్చిన చోటు ఎంత? అది ఎలాంటిది? అలాగే మీ రచనల్లో బాల్యాన్ని గురించి చాలా అందంగా, గొప్పగా చెప్తారు. కానీ మెజారిటీ వర్గాల పిల్లల బాల్యాలు అలా ఉన్నాయా? లేవు. అనేదే వాస్తవం కదా! మరెందుకు బాల సాహిత్య రచయితలు తమ రచనల్లోకి ఈ విషయం రానీయరు? మధ్యతరగతి, ఉ న్నత మధ్యతరగతి జీవుల, భద్ర జీవుల బాల్యమే మొదటి నుంచి బాల సాహిత్యంలో చోటు చేసుకుంటున్నదని నేనంటాను – నిజం కాదా? ఈనాడు బాల్యాన్ని ధ్వంసం చేస్తున్న తీవ్రమైన సమస్యలు, నేటి పిల్లలు సమస్యలు బాల సాహిత్యానికి ఎందుకు పనికి రాకుండా పోయాయి?'

ఇలాంటి ప్రశ్నలు నాగిళ్ళ రమేశ్ ఎంతో వేదనగా వేశాడు. తెలుగు బాల సాహిత్యంపై ఆ బాల్యాల తరుపున అడిగిన ప్రశ్నలు ఈనాడు తప్పనిసరిగా పట్టించుకోవలసిన ప్రశ్నలు. నిజమే! బాల సాహిత్యం కేవలం నీతిబోధనకే పరిమితమై పోతున్న స్థితిలోంచి బయటపడాలి. ఈనాటి మెజారిటీ బాల్యాలనూ, వాళ్ళ సమస్యలనూ పట్టించుకోవాలి. వాళ్ళకు జీవితాల్ని గెలిచే, నిలబెట్టుకునే రచనలతో బాలసాహిత్యం రావాలి. బాల్యం అంటే పద్దెనిమిదేళ్ళ వరకు అని ప్రపంచ బాలల చట్టాలు, మన దేశపు చట్టాలు నిర్దేశిస్తున్నా బాల సాహితీ వేత్తలు శైశవాన్నే బాల్యంగా నమ్ముతున్న పరిస్థితి ఎందుకు ఉంది?'

ఆయన ప్రశ్నలకు మేం ఏదో సమాధానాలు చెప్పాం. అవి నాకైతే సంతృప్తిగా అనిపించలేదు. ఏమైనా ఈ చర్చ బాల సాహిత్య రంగాన్ని నేడు చుట్టుముడుతున్నది. ఎంత పట్టించుకోక పోయినా బాలసాహిత్య రంగం ఈనాటి సామాజిక వాస్తవికతకు మారితీరాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. ఏమో!.... తెలంగాణ, తెలుగువాళ్ళ బాల సాహిత్యమే ప్రపంచ బాలసాహిత్య రంగానికి కొత్త చూపును ప్రసాదిస్తుందేమో!.... చూడాలి!...

ఉదయం 11 గంటలకు పిల్లల్ని కవితలు, కథలు రాసే గ్రూపులుగా ఏర్పరచి, పర్యవేక్షణకు బాలసాహితీవేత్తలను తోడిచ్చి, వారికి కేటాయించిన గదుల్లోకి పంపించారు. సుమారు రెండు గంటల వ్యవధిలో 36 పాఠశాలల నుంచి పాల్గొన్న ఆ పిల్లల్లో 102 కథలు, 44 కవితలు పిల్లలు రాశారు. తరువాత గం. 12.30 ని.లకు బాలసాహిత్య పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది.

ముగింపు సభ రంగినేని మోహనరావు అధ్యక్షతన జరిగింది. జిల్లా రాజస్వ అధికారి (డిఆర్ఓ) గాజుల శ్యాంప్రసాద్ లాల్‌గారు, ఆర్.డి.ఓ వెంకటేశ్వర్లు, యం.ఆర్.ఓ. రాజు, డి.ఆర్.జి.ఏ. ప్రాజెక్టు అధికారి, కథారచయిత బెజ్జారపు రవీందర్, మహిళా శిశు సంక్షేమ అధికారి డి. సరస్వతి ముఖ్య అతిధులుగా, ఆత్మీయ అతిధులుగా పాల్గొని విద్యార్థులకు ప్రశంసాపత్రాలు బహూకరించారు. విషయ నిపుణులను, అతిధులను సత్కరించారు. జ్ఞాపికలు అందజేశారు.

పిల్లలు తాము రాసిన రచనలను కొన్నింటిని చదివి వినిపించారు. ముఖ్యంగా 'మణికంఠ' అనే ఎనిమిదేళ్ళ బాబు అనాథల గురించి పాడిన పాట ఆ పిల్లాడితో బాటు ఎందరికో కన్నీళ్ళు తెప్పించింది. "ఇలా పిల్లల సాహిత్య పండుగను ప్రతి సంవత్సరం నిర్వహించాలనుకుంటున్నామని, పిల్లల రచనల్ని పుస్తకాలుగా ప్రచురిస్తామని, అందరూ సహకరించాలని' మోహనరావుగారు తెలిపారు. శ్రీకాకుళం, మహబూబ్‌నగర్, నల్లగొండ, హైదరాబాద్, సిద్ధిపేట, కామారెడ్డి వంటి దూరప్రాంతాల నుంచి వచ్చిన బాలసాహితీవేత్తలు. బాలసాహిత్యానికి ఒక కొత్త చూపును ఇచ్చే ఈ పండుగను నిర్వహించిన రంగినేని మోహనరావు, పత్తిపాక మోహన్, గరిపల్లి అశోక్, పెద్దింటి అశోక్ కుమార్, నాగిళ్ళ రమేశ్, జూకంటి జగన్నాథం వంటి వాళ్ళను, పిల్లలను ఇతర ఏర్పాట్లు చేసిన సిబ్బందిని, అందరూ మనస్ఫూర్తిగా అభినందించారు.

– డా॥ వి.ఆర్. శర్మ, m : 9177887749
e : dr.v.r.sharma@gmail.com


సతీష్‌చందర్ మాతృమూర్తి సత్యవతి గారికి మొదటి ప్రతిని అందజేస్తున్న పుస్తకావిష్కర్త బి. నరసింగరావు, తదితరులు.


సన్నిధానం, జూలూరు గౌరీశంకర్, పుస్తకావిష్కర్త బి.నరసింగరావు, సతీష్‌చంద్ర, విద్యాసాగర్, కుప్పిలి పద్మ, కార్టూనిస్ట్ జావేద్

# పంచమ వేదమా..? పంచవేదాలూనా..?

## 'పదచిత్రం' ఆవిష్కరణ సభలో 'మాభూమి' దర్శకులు బి.నర్సింగరావు

'సతీష్ చందర్ రచించిన పంచమ వేదాన్ని వెతికాను. దొరక్కుండా వుంటుందా..? దొరికింది. దాచలేరు కదా! అయిదో వేదమే రాశారు. అంటే నాలుగు వేదాలూ వదిలేసారానా? నిజమే. 'పంచమవేదం' దళిత కవిత్వానికి మేనిఫెస్టోనే...! కానీ ఆయన రాసింది 'పంచమవేదమా'? పంచ (అయిదు) వేదాలూనా..? అయిదు వేదాలూ రాశారు.'

ఈ వ్యాఖ్య చేసింది ఎవరో కాదు. 'మాభూమి' 'రంగులకల' 'దాసి' వంటి చిత్రాలతో భారతీయ చిత్రాలకు.. అందునా తెలుగు చిత్రాలకు... అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టిన దర్శకులు, కవి, చిత్రకారులు బి.నర్సింగ రావు అన్నారు.

సతీష్ చందర్ రచించిన 'పదచిత్రం' అనే కొత్త కవిత్వ సంపుటిని, 29 అక్టోబరు 2017న ఆయన బషీర్‌బాగ్ (హైదరాబాద్) ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రపంచకవిత్వం వెలుగులో తెలుగు కవిత్వాన్నీ, సతీష్ చందర్ కవిత్వాన్నీ సమీక్షించారు.

సతీష్ చందర్ తొంభయ్యవ దశకంలో ప్రచురించిన 'పంచమవేదాన్ని' ఆయన గుర్తుకు తెస్తూ, 'పదచిత్రం' వరకూ కవి సాగించిన తాత్వికయాత్రను వివరించారు.

'పంచమ వేదం'లో ఒక్క అయిదవ వేదం మాత్రమే వుంటే, 'పద చిత్రం'లో అయిదు వేదాలూ అని చెబుతూ వాటిని ఆయన ఉటంకించారు. ఇరవయినాలుగు విభాగాలుగా విస్తరించిన ఈ గ్రంథం నుంచి అయిదు కవితలను ఉటంకించి, వీటిని అయిదు వేదాలుగా భావించవచ్చన్నారు. అవి ఇలా వున్నాయి:

ఒకటవ వేదం: కవిత్వానికే కాదు.. జీవితానికీ తొలిపలుకే. జన్మవెనుక జన్మను వెతుకుతూరెందుకో! అమ్మే కదా పూర్వ జన్మ. పడినప్పుడు ఎలాగూ అమ్మను తలుస్తాం. ఈ మధ్య ఆమెను తలవటం కోసమే పడుతున్నాం ఎందుకో..!

రెండవ వేదం: కనిపించాలన్న కోరికతో..కనిపించీ, కనిపించకుండా వుండటమే సిగ్గు. విరిసీవిరియని మొగ్గలో.. కందీ కందని బుగ్గలో. అందీ అందని ఉగ్గులో అంతా సిగ్గే.

మూడవ వేదం:ఏడాది పొడుగునా జెండాని అమ్ముకుని ఏడాదికి ఒక్కసారే జెండాని ఎగురవేసేది నేత. సంవత్సరమంతా జెండాని అమ్ముకుని, పండగ నాడు, జెండాని అమ్ముకునేది నేత.

నాల్గవ వేదం: కాగితాల్ని విసిరేసినట్లు జీవితాల్నీ విసిరేస్తాం. వాళ్ళే వీధి బాలలు.

పంచమ(అయిదవ) వేదం: కొన్ని దూరాలు ఎన్నటికీ తరగవు.. నేలకీ, నింగికీ; ఆకలికీ, అన్నానికీ; అవమానానికీ, ఆత్మగౌరవానికీ

ఈ అయిదు వేదాల సారాన్ని నింపుకున్న కవిత్వ సంపుటిగా 'పద చిత్రాన్ని' బి.నర్సింగరావు గుర్తించారు.

తక్కువ పదాలలో ఎక్కువ భావాన్ని చెప్పే కవిత్వపద్ధతి ప్రపంచ సాహిత్యంలో ఎన్నిరకాలుగా వుందో సోదాహరణంగా వివరించారు.

భారతీయ సాహిత్యం నుంచి హాలుడి 'గాథాసప్తశతి' నుంచీ, జయ వల్లభుని 'వజ్జలగ్గ' నుంచీ, సూఫీ తత్త్వాలనుంచీ, కన్నడ వచనాలనుంచీ ఉదాహరణలు ఇస్తూ, జాపనీస్ హైకూలతో ఈ సంక్షిప్త వరవడి పరాకాష్టకు చేరిందన్నారు. అయితే 'హైకూ'ల్లో పద నియతి వుంటుందన్నారు.

ఇలాంటి నియితి ఏదీ లేకుండానే 'పద చిత్రం' కవితలు ఆ స్థాయికి చేరుకున్నాయన్నారు. ఇందులోని కొన్ని కవితలు నిర్వచనాల్లాగా వున్నాయనటం వాస్తవమేనని అంటూనే, కొన్ని చోట్ల కవి సూత్రీకరణలు చేసిన విషయాన్ని కూడా బి.నర్సింగరావు ప్రస్తావించారు. సూత్రీకరణలు చేసి కవి బయిటపడటం చాలా కష్టమని, కానీ సతీష్ చందర్ సులభంగా బయిటకు రాగలిగారన్నారు.

ప్రపంచంలో తెలుగు గ్రంథాలు వుండే ప్రతీ చోటా వుండదగ్గ గ్రంథంగా 'పదచిత్రాన్ని' బి.నర్సింగరావు కొనియాడారు.

ఈ సభకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న కవి, తెలంగాణ వెనుకబడిన వర్గాల కమిషన్ సభ్యులు జూలూరు గౌరీ శంకర్ మాట్లాడుతూ సతీష్ చందర్ రచించిన 'పదచిత్రం' తెలుగు సాహిత్యానికి సంబంధించినంత వరకూ 'గ్లోబ్' లాంటిదన్నారు. ప్రపంచానికే ఒక చిత్రపటంగా ఈ గ్రంథాన్ని భావించవచ్చన్నారు. ఆంధ్ర ప్రాంతం వెళ్ళి అక్కడ తెలంగాణ నినాదాన్ని ధైర్యంగా ప్రకటించి, ముందు నుంచీ తెలంగాణ ఉద్యమానికి బాసటగా నిలిచిన కవి సతీష్ చందర్ ఆయన గుర్తు చేశారు.

ఈ సభకు అధ్యక్షత వహించిన కవి, విశ్రాంత ఐయ్యేఎస్ అధికారి ఎ.విద్యాసాగర్ ఉపమానాలను వెయ్యటంలో సతీష్ చందర్ విశేషమైన ప్రతిభ చూపుతారన్నారు.

'పదచిత్రం' తొలిప్రతిని సతీష్ చందర్ తల్లి, విశ్రాంత ఉపాధ్యాయురాలు సత్యవతమ్మకు ఆవిష్కర్త నర్సింగరావు అందజేశారు. ఈ సభలో గ్రంథ రచయిత సతీష్ చందర్‌తో పాటు, స్త్రీవాద రచయిత్రి, కవి కుప్పిలి పద్మ, కవి, పరిశోధకులు, సన్నిధానం నరసింహ శర్మ, కవి, చిత్రకారుడు జావెద్ పాల్గొన్నారు.

ఈ సభకు పలురంగాల్లో ప్రసిద్ధులు హాజరయ్యారు. తెలంగాణ రిసోర్స్ సెంటర్ వ్యవస్థాపకులు ఎం. వేదకుమార్, 'అంకురం' చిత్ర దర్శకులు ఉమామహేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర నేత ఎస్.కుమార్, ప్రగతి శీల మహిళా సంఘం అధ్యక్షురాలు సంధ్య, బహుజన ఉద్యమనేతలు కొరివి వినయ కుమార్, సుధాకర్‌లు, సుప్రసిద్ధ కవులు అరణ్య కృష్ణ, హనీఫ్ ప్రభృతులు హాజరయ్యారు.

**- దక్కన్ న్యూస్**

## పాఠక హృదయాలతో నిత్యం సంభాషించే కవిత్వం

# డా॥ ఎన్.గోపి 'జీవన భాష'

ఆధునిక వచన కవితా పరిణామ వికాసంలో మైలురాళ్ళు అనదగిన కవితా సంపుటాలను అందించిన సుప్రసిద్ధ కవి డా॥ ఎన్ గోపి. అయిదు దశాబ్దాలుగా నిరంతరం కవితా సృజనలో నిమగ్నమవడమే వారి సాహిత్య చైతన్యానికి నిదర్శనం. నిర్విరామంగా రాయడమే కవి ప్రతిభకు తార్కాణం కాదు. అది వారి క్రియాశీల స్వభావానికి సంబంధించిన మరో స్ఫూర్తిదాయక అంశం. కాని ప్రతి కవితను తొలి కవితంత ఉద్వేగంతో, తపనతో రాయగల శక్తిని నిలుపుకోవడం గోపిగారి ప్రత్యేకత. నేటి తరానికి ఆదర్శనీయమైన విషయం. ఇటువంటి నిబద్ధత ఒక సాహిత్య సంస్థల్లోనో, ఉద్యమ నాయకుల్లోనో కనిపిస్తుంది. గోపిగారిలోనూ అటువంటి కమిట్‌మెంట్‌ను చూడవచ్చు. వృత్తిగతంగానూ, సాహిత్యయానంలోనూ అనేక ఉన్నత స్థాయిలను అందుకున్నవారిలో సహజంగా కొంత సృజనపరమైన భావావేశ ఉధృతి, సాంద్రత పలచ బడుతుంది. గోపిగారిలో మాత్రం అటువంటి నిర్లిప్తత కనిపించదు. విస్తృతమైన అనుభవంతో మరింత లోతుగా లోకపరిశీలన చేస్తున్నారు. సామాజిక పరిణామాలపట్ల అప్రమత్తతతో స్పందిస్తుంటారు. నిత్య కవిత్వ స్పృహ, సామాజిక బాధ్యత వారి కవిత్వంలో తొణికిసలా డుతుంటుంది. అందుకు తాజా సాక్ష్యమే వారి ఇరవై రెండవ కవితా సంపుటి 'జీవన భాష'.




ఈ సంపుటిలోని అరవైఐదు కవితలు మనం చూడలేకపోతున్న ప్రపంచాన్ని, కవి చూసిన కొత్తదైన ప్రపంచాన్ని కళ్ళముందు ఆవిష్కరిస్తాయి. కవి నడిచిన దారులవెంట ఆర్ద్రహృదయంతో కలియతిరుగుతాము. తెలియని అనుభూతి భారంతో కవి హృదయావరణంలోకి వెళ్ళి ఉపశమనం పొందుతాం. 'జీవనభాష' లోని కవిత్వం మన జ్ఞాపకాలను రగుల్కొలిపినా, సామాజిక వేదనకు గురిచేసినా, రాజకీయ విధానాలపై ఆగ్రహాన్ని ప్రకటించినా పాఠకుడి పరిధిని దాటి సంచరించదు. పాండిత్య ప్రదర్శనా దారుల్లో పయనించదు. "అసంపూర్ణ కవిత" లో గోపిగారికి పాఠకుడి మీద ఉన్న గౌరవం అర్థమౌతుంది. కొత్తగా కవిత్వం రాస్తున్న కవులకు కవిత్వ రహస్యలను తెలిపే కవికుల గురువుగానూ ఈ కవితలో కనిపిస్తారు. 'ముందు నీ కవితకు/నువ్వే శ్రోతగా మారాలి' అంటారు. పాఠకుడిని మరిచిపోయి రాసిన వాక్యాలు కవికే పరాయివిగా కనిపిస్తాయని హెచ్చరిస్తారు. 'పాఠకుడు భావుకుడు/ కాలటం తెలిసిన కట్టెలాంటివాడు/ కరగటం తెలిసిన వెన్నలాంటివాడు/ నేను రాసిన కవిత సగమే/ అతనికి అందినప్పుడే అది సంపూర్ణ కవిత' అంటూ కవిత్వ ఆల్కేమీని ఈ తరానికి పంచుతారు.

గోపిగారు కవితలో కథానుభూతిని పొదుగుతారు. సాధారణంగా కథ సంఘటన కేంద్రీకృతంగా నడుస్తుంది. ఒక బలమైన సన్నివేశం చుట్టూ కథ తిరుగాడుతుంది. సహజమైన వర్ణన, స్వభావోక్తితో కథ జీవం నింపుకుంటుంది. అటువంటి కథనాత్మక పద్ధతిని ధ్వన్యాత్మకంగా నిర్వహించడంలో గోపిగారు శబ్దశక్తివంతులు. 'మరోసారి గురజాడ' కవితనే తీసుకుందాం. కవి వైజాగ్ నుంచి శ్రీకాకుళం వెళ్తుంటే దారిలో కలిసిన ఓ పెద్దాయనతో జరిగిన సంభాషణ అంటూ మొదలైన ఈ కవిత మనల్ని కదలించివేస్తుంది. ఆలోచన్లో పడవేస్తుంది. కలిసిన పెద్దాయన ఎవరో కాదు.....'నవ్య కవితకు ఊపిరులూదిన నవయుగ వైతాళికుడు' గురజాడ అప్పారావు. వారితో నేటి అగ్రశ్రేణి కవి కలిస్తే ఎలాంటి ఉన్నతస్థాయి మేధో సంభాషణ జరుగుతుందో అద్భుతంగా గోపిగారు కవిత్వీకరించారు. 'అన్ని దేశాల్ కమ్మవలెనోయ్' అన్నారు ''మీరు / అన్ని దేశాల నరుకులు మనల్ని కమ్మేస్తున్నాయిప్పుడు / ఇప్పుడన్ని దేశాల్లో అమెరికా నిండిపోయింది / ఇప్పుడు దేశభక్తి అంటే / అమెరికా భక్తే" అంటూ ఆనాటి గురజాడ రచనల్లోని పరిస్థితులు నేడు మరింత దుస్థిత స్థితుల్లోకి వెళ్ళిపోయిందనే చేదునిజాల్ని వ్యంగ్యంగా వినిపిస్తుందీ కవిత. కవి నూరేళ్ళ తర్వాత కూడా మారని పాడు కాలాన్ని చూపి గురజాడనే ఆలోచన్లో పడవేసారు. కవిత్వం, విమర్శ వేరు వేరు ప్రక్రియలు. కానీ కవి ఇక్కడ కవిత్వాన్ని విమర్శను సమపాళ్ళలో సమ్మిళితం చేస్తూ కొత్త దిశానిర్దేశాన్ని చూపుతారు. 'మీలోంచే మరో గురజాడ పుట్టాలి' అనే చైతన్యాన్ని రగుల్కొలుపుతారు కవి.

ఈ కవితా సంపుటి ఒక చేదబావి. ఎంత తోడుకున్నా ఊరే చెలిమెలాగా ఇందులో కవితాద్రవం ఊరుతుంది. శారీరక దాహం నీళ్ళు తాగగానే తీరిపోతుంది. కాని ఈ కవితాద్రవం తాగినకొద్ది తాగాలనిపిస్తుంది. పాఠకుడి పఠనదాహం సంపుటిలోని చివరి కవితతోనూ తీరేదికాదు. ఈ కవికి ఎన్నటికి తరగని వారసత్వ సంపదలా గత జ్ఞాపకాల నిధులు పుష్కలంగా ఉన్నాయి. ఈ సంపుటిలోని 'చేదబావి' కవితలోనూ చిన్నప్పటి బావిని ఎంత భావోద్వేగంతో స్మరించు కుంటున్నారో చూడండి

**"నాస్టాల్జియా కాదు / ఇప్పటికీ ఉందా బావి**
**దానిలో ప్రతిఫలించేది / వర్తమాన ఆకాశమే**
**...**
**మా చేదబావి / నాకో కాలిక దర్పణం**
**ఇప్పటికీ దాహం తీరుస్తుందా బావి**
**దాని ఊట**
**ఎప్పటికీ ముగియని పాట.**
**జ్ఞాపకాలు కేవలం**

**గతకాలపు నీడలు కావు**
**ప్రస్తుత క్షణాలతో**
**ముడిపడిన అంతస్స్యూత సంతోషాలు**
..
**ఈ బావిని చూసినప్పుడల్లా / మా అమ్మ గుర్తుకొస్తుంది**
**మా ఇద్దరి చేతులనిండా / చేంతాడు మిగిల్చిన**
**కాయలు కనిపిస్తాయి / ఇప్పుడు వాటి ఫలాలనే**
**మా పిల్లలు అనుభవిస్తున్నారు.**
**బావి నాస్టాల్జియాకాదు**
**అమ్మకూడా అంతే!"**

గోపిగారు జీవనానుభూతులను దృశ్యమానం చేస్తారు. ఎటువంటి జడపదార్థంలాంటివారైనా ఒక వాక్యాన్ని చదవడం ప్రారంభిస్తే గిరకమీద నుంచి జారే బొక్కెనలా కవితాంతరంగంలోకి జారిపోతారు. సరళమైన చిన్న వాక్యంలో కవితాసాంద్రతను సాధించడం ఈ కవికే సాధ్యమయింది. గతాన్ని వర్తమానంలో పున:ప్రతిష్ఠించడమే కాదు, ఈ తరం కోల్పోతున్న గతానుభూతిని స్వీయానుభూతిగా మార్చే మాంత్రిక శక్తి ఈ కవిత్వంలో దాగి ఉంది.

ఈ కవిలోని అంతర్నేత్రం మరింత సునిశిత శక్తిని సంతరించుకున్నట్లుగా విదితమవుతుంది. లోకాన్ని ఏ పార్శ్వం నుంచి పరిశీలన చేయాలనే దృక్పథ విస్తృతి పెరిగినట్లుగా కొన్ని కవితలను చదివితే అర్థమవుతుంది. 'కొత్త బాసండ్లు, పాతబట్టలు'' కవిత పాతబట్టలకు కొత్త బాసండ్లు ఇచ్చి పొట్ట నింపుకునే చిరువ్యాపారం చేసే యువతి చుట్టూ మన ఆలోచనలు తిరిగేలా చేస్తుంది. "పాత బట్టలకు కొత్త పాత్రలు/ పేదరికాల మధ్య సమన్వయ వినిమయం/ ఆమె జీవితం" అంటూనే "ప్రపంచీకరణకు సవాల్ విసిరే/ ఏకాకి యోద్ధగా" ఆమెను వర్ణించడం లోకానికి కొత్త ఆత్మవిశ్వాసాన్ని అంది స్తుంది. ఆధిపత్య ఆర్థిక వ్యవస్థల పోటీకి ఎదురీదుతూ చేసే జీవన పోరాటం, వాస్తవిక బతుకుచిత్రం మనకు విలువైన పాఠం బోధిస్తున్నట్లుగా అనిపిస్తుంది. 'స్మశానం-దుకాణం "కవితలోని పెద్ద రాములు పాత్రచుట్టూ అలముకున్న తాత్విక వాతావరణం మనల్ని వదలిపెట్టదు. నిశ్శబ్దంగా వచ్చే మృత్యువులో దాగిన కల్లోల జీవనశబ్దాలను వినిపిస్తుంది కవిత.

గోపిగారు సమకాలీన వ్యవస్థలను కుదిపేసిన సంఘటనలపట్ల ధర్మాగ్రహాన్ని ప్రకటిస్తారు. ఒక తండ్రిలా, ప్రజాస్వామిక వాదిగా, పౌరస్పృహతో సామాజిక తాత్వికుడిగా స్పందిస్తారు. వేముల రోహిత్ మరణంపై సాధారణ స్మృతి కవితల జాబితాలోకి చేరని కవితను చెప్పారు. "ఆ సమయంలో / మీ అమ్మ గుర్తుకొచ్చినా బాగుండేది / నీలాంటివాడు తయారుకావాలంటే / ఎన్ని తరాల కన్నీళ్ళు / గడ్డకట్టాలో స్ఫురించలేదు నీకు" అంటూ నేటి యువతరానికి బతుకులో ఉండే విలువను, బతకడానికి కావలసిన తెగింపును అందించే ప్రయత్నం చేస్తారు. రచయిత కల్బుర్గి హత్యానంతర పరిస్థితులపై రాసిన 'కల్బుర్గి హత్య తరువాత' అనే కవిత రచయితలను ఆత్మవిమర్శకు గురిచేస్తుంది. 'రచయితలు / గుండెలకు బదులు / జెండాలు మొయ్యడమే విషాదం" అనడం సాహిత్యకుల నైతికతను ప్రశ్నిస్తుంది. వారు చేయవలసిన కర్తవ్యాన్ని నిర్దేశిస్తుంది. ఈ వరుసలో ఈ కవితా సంపుటిలోని ప్రతీ కవితను ఉదహరించవచ్చు. 'బల్లి, అద్దం, పార, చంకసంచి, ఎక్కదీపం' మొదలైన వస్తువులపై తనకే సాధ్యమైన రీతిలో ఎవరూ చూడని కోణంలోంచి కొత్త విషయాలను వర్ణించి ఆశ్చర్యచకితుల్ని చేస్తారు. ''తెలంగాణ యువకుడి ముఖమే / తన కవిత్వానికి ఆముఖం" అంటూ "ఏ ఉద్యమమైనా అతని గుండె చప్పుడులోంచే పుడుతుందని" తెలంగాణ జీవలక్షణాలకు కవితారూపాన్నిస్తారు. కొన్ని కవితలను చదువుతుంటే రాయలేనివారిని సైతం రాయగలిగే ఉద్వేగానికి గురిచేస్తాయి.

నిజమైన కవికి కవిత్వమే మాతృభాష. గోపిగారు ఈ జీవన భాషనే తన అనుసంధాన భాషగా మార్చుకుని ప్రపంచంతో నిరంతరం సంభాషిస్తున్నారు. ఈ సంభాషణ వైయక్తికం నుంచి విశ్వజనీనతవైపు పయనిస్తుంది. ఆ ప్రయాణంలో ఈ 'జీవన భాష' ఒక మేలిమి మైలురాయి!

**-డా॥ ఎస్. రఘు** m : 9848208533
e : raghusr17@gmail.com

**ప్రతులకు:**
పుస్తకం పేరు: **జీవనభాష (కవిత్వం);** కవి పేరు: **డా.ఎన్.గోపి**
పుటలు: **128,** వెల: **రూ.150,** ముద్రణ: **2017**
**చిరునామా:** ఎన్. అరుణ, ఇం.నెం13-1/5బి, రామంతాపూర్, హైద్రాబాద్-500013, ఫోన్: 040-27037585, 9391028496.
**మరియు అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో లభించును.**

## పత్రికలు - పరిచయం:

గమనిక: ఈ శీర్షికలను ప్రచురించేందుకు ఆయా పత్రికలు, ప్రత్యేక సంచికల వివరాలను మాకు తెలియ జేయగలరు.

**థింసా**
**సంపాదకులు :**
**రెబ్బాప్రగడ రవి**




**ఫోన్: 97053 47489**

**మోదుగుపూలు**
**గౌరవ సంపాదకులు :**
**ఎస్. వినయ్ కుమార్**




**ఫోన్: 040-27668027**

**సాందీపని**
**సంపాదకులు :**
**ఎన్. రాజేశ్వరరావు**




**ఫోన్: 040-27603617**

**తెలంగాణ**
**ప్రధాన సంపాదకులు :**
**అష్టకాల రామ్మోహన్**




**ఫోన్: 040-23310098**




ఎడమకాలు చెప్పు జారింది
రచన: జనజ్వాల
వెల: రూ. 60
ప్రచురణ: చినుకు పబ్లికేషన్స్
ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో




పదచిత్రం
రచయిత: సతీష్ చంద్ర
వెల: రూ.250
ప్రతులకు: 411, హిమసాయి గార్డెన్స్, స్ట్రీట్ నెం.5,
జవహర్‌నగర్, హైదరాబాద్ - 500020.




డా॥ అనంత పద్మనాభరావు
సమగ్ర సాహిత్యం-పరిశీలన
రచన: డాక్టర్ శ్రీమతి ధన్యంరాజు నాగమణి
వెల: రూ. 250
ప్రతులకు: 8-3-669/10/7, 8, ఎస్-1 గాయత్రి,
శ్రీ దివ్య ఎన్‌క్లేవ్, జయప్రకాశ్ నగర్, ఎల్లారెడ్డిగూడ,
హైదరాబాద్. ఫోన్: 9908216799





ఎములాడ మూలవాగు (కవిత్వం)
రచయిత: సంకేపల్లి నాగేంద్రశర్మ
వెల: రూ.80
ప్రచురణ: శరత్ సాహితీ కళాస్రవంతి
ప్రతులకు: ఇం.నెం.6-6-103111,
శివాజీనగర్, కరీంనగర్-505 001





నేనెరిగిన సాహితీవేత్తలు
రచన: ద్వా.నా.శాస్త్రి
వెల: రూ. 60
ప్రతులకు: నవదోయ బుక్ హౌస్,
కాచిగూడ, హైదరాబాద్




మెరుగైన జీవితం
రచన: కడియాల సురేష్ కుమార్
వెల: రూ.110
ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో
ఫోన్: 9515570108




తలకిందుల లోకం
మూలం: మనీషా సేరి 'కాఫ్కాలాండ్'
తెలుగు: ఆర్.శశికళ
వెల: రూ.150
ప్రచురణ: మలుపు
ప్రతులకు: 2-1-1/5, నల్లకుంట,
హైదరాబాద్-500044.
ఫోన్: 9866559868




మెరిసే అక్షరాల వెనుక
రచన: ఎన్.రాజశేఖరం
వెల: రూ. 30
ప్రతులకు: వరవరరావు, ఫ్లాట్ నం. 419,
హిమసాయి హైట్స్, స్ట్రీట్ నం.6,
జవహర్ నగర్, హైదరాబాద్-20.




గబ్బగీమి (నవల)
రచన: శాంతివనం మంచికంటి
వెల: రూ.150
ప్రతులకు: శాంతివనం, ఒంగోలు
-పి.నాయుడుపాలెం, ప్రకాశం జిల్లా -523226.
ఫోన్: 9949535695




చారాణా (కథలు)
రచన: వహీద్‌ఖాన్
వెల: రూ. 100/-
ప్రచురణ: తెలంగాణ సాహితి
ప్రతులకు: ప్రముఖ పుస్తక దుకాణాలు, రహత్‌నగర్
కాలనీ, నాగర్‌కర్నూల్, ఫోన్: 9441946909

## పుస్తక పరిచయం

పుస్తక పరిచయం శీర్షిక ద్వారా వివిధ పుస్తకాలను పాఠకులకు పరిచయం చేసే ప్రయత్నం ఇది. ఈ వేదిక ద్వారా పాఠకులకు తమ పుస్తకాలను పరిచయం చేయాలనుకునే రచయితలు, ప్రచురణ సంస్థలు తమ పుస్తకాలు రెండు కాపీలను దిగువ చిరునామాకు పంపించవచ్చు. వీలు వెంట వాటిని ప్రచురిస్తాం. సమకాలీన సామాజిక అంశాలతో కూడిన కొత్త పుస్తకాలకు ప్రాధాన్యం.

పుస్తకాలు పంపించాల్సిన చిరునామా:

TRC TELANGANA RESOURCE CENTRE

**DECCAN LAND : "CHANDRAM"** 490, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029. Telangana
**Fax: 040-27635644 Mobile: 9030626288**
E-mail: deccanlandindia@gmail.com www.deccanland.com





Photographer:
**SRINIVASACHARY**

కొత్తదనంతో కూడిన ఆలోచనా సరళిని రేకెత్తించాలన్న తపనతో గిరిజన జీవనాన్ని తనదైన శైలితో ఆవిష్కరించిన అరుదైన ఫోటోగ్రాఫర్ వానమామలై శ్రీనివాసాచారి. తన కళను ఔత్సాహికులైన ఫొటోగ్రాఫర్లకు పంచి నిష్ఠా తులను సమాజానికి అందించాలన్న సంకల్పంతో సాగుతున్న ఆయన సృజనశీలి, కార్యదక్షుడు. శరవేగంగా వస్తున్న మార్పులను విశ్లేషించుకుని తన వృత్తికి రాణింపు అద్దుతున్నారు.

ప్రత్యేక కథనం లోపలి పేజీల్లో








































DECCAN LAND, Telugu Monthly Magazine 1- November - 2017
Postal Dates: 2nd & 3rd Every Month
RNI Regn. No. APTEL/2012/46784
Postal Permission, LII/RNP/HD/1167/2015-17




Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, 1-9-1126/B, Azamabad, Hyderabad-500020, Telangana,
Published at CHANDRAM, 3-6-712/2, St.No.11, Himayatnagar, Hyderabad-500029, Telangana, Editor Manikonda Vedakumar